సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 227
శనివారం 8-11-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సిరీస్ విజయమే లక్ష్యంగా..
నేడు ఆస్ట్రేలియాతో భారత్ చివరి టీ20 మ్యాచ్ - 13లో

'సింగ్‌టెల్' వాటా విక్రయం
ఎయిర్‌టెల్‌లోని రూ.10,353 కోట్ల షేర్లు విక్రయించిన సింగ్‌టెల్ - 13లో

వచ్చే ఏడాది భారత్‌కు..
భారత ప్రధాని తనకు ఆహ్వానం పంపారని.. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు.
వివరాలు 6లో ▸

బిహార్‌లో ఎక్కడా రీపోలింగ్ లేదు
బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ 45,000కు పైగా బూత్‌ల్లో ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల సంఘం ప్రకటించింది.
వివరాలు 6లో ▸

ఫుట్‌బాల్‌కు సునీల్ ఛెత్రి గుడ్‌బై
ఆసియా ఫుట్‌బాల్ టోర్నీకి భారత్ అర్హత సాధించడంలో విఫలమవ్వడంతో సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికారు.
వివరాలు 13లో ▸

'రాజూరి'కి అరుదైన గుర్తింపు
రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా శ్రీ కృష్ణదేవరాయ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డా.రాజూరి రామకృష్ణారెడ్డికి గుర్తింపు లభించింది.
వివరాలు 3లో ▸

మా ప్రమేయం లేకుండా
వాంగ్మూలాలా!
మద్యంపై అక్రమ కేసులో కీలక మలుపు

మేం చెప్పని విషయాలతో సెక్షన్ 161 కింద దర్యాప్తు సంస్థ వాంగ్మూలం తయారు చేసింది

3లో

- తీవ్ర విస్మయకరంగా.. మేం చెప్పిన దానికి భిన్నమైన విషయాలు అందులో ఉన్నాయి.. అవి మేం స్వచ్ఛందంగా ఇచ్చిన వాంగ్మూలాలు కానే కావు
- వాటిని దర్యాప్తు రికార్డు నుంచి తొలగించేలా ఆదేశించండి..
- మేం చెప్పిన వాస్తవాలను నమోదు చేయకపోవటాన్ని చట్ట, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించండి.. సెక్షన్ 161 కింద మేం ఇచ్చామని దర్యాప్తు సంస్థ చెబుతున్న వాంగ్మూలాలు.. మేం స్వచ్ఛందంగా ఇవ్వలేదు
- దర్యాప్తు అధికారి సాక్షుల వాంగ్మూలాలను, చెప్పిన విషయాలను.. చెప్పినట్లుగానే నమోదు చేయాలి.. వాంగ్మూలం ఇచ్చే ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాల్సి ఉన్నా దాన్ని పాటించలేదు
- నిష్పాక్షిక దర్యాప్తు రాజ్యాంగంలోని అధికరణ 21లో భాగం..
- గత నెల 16న మేం ఇచ్చిన వాంగ్మూలాలు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం..
- మద్యంపై అక్రమ కేసులో హైకోర్టును ఆశ్రయించిన సాక్షులు పెనకా శరత్ చంద్రారెడ్డి, రోహిత్‌రెడ్డి

ప్రభుత్వ ఆస్పత్రులంటే
ఇంత చులకన ఎందుకు?
సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్

- అన్ని విధాలా మేం అభివృద్ధి చేసిన విశాఖపట్నం కేజీహెచ్‌ను నిర్వహించలేని దౌర్భాగ్య స్థితి మీది
- ఉత్తరాంధ్రలో పేదలకు పెద్ద దిక్కు అయిన ఈ ఆస్పత్రిని గాలికొదిలేశారు
- ఏకంగా 12 గంటలపాటు కరెంటు పోయి రోగులకు తీవ్ర ఇబ్బందులు
- కొవ్వొత్తులు, సెల్ ఫోన్ వెలుతురులో రోగులకు సేవలందించాల్సిన దుస్థితి
- విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, ఆరోగ్యశ్రీ నిర్వీర్యం
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ రద్దు, సీహెచ్‌సీల్లో స్పెషలిస్టు డాక్టర్ల తొలగింపు
- నాడు–నేడు పనులు నిలిపివేత, జీరో వేకెన్సీ పాలసీకి మంగళం, ఆరోగ్య ఆసరా మాయం
- 108, 104 పరిస్థితి ఘోరం.. ఇన్ని రకాలుగా ప్రభుత్వ వైద్య రంగం సర్వనాశనం
- మేం తెచ్చిన కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం
- ఎందుకు ఇంత నిర్లక్ష్యం.. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతారా?

5లో

ఆక్సిజన్ కాదు.. ఆల్కహాల్ కారణమట!

కేజీహెచ్‌లో మహిళ మృతి వివాదాస్పదం
ఆస్పత్రిలో 12 గంటలు విద్యుత్ సరఫరా బంద్
ఇదే సమయంలో మహిళా పేషెంట్ మృతి
ఆక్సిజన్ అందకేనంటూ కుటుంబ సభ్యుల ఆవేదన

5లో

న్యూస్‌రీల్

పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చూడాలి

పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చూడాలని ఎస్‌ఐపీబీ భేటీలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించిన భూములను సమీక్షించాలన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతిని మెగా సిటీలుగా తీర్చిదిద్దాలన్నారు.
వివరాలు 11లో ▸

హైకోర్టు కారుణ్యం

రాజధాని భూసేకరణ బాధితుల గోడును క్షేత్రస్థాయిలో పరిశీలించి మానవీయ దృష్టితో పరిష్కరించేందుకు హైకోర్టు చర్యలు చేపట్టింది. కారుణ్య మరణం కోరిన శేషగిరమ్మ, ఆమె మనుమరాలి బాగోగులే తమకు ప్రధానమని చెప్పిన న్యాయమూర్తి.. క్షేత్రస్థాయిలో వారి పరిస్థితి ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని న్యాయవాదిని ఆదేశించారు.
వివరాలు 14లో ▸

వి.కావేరి బస్సు యజమాని అరెస్టు

కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదం కేసులో వి.కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా.. స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపాలని ఆదేశించారు.
వివరాలు 3లో ▸

రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు ప్రారంభం

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు మొదలయ్యాయి. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు.
వివరాలు 3లో ▸

నిధులు మళ్లిస్తే పోల'వరం' ఎప్పుడు?
రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులను నిలదీసిన పీపీఏ సీఈవో అతుల్ జైన్

తక్షణమే రూ.1,077.47 కోట్ల అడ్వాన్సు నిధులు ఎస్ఎన్ఏ ఖాతాలో జమ చేయాలని ఆదేశం
నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంపై అసహనం
ఎట్టిపరిస్థితుల్లో 2027 మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాల్సిందేనని స్పష్టీకరణ
పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు గురించి మరో వేదికపై చర్చించాలని పీపీఏ సీఈవో సూచన

- వివరాలు 11లో

అప్పుల్లో బాబే నంబర్‌వన్
తిరోగమనంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

ఈ ఆర్థిక సంవత్సరం 6 నెలల్లో బడ్జెట్ అప్పుల్లో బాబు సర్కారు దేశంలోనే టాప్

ఈ ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల బడ్జెట్ కీలక సూచికలను వెల్లడించిన కాగ్

- దేశంలోని మిగతా పెద్ద రాష్ట్రాల కంటే అత్యధిక అప్పులు చేసింది ఏపీ ప్రభుత్వమే
- నెలకు రూ.10 వేల కోట్లకు పైగా రుణాలు.. సంపద సృష్టిలో మాత్రం తిరోగమనం
- చంద్రబాబు పాలన చేపట్టిన నాటి నుంచి అమ్మకం పన్ను రాబడి తిరోగమనమే
- వైఎస్ జగన్ పాలనలో వచ్చిన సంపద కూడా ఆవిరి.. పెరగకపోగా వైఎస్ జగన్ పాలన కంటే తగ్గిన బడ్జెట్ వ్యయం
- 2023-24లో వైఎస్ జగన్ పాలన తొలి 6 నెలల కన్నా బడ్జెట్ వ్యయం రూ.4,758 కోట్లు తక్కువ
- ఇది చంద్రబాబు సర్కారు ఈ ఆర్థిక ఏడాది తొలి ఆరు నెలల బడ్జెట్ ప్రోగ్రెస్

11లో

- అమ్మకం పన్ను రాబడి తగ్గడమంటే ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడమే
- 2023-24 తొలి 6 నెలలతో పోల్చితే అమ్మకం పన్ను రాబడి రూ.517.55 కోట్లు, రెవెన్యూ రాబడులు రూ.7,903.96 కోట్లు తగ్గుదల
- కేంద్రంలో భాగస్వామిగా ఉన్నా.. కేంద్ర గ్రాంట్‌లలో రూ.17,255 కోట్లు తగ్గుదల
- 2023-24 తొలి 6 నెలలతో పోల్చితే సామాజిక రంగ వ్యయం రూ.8,065 కోట్లు తగ్గింది.. ఈ ఆర్థిక సంవత్సరం ఆరు నెలల్లో రూ.63,052 కోట్ల బడ్జెట్ అప్పులు
- కానీ, ఆరు నెలల్లో మూలధన వ్యయం కేవలం రూ.11,715 కోట్లే
- అదే 2023-24 తొలి 6 నెలల్లో మూలధన వ్యయం రూ.16,576 కోట్లు
- రెండో ఆర్థిక సంవత్సరం వచ్చినా... చంద్రబాబు పాలనలో సంపద పెరగకపోగా 2023-24 కన్నా తగ్గుతున్న వైనం

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹78	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇలాంటివాళ్ళే

ఈ విషయంలో బాగా నోరు పారేసుకుంటున్నాడు!

క్రికెటర్ శ్రీచరణికి
ప్రభుత్వం నజరానా

రూ.2.5 కోట్ల నగదు పురస్కారం
ఇంటి నిర్మాణానికి వెయ్యి చదరపు గజాల స్థలం
గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
క్యాంపు కార్యాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీచరణి

13లో

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో గందరగోళం

దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్య తీవ్ర అలజడి రేపింది. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఏటీసీ సరిగా పనిచేయకపోవడంతో 800కు పైగా దేశీయ, అంతర్జాతీయ విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

6లో

ఆ ప్రాంగణాల్లో కుక్కలు కనపడొద్దు!

6లో

- రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై పశువుల సంచారంపై నిషేధం
- విద్యా సంస్థలు, ఆస్పత్రులు, బస్టాండ్లకు తక్షణమే ఫెన్సింగ్
- ఆయా చోట్ల పట్టుకున్న కుక్కలకు షెల్టర్లలోనే ఆశ్రయం
- ఆదేశాల అమలు చీఫ్ సెక్రటరీల వ్యక్తిగత బాధ్యత
- కుక్క కాటు ఘటనలపై సుప్రీంకోర్టు వరుస ఆదేశాలు
- జంతు ప్రేమికుల వాదనలు పట్టించుకోని న్యాయస్థానం

వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రధాని మోదీ

ఒక మంత్రం.. ఒక శక్తి, ఒక స్ఫూర్తి

6లో

వందేమాతరం అంటే ఒక పదం, ఒక మంత్రం, ఒక శక్తి, ఒక స్వప్నం, ఒక సంకల్పం అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. వందేమాతరం గేయం తరతరాలుగా మనకు నూతన స్ఫూర్తిని, శక్తిని ఇస్తూనే ఉందన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా జరిగే స్మారకోత్సవాలను ప్రధాని మోదీ ఢిల్లీలో ప్రారంభించారు.

#HarGharKisna
kisna.com
KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
Festive Sparkle
UPTO 75% తగ్గింపు*
వజ్రాల ఆభరణాల తయారీ ఛార్జీలపై
UPTO 25% తగ్గింపు*
బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై
90%* బైబ్యాక్ | 95%* ఎక్స్చేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
LUCKY DRAW
షాప్ అండ్ విన్
1000+ స్కూటర్లు మరియు 200+ కార్లు గెలుచుకునే స్వర్ణావకాశం!
KISNA
Our Existing Exclusive Showrooms: Andhra Pradesh - Srikakulam | Visakhapatnam - Gajuwaka, Sampath Vinayaka Road | Vijayawada |
Telangana, Hyderabad - Sarath City Mall | Inorbit Mall - Cyberabad | Somajiguda | A. S. Rao Nagar | Karimnagar
Upcoming Showrooms: Andhra Pradesh - Guntur | Visakhapatnam - Inorbit Mall | Madhurawada | Telangana, Hyderabad - Himayatnagar, Kukatpally
ICICI Bank 5% Instant Discount*
KISNA is now available at 121+ Exclusive Showrooms and more than 1,500 Shop-In-Shop locations across India.
SCAN HERE

క్లుప్తంగా...

వందేమాతరం స్ఫూర్తికి నా వందనం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వందేమాతరం గీతం స్ఫూర్తితో భావితరాల అభివృద్ధికి కలిసి పని చేద్దామని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా శుక్రవారం ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''వందేమాతరం' 150 సంవత్సరాల స్ఫూర్తికి నా వందనం. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ పవిత్ర గీతం మన స్వాతంత్య్ర సమరయోధులలో రగిలించిన ఐక్యతా భావనే మనందరికీ ఆదర్శం. ఆ స్ఫూర్తితో మన భావితరాల కోసం, వారి అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం' అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

ఏపీఐఐసీ డైరెక్టర్లుగా 15 మంది నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) చైర్మన్ రామరాజు వివిధ జిల్లాల నుంచి ఎంపిక చేసిన 15 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారంతా ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని తెలిపారు. ఈ మేరకు ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధికారికంగా కనకదాస జయంతి

సాక్షి, అమరావతి: సంత్ కనకదాస జయంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా కార్తీక శుద్ధ త్రయోదశి తిథి నాడు కనకదాస జయంతిని జరుపుకొంటారు. దీనిలో భాగంగానే ఈ నెల 8న అదే తిథి నాడు రాయలసీమ జిల్లాల్లో అధికారికంగా నిర్వహించాలని ఆయా జిల్లా కలెక్టర్లు, అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

వైఎస్సార్‌సీపీపై కర్నూలు పోలీసులు టార్గెట్

- బస్సు ప్రమాదం అంశంలో వేధింపుల పర్వం
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి నోటీసు

సాక్షి, అమరావతి : కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటనలో కర్నూలు పోలీసులు వైఎస్సార్ సీపీని టార్గెట్ చేశారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలోకి శుక్రవారం ఉదయం కర్నూలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్ రెడ్డి వచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి నోటీసు అందజేశారు. తొలుత.. ఈ నోటీసులను హేమంత్‌కుమార్‌రెడ్డి ఎవరికి ఇస్తున్నారో కూడా రాయకుండా తీసుకొచ్చారు. దీనిపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి అభ్యంతరం తెలిపి లిఖితపూర్వకంగా రాసివ్వాలని కోరారు. దీంతో.. మళ్లీ నాలుగు గంటల పాటు ఉన్నతాధికారులతో మంతనాలు జరిపిన ఇన్‌స్పెక్టర్ తిరిగి మ.3 గంటలకు మరోసారి వచ్చారు. కర్నూలు బస్సు ప్రమాదానికి నకిలీ మద్యం కారణమంటూ ప్రచారం చేశారని.. దానివెనుక పూడి శ్రీహరి ఉన్నారంటూ నోటీసు అందించారు. మూడ్రోజుల్లోగా కర్నూలులో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే, పోలసులు ఇచ్చిన నోటీసులపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో యజమాని అరెస్టు

కర్నూలు: కర్నూలు జిల్లాలోని ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు వద్ద 44వ జాతీయ రహదారిపై వి.కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధమై 19 మందిని బలితీసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వి.కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గత నెల 24న తెల్లవారుజామున దుర్ఘటన జరగ్గా, బస్సు డ్రైవర్, యజమానిపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యను గత నెల 28న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అరెస్టు చేశారు. ఆయన్ని జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ అనూష ఎదుట హాజరుపర్చగా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపాల్సిందిగా ఆదేశించారు.

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా 'రాజూరి'

శాస్త్ర, సాంకేతిక రంగంలో ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డా.రాజూరి రామకృష్ణారెడ్డికి అరుదైన గుర్తింపు లభించింది. ఈ సంస్థలో ప్రపంచవ్యాప్తంగా 55 వేల మంది ప్రఖ్యాత శాస్త్రవేత్తలకు మాత్రమే గుర్తింపు ఉంది. రాజూరి ఎస్కేయూ ఫిజిక్స్ విభాగంలో మూడు దశాబ్దాలపాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రాంతీయ వాతావరణ స్థితిగతులను అంచనా వేయడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో ఎస్కేయూలో ప్రాజెక్టు ఏర్పాటుచేశారు. ఈ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా డాక్టర్ రాజూరి పనిచేశారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గానూ సేవలందించారు. డాక్టర్ రాజూరి సైద్ధాంతిక, భౌతిక, పర్యావరణ శాస్త్రాల్లో విశేష పరిశోధనలు చేశారు. అతి సులభమైన సైద్ధాంతిక పద్ధతులను.. ముఖ్యంగా రసాయన శాస్త్ర సంబంధిత క్వాంటం సిద్ధాంతపరమైన రసాయన బంధనాల్ని, భౌతిక-రసాయనిక పదార్థ ధర్మాలపై ఆయన అధ్యయనం చేశారు. 244 పరిశోధనా పత్రాలు సమర్పించారు. 6,439 గూగుల్ సైటేషన్స్, 110 ఇండెక్స్, హెచ్ ఇండెక్స్ 45 రేటింగ్ పొందారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ రూపొందించిన వరల్డ్ టాప్-2 శాతం శాస్త్రవేత్తల జాబితాలోనూ రాజూరి స్థానం సంపాదించారు.

– అనంతపురం

నిజ జీవితంలో ఘటనలే నా స్వరాలు

తాను మాటల వాడిని కాదని, పాటల వాడినని.. మాటలు మాట్లాడటం కంటే పాటలు పాడటమే తనకు సులభమని ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. నిజ జీవితంలో జరిగిన ఘటనలు, పరిణామాలే తన స్వరాలనీ, వాటినే పాటలుగా మార్చానన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శనివారం నిర్వహించే మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్లో మీడియాతో ముచ్చటించారు. తాను స్వర పరిచిన గీతాలను విన్న వారు తమ జీవితాల్లో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుంటారని చెప్పారు. తనకు కళ్లెదుట కనిపించిన ప్రతి పరిణామాన్ని ఒక స్వరంగా మార్చానని తెలిపారు. గతంలో పాట రికార్డింగ్ చేసే క్రమంలో ఎంతో కసరత్తు జరిగేదని, ఏ వాయిద్యకారుడు ఎప్పుడు వాయించాలో నోట్స్ రాసి ఇస్తామని, ఎక్కడ చిన్న తప్పు దొర్లినా రీ రికార్డింగ్ తప్పదన్నారు. ఇప్పుడు పాట రాస్తున్న వారు ఎవరో పాడే వారికి తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాడే వారికి ఆర్కెస్ట్రా బృందంతో పరిచయం కూడా ఉండటం లేదన్నారు. చాలా మంది సంగీత దర్శకులు తనను ఆదర్శంగా తీసుకోవడం దేవుడిచ్చిన వరం అని చెప్పారు.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)

'అనంత'లో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు ప్రారంభం

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు మొదలయ్యాయి. వీటిని అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు సీసీఎల్‌ఏ జట్టును కలుపుకుని మొత్తం 27 కంటెంజెంట్ల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. మొదటగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. వారి నుంచి సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జయలక్ష్మి జ్యోతి వెలిగించి, క్రీడలను ప్రారంభించారు. పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు ఇటువంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో విశాఖపట్నం, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

– అనంతపురం కార్పొరేషన్

మద్యంపై అక్రమ కేసులో కీలక మలుపు..

మా ప్రమేయం లేకుండా వాంగ్మూలాలా!

సిట్‌కి ఎదురు తిరిగిన సాక్షులు పెనక రోహిత్‌రెడ్డి, శరత్ చంద్రారెడ్డి

తాము చెప్పని వాటిని వాంగ్మూలాల్లో చేర్చడంపై హైకోర్టులో పిటిషన్లు

- తమ వాంగ్మూలాలను రికార్డులను తొలగించేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థన
- విచారణ జరిపిన హైకోర్టు.. తదుపరి విచారణ ఈ నెల 27కి వాయిదా

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై అక్రమ కేసులో ఇన్నాళ్లు భేతాళ విక్రమార్క కథలు చూశాం! సాక్షుల వాంగ్మూలం పేరుతో సిట్ ద్వారా టీడీపీ పెద్దలు ఆడిస్తున్న నాటకాలు తాజాగా బట్టబయలయ్యాయి! హైకోర్టులో వేసిన పిటిషన్‌తో ఈ విషయం మరోసారి తేలిపోయింది. తాము చెప్పని విషయాలతో సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద విచారణ సంస్థ తయారు చేసిన వాంగ్మూలాలను దర్యాప్తు రికార్డు నుంచి తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఈ కేసులో సాక్షులు పెనకా శరత్ చంద్రారెడ్డి, ఆయన సోదరుడు పెనకా రోహిత్‌రెడ్డి తాజాగా హైకోర్టును ఆశ్రయించడం కీలకంగా మారింది. తాము చెప్పిన వాస్తవాలను నమోదు చేయకపోవడాన్ని చట్ట విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వారిద్దరూ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద తాము ఏ వాంగ్మూలాలైతే ఇచ్చామని సీఐడీ చెబుతోందో... వాటిని తాము స్వచ్ఛందంగా ఇవ్వనేలేదని వారు తమ పిటిషన్‌లో స్పష్టం చేశారు. దర్యాప్తు అధికారి సాక్షుల వాంగ్మూలాలను వారు చెప్పిన విషయాలను చెప్పినట్లుగా నమోదు చేయాల్సి ఉంటుందని.. అలాగే వాంగ్మూలం ఇచ్చే ప్రక్రియను ఆడియో, వీడియోగ్రఫీ చేయాల్సి ఉన్నా, అలాంటిదేమీ చేయలేదని తమ పిటిషన్‌లో కోర్టుకు నివేదించారు. నిష్పాక్షిక దర్యాప్తు అన్నది రాజ్యాంగంలోని అధికరణ 21లో భాగమన్నారు. దర్యాప్తు ప్రక్రియ దుర్వినియోగం అవుతున్నప్పుడు, దర్యాప్తు నిష్పాక్షికతను పరిరక్షించేందుకు కోర్టు తనకు స్వతఃసిద్ధ అధికారాలను ఉపయోగించవచ్చునని నివేదించారు.

మేం చెప్పింది వేరు.. వాంగ్మూలాల్లో ఉన్నది వేరు...

మద్యం విధానంపై అక్రమ కేసులో సిట్ అధికారులు గత నెల 13న హైదరాబాద్ వచ్చి సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద తమ వాంగ్మూలాలను నమోదు చేశారని పిటిషన్‌లో తెలిపారు. ల్యాప్‌టాప్‌లో తమ వాంగ్మూలాలను నమోదు చేసిన అధికారులు ఈ ప్రక్రియను ఆడియో, వీడియోగ్రఫీ చేయలేదని పేర్కొన్నారు. దర్యాప్తునకు సహకరిస్తామని, తెలిసిన విషయాలన్నీ చెబుతామని ఆ అధికారులకు చెప్పామన్నారు. ఆ తరువాత తమకు తెలిసిన విషయాలు వారికి చెప్పామన్నారు. రెండు గంటల పాటు వాంగ్మూలాలను నమోదు చేసిన అధికారులు, వాటిని ఓసారి చదువుకోవాలని ల్యాప్‌టాప్ తమకు ఇచ్చారని, అందులో ఉన్న వివరాలన్నీ సరైనవేన్నారు. ఇదిలా ఉంటే, గత నెల 16న సోషల్ మీడియాలో తాము ఇచ్చిన వాంగ్మూలాలు అంటూ ఓ రిపోర్ట్ విస్తృతంగా సర్కులేట్ అయిందని తెలిపారు. ఆ తరువాత 13వ తేదీన సిట్ అధికారులు నమోదు చేసిన వాంగ్మూలం కాపీని తీసుకుని పరిశీలించామని, విస్మయకరంగా తాము చెప్పిన దానికి భిన్నమైన విషయాలో ఆ వాంగ్మూలాల్లో ఉన్నాయని శరత్ చంద్రారెడ్డి, రోహిత్‌రెడ్డి తమ పిటిషన్‌లో వెల్లడించారు. ఇవి తాము స్వచ్ఛంధంగా ఇచ్చిన వాంగ్మూలాలు కానే కావని స్పష్టం చేశారు.

విచారణ అర్హత ఉంది.. సుప్రీం తీర్పులున్నాయి..

శరత్ చంద్రారెడ్డి, రోహిత్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం విచారణ జరిపారు. వ్యాజ్యం విచారణకు రాగానే పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మయాంక్ జైన్ ఈ కేసు గురించి వివరిస్తుండగా.. సీఐడీ, సిట్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుంటూ పూర్తి వివరాలను సమర్పించేందుకు విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వ్యాజ్యానికి విచారణార్హతే లేదని, దీనిపైనే మొదట వాదనలు వినిపిస్తామన్నారు. దీనిపై మయాంక్ జైన్ ప్రతిస్పందిస్తూ.. విచారణ అర్హత ఉందని, దీనికి సంబంధించి సుప్రీం కోర్టు తీర్పులు కూడా ఉన్నాయని నివేదించారు. ఇరుపక్షాల వాదనలను విన్న అనంతరం తదుపరి విచారణను న్యాయమూర్తి ఈ నెల 27కి వాయిదా వేశారు. పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీ, సిట్‌ని ఆదేశించారు.

నచ్చినట్లుగా నివేదికలు సిద్ధం చేసుకుంటూ

మద్యం విధానంపై అక్రమ కేసులో సాక్షులుగా మారాలని దర్యాప్తు సంస్థ 'సిట్' ద్వారా తీవ్ర ఒత్తిళ్లు తెస్తూ.. అందుకు ఒప్పుకోకపోతే వారి కుటుంబ సభ్యులనూ టీడీపీ పెద్దలు వేధించారు. సిట్ ద్వారా ఓ కట్టుకథ అల్లేసి.. సోదాల పేరుతో ఏమార్చే కుట్రలకు దిగారు. వాస్తవాలు, ఆధారాలతో నిమిత్తం లేకుండా.. కోర్టులపై గౌరవం లేకుండా లెక్కలేనితనంతో వ్యవహరించారు. కేసు విచారణ పేరుతో తమకు నచ్చినట్లుగా నివేదికలు సిద్ధం చేసుకుంటూ టీడీపీ పెద్దల కుట్రలకు తలొగ్గారు! అసలు తాను చెప్పని అంశాలను వాంగ్మూలం పేరుతో రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారంటూ ఈ అక్రమ కేసులో నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డి గతంలోనే న్యాయస్థానానికే మొరపెట్టుకోగా.. ప్రపంచంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా ఇలా వ్యవహరించిన దాఖలాలు లేవని న్యాయ నిపుణులు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సిట్ ఏర్పాటైన నాటి నుంచి టీడీపీ పెద్దల కనుసన్నల్లో పచ్చ కుట్రలు, కట్టు కథలు ఎలా అల్లారో ఒకసారి పరిశీలిద్దాం..

దర్యాప్తు పేరిట వేధింపులు, బెదిరింపులు

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్, అనూషలపై ఒత్తిడి

మద్యం విధానంపై అక్రమ కేసు దర్యాప్తునకు సిట్.. బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, పూర్వ ఉద్యోగి సత్య ప్రసాద్‌లను బెదిరించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాలనే ఆధారంగా చేసుకుంది. అబద్ధపు వాంగ్మూలం నమోదుకు నిరాకరిస్తూ, సిట్ బెదిరింపులకు వ్యతిరేకంగా వాసుదేవరెడ్డి మూడుసార్లు హైకోర్టును ఆశ్రయించారు. అయినా సరే ప్రభుత్వం ఆయన్ను వెంటాడి వేధించింది. డిప్యుటేషన్ ముగిసినా కేంద్ర సర్వీసులకు వెళ్లనివ్వకుండా, రిలీవ్ చేయకుండా అడ్డుకుంది. మూడు రోజులపాటు గుర్తు తెలియని ప్రదేశంలో నిర్బంధించి వేధించింది. ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసింది. చివరికి సిట్ చెప్పినట్టుగా ఆయన అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడంతో ఆ వెంటనే రిలీవ్ చేసి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అదే రీతిలో బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఉద్యోగులు సత్య ప్రసాద్, అనూషలను వేధించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించింది. సత్యప్రసాద్ ఎన్నో ఏళ్లుగా మానసిక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్టు తాజాగా వైద్య నివేదికలు వెలుగులోకి వచ్చాయి. అటువంటి వ్యక్తితో ఇప్పించిన వాంగ్మూలం ఆధారంగా సిట్ అక్రమ కేసును దర్యాప్తు చేస్తుండటం విస్మయపరుస్తోంది.

రాజ్ కసిరెడ్డిని ఎంపిక చేసుకోవడంలోనే కుతంత్రం..!

అసలు ఈ కుట్ర కేసుకు కేంద్ర బిందువుగా రాజ్ కసిరెడ్డిని ఎంపిక చేసుకోవడంలోనే చంద్రబాబు ప్రభుత్వ కుతంత్రం దాగుంది. అసలు విషయం ఏమిటంటే.. రాజ్ కసిరెడ్డి టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాపార భాగస్వామి కావడం గమనార్హం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన సన్నిహితుడు కూడా. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగానే.. అంటే 2021లోనే రాజ్ కసిరెడ్డి.. కేశినేని చిన్ని భాగస్వామిగా వ్యాపారాలు నిర్వహించారు. రాజ్ కసిరెడ్డికి చెందిన 'డే ఇన్‌ఫ్రాకాన్ ఎల్‌ఎల్‌పీ'లో కేశినేని చిన్ని దంపతులు వాటాదారులుగా ఉన్నారు. అక్రమంగా నిధులు తరలించారని సిట్ అధికారులు చెబుతున్న ఇషన్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైడే ఇన్‌ఫ్రా ఎల్‌ఎల్‌పీ హైదరాబాద్‌లోని ఒకే చిరునామాతో (జూబ్లీ హిల్స్, సర్వే నంబర్ 403, ప్లాట్ నంబర్ 9)తో రిజిస్టర్ అయ్యాయి. అంతే కాదు ఆ రెండు కంపెనీలు ఒకే మెయిల్ ఐడీ (accounts@wshanviinfraprojects.com)నే ఉపయోగిస్తుండటం గమనార్హం. కేశినేని చిన్ని ఏకంగా 12 రియల్ ఎస్టేట్, విదేశీ కంపెనీల ద్వారా భారీగా నల్లధనాన్ని అమెరికా, దుబాయ్‌లకు తరలించి భారీ పెట్టుబడులు పెట్టారు. రాజ్ కసిరెడ్డి వ్యాపార భాగస్వామి అయిన కేశినేని చిన్ని మంత్రి నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడే కాదు బినామీ అన్నది బహిరంగ రహస్యమే! అందుకే పట్టుబట్టి మరీ ఆయనకు విజయవాడ ఎంపీ టికెట్ ఇప్పించారు. కేశినేని చిన్ని బినామీ కంపెనీ ఉర్సా ఐటీ సొల్యూషన్స్‌కు విశాఖలో అత్యంత విలువైన 60 ఎకరాలను కారుచౌకగా కట్టబెట్టే కుట్రలకు తెర తీయడం తెలిసిందే. మరి రాజ్ కసిరెడ్డి వ్యాపార భాగస్వామి అయిన ఎంపీ కేశినేని చిన్నిపై సిట్ ఎందుకు కేసు నమోదు చేయడం లేదన్నది కీలకం. దీంతో ఇదంతా చంద్రబాబు రెడ్‌బుక్ కుతంత్రమేనన్నది తేటతెల్లమవుతోంది.

డిస్టిలరీల ప్రతినిధులకు వేధింపులు..

అబద్ధపు వాంగ్మూలాలు ఇవ్వాలని టీడీపీ పెద్దలు డిస్టిలరీల ప్రతినిధులను వేధించారు. వృద్ధులని కూడా చూడకుండా విచారణ పేరుతో హైదరాబాద్ నుంచి విజయవాడ తీసుకువచ్చి వేధించడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో వారిని హైదరాబాద్‌లోని వారి నివాసంలోనే విచారించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసుతో ఏమాత్రం సంబంధం లేని రాజ్ కసిరెడ్డి తండ్రిని బలవంతంగా తీసుకువచ్చి విచారణ పేరుతో వేధించారు. మరో నిందితుడి తండ్రి, రిటైర్డ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా నిర్బంధించి మరీ వేధించడంతో ఆ కుటుంబం హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

రూ.11 కోట్ల జప్తు డ్రామా

రాజ్ కసిరెడ్డి కుటుంబానికి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలో రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్నామని సిట్ మరో కుట్ర కథ అల్లింది. అయితే ఆ నగదు తనది కాదని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సిట్ కుట్రకథ అడ్డం తిరిగింది. ఆ నోట్ల కట్టలపై ఉన్న బ్యాచ్ నంబర్ల ఆధారంగా ఎప్పుడు? ఏ బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేశారు? ఆర్బీఐ ద్వారా దీనిపై విచారించాలని ఆయన న్యాయస్థానాన్ని కోరడంతో సిట్ తోకముడిచింది.

వెంకటేష్ నాయుడుకు ప్రలోభాలు

అబద్ధపు వాంగ్మూలం ఇస్తే నామినేటెడ్ పదవి ఇవ్వడంతోపాటు రూ.2 కోట్లు ఇస్తామని టీడీపీ పెద్దలు రియల్టర్ వెంకటేశ్ నాయుడు దంపతులను ప్రలోభ పెట్టారు. అందుకు వారు తిరస్కరించడంతోనే వెంకటేశ్‌నాయుడును అరెస్టు చేశారు. ఆయన నోట్ల కట్టలను లెక్కిస్తున్నట్లుగా ఓ వీడియోను సెల్‌ఫోన్ నుంచి రిట్రీవ్ చేశామంటూ ఎల్లో మీడియా ద్వారా ప్రచారంలోకి తెచ్చింది. ఎన్నికల ఖర్చు కోసం ఆ డబ్బు వినియోగించారని దుష్ప్రచారానికి తెర తీసింది. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గతంలో గన్‌మెన్‌గా పని చేసిన గిరి, మదన్‌రెడ్డిలను అక్రమంగా నిర్బంధించి అబద్ధపు వాంగ్మూలం కోసం తీవ్రస్థాయిలో వేధించారు. బెంబేలెత్తిన గిరి.. సిట్ అధికారులు చెప్పినట్టు అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. ఆ వెంటనే ఆయనకు ప్రమోషన్ కల్పించి మరీ జీతం పెంచారు. అందుకు సమ్మతించని మదన్‌రెడ్డిపై సిట్ అధికారులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

మిథున్‌రెడ్డిపై నిరాధార అభియోగాలు..

మద్యం విధానంతో ఏమాత్రం సంబంధం లేని వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు టీడీపీ పెద్దలు యత్నించారు. గత ప్రభుత్వంలో మిథున్‌రెడ్డి ఎంపీగా మాత్రమే ఉండగా.. ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనీసం ఆ శాఖ మంత్రిగా కూడా లేకపోవడం గమనార్హం. ఎంపీ మిథున్‌రెడ్డిపై నమోదు చేసిన అభియోగాలు అవాస్తవమని స్పష్టమైంది. ఆయన కంపెనీలోకి అక్రమంగా నిధులు వచ్చాయన్న సిట్ అభియోగాలు న్యాయస్థానంలో తేలిపోయాయి. మిథున్‌రెడ్డి తమ బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఇతర ఆధారాలు న్యాయస్థానానికి సమర్పించారు. ఆయనపై నమోదు చేసిన అభియోగాల్లో సిట్ కనీస ఆధారాలు కూడా చూపలేకపోయిందని, ఒక్క దానికీ ఆధారం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది.

తప్పుల తడకగా చార్జ్‌షీట్‌లు

న్యాయస్థానం సాక్షిగా సిట్ అక్రమ అరెస్టుల కుట్రలు బెడిసికొట్టాయి. సిట్ దాఖలు చేసిన మొదటి చార్జ్‌షీట్, అనుబంధ చార్జ్‌షీట్లను పరిశీలించిన న్యాయస్థానమే వాటి చట్టబద్ధతను ప్రశ్నించడం ప్రాధాన్యం సంతరించుకుంది. న్యాయస్థానం వ్యక్తం చేసిన 21 అభ్యంతరాలపై సిట్ కనీసం సమాధానం చెప్పలేకపోయింది. దాంతో ఈ కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు న్యాయస్థానం డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది.

సోదాల పేరుతో హడావుడి..

భేతాళ కుట్రలు బెడిసికొట్టిన ప్రతిసారి సోదాల పేరుతో హడావుడి చేస్తూ ఏదో ఒక పేరును తెరపైకి తెచ్చి సిట్ ఏమారుస్తోంది. తనిఖీల పేరుతో తప్పుడు సాక్ష్యాలు సృష్టించేందుకు యత్నిస్తోంది. టీడీపీ పెద్దల కనుసన్నల్లో ఓ డాక్యుమెంట్‌ను వదలడం.. అందుకు ఎల్లో మీడియా తాన తందానా అంటూ బ్రేకింగ్ న్యూస్‌గా ప్రచారం చేస్తోంది. అక్రమ కేసును నిజమని భ్రమింప చేసే ఎత్తుగడలకు తెర తీస్తోంది. ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలతో ఏమాత్రం సంబంధం లేని వైఎస్ అనిల్‌రెడ్డి కార్యాలయాల్లో సోదాల పేరుతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు సిట్ యత్నించింది. ఇక ఆయన కంపెనీల్లో మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా వ్యవహరించారని ఎల్లో మీడియా దుష్ప్రచారం చేసింది. వాస్తవానికి వైఎస్ అనిల్‌రెడ్డి మాతృమూర్తి వైఎస్ భారతి ఆ కంపెనీల్లో గతంలో డైరెక్టర్‌గా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, వ్యాపారి నర్రెడ్డి సునీల్ రెడ్డి నివాసాల్లోనూ తనిఖీల రిట సిట్ రాద్ధాంతం చేసింది. ఆ సమయంలో ఓ ప్రైవేటు వాహనంలో కొన్ని సందేహాస్పద పత్రాలను ఆయన నివాసంలో చేరవేసేందుకు సిట్ యత్నించడం గమనార్హం. ఆ వాహనంలో ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగి ఉండటంతో అసలు కుట్ర బట్టబయలైంది.

రిమాండ్ రిపోర్టుపై సంతకం చేయని రాజ్ కసిరెడ్డి

లేని కుంభకోణం ఉన్నట్టుగా భ్రమింపజేసేందుకు సిట్ అక్రమ అరెస్టులకు తెగబడింది. అప్రూవర్‌గా మారి తాము చెప్పినట్టు వాంగ్మూలం ఇవ్వాలని టీడీపీ పెద్దలు రాజ్ కసిరెడ్డిని వేధించారు. అందుకు ఆయన తిరస్కరించడంతోనే అరెస్టు చేశారు. అసలు రాజ్ కసిరెడ్డి చెప్పని విషయాలు చెప్పినట్టుగా సిట్ అధికారులే అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయడం ఈ కుట్రకు పరాకాష్ట. ఆ వాంగ్మూల పత్రంపై సంతకం చేసేందుకు రాజ్ కసిరెడ్డి నిరాకరించారని సిట్ స్వయంగా తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. దీంతో అసలు బండారం బయటపడింది. అక్రమ కేసులో చంద్రబాబు ప్రభుత్వం ఎంతగా బరితెగిస్తోందన్నది ఆ నివేదికే బట్టబయలు చేసింది.

బెట్టింగ్‌యాప్‌ల ప్రమోషన్ కేసులో మళ్లీ కదలిక?

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను సెలబ్రిటీలు ప్రచారం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో మళ్లీ కదలిక వచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిని సౌందర్‌రాజన్, శోభాషెట్టి, అమృత్ చౌదరి, పావని, నేహ పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతు చౌదరి, బండారు శేషయాని సుప్రీత, మేనేజ్‌మెంట్ ఆఫ్ బెట్టింగ్ యాప్స్ కిరణ్ గౌడ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు అజయ్, సన్నీ, సుధీర్, యూట్యూబర్ లోకల్ బాయ్ నాని ఉన్నారు. ఏపీ, తెలంగాణతో జంగ్లీ రమ్మీ, ఏ23, జీత్‌విన్, పరిమ్యాచ్, లోటస్ 365 సహా ఇతర ప్లాట్‌ఫామ్‌ల గురించి వీరంతా ప్రచారం చేసినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారని సమాచారం. వీరిలో ఇప్పటికే చాలా మందికి ఈడీ అధికారులు నోటీసులు జారీ చేసి, ప్రశ్నించిన విషయం తెలిసిందే. తాజాగా మరోమారు అవసరం మేరకు కొందరు నటులకు నోటీసులు ఇచ్చేందుకు ఈడీ సిద్ధమవుతున్నట్టు తెలిసింది. దేశవ్యాప్తంగా బెట్టింగ్ యాప్‌లను వివిధ రంగాల సెలెబ్రిటీలు ప్రమోట్ చేసిన అంశంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

అరకులో జియో థర్మల్ ఎనర్జీ టెక్నాలజీ

- కేంద్ర ప్రభుత్వ సంస్థ 'ఈఈఎస్‌ఎల్' ప్రతిపాదన
- దేశ పర్యాటక రంగంలో మొట్టమొదటి ప్రాజెక్ట్
- 50 శాతం కంటే ఎక్కువ ఇంధన పొదుపునకు అవకాశం

సాక్షి, అమరావతి : అరకులో జియోథర్మల్ ఎనర్జీ టెక్నాలజీ (జీఈటీ)ని అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్‌ఎల్) ప్రకటించింది. ఈ మేరకు 'ఈఈఎస్‌ఎల్' జాతీయ సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. అత్యాధునిక క్లీన్ టెక్నాలజీల ద్వారా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని పీఎస్‌యూల జాయింట్ వెంచర్ అయిన ఈఈఎస్‌ఎల్ జియోథర్మల్ ఎనర్జీ టెక్నాలజీని ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులో ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. దీని ద్వారా 50 శాతం వరకూ విద్యుత్ ఆదా కానుంది. జీఈటీ ఏర్పాటుపై ఈఈఎస్‌ఎల్ సీఈవో అఖిలేష్ కుమార్ దీక్షిత్‌తో గృహనిర్మాణ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్,ఎండీ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలీ ఇప్పటికే సంప్రదింపులు జరిపారు.

"కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేసినప్పుడు, విపత్తు రథచక్రంలా వెంబడిస్తుంది.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 8 నవంబర్ 2025

హక్కులకు 'సుప్రీం' ఛత్రం

'మన పోలీసులకు తగినంత సామర్థ్యం లేదు. సంస్థాగతంగా, శిక్షణపరంగా ఎన్నో లోపాలున్నాయి. పోలీసు వ్యవస్థపై తగిన పర్యవేక్షణ కూడా లేదు'– ఇవి ఇటీవల ఏదో ఉదంతంలో ఎవరో చేసిన వ్యాఖ్యలు కాదు. సరిగ్గా నూట ఇరవై మూడేళ్ల క్రితం బ్రిటిష్ వలస పాలకుల హయాంలో ఫ్రేజర్ నేతృత్వంలోని రెండో పోలీస్ కమిషన్ నివేదికలోని మాటలు. దేశంలో తరచుగా జరిగే ఉదంతాలు వింటుంటే అప్పటికీ, ఇప్పటికీ పెద్దగా మారిందేమీ లేదని అర్థమవుతుంది. మిగిలినవాటి మాటెలా ఉన్నా పౌరుల్ని అరెస్టు చేయటం విషయంలో నిబంధనలు సక్రమంగా పాటించే సంస్కృతి పోలీసులకు అలవడ లేదు. అందుకే ఎవరినైనా అరెస్టు చేయదల్చుకున్నప్పుడు నిందితులకు అర్థమయ్యే భాషలో అందుకు గల కారణాలను వెంటనే తెలియజెప్పాలని, వారిని ఏ కేసులో అరెస్టు చేస్తున్నారో... ఎందుకు చేస్తున్నారో... ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయో లిఖిత పూర్వకంగా చెప్పాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఏజీ మసీహ్‌ల ధర్మాసనం గురువారం తేల్చిచెప్పింది. ఒకవేళ అందుకు వ్యవధి లేకపోతే కోర్టులో హాజరు పరచటానికి రెండు గంటల ముందైనా నెరవేర్చాలని నిర్దేశించింది. అలా చేయకపోతే ఆ అరెస్టూ, రిమాండ్ కూడా చట్టవిరుద్ధమే అవుతాయని స్పష్టం చేసింది.

మన దేశంలో దాదాపు 40 శాతం అరెస్టులు స్వల్ప కారణాలపైనే జరుగుతాయి. వీరిలో అత్యధికులు అట్టడుగు వర్గాలవారు కనుక తమను ఎందుకు అరెస్టు చేశారో కూడా తెలియదు. పోలీసులు చెప్పరు. 'కామన్ కాజ్' సంస్థ ఇటీవల విడుదల చేసిన 'స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా' నివేదిక అరెస్టుల విషయంలో కులం, మతం, రాజకీయ అనుబంధాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పింది. 17 రాష్ట్రాల్లో కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌ల వరకూ వేలాది మందితో మాట్లాడి ఈ నివేదిక రూపొందించారు. అరెస్టుల విషయంలో నిబంధనలన్నీ తు.చ. తప్పకుండా పాటిస్తామని కేవలం 41 శాతం మంది చెప్పారు. ఒక మతం లేదా కులానికి చెందినవారు సహజంగా నేరగాళ్లన్న భావన నిలువెల్లా పాతుకుపోయింది. ఇలాంటివారి విషయంలో ఇక నిబంధనలేం పాటిస్తారు? ఈ నేపథ్యంలో తాజా తీర్పు ఒక ఊరట. నిజానికి సుప్రీంకోర్టు ఇలా చెప్పటం మొదటి సారేమీ కాదు. గత ఫిబ్రవరిలో జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం సైతం విహాన్ కుమార్ కేసులో పోలీసులకు రాజ్యాంగం నిబంధనలను గుర్తు చేయాల్సి వచ్చింది. నిరుడు పంకజ్ బన్సాల్, ప్రబీర్ పురకాయస్థల కేసుల్లోనూ సుప్రీం కోర్టు ధర్మాసనాలు ఈ సంగతే చెప్పాయి.

అరెస్టులకు సంబంధించి రాజ్యాంగం 22వ అధికరణంలోని నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఏకపక్ష అరెస్టు లేదా నిర్బంధం నుంచి పౌరులకు రక్షణనిస్తున్నాయి. మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపరచటానికి ముందే అరెస్టుకు దారితీసిన కారణాలేమిటో నిందితులకు తెలియాలనీ, న్యాయవాదిని నియమించుకుని సమర్థించుకునే అవకాశం ఉండాలనీ, బెయిల్ కోరవచ్చనీ ఆ అధికరణం చెబుతోంది. గతంలో సీఆర్‌పీసీ (ఇప్పుడు బీఎన్‌ఎస్‌ఎస్)లోని సెక్షన్ 57, అరెస్టయినవారిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని నిర్దేశిస్తోంది. కానీ 22వ అధికరణానికి అనుగుణమైన చట్టాలు కొరవడటం పోలీసుల ఇష్టారాజ్యానికి దారితీస్తోంది. మన దేశంలో అరెస్టు చేయటానికి 'సహేతుకమైన అనుమానం' ఉంటే సరిపోతుంది. అమెరికాలో 'సంభావ్యమైన కారణం' చూపాలి. ఈ వ్యత్యాసం వల్లే అక్రమ అరెస్టులు రివాజవుతున్నాయి. ఫలితంగా 'చట్టం నిర్దేశించిన విధానంలో తప్ప పౌరుల జీవితాన్నీ, వారి వ్యక్తిగత స్వేచ్ఛనూ హరించ రాద'ని చెప్పే రాజ్యాంగంలోని 21వ అధికరణం కూడా ఉల్లంఘనకు గురవుతోంది.

అక్రమ అరెస్టు ఆ వ్యక్తిపైన మాత్రమేకాక అతనితో సంబంధం ఉన్న వారందరిపైనా ప్రభావం చూపుతుందనీ, వారి మానసిక సమతౌల్యాన్నీ, సామాజిక సంక్షేమాన్నీ దెబ్బతీస్తుందనీ సుప్రీంకోర్టు చేసిన తాజా హెచ్చరిక పాలకులకు కనువిప్పు కావాలి. నేరాలు పెరిగాయనో, చట్టాలంటే భయం లేకుండా పోయిందనో పోలీసులు చట్ట బాహ్యతను ఆశ్రయించటం నీతిమాలినతనం. పాలకులు దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తిక మాసం, **తిథి:** బ.తదియ ప.12.09 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మృగశిర రా.3.47 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ప.10.34 నుండి 12.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.57 నుండి 7.38 వరకు, **అమృత ఘడియలు:** రా.7.34 నుండి 9.04 వరకు, **సంకటహరచతుర్థి.**

సూర్యోదయం : 6.02
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

మార్చే వ్యక్తి

మీ జీవితాన్ని మార్చే వ్యక్తి కోసం మీరు వెతుకుతుంటే కనుక, అద్దంలో మిమ్మల్ని చూసుకోండి. అర్థమైందా? మిమ్మల్ని మీరు విలువైన వారిగా భావించిన మరుక్షణం ప్రపంచం మిమ్మల్ని విలువైన వారిగా భావించటం ప్రారంభిస్తుంది. ముందుకు సాగండి. మీ భవిష్యత్తు మీరే!

– ప్రతీక్ మాహేశ్వరి, 'ఫిజిక్స్‌వాలా' కో–ఫౌండర్

కొంతవరకే

పరీక్షలలో మీకు వచ్చిన ర్యాంకు ఆధారంగా మీ భవిష్యత్తును ఊహించుకోకండి. పరీక్షా ఫలితాలు జీవితంలో మీరు ఏం సాధిస్తారో నిర్ణయించవు. మీ దృఢ సంకల్పం, అంకిత భావం, చదువు పట్ల నిబద్ధత... ఇవే చివరికి సమాజంలో మీకొక స్థానం కల్పిస్తాయి.

– బి.ఆర్. గవాయి, భారత ప్రధాన న్యాయమూర్తి

ప్రార్థన

2024లో జట్టు నుంచి నన్ను తొలగించాక దేవుణ్ణి నేను ఒకటే ప్రార్థించాను: "దేవా, నేను మార్చలేని వాటిని అంగీకరించే ప్రశాంతతను ఇవ్వు. మార్చగలిగే వాటిని మార్చేందుకు ధైర్యాన్ని ఇవ్వు. రెండిటికీ మధ్య తేడాను తెలుసుకునే వివేకాన్ని ఇవ్వు."

– వరుణ్ చక్రవర్తి, క్రికెటర్

సత్వర మార్గం!

విజయానికి సత్వర మార్గం లేదు. మీకు తెలివితేటలు ఉండాలి. ఉన్నా, అవి సరిపోవు! కష్టపడాలి. పట్టుదల కావాలి. అవకాశాలు వచ్చినప్పుడు వదులుకోకూడదు. సవాళ్లు ఎదరైనప్పుడు వదిలేయకూడదు. అన్నిటి కంటే ముఖ్యం విజయం కోసం మీరు పక్కదారులు తొక్కకూడదు.

– అరవింద్ పనగఢియా, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్

మీ మాటలు

మీరు కేవలం శరీరం మాత్రమే కాదు, ఆత్మ కూడా అని గ్రహించిన క్షణం... జీవితం పట్ల మొత్తం మీ దృక్పథమే మారిపోతుంది. నా అనారోగ్యం ద్వారా నేను తెలుసుకున్నది ఏమిటంటే – శరీరం, ఆత్మ ఎల్లప్పుడూ మన మాటే వింటాయి. కనుక మన మాటల్లో ధీమా, ధైర్యం ఉండాలి.

– సోనాలి బెంద్రే, నటి, క్యాన్సర్ సర్వైవర్

ఉదాసీనత



నాయకుడు అంటే మార్గం తెలిసినవాడు. ప్రజల్ని ఆ మార్గంలో నడిపించేవాడు. తను కూడా ఆ మార్గంలో నడిచేవాడు. భారత దేశం విజయవంతమైన, గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థగా పరిఢవిల్లడానికి మొదట్నుంచీ తోడ్పడుతూ వస్తున్నది అలాంటి నాయకత్వమే.

– ఎల్.కె. అద్వానీ, రాజకీయ దిగ్గజం

వినిమయ తత్త్వమే కాలుష్య కారకం

విశ్లేషణ

అవిజిత్ పాఠక్

దేశ రాజధానిలో వాయు కాలుష్య తీవ్రత గురించి ఇప్పటికే చాలా విన్నాం. మనం పీల్చే విషపు గాలి పర్యవసానాలు, నష్టాలపై నిపుణులు అడపాదడపా హెచ్చరిస్తూనే ఉన్నారు. కోవిడ్–19 వల్ల కన్నా వాయు కాలుష్యం వల్ల ఎక్కువ మంది చనిపోతున్నారని 'ఎయిమ్స్' మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా అన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆయన చెప్పిన దాని ప్రకారం వాయు కాలుష్య దీర్ఘకాలిక ప్రభావాలు దగ్గులు, ఊపిరి సలపకపోవడానికి మాత్రమే పరిమితమైనవి కావు. అది హార్ట్ ఎటాక్, స్ట్రోక్, చివరకు క్యాన్సర్‌కు కూడా కారణమవుతోంది. అయినా, మనం సంక్షోభం మూలాల లోకి వెళ్ళేందుకు సిద్ధంగా లేనట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం సూచించే తాత్కాలిక పరిష్కాలతో తృప్తి పడుతున్నాం. ఎయిర్ ప్యూరిఫయర్లు కొనేందుకు, బయటకు వెళ్ళేటపుడు ఎన్ 95 మాస్కులు ధరించేందుకు అలవాటు పడుతున్నాం. కృత్రిమ వర్షాలను సాంకేతిక అద్భుతంగా మురిసిపోతూ, అవి తేగల ఊరట కోసం ఎదురు చూస్తున్నాం.

ఒక ప్రజా సమస్యకు ఆ రకమైన ప్రైవేటు పరిష్కారాలను మించి ఆలోచించేందుకు తెగువ, రాజకీయ, నైతిక విశ్వాసం అవసరం. మనం సాధారణంగా మార్చేసిన జీవన విధానాలకు సంబంధించి ప్రపంచ దృక్కోణాన్ని ప్రశ్నించేందుకు మనమంతా ఏకం కావాల్సి ఉంది.

వినిమయ తత్త్వపు విషవలయం

ఢిల్లీ వాయు కాలుష్యం విస్తృతమైన వాతావరణ మార్పు సంక్షోభంతో ముడిపడి ఉన్నదనీ, అవి రెండూ అవిభాజ్యమైనవనీ నిజాయితీగా అంగీకరిద్దాం. అది ఆధునికత తెచ్చిపెడుతున్న అనర్థం. ముందు వెనుకలు ఆలోచించని సాంకేతిక ప్రగతి కోసం ప్రకృతిని జయించాలని చూస్తున్నాం. దాంతో, టెక్నో–క్యాపిటలిజం స్థిరంగా వృద్ధి చెందుతూ వచ్చింది. వస్తు వినియోగ తత్త్వానికి మనం క్రమంగా బానిసలమైపోయాం. మన చుట్టూ ఉన్న వాటిలో చెట్టు, పుట్ట, నది, పర్వతం ఏదైనా కావచ్చు– ప్రతీదీ వాటివైన స్వరూప స్వభావాలను, ప్రయోజనాన్ని కోల్పోయాయి. ప్రకృతి అంటే కొల్లగొట్టదగిన వనరు అనే భావన పాదుకుపోయింది. మరింత విద్యుచ్ఛక్తి, మరిన్ని కార్లు, మరింత వస్తు సామగ్రి, మరిన్ని దుస్తులు... వస్తు వినిమయ తత్త్వానికి అంతూ పొంతూ లేకుండా పోతోంది. రోడ్ల విస్తరణకు వేలాది చెట్లను నరికేసేందుకు మనం సంశయించడం లేదు. విద్యుదుత్పాదనకు నదుల సహజ ప్రవాహ గతులను మార్చేస్తున్నాం.

ఔను. ఆధునికత సంక్షోభం ఢిల్లీ వాయు కాలుష్య రూపంలో జడలు విప్పుకుని దర్శనమిస్తోంది. ఒక్కసారి ఢిల్లీ రోడ్లను పరికిస్తే

వాహనాలు వరదెత్తినట్లుగా కనిపిస్తాయి. దేశ రాజధానిలో 1.2 కోట్ల వాహనాలు రిజిస్టరయ్యాయనీ, వాటిలో 33.8 లక్షలు ప్రైవేటు కార్లేననీ ఢిల్లీ స్టాటిస్టికల్ హ్యాండ్ బుక్ (2023) సూచిస్తోంది. వేగం, చలన శక్తి ఆధునికతలో అంతర్భాగాలవడంతో మనకు మరిన్ని కార్లు, విమానాలు అవసరమవుతున్నాయి. పర్యవసానంగా శిలాజ ఇంధనాలను వెలికి తీయడం అవిశ్రాంతంగా సాగుతోంది. కర్బన ఉద్గారాలు పెరిగిపోతున్నాయి. ఆధునికత, టెక్నో–క్యాపిటలిజం విష విలయంలో చిక్కుకున్నాం.

తప్పులో మన వాటా?

ఢిల్లీలో కాలుష్యానికి ప్రాథమిక కారణం పొరుగు రాష్ట్రాలలో పంట కోతల తర్వాత గడ్డి గాదాన్ని మంటపెట్టడం వల్ల కాదని నిజాయితీగా అంగీకరించాలి. ఢిల్లీ వాయు కాలుష్యానికి వాహనాల ఉద్గారాలు ప్రధాన దోహదకారిగా ఉన్నాయనే వాస్తవాన్ని మనం ఎలా విస్మరించగలం? సూక్ష్మ ఘన, ద్రవ ధూళి కణాలు, దుమ్ము, మసి, పొగల మిశ్రమాన్ని పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం)గా పిలుస్తున్నారు. ఢిల్లీలో వార్షిక పీఎం 2.5 శాతంగా ఉంది. దానిలో వాహన ఉద్గారాల వాటాయే 10 నుంచి 30 శాతంగా ఉందని లెక్క తేలింది. అలాగే, పరిశ్రమలు, విద్యుదుత్పాదన కేంద్రాలు విడిచిపెట్టేవి, వ్యర్థ పదార్థాలను దగ్ధం చేయడం వల్ల వచ్చేవి, నిర్మాణ పనుల వల్ల రోడ్లపైకి వస్తున్న దుమ్ము నగరంలో వాయు కాలుష్య తీవ్రతకు కారణమవుతున్నాయి.

కానీ, ఈ ప్రశ్నలను లేవనెత్తడం కష్టం. ఎందుకంటే, అవి మనల్నే వేలెత్తి చూపుతాయి. మనం అనుసరిస్తున్న హైపర్ ఆధునికత జీవన మార్గాలపై ఇంటరాగేషన్‌కు దిగుతాయి. కనుక, ఆత్మ పరిశీలనకు మనం విముఖులుగా ఉంటాం. దానికి బదులు, మన పడక గదుల్లో ఎయిర్ ప్యూరిఫయర్లను వాడితే మనం సురక్షితంగా ఉంటామని మనకు మనం సర్ది చెప్పుకోవడం తేలిక. పెద్దగా ఆందోళన చెందనక్కర లేకుండా టెక్నో–సైన్స్ కృత్రిమ వర్షాలను కురిపించగలదని సంతృప్తి పడటం తేలిక. ఎలక్ట్రిక్ కార్లను వాడటం ప్రారంభిస్తే సమస్య పరిష్కారమైపోతుందని నమ్మడం తేలిక. కట్టె పొయ్యిలు, బొగ్గు కుంపట్లు వంటి వాటి ద్వారా కాలుష్యానికి కారణమవుతున్నారని పేదలను నిందించడం తేలిక.

లగ్జరీ ఎస్‌యూవీలు, స్పీడుగా దూసుకుపోయే కార్లు, ఖరీదైన వస్తువుల వినియోగం కర్బన ఉద్గారాలకు గణనీయంగా తోడ్పడుతున్నాయని చెబితే ధనికులకు, అత్యంత సంపన్నులకు కోపం వస్తుంది. కాలుష్య పర్యవసానంగా ఏర్పడుతున్న ప్రతికూల అనారోగ్య పరిస్థితుల బారిన ధనికులకన్నా పేదలు ఎక్కువ పడుతున్నారనే వాస్తవాన్ని తేలిగ్గా పక్కన పెట్టేస్తున్నారు.

నిజంగా కావాల్సినవి!

కాలుష్య రహిత భవిష్యత్తుకు నూతన జీవన పద్ధతులు, పట్టణ ప్రణాళికలు తప్పనిసరి. న్యూరోటిక్ స్పీడు నుంచి మందగమనానికి, భారీ ఎక్స్‌ప్రెస్ వేల నుంచి నడకకు, సైకిళ్ళు తొక్కడానికి ప్రోత్సహించే రోడ్లకు, ప్రైవేటు వాహనాల నుంచి ప్రజా రవాణా వ్యవస్థలకు మారక తప్పదు. ఆకర్షణీయంగా కనిపించే వినిమయ తత్త్వం నుంచి నిరాడంబర, నిలకడగా సాగించగలిగిన జీవన విధానాలకు మళ్ళాలి. అవసరం లేనివాటి కోసం వెంపర్లాడటం మానుకోవాలి. మనం, మన సంతానం ఆరోగ్యకరంగా ఉండేందుకు సహాయ పడగల వాటిని అలవరచుకోవాలి. శుద్ధమైన తాగునీరు, గాలి, చెట్లు, నీటి వనరులు, నీలాకాశం, ఎటుచూసినా హరిత పరిసరాలు మనకు నిజమైన అవసరాలు. ప్రాధాన్యాలను ఎంచుకోవాల్సింది మనమే. మనం ఏ విధమైన అభివృద్ధిని కోరుకుంటున్నామో, ఆ దిశగా అడుగులు వేసేందుకు మనమే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

వ్యాసకర్త సామాజిక శాస్త్రవేత్త
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

◆ ఆధునికత పేరుతో మనం పెడుతున్న పరుగు, మన వివేకాన్ని వెనక్కి నెట్టేస్తోందని ఊపిరాడనివ్వని ఢిల్లీ పరిసరాలు గుర్తు చేస్తున్నాయి. వస్తు వినియోగ తత్త్వానికి మనం బానిసలమైపోయాం. చెట్టు, పుట్ట, నది, పర్వతం – ప్రతీదీ వాటి వైన స్వరూప స్వభావాలను, కోల్పోయాయి.

◆ కాలుష్య రహిత భవిష్యత్తుకు నూతన జీవన పద్ధతులు తప్పనిసరి. న్యూరోటిక్ స్పీడు నుంచి మందగమనానికి, భారీ ఎక్స్‌ప్రెస్ వేల నుంచి నడకకు, సైకిళ్ళు తొక్కడానికి ప్రోత్సహించే రోడ్లకు, ప్రైవేటు వాహనాల నుంచి ప్రజా రవాణా వ్యవస్థలకు మారక తప్పదు.

ఇది సైన్స్ మనోనేత్రం

టైమ్ మిషన్

అది 1895 నవంబర్ 8వ తేదీ రాత్రి. జర్మనీలోని ఊర్జ్‌బర్గ్ ల్యాబొరేటరీలో గుడ్డివెలుతురు నిండిన గదిలో భౌతిక శాస్త్రవేత్త విల్‌హెల్మ్ కాన్‌రాడ్ రాంట్‌జెన్ నెమ్మదిగా పనిచేసుకుంటూ ఉన్నాడు. ఆయన భార్య 'అన్నా' నిద్రపోయి చాలా సేపైంది. కానీ విల్‌హెల్మ్ ఇంకా గాజు గొట్టాలు, తీగల కాయిల్స్‌తో నిండిన ఆ గదినే పట్టుకుని వేలాడుతున్నాడు. చిన్నతనంలో గడియారాలు ఎలా పనిచేస్తాయో తెలుసుకోవడానికి ఏకంగా వాటిని విప్పి చూసేవాడు. ఇప్పటికీ అటువంటి జిజ్ఞాసతోనే రోజుల్ని నిమిషాలుగా ఇలా గడిపేస్తున్నాడు.

ఆ సాయంత్రం ఆయన క్రూక్స్ ట్యూబ్ నుండి కాంతి బయటికి రాకుండా చేయడం కోసం నల్ల కార్డ్‌బోర్డ్‌ను చుట్టాడు. కరెంట్ ఆన్ చేశాడు. ఇప్పుడు నిజానికి క్రూక్స్ ట్యూబ్ నుండి కాంతి బయటికి రాకూడదు. అయినా, గదిలో కొద్ది దూరంలో ఉన్న బేరియం–ప్లాటినో–సైనైడ్ స్క్రీన్ (తెర) మీద ట్యూబ్ నుంచి వస్తున్న ఆకుపచ్చ కాంతి మెరుస్తోంది. రాంట్‌జెన్ గుండె దడదడలాడింది. స్క్రీన్‌ను మరింత దూరం జరిపాడు. అయినా ఆ కాంతి దానిమీద పడుతూనే ఉంది. ఇలా కాదని ట్యూబ్‌కు, స్క్రీన్‌కు మధ్య పుస్తకం పెట్టాడు; కాంతి మసకబారింది కానీ ఆగిపోలేదు. ఈ సారి పుస్తకం బదులు చెక్కను పెట్టాడు. ఇంకా కాంతి

1895: రాంట్‌జెన్ భార్య 'అన్నా' చేతి 'ఎక్స్‌'రే

పడుతూనే ఉంది. అతడిలోని జిజ్ఞాసువు మరింత రెచ్చిపోయాడు. ఒక పక్క భయమేస్తున్నా... వణుకుతూనే తన చేతిని అడ్డు పెట్టాడు.

సూర్యకాంతిలో నీడల్లా స్పష్టంగా, అతని వేళ్ల సన్నని ఎముకలు స్క్రీన్ మీద కనిపించాయి. అతడిలో ఆసక్తి రెట్టింపయ్యింది. శక్తిమంతమైన ఈ కిరణాల వల్లే ఇదంతా జరుగుతోందని గ్రహించాడు. ఇప్పటివరకూ ఇటువంటి కిరణాలు ఉన్నాయనే తెలియదు కాబట్టి వాటి పేరు కూడా తెలియదు. గణితం, భౌతిక శాస్త్రంలో తెలియని విలువలనూ, పేర్లనూ 'ఎక్స్' అని పిలవడం మామూలే. అందుకే ఈ కిరణాలను 'ఎక్స్–రేస్' అని పిలిచాడు.

కొన్ని రోజుల తరువాత భార్య అన్నాను ఫొటోగ్రాఫిక్ ప్లేట్ మీద చేయి ఉంచమని కోరాడు. ఆమె కొద్దిగా సంకోచించింది కానీ అతడు కోరినట్లే తన పెళ్లి ఉంగరం ఉన్న చేతిని ఉంచింది. ఉంగరం తెల్లటి వృత్తంగా, ఆమె ఎముకలు చర్మం కింద సన్నగా, ప్రకాశవంతంగా కనిపించాయి. అన్నా గాబరా పడింది. ఆనందంతో 'నా సొంత ఎముకలు చూస్తున్నాను' అంది. 'ఈ అనుభవం ఎంత అందంగా, ఎంత భయంకరంగా ఉందో' అంటూ గుసగుసలాడింది.

రాంట్‌జెన్ ఆ రాత్రి నిద్రపోలేదు. డెస్క్ దగ్గర కూర్చుని ఆ ప్లేట్‌ను చూస్తూ ఉన్నాడు. యుద్ధాల నుంచి కుంటుకుంటూ తిరిగి వచ్చిన సైనికుల్ని గుర్తు చేసుకున్నాడు. వాసిన కండరాల కింద దాగిన విరిగిన ఎముకలతో ఉన్న పిల్లలు గుర్తుకు వచ్చారు. తుపాకి గుండు లేదా కణుతులు ఎక్కడ దాగాయో అంచనా వేస్తూ ఇష్టమొచ్చినట్లు శరీరాలను కోసే డాక్టర్లు గుర్తుకువచ్చారు. ఇప్పుడు తాను కనిపెట్టిన ఎక్స్ కిరణాలతో వీళ్లందరికీ ఎంత ఉపయోగమో మనసు పదే పదే చెబుతోంది.

తన ఆవిష్కరణలను నిశ్శబ్దంగా చిన్న జర్నల్‌లో ప్రచురించాడు. కొన్ని వారాల్లోనే ప్రపంచం మారిపోయింది. ఎక్స్‌రేతో వియెన్నాలో సర్జన్లు ఒక మహిళ చేతి లోపల ఉన్న సూదిని కనుగొన్నారు. లండన్‌లో ఒక బాలిక గొంతులోని నాణెం ఒక్క కోత లేకుండా తీసేశారు.

రాంట్‌జెన్ ఎక్స్‌రేపై పేటెంట్ హక్కు తీసుకోవడానికి నిరాకరించాడు. 'ఇది మానవాళికి చెందినది' అన్నాడు. ఈ ఆవిష్కరణకు గాను 1901లో మొదటి నోబెల్ భౌతికశాస్త్ర బహుమతి వచ్చినప్పుడు, ఆ డబ్బును తన యూనివర్సిటీకి ఇచ్చేశాడు. అతను ఎప్పుడూ ప్రచారాన్ని కోరుకోలేదు. ఇప్పుడు ఎక్సరే కానీ, దానిపై ఆధారపడి తయారు చేసిన ఆధునిక స్కానింగ్ మిషన్లు కానీ లేకుండా మన వైద్య రంగాన్ని ఊహించనైనా ఊహించలేం. ◆

అక్షర శస్త్రధారి

ఇన్ బాక్స్

సుసంపన్న తెలుగు జర్నలిజంలో తనదైన విశిష్ట ముద్ర వేసిన సుప్రసిద్ధ పాత్రికేయులు చక్రవర్తుల రాఘవాచారి. కమ్యూనిస్టు దృక్కోణం, సమాజ హితం, ధర్మాగ్రహం, నిబద్ధత, సమగ్రత, ప్రామాణికతలకు ఆయన సంపాదకీయాలు పెట్టింది పేరు. అప్పటి వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో వరదాచార్యులు, కనకవల్లి దంపతులకు 1939 సెప్టెంబరు 10వ తేదీన ఆయన జన్మించారు. గుంటూరు జిల్లా పొన్నూరులోని భావనారాయణ సంస్కృత కళాశాలలో చదివారు. 15 ఏళ్లకే ఉర్దూ, సంస్కృతంలో రాటుదేలారు. 1951లో హైదరాబాద్‌లోని లాలాగూడ రైల్వే స్కూల్‌లో హైస్కూల్ విద్య, నిజాం కాలేజీలో పీయూసీ చదివారు. 1961లో ఉస్మానియాలో బీఎల్,తర్వాత ఎల్ఎల్ఎం చదివారు. లా కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షునిగా వ్యవహరించారు. న్యాయవాద వృత్తి స్వీకరించకుండా జర్నలిజాన్ని ఎంచుకొని రాణించారు. గుంటూరు జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నాయకుడు కనపర్తి నాగయ్య కుమార్తె జ్యోత్స్నను పెళ్లి చేసుకున్నారు.

చక్రవర్తుల రాఘవాచారి

'పేట్రియాట్' ఆంగ్ల పత్రికలో తొలుత పని చేసినా తెలుగు జర్నలిజాన్నే రాఘవాచారి ఎంచు కున్నారు. 'విశాలాంధ్ర' దినపత్రికకు 1972 నుంచి 30 ఏళ్లు సంపాదకునిగా సేవలందించి నిబద్ధ పాత్రికేయునిగా కీర్తి గడించారు. తెలుగువారి సామాజిక, ఆర్థిక, రాజ కీయ, సాంస్కృతిక, సాహిత్య పరిణామాలకు ఆయన సంపాదకీయాలు నిలువుటద్దాలు. ప్రామాణికమైన ఆయన సంపాదకీయాలను 'సి.రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్' 2020 నుంచి వరుసగా సంపుటాలుగా ప్రచురిస్తుండటం సంతోషదాయకం. ఇప్పటికి 1. సాహిత్యం, సంస్కృతి, కళలు 2. నివాళి. 3. రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టసభలు 4. జాతీయాలు పేరిట సంపుటులు వచ్చాయి. ఐదో సంపుటి రాబోతోంది. జర్నలిస్టులకే కాకుండా చరిత్ర విద్యార్థులు, పరిశోధకులకు సైతం ఈ సంపాదకీయాలు గీటురాళ్లుగా నిలుస్తాయి. 1987లో విశాలాంధ్ర గుంటూరు కరస్పాండెంట్‌గా నేను పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించాను. రాఘవాచారి గారే నా తొలి సంపాదకులు కావటం మధుర స్మృతి.

– పంతంగి రాంబాబు I సీనియర్ జర్నలిస్టు
(రేపు సి. రాఘవాచారి 6వ స్మారకోపన్యాస సభ హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో)

టారిఫ్‌లు అప్... ఎగుమతులు డౌన్

డేటా పాయింట్

అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌ల ప్రభావం సెప్టెంబరులో... మనం ఆ దేశానికి చేసిన ఎగుమతులపై భారీగానే పడింది. ముఖ్యంగా ముత్యాలు, విలువైన జాతి రాళ్ల ఎగుమతులు గతేడాది ఇదే సమయంతో పోలిస్తే సుమారు 77 శాతం తగ్గాయి.



దేనికోసం ఈ దురాశ?

జ్యోతిర్మయం

ఒకానొకడు తనకు 50 ఏనుగులు కావాలనీ, వంద ఎకరాల భూమి కావాలనీ, చుట్టుపక్కల ఎవరికీ లేనంత పెద్ద ఇల్లు కట్టాలనీ ఆశపడ్డాడు. అతను దేవుణ్ణి ప్రార్థించేటప్పుడల్లా తన కోరికలన్నీ చెప్పుకొనేవాడు. తన ఆశలు నెరవేర్చుకోవడం కోసం ఒంటి కాలి మీద నిల్చుని తపస్సు చేశాడు. ఒకరోజు దేవుడు ప్రత్యక్షమై 'ఏమిటి నీ సమస్యా?'అని అడిగాడు.

అతని ఆశలన్నీ విన్న దేవుడు చిన్న నవ్వు నవ్వి, తన లోకంలోని యాభై ఏనుగులను చూపిస్తూ 'అవి సరిపోతాయా?' అన్నాడు. అతను సంతోషంగా తల ఊపాడు. అలాగే అతనికి 100 ఎకరాల భూమి చూపించి 'ఇది చాలా?' అన్నాడు. దానికతను 'ఆ భూమిలో ఓ నాలుగు బావులు ఉంటే బాగుంటుంది' అన్నాడు. 'తథాస్తు' అన్నాడు దేవుడు. అనంతరం పెద్ద ఇల్లు సమకూర్చాలన్నాడు. అందుకూ దేవుడు 'అట్లాగే' అన్నాడు.

అతను అడిగినవన్నీ ఇచ్చిన తర్వాత, దేవుడు 'నాకొక చిన్న సహాయం చేయాలి' అన్నాడు. 'ఏమీ లేదు, నువ్వు చనిపోయిన తర్వాత నా లోకానికొచ్చేటప్పుడు నాకొక ఏనుగు వెంట్రుక ముక్క తీసుకురావాలి' అని అన్నాడు.

దానికతను, 'ఇంతేనా? అయినా నేను చనిపోయే వరకు ఎందుకు ఆగాలి? ఇప్పుడే ఇస్తాను' అన్నాడు.

అయితే దేవుడు 'నాకిప్పుడు అవసరం లేదు. అప్పుడే ఇద్దువుగానీలే' అన్నాడు. దానికతను, 'మీకు తెలియనిదా స్వామీ... చనిపోయిన తర్వాత ఒక్క వెంట్రుక ముక్క కూడా నాతో తీసుకురాలేను?' అని అన్నాడు.

'తెలుసు కదా! మరి నీకెందుకీ దురాశ?' అన్నాడు దేవుడు. దాంతో అతను నిజం గ్రహించి, తనకిచ్చినదంతా తిరిగి దేవుడికే ఇచ్చేసి వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

– యామిజాల జగదీశ్

ప్రభుత్వ ఆస్పత్రులంటే ఇంత చులకన ఎందుకు?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ''చంద్రబాబు గారూ.. అసలు పరిపాలన అంటే మీకు తెలుసా? ప్రభుత్వ ఆస్పత్రులను ఇలా భ్రష్టు పట్టిస్తారా? ఉత్తరాంధ్ర ప్రాంతంలోని పేదలకు పెద్ద దిక్కు అయిన విశాఖపట్నం కేజీహెచ్ ఆస్పత్రిని నిర్వహించలేని దౌర్భాగ్య స్థితిలో మీరు ఉన్నారు. విజన్ గురించి, ఆన్‌లైన్ పరిపాలన గురించి సచివాలయంలో కూర్చుని మీరు రొటీన్ డైలాగులు చెబుతున్న పరిణామాల మధ్య, ఈ పెద్దాసుపత్రిలో కరెంటు పోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రులంటే ఇంత చులకన ఎందుకు? ఇంత నిర్లక్ష్యం దేనికి?' అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతారా.. అంటూ నిప్పులు చెరిగారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

- విశాఖపట్నం కేజీహెచ్‌లో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కరెంట్ పోతే రాత్రి 12.30 గంటల వరకు పట్టించుకునే నాథుడు లేడు. దాదాపు 12 గంటలపాటు చిన్న పిల్లలు, గర్భిణులు, రోగులు అష్టకష్టాలు పడ్డారు. ఆపరేషన్లు చేయించుకున్న వారి పరిస్థితి మరింత హృదయ విదారకం. కొవ్వొత్తులు, సెల్ ఫోన్ వెలుతురులోనే రోగులకు సేవలు అందించాల్సిన దుస్థితి. ఇవన్నీ మీ రొటీన్ డైలాగ్‌లు, డ్రామాల మధ్య మీకు కనపడక పోవడం దారుణం. రెండు వేల పడకలున్న ఆస్పత్రిలో 1,700 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. ఇలాంటి ఆస్పత్రి నిర్వహించే తీరు ఇదేనా? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న కనీస స్పృహ మీ ప్రభుత్వానికి లేదా? అది కూడా 12 గంటలపాటు స్పందన లేకపోవడమా? ప్రభుత్వ ఆస్పత్రులు అంటే ఇంత చులకన ఎందుకు? ఇంత నిర్లక్ష్యం దేనికి?
- మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత విలేజ్ క్లినిక్‌లు నిర్వీర్యం, పీహెచ్‌సీలు నిర్వీర్యం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ రద్దు, సీహెచ్‌సీల్లో స్పెషలిస్టు డాక్టర్ల తొలగింపు.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో, టీచింగ్ ఆస్పత్రుల్లో నాడు-నేడు పనులు నిలిపేయడం, సిబ్బంది విషయంలో జీరో వేకెన్సీ పాలసీకి మంగళం, ఆరోగ్యశ్రీకి బకాయిలు పెట్టి సర్వనాశనం, ఆరోగ్య ఆసరా మాయం.. 108, 104ల పరిస్థితి ఘోరం. చివరకు 104, 108 కాంట్రాక్టులను మీ పార్టీ సభ్యుడికి అవినీతి కోసం కట్టబెట్టి, ఇన్ని రకాలుగా ప్రభుత్వ వైద్య రంగాన్ని సర్వనాశనం చేసి, ఇప్పుడు కేజీహెచ్ లాంటి ఆస్పత్రులను కూడా దెబ్బతీస్తున్నారు. మేం తెచ్చిన కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ అంతకు మించి హాని చేస్తున్నారు.
- మా ప్రభుత్వ హయాంలో కేజీహెచ్ ప్రాధాన్యతను గుర్తించి అనేక అభివృద్ధి పనులు చేశాం. ప్రస్తుత క్యాజువాలిటీని ఆధునికీకరించడమే కాకుండా, రెండో క్యాజువాలిటీని 24 గంటలూ సేవలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. సీఎస్ఆర్ బ్లాక్ పూర్తి చేసి 200 పడకలు అందుబాటులోకి తెచ్చాం. కొత్త అల్ట్రా సౌండ్ స్కాన్, కొత్త ఎమ్మారై, మొబైల్ ఎక్సరే, ఆన్‌లైన్‌లోనే రోగి పరీక్ష ఫలితాలను తెలుసుకునే ఏర్పాటు, క్రిటికల్ కేర్ యూనిట్‌తోపాటు ఓపీ మొత్తాన్ని ఆధునీకరించాం. వృద్ధులు, మహిళలకు ప్రత్యేక ఓపీ, పిల్లలకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, కార్డియాలజీ విభాగం మొత్తం పునర్ నిర్మాణం, ఆధునిక పరికరాలు, భావనగర్ వార్డులో ఏఎంసీ యూనిట్లు, అందుబాటులోకి కేన్సర్ కేర్ యూనిట్.. అందులో అత్యాధునిక పరికరాలు, ఒక్క కేజీహెచ్‌కే కొత్తగా 8 అంబులెన్సులు, రోగుల సహాయకుల బస కోసం చౌల్ట్రీల ఆధునికీకరణ, దీంతోపాటు వెయిటింగ్ హాల్స్‌ను కనీసం 200-250 మంది ఉండేలా తీర్చిదిద్దాం. ఇలాంటి ఎన్నెన్నో కార్యక్రమాలతో కేజీహెచ్ ద్వారా పేదలకు అత్యుత్తమ వైద్యం అందేలా నిరంతరం కృషి చేశాం. కానీ, మీరు వాటన్నింటినీ నీరుగారుస్తూ పేదవాళ్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మేం గొప్పగా ఆధునికీకరించినవి కూడా మీరు మెయింటెయిన్ చేయలేకపోతున్నారు. కార్డియాలజీ విభాగంలో పరికరాలు పాడైపోయి ఈ ఏడాది జనవరి నుంచి దాదాపు ఏడు నెలలకు పైగా గుండె ఆపరేషన్లు ఆగిపోవడం మీ పాలనా వైఫల్యం కాదా చంద్రబాబు గారూ? ఇప్పుడు కూడా అరకొరగానే నడిపిస్తున్నారు కదా? ఆస్పత్రిలో కరెంటు లేని కారణంగా ఆక్సిజన్ అందకపోవడంతో దేవీ అనే మహిళ చనిపోయిందని ఆ మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఇలా ఎన్ని పాపాలు చేస్తారు చంద్రబాబు గారూ? చివరకు నిన్న పులివెందుల టీచింగ్ ఆస్పత్రి నుంచి పరికరాలు తీసేస్తున్న ఫొటోలు చూస్తుంటే నిజంగా మీ పాపాలకైనా హద్దుండాలి కదా?

ఆక్సిజన్ కాదు.. ఆల్కహాల్ కారణమట..!

- కేజీహెచ్‌లో మహిళ మృతి వివాదాస్పదం
- ఆక్సిజన్ అందకపోవడం కారణమని కుటుంబ సభ్యుల ఆవేదన

ఆక్సిజన్ అందకే దేవి మృతి చెందిందంటున్న బంధువు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా వైద్య సేవల కోసం వచ్చే కీలకమైన ఆస్పత్రి. ఇంతటి కీలక ఆస్పత్రి దాదాపు సగం రోజు అంధకారంలో చిక్కుకుంది. ఇదే సమయంలో దేవి అనే ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆక్సిజన్ అందకపోవడం వల్లే మృతి చెందిందని బంధువులు చెబుతున్నారు. అయితే మహిళ మృతి చెందింది ఆక్సిజన్ అందక కాదనీ.. ఆల్కహాల్ తాగడం వల్ల లివర్ డ్యామేజ్ జరిగి.. గుండెపోటుతో మృతి చెందిందని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ ఒత్తిళ్లతో 'పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు' కేజీహెచ్ అధికారులు ఆల్కహాల్ నాటకానికి తెరతీసారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరస్పర విరుద్ధ ప్రకటనలు

మహిళ మృతిపై కుటుంబ సభ్యులు, వైద్యుల నుంచి పూర్తి భిన్నమైన ప్రకటనలు వెలువడ్డం గమనార్హం. '' మధ్యాహ్నం ఉక్కిరిబిక్కిరిగా ఉందని చెప్పింది. ముమ్మాటికీ ఆక్సిజన్ అందకే దేవి మృతిచెందింది''అని దేవి సోదరి పేర్కొన్నారు. అయితే ''దేవి అనే మహిళ.. 6వ తేదీ తెల్లవారు ఝామున 2.45 గంటలకు జ్వరం, ఒళ్లునొప్పులు, వాంతులతో అడ్మిట్ అయ్యారు. ఆక్సిజన్ లెవెల్స్ 93-97శాతం ఉన్నాయి. బీపీ కూడా బాగానే ఉంది. పల్స్ ఎక్కువగా కొట్టుకుంటోంది. ఆమెని సాధారణ వార్డులోనే చికిత్స అందించారు. ఆమె ఆల్కహాల్‌కు అడిక్ట్ అయినట్లు గుర్తించాం. గురువారం మధ్యాహ్నం లివర్ సామర్థ్యం దెబ్బతినడం, లివర్, గాల్ బ్లాడర్‌లో స్టోన్స్‌ఉన్నట్లు అల్ట్రా సౌండ్ రిపోర్టులో గుర్తించాం. రాత్రి సడెన్‌గా గుండె పోటు వచ్చి మృతి చెందింది. ఆమె చనిపోవడానికి ఆక్సిజన్ లేకపోవటం అనేది కారణమే కాదు'' అని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పేర్కొన్నారు.

అరవద్దంటూ బెదిరింపులు

దేవి ఉదయం చేరినప్పుడే.. ఆక్సిజన్ లెవల్స్ తగ్గుతున్నాయని వైద్యులు గుర్తించి.. ఆక్సిజన్ అందించినట్లు బంధువులు చెబుతున్నారు. కానీ.. ఆమె మృతి చెందిన తర్వాత.. కేజీహెచ్ సిబ్బంది మాత్రం.. 'అబ్బే ఆమెకు అసలు ఆక్సిజన్ పెట్టనేలేదు' అంటూ బుకాయించేస్తున్నారు. ఈ విషయంపై రోగి బంధువులు నిలదీసినప్పుడు.. అరవొద్దంటూ వారిపై బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది.

ఒకే రోజు అన్ని పరీక్షలు చేసేశారా.?

కేజీహెచ్‌కు ఎమర్జెన్సీ కేసు వచ్చినప్పుడు మాత్రమే కీలక పరీక్షలు నిర్వహించి రిపోర్టులను వేగవంతంగా వచ్చే ఏర్పాట్లు చేస్తుంటారు. కానీ దేవి అడ్మిట్ అయ్యింది.. జ్వరం, వాంతులు, ఒళ్లు నొప్పులతోనే. అందుకే.. వైద్యులు సాధారణ వార్డుకి రిఫర్ చేశారు. ఈ పరిస్థితుల్లో పేషెంట్‌కు అల్ట్రాసౌండ్, ఇతర రక్త పరీక్షలు చేసినా.. రిపోర్టులు రాత్రి లేదా మరుసటి రోజు ఉదయానికి వస్తాయి. కానీ దేవికి మాత్రం వెంటవెంటనే ఎలా వచ్చేశాయి.? ఇవన్నీ మృతి చెందిన తర్వాత సృష్టించినవని బంధువులు విమర్శిస్తున్నారు.

రెండువేల సంతకాలు చేయించిన రేష్మ

అభినందించిన చెల్లుబోయిన



రాజమహేంద్రవరం రూరల్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో తూర్పుగోదావరి జిల్లాలోని కాతేరు గ్రామ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షురాలు, ఇంజినీరింగ్ విద్యార్థిని మహమ్మద్ రేష్మ రెండు వేల సంతకాలను పూర్తి చేసింది. శుక్రవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు సంతకాల పేపర్లను అందజేసింది. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ ఆమెను అభినందించారు. రేష్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పీపీపీ విధానం వల్ల జరిగే నష్టాలను కళాశాల విద్యార్థులకు తెలియచెప్పడంతో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా కోటిసంతకాల సేకరణకు మద్దతుగా నిలిచి సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి వామిశెట్టి పరమేశ్వర రావు, నల్లజర్ల ఎంపీపీ బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలు, డేటా డిజిటలైజేషన్‌పై దృష్టి పెట్టాలి

- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- కోటి సంతకాలు రచ్చబండ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన
- 12న నియోజకవర్గాల్లో ర్యాలీలకు కలిసి వచ్చే అన్ని పార్టీలను కలుపుకొని పోదాం

సాక్షి, అమరావతి: పార్టీ కమిటీల ఏర్పాటు, డేటా డిజిటలైజేషన్‌పై నాయకులు సీరియస్‌గా దృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వీటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమాలను ఇంటెన్సివ్ డ్రైవ్ లా ముందుకు తీసుకెళ్తూ నిర్దేశిత సమయానికి అన్ని స్థాయిల్లో కమిటీల నియామకాలు పూర్తవ్వాలన్నారు. సెంట్రల్ ఆఫీస్ నుంచి ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం తక్షణమే ఫోకస్డ్‌గా పని చేసి.. మండల, గ్రామ స్థాయి కమిటీల నియామకాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డేటా ప్రొఫైలింగ్ పక్కాగా జరగాలని, అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ ఇప్పటికే రూపొందించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో ఆర్డినేషన్), రాష్ట్ర కార్యదర్శులు (కో ఆర్డినేషన్), ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర కార్యదర్శుల(పార్లమెంట్)తో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. కమిటీల ఏర్పాటు ఎంత ముఖ్యమో.. ఆ తర్వాత ఆ కమిటీలు అంతే ఉత్సాహంగా పని చేయాలని జగన్ సూచించారని తెలిపారు.

పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోటి సంతకాలు రచ్చబండ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, జగన్ అభిప్రాయంతో ప్రజలు ఏకీభవిస్తున్నారని చెప్పారు. పార్టీ అనుబంధ విభాగాలు కూడా ఇందులో తమవంతుగా వివిధ వర్గాల ప్రజలను కలిసి ప్రజా స్పందనను సంతకాల రూపంలో విస్తృతంగా నమోదు చేస్తున్నారన్నారు. వచ్చే వారంలో కోటి సంతకాల సేకరణపై రివ్యూ చేద్దామని, ప్రభుత్వం దిగివచ్చే వరకు మన పోరాటం ఆగదని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గాల్లో ఈ నెల 12న నిర్వహించే ర్యాలీలకు కలిసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకొని పోదామని, వివిధ కుల సంఘాలు, సివిల్ సొసైటీలను భాగస్వామ్యం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో పోస్టర్ రిలీజ్ కార్యక్రమం జరిగిందని, దీనిపై ఈ నెల 8న అన్ని జిల్లాల్లో జిల్లా పార్టీ అధ్యక్షులు, 9వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, ఆ తర్వాత మండల స్థాయిలో పోస్టర్ రిలీజ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని మీడియాకు వివరించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను డిజిటల్, సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళదామని చెప్పారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై..

వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం

- ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు
- 175 నియోజకవర్గాల కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహణ
- తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ

'వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రజా ఉద్యమం పేరుతో 175 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించనున్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేస్తారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాక్ గూఢచర్యం కేసులో మరో ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: దేశ భద్రతా రహస్యాలు పాకిస్తాన్‌కు చేరవేస్తూ గూఢచర్యానికి పాల్పడిన కేసులో మరో ఇద్దరు నేవీ అధికారులకు విశాఖ ప్రత్యేక న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. హైదరాబాద్‌లోని జాతీయ భద్రతా సంస్థ అధికారులు జరిపిన విచారణలో గూఢచర్యం కేసులో విశాఖ జిల్లాకు చెందిన కలవలపల్లి కొండబాబు, హిమాచల్‌ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాకు చెందిన అవినాష్ సోమల్‌ల నేరం రుజువు కావడంతో ఇద్దరికీ ఐదేళ్ల పది నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేలు చొప్పున జరిమాన విధించింది. జరిమాన చెల్లించకుంటే అదనంగా ఏడాది సాధారణ శిక్ష అనుభవించాలని పేర్కొంది. 2019లో ఈ ఇద్దరు నిందితులను ఎన్ఐఏ ముంబైలో అరెస్ట్ చేసింది. దీంతో ఈ ఇద్దరితో కలిపి ఈ కేసులో శిక్ష పడిన వారి సంఖ్య ఆరుకు చేరింది. ఈ కేసులో మొత్తం 15 మందిపై ఎన్ఐఏ చార్జిషీటు దాఖలు చేసింది. మిగతా తొమ్మిది మందిపై విచారణ పెండింగ్‌లో ఉంది.

ఎంబీఏ విద్యార్థి దారుణ హత్య

- ఎక్కడో చంపి.. ఊరికి సమీప చెరువు మొరవలో మృతదేహం పడవేత

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థిని దారుణంగా హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. గోళ్లపల్లె పంచాయతీ గుడిసెవారిపల్లెకు చెందిన టి.శ్యామలమ్మ, వెంకటశివారెడ్డి దంపతులకు టి.జయప్రకాష్‌రెడ్డి (23), గిరివర్ధన్‌రెడ్డి సంతానం. వెంకటశివారెడ్డి నాలుగేళ్ల క్రితమే మృతి చెందగా జయప్రకాష్‌రెడ్డి అంగళ్లులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. జయప్రకాష్‌రెడ్డి నాలుగు నెలలుగా కళాశాలకు వెళ్లకుండా మద్యానికి అలవాటు పడ్డాడు. దీనికితోడు తల్లి శ్యామలమ్మతో ఆస్తులకు సంబంధించి గొడవ పడేవాడు. దీంతో శ్యామలమ్మ తన పుట్టినిల్లైన మదనపల్లె మండలంలోని జవుకుపల్లెకు వెళ్లిపోయింది. ఈనెల మూడో తేదీన జయప్రకాష్‌రెడ్డి జవుకుపల్లెకు వెళ్లి ఆస్తుల పంపకాల కోసం తల్లితో గొడవ పెట్టుకున్నాడు. త్వరలోనే పరిష్కరించుకుందామని బంధువులు సర్దిచెప్పి పంపేశారు. ఈ క్రమంలో గుడిసివారిపల్లె సమీపంలోని నేరేళ్ల చెరువు మొరవపై జయప్రకాష్‌రెడ్డి దారుణ హత్యకు గురయ్యాడు. గమనించిన మృతుడి పెద్దమ్మ సరళ.. శ్యామలమ్మకు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఒంటిపై తీవ్ర గాయాలు ఉన్నట్లు గుర్తించామని సీఐ గోపాల్‌రెడ్డి చెప్పారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ చెప్పారు. తుమ్మనంగుట్ట-గట్టు మార్గంలోని గుంతావారిపల్లె సమీపంలో రోడ్డుపై రక్తం మరకలను గుర్తించామని, దుండగులు అక్కడ హతమార్చి మృతదేహాన్ని మొరవపై పడేసినట్లు తెలుస్తోందన్నారు.

మారణహోమం సృష్టించేందుకే..

బండ్లమూడి దళితులపై దాడి

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆగ్రహం
- రాజకీయ, ఆర్థిక బలం ఉందన్న అహంకారంతోనే దాడి చేశారని మండిపాటు
- నిందితులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

ఒంగోలు టౌన్: కారంచేడు, చుండూరు తరహాలో మారణహోమం సృష్టించడానికే ప్రకాశం జిల్లా బండ్లమూడిలో దళితులపై అగ్రకులాల వారు దాడికి పాల్పడ్డారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడిలో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దళితులను శుక్రవారం ఆయన పరామర్శించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి.. బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం చేయాలని కోరారు. అనంతరం మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడుతూ.. బండ్లమూడిలో దళితులపై దాడి పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందన్నారు. లేకపోతే అగ్రకులాలందరి చేతుల్లోకి కర్రలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. దళితుల పొలంలో శ్రీనివాసరెడ్డికి చెందిన మేకలు మేశాయని.. దీంతో పంట నష్టం జరిగిందన్నారు. పరిహారం అడిగేందుకు వెళ్లిన ఏసుదాసు కుటుంబాన్ని కులం పేరుతో తీవ్రంగా దూషించారని చెప్పారు. దీనిపై ఏసుదాసు కుటుంబం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. అగ్రకులాల వారు దాడికి తెగబడ్డారన్నారు. దీంతో దళితుల తలలు పగిలాయని.. ఒకరి చేయి విరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక బలం ఉందన్న అహంకారంతోనే దాడికి తెగబడ్డారని విమర్శించారు. ఈ కేసును నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని.. తీవ్రతను తగ్గించేలా సెక్షన్లు నమోదు చేశారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించకపోతే.. మరింతగా విర్రవీగే అవకాశం ఉందన్నారు. దీనివల్ల గ్రామంలో ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు నేలపాటి రాజు, గుంటూరు ప్రభుదాసు, తోరటి ఆనంద్, సర్వేపల్లి రవిరాజు, భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

కనగానపల్లి: ప్రైవేటు పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు బస్సు ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం సీఎస్ కోట గ్రామంలో ఇమ్మ్యాక్యులేట్ హార్ట్ అనే ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం స్కూల్ బస్సు 60 మంది విద్యార్థులతో బయలుదేరింది. తగరకుంట సమీపంలోకి రాగానే సెన్సార్ సరిగా పనిచేయలేదు. బస్సు బ్రేకులతో పాటు స్టీరింగ్ పనిచేయకుండా తిరగడం ఆగిపోయింది. దీంతో అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకెళ్లింది. బస్సు టైర్ల కింద రాళ్లు అడ్డుపడటంతో అక్కడే ఆగిపోయింది. లేదంటే గుంతలోకి బోల్తా పడే ప్రమాదముండేది. విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు.

ప్రేమ పేరుతో వేధించిన గెస్ట్ లెక్చరర్ అరెస్ట్



నర్సీపట్నం(అనకాపల్లి జిల్లా): ప్రేమ పేరుతో విద్యార్థినిని వేధిస్తున్న అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్ కోనా నారాయణరావును అరెస్ట్ చేసినట్టు నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. విద్యార్థిని ఫిర్యాదుతో పాటు కాలేజీ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు, విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని సెక్షన్ 75, 78 కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా, నారాయణరావు జనసేన పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నాడు. పార్టీ పదవి కోసం ఇతని పేరును ఇటీవల స్థానిక నాయకత్వం సిఫారసు కూడా చేసినట్లు తెలిసింది.

విజయవాడలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప ప్రాంగణం

వాటర్ ఫౌంటెయిన్‌లలో పసరుపట్టిన నీరు తొలగించిన దృశ్యం

తాత్కాలిక శు'భ్రమేనా'..!

- చెత్తాచెదారం, వాటర్ ఫౌంటెయిన్లలో పసరు నీరు తొలగింపు
- కంటితుడుపు చర్యలతో సరిపెట్టొద్దని దళిత, గిరిజన సంఘాల ఆగ్రహం
- సుందర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్
- 26న రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని 'చలో అంబేడ్కర్ విగ్రహం' కార్యక్రమానికి పిలుపు

అంబేడ్కర్ స్మృతివనంలో సర్కారు పారిశుద్ధ్య పనులు

సాక్షి, అమరావతి: విజయవాడ సామాజిక న్యాయ మహాశిల్పం అంబేడ్కర్ ప్రాంగణంలో సర్కారు పారిశుద్ధ్య పనులు చేపట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన మహాశయుని మహాశిల్పంపై చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఆది నుంచి వివక్ష, నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో ''అంబేడ్కర్‌పైనా కూటమి కక్ష!' శీర్షికన సాక్షి కథనం ప్రచురించడంతో సర్కారు తీరుపై దళిత, గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో ఎట్టకేలకు దిగొచ్చిన సర్కారు శుక్రవారం ప్రాంగణంలో హడావుడిగా పారిశుద్ధ్య పనులు చేపట్టింది. వాటర్ ఫౌంటెయిన్లలో పేరుకుపోయిన పసరు నీటిని తొలగించింది. వాటిని మళ్లీ మంచినీటితో నింపాల్సి ఉంది. ప్రాంగణం మొత్తం పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, శుభ్రంచేయించింది. ఈ చర్యలపై దళిత, గిరిజన సంఘాలు గళమెత్తాయి. కేవలం తాత్కాలిక కంటితుడుపు చర్యలతో సరిపెట్టకుండా స్ఫూర్తిదాయకమైన ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనిని ప్రైవేట్‌పరం చేయకుండా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నాయి. సామాజిక న్యాయ మహాశిల్పం పరిరక్షణకు, అభివృద్ధికి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం రోజున 'చలో అంబేడ్కర్ విగ్రహం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నద్ధమయ్యాయి.

రాష్ట్రం గర్వించే రీతిలో సామాజిక న్యాయ మహాశిల్పం

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అంబేడ్కర్ స్మృతివనాన్ని రాజధాని అమరావతిలో నిర్మిస్తామని ప్రతిపాదించి ఆ ఐదేళ్లలో కనీసం పనులు కూడా ప్రారంభించలేదు. పూర్తి చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో సామాజిక న్యాయ మహాశిల్పాన్ని రాష్ట్రం గర్వించే రీతిలో ఏర్పాటుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిని ప్రైవేటీకరించేందుకు కుయుక్తులు పన్నుతోంది. ప్రాంగణంలో పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులపాల్జేస్తోంది. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. తాత్కలిక కంటితుడుపు చర్యలు చేపడితే పోరాటం తప్పదు.

– వి.శ్రీనివాసరావు, దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున నిర్మించిన సామాజిక న్యాయ మహాశిల్పం రాష్ట్ర ప్రతిష్టను పెంచింది. ఈ ప్రాంగణంలో కన్వెన్షన్ సెంటర్ తదితర పనులను పూర్తిచేయాల్సి ఉంది. వాటిపై కూటమి సర్కారు దృష్టిపెట్టాలి. ఈ ప్రాంగణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– అంద్ర మాల్యాద్రి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజా సంఘాలపై టీడీపీ బురద జల్లడం సరికాదు

సామాజిక న్యాయ మహాశిల్పం పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్న ప్రజా సంఘాలు, అంబేడ్కరిస్టులపై టీడీపీలోని కొందరు ఎస్సీ నాయకులు బురదచల్లే తీరు సరికాదు. ప్రాంగణం అభివృద్ధిపై అంబేడ్కరిస్టులు, పౌర సమాజ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి.

– శ్వేతా బుడమూరి, సమతా సైనిక దళ్ మహిళా అధ్యక్షులు

26న చలో అంబేడ్కర్ విగ్రహం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకుని 'చలో అంబేడ్కర్ విగ్రహం' కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ ప్రభుత్వం రాగానే అంబేడ్కర్ ప్రాంగణంలో లైట్లు తీసేసి అంధకారంలో ఉంచారు. విగ్రహంపై ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరును తొలగించి అక్కసు తీర్చుకున్నారు. దీనిని రాజకీయ కోణంలో చూడాల్సిన పనిలేదు. కూటమి సర్కారు కళ్లు తెరిపించేలా చలో విజయవాడ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలి.

– వై.కొండలరావు, జై భీమ్ భారత్ పార్టీ అధికార ప్రతినిధి

ఒక మంత్రం..ఒక శక్తి..స్ఫూర్తి

దురదృష్టవశాత్తూ ముఖ్యమైన చరణాలు తొలగించారు

- వందేమాతరం గేయానికి చేసిన గాయం దేశ విభజనకు బీజం వేసింది
- ఆ విభజన ఆలోచనా విధానం ఈనాటికీ సవాలు విసురుతోంది
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- వందేమాతరం ఉత్సవాలు ప్రారంభం
- ప్రత్యేక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల
- సామూహిక గేయాలాపనలో పాల్గొన్న ప్రధాని

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వందేమాతరం... ఒక మంత్రం, ఒక శక్తి, ఒక స్వప్నం, ఒక సంకల్పం అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వందేమాతరం గేయం తరతరాలుగా మనకు నూతన స్ఫూర్తిని, శక్తిని ఇస్తూనే ఉందని అన్నారు. ప్రఖ్యాత బెంగాలీ సాహితీవేత్త బంకించంద్ర చటర్జీ రచించిన జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాబోయే ఏడాది పాటు దేశవ్యాప్తంగా జరిగే స్మారకోత్సవాలను ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలో లాంఛనంగా ప్రారంభించారు. ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంప్, నాణేన్ని విడుదల చేశారు. సామూహిక గేయాలాపనలో పాల్గొన్నారు. భారత స్వాతంత్ర్య సమరానికి వందేమాతరం బలమైన గొంతుకగా నిలిచిందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ప్రతి భారతీయుడి మనసులోని భావాలను వ్యక్తీకరించిందని తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తూ 1937లో వందేమాతరం గేయంలోని ముఖ్యమైన చరణాలను తొలగించారని తప్పుపట్టారు. గేయానికి అసలైన ఆత్మలాంటి చరణాలు కనిపించకుండాపోయాయని అన్నారు. వందేమాతరం గేయానికి చేసిన గాయం విభజన దేశ విభజనకు బీజం వేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. దేశ నిర్మాణానికి బోధకశక్తి అయిన ఈ మహామంత్రానికి అన్యాయం ఎందుకు జరిగిందో ఈనాటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆ విభజన ఆలోచనా విధానం ఈనాటికీ మన దేశానికి సవాలు విసురుతోందని చెప్పారు.

దుర్గామాతగా మారగలం

మన జాతీయ గేయం ప్రతి తరానికీ సమకాలీన

బ్రిటిష్ వలసవాదులు వారి దుష్ట పాలనను సమర్థించుకోవడానికి భారత్‌ను వెనుకబడిన దేశంగా, తక్కువ స్థాయి కలిగిన దేశంగా చిత్రీకరించారని ప్రధాని మోదీ ఆక్షేపించారు. వందేమాతరం గేయం ఆ తప్పుడు ప్రచారాన్ని పటాపంచలు చేసిందని అన్నారు. దేశం అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం అని భావించేవా

ఆ స్వప్నాన్ని సాకారం చేసుకోవాలి

రిని.. ఈ గేయం దేశాన్ని ఒక తల్లిగా అభివర్ణించడం చాలా ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు. మన దృష్టిలో తల్లి అంటే జన్మనిచ్చి, పోషించడమే కాకుండా బిడ్డ ప్రమాదంలో ఉంటే కాపాడుకొనే గొప్ప వ్యక్తి, దుష్టులను దునుమాడే శక్తి అని వెల్లడించారు. వందేమాతరం అసలైన స్వప్నాన్ని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'ఆత్మనిర్భర్ భారత్' విజయం సాధిస్తోందన్నారు. '2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్' అనే లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా పరుగులు తీస్తోందని పేర్కొన్నారు. మనం ప్రతిసారీ ఒక కొత్త ఘనత సాధించినప్పుడు దేశమంతటా వందేమాతరం ప్రతిధ్వనిస్తోందని హర్షం వ్యక్తంచేశారు. మన ఆడబిడ్డలు కీలక రంగాల్లో విజయాలు సొంతం చేసుకున్నప్పుడు దేశ ప్రజలంతా వందేమాతరం అంటున్నారని తెలియజేశారు. వన్ ర్యాంక్, వన్ పెన్షన్ పథకానికి 11 ఏళ్లు పూర్తయ్యాయని ప్రధానమంత్రి వివరించారు. ఉగ్రవాదం, నక్సలిజం, మావోయిస్టు తీవ్రవాదాన్ని ఓడించినప్పుడల్లా మన సైనిక దళాలు వందేమాతరం అని నినదిస్తున్నాయని చెప్పారు. వందేమాతరం స్మారకోత్సవాలు 2026 నవంబర్ 7వ తేదీదాకా కొనసాగుతాయి. ఈ గేయాన్ని బంకించంద్ర చటర్జీ 1875 నవంబర్ 7న అక్షయ నవమి సందర్భంగా రచించారు. అనంతరం ఆయన రాసిన ఆనంద్‌మఠ్ నవలలో ఈ గేయాన్ని చేర్చారు.

మేనని ప్రధాని మోదీ వివరించారు. ఆపరేషన్ సిందూర్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశ భద్రత, గౌరవంపై దాడికి దిగిన ముష్కరులకు తిరుగులేని గుణపాఠం నేర్పించామని చెప్పారు. నూతన భారతదేశంలో మానవాళికి సేవ చేసే 'కమల, విమల స్ఫూర్తి'తోపాటు అవసరమైతే దుర్గామాతగా మారడం కూడా మనకు తెలుసని స్పష్టంచేశారు. పది రకాల ఆయుధాలు చేతబూని ఉగ్రవాదులను అంతం చేయగలమని పేర్కొన్నారు. ముష్కరులు మరోసారి మనవైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే ప్రాణాలతో వదిలిపెట్టబోమని పరోక్షంగా హెచ్చరించారు.

మళ్లీ స్వర్ణయుగంలోకి..

విజ్ఞానం, సైన్స్ అండ్ టెక్నాలజీ అనే పునాదులపై మన దేశాన్ని గొప్పగా నిర్మించుకోవాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. భారతదేశ సౌభాగ్యం గురించి ప్రపంచం కొన్ని శతాబ్దాలుగా వింటోందని అన్నారు. కేవలం కొన్ని శతాబ్దాల క్రితం ప్రపంచ జీడీపీలో మన జీడీపీ నాలుగింట ఒక వంతు ఉండేదని తెలిపారు. బంకించంద్ర చటర్జీ వందేమాతర గేయాన్ని రచిస్తున్న సమయంలో దేశం స్వర్ణయుగాన్ని కోల్పోయిందని అన్నారు. విదేశీ దండయాత్రలు, దోపిడీ, దౌర్జన్యాలు, అరాచకాలు, వలసవాద విధానాలు మనదేశాన్ని పీల్చిపిప్పి చేశాయని, పేదరికం, ఆకలితో దేశం అల్లాడిపోయిందని గుర్తుచేశారు. భారతదేశం ఎప్పటికైనా పునర్వైభవం సాధించాలని బంకించంద్ర చటర్జీ కలలుగన్నారని చెప్పారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా మళ్లీ స్వర్ణయుగంలోకి ప్రవేశించాలంటూ బోధించారని తెలిపారు. ఆ దిశగా వందేమాతరం అనే మహోన్నతమైన పిలుపును ఇచ్చారని ప్రధానమంత్రి శ్లాఘించారు.

శుక్రవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందేమాతర గీతాలాపన కార్యక్రమానికి త్రివర్ణ పతకాలు చేబూని హాజరైన పాఠశాల విద్యార్థులు

వందేమాతరం

గళమెత్తిన యావత్ దేశం

న్యూఢిల్లీ: వందేమాతరం ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజలు జాతీయ గేయం ఆలపించారు. శుక్రవారం దేశమంతటా విద్యాసంస్థల్లో సామూహిక గేయాలాపన చేశారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వందేమాతరం స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఢిల్లీలో జరిగిన ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. గేయంలోని ముఖ్యమైన చరణాలను తొలగించడాన్ని ఆయన తప్పుపట్టారు. వందేమాతరం గేయం దశాబ్దాలుగా ఎలా స్ఫూర్తిగా నిలుస్తోందో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వివరించారు. భరతమాతను సుజలం, సుఫలం, సుఖదాంగా కొనసాగించడానికి మనమంతా బలమైన సంకల్పం తీసుకోవాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో రాష్ట్రపతి పోస్టు చేశారు. వందేమాతరం మనకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ గేయం జాతీయవాదాన్ని మేల్కొల్పిందని గుర్తుచేశారు. వందేమాతరం ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రసంగించారు. మన స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలను గత 11 ఏళ్లలో సమ్మిళిత కృషి ద్వారా నెరవేర్చామని తెలిపారు.

కాంగ్రెస్ పాపం చేసింది: బీజేపీ

కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం, పాపం చేసిందని బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్.కేశవన్ 'ఎక్స్'లో విమర్శించారు. వందేమాతరం గేయాన్ని మతంతో ముడిపెట్టి కొన్ని చరణాలను అప్పటి కాంగ్రెస్ నేత జవహర్‌లాల్ నెహ్రూ ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. దుర్గామాతను ఆరాధిస్తున్నట్లుగా ఉన్నాయన్న కారణంతోనే వాటిని తొలగించారని ఆక్షేపించారు. మతపరమైన ఎజెండాకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఓ వర్గాన్ని సంతృప్తిపర్చాలన్న ఉద్దేశంతోనే జాతీయ గేయాన్ని ముక్కలు చేశారని మండిపడ్డారు.

మోదీ క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్

జాతీయ గేయాన్ని 1937లో విభజించారంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. బంకించంద్ర చటర్జీ రాసిన గేయంలో మొదటి రెండు చరణాలను స్వీకరించాలని అప్పట్లో రవీంద్రనాథ్ ఠాగూర్ స్వయంగా సూచించారని గుర్తుచేసింది. నోబెల్ బహుమతి గ్రహీతను అవమానించడం సిగ్గుచేటు అంటూ మోదీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మోదీ విభజన సిద్ధాంతాన్ని నమ్ముకుంటున్నారని ఆరోపించింది. ప్రధానమంత్రి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. వందేమాతరాన్ని దశాబ్దాలుగా సగర్వంగా ఆలపిస్తున్నది కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొంది. జాతీయవాదానికి సంరక్షకులం అని చెప్పుకొనే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు వారి శాఖల్లో జాతీయ గేయం, జాతీయ గీతాన్ని ఏనాడూ ఆలపించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు.

పూర్తి గేయం అందరూ ఆలపించాలి

దేశ ఐక్యత, సాంస్కృతిక చైతన్యానికి స్ఫూర్తి: అమిత్ షా

న్యూఢిల్లీ: వందేమాతరం ఉత్సవాల్లో భాగంగా పూర్తి గేయాన్ని అందరూ ఆలపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. దేశ ఐక్యతకు, సాంస్కృతిక చైతన్యానికి ఇదొక కాలాతీతమైన స్ఫూర్తి అని చెప్పారు. ఏడాది పాటు జరిగే ఉత్సవాల్లో పూర్తి గేయాన్ని దేశమంతటా తాము ఆలపిస్తామని తెలిపారు. ఇది స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు నడిపించిన గొప్ప గేయమని చెప్పారు. మన సంకల్పానికి స్ఫూర్తి అని, భారతదేశాన్ని మేల్కొల్పిన తొలి మంత్రమని వివరించారు. ఈ మేరకు అమిత్ షా తనకు సంబంధించిన వెబ్‌సైట్‌లో శుక్రవారం ఓ వ్యాసం రాశారు. వందేమాతరం అంటే ఒక ప్రార్థన అని వెల్లడించారు. సాంస్కృతిక జాతీయవాదంపై బంకించంద్ర చటర్జీ చేసిన మొదటి ప్రకటన వందేమాతరం అని వ్యాఖ్యానించారు. పూర్తి గేయం మరోసారి ప్రతిధ్వనించాలని, సాంస్కృతిక జాతీయవాదం గురించి యువతకు స్ఫూర్తినివ్వాలని అమిత్ షా ఆకాంక్షించారు.

భవ్యమైన భవిష్యత్తుకు ఇదొక మంత్రం

భారతదేశ చరిత్రలో సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో సంగీతం, కళలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయని అమిత్ షా గుర్తుచేశారు. వందేమాతరం మహోన్నత జాతీయ గేయమని కొనియాడారు. ఈ గేయంలో గొప్ప మ్యాజికల్ పవర్ ఉందని, ఎలాంటి వారినైనా ఉత్తేజితులను చేస్తుందని మహాత్మాగాంధీ సైతం ప్రశంసించారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసిన ఘనత వందేమాతరం సొంతమని గాంధీజీ పేర్కొన్నట్లు గుర్తుచేశారు. భరతమాత పునర్జన్మకు వందేమాతరం ఒక మంత్రమని మహర్షి అరబిందో అన్నట్లు తెలిపారు. వందేమాతరం అంశం అనేది గతాన్ని గుర్తుచేసుకోవడానికే పరిమితం కావొద్దని, భవ్యమైన భవిష్యత్తుకు ఇదొక మంత్రం కావాలని అమిత్ షా తేల్చిచెప్పారు. 'వికసిత్ భారత్' సంకల్పానికి, ఆత్మనిర్భర్ భారత్ ధ్యేయానికి వందేమాతరమే స్ఫూర్తి అని స్పష్టంచేశారు.

పట్నాలో జరిగిన కార్యక్రమంలో అమిత్ షా

కేసుల వివరాలు వెల్లడించకపోతే

ఎన్నికైన అభ్యర్థిపైనా అనర్హత వేటు: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాల్లో అన్ని విషయాలూ కచ్చితంగా వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చేసిన నేరాలు, శిక్షలు, జరిమానాలు, వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా పేర్కొనాలని సూచించింది. ఒకవేళ ఎన్నికల్లో నెగ్గిన తర్వాత ఆ అభ్యర్థి నామినేషన్‌లో కొన్ని విషయాలు దాచిపెట్టినట్లు తేలితే అతడిపై అనర్హత వేటు పడుతుందని స్పష్టంచేసింది. ఈ మేరకు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా ఒక ఉత్తర్వు జారీ చేసింది. మధ్యప్రదేశ్‌లోని భికన్‌గావ్ నగర పరిషత్ సభ్యురాలిపై అనర్హత వేటు పడింది. చెక్ బౌన్స్ కేసులో ఆమె నిందితురాలు. ఏడాదిపాటు జైలు శిక్ష కూడా పడింది. ఈ విషయాన్ని అఫిడవిట్‌లో దాచిపెట్టారు. అందుకే ఎన్నికైన తర్వాత కూడా అనర్హత వేటు పడింది. దాంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనను అనర్హురాలిగా ప్రకటించడాన్ని నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

బిహార్‌లో ఎక్కడా రీపోలింగ్ లేదు: ఈసీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ 45,000కుపైగా బూత్‌ల్లో ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల సంఘం ప్రకటించింది. రీపోలింగ్ కోసం ఎలాంటి ప్రతిపాదన చేయలేదని శుక్రవారం వెల్లడించింది. ఎక్కడా రీపోలింగ్ అవసరం రాలేదని పేర్కొంది. తొలి దశలో పోలింగ్ జరిగిన 121 నియోజకవర్గాల్లో సంబంధిత డాక్యుమెంట్ల సూక్ష్మపరిశీలన పూర్తయినట్లు తెలియజేసింది. ఎన్నికల నిర్వహణలో లోపాలు గానీ, అవకతవకలు గానీ జరిగినట్లు నిరూపణ కాలేదని స్పష్టంచేసింది. అందుకే రీపోలింగ్ కోసం ప్రతిపాదించలేదని ఎన్నికల సంఘం వివరించింది.

113 జెట్ ఇంజిన్ల కొనుగోలుకు జీఈతో హాల్ ఒప్పందం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) అమెరికా రక్షణ రంగ సంస్థ జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) ఏరోస్పేస్‌తో భారీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా, ఎంకే1ఏ కార్యక్రమం కింద తేజస్ విమానాలకు అవసరమైన 113 జెట్ ఇంజిన్లను కొనుగోలు చేయనుంది. భారత ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం 50%టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించిన వేళ ఈ ఒప్పందం కుదరడం గమనార్హం. రూ.8,870 కోట్ల విలువైన ఈ ఒప్పందం ప్రకారం జీఈ ఏరోస్పేస్ సంస్థ ఎఫ్404–జీఈ–ఐఎన్ 20 రకం ఇంజిన్లను హెచ్‌ఏఎల్‌కు 2027–2032 సంవత్సరాల మధ్య అందజేయాల్సి ఉంటుంది.

ఆ ప్రాంగణాల్లో కుక్కలు కనపడొద్దు!

- రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై పశువుల సంచారంపై నిషేధం
- విద్యా సంస్థలు, ఆస్పత్రులు, బస్టాండ్లకు తక్షణమే ఫెన్సింగ్
- ఆయా చోట్ల పట్టుకున్న కుక్కలకు షెల్టర్లలోనే ఆశ్రయం
- ఆదేశాల అమలు చీఫ్ సెక్రటరీల వ్యక్తిగత బాధ్యత
- కుక్క కాటు ఘటనలపై సుప్రీంకోర్టు వరుస ఆదేశాలు
- జంతు ప్రేమికుల వాదనలు పట్టించుకోని న్యాయస్థానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కుక్క కాటు ఘటనలు, వీధి కుక్కల బెడద పెరిగిపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేసింది. పౌరుల భద్రత, ముఖ్యంగా చిన్నారులు, రోగుల రక్షణకు అత్యంత ప్రాధాన్య మిస్తూ సంచలన, చరిత్రాత్మక ఆదేశాలను జారీ చేసింది. పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి సున్నితమైన ప్రాంతాల ప్రాంగణాల్లో వీధి కుక్కలను పూర్తిగా లేకుండా చేయాలని స్పష్టం చేసింది. ఆయా ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను స్టెరిలైజేషన్ తర్వాత కూడా.. తిరిగి అదే ప్రదేశంలో వదిలిపెట్టరాదని రాష్ట్రాలను కఠినంగా ఆదేశించింది. వాటిని షెల్టర్లకు తరలించాల్సిందేనని పేర్కొంది.

తీర్పు వెలువడుతున్న సమయంలో సుప్రీంకోర్టు ఆవరణలో కుక్కలు

ఇదే సమయంలో, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై పశువుల విచ్చలవిడి సంచారంపైనా సుప్రీంకోర్టు ఉక్కు పాదం మోపింది. రోడ్లపై సంచరించే పశువులను తక్షణమే గోశాలలకు తరలించాలని కుండబద్దలు కొట్టింది. ఈ ఆదేశాల అమలులో రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులే (చీఫ్ సెక్రటరీలు) వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కుక్కకాటు ఘటనలు పెరగటం ఆందోళనకరం, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ధర్మాసనం పేర్కొంది.

వాటిని వదలొద్దు..

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రెండు వారాల్లోగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు (స్కూళ్లు, కాలేజీలు), ఆస్పత్రులు, పబ్లిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, బస్టాండ్‌లు, డిపోలు, రైల్వే స్టేషన్లను గుర్తించాలి. ఈ ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు చొరబడకుండా గేటుతోపాటు చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు చేయాలి. స్థానిక మున్సిపాలిటీలు, పంచాయతీలు ఈ ప్రాంగణాల్లో సంచరించే వీధి కుక్కలను తక్షణమే పట్టుకోవాలి. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేయించాలి. అత్యంత ముఖ్యంగా, ఈ ప్రాంగణాల్లో పట్టుకున్న కుక్కలను స్టెరిలైజేషన్ తర్వాత కూడా.. తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టడానికి వీల్లేదు. వాటిని కచ్చితంగా షెల్టర్ హోంలకు తరలించాలి. వాటిని తిరిగి అక్కడే వదిలిపెడితే, ఈ సంస్థలను కుక్కల బెడద నుంచి విముక్తి చేయాలన్న తమ ఆదేశాల అసలు ఉద్దేశమే దెబ్బ తింటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది.

మూడు నెలలకోసారి తనిఖీలు

మూడు నెలలకోసారి అధికారులు విద్యా సంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల ప్రాంగణాలను తనిఖీ చేసి, కుక్కలు లేవని నిర్ధారించుకోవాలి. ఈ ఆదేశాలు వెలువడిన వెంటనే, జంతు హక్కుల కార్యకర్తల తరఫు న్యాయవాదులు కరుణా నంది, ఆనంద్ గ్రోవర్ జోక్యం చేసుకున్నారు. 'కుక్కలను తొలగిస్తే, కొత్త కుక్కలు ఆ ప్రదేశాన్ని ఆక్రమిస్తాయి. ఇది ఏబీసీ నిబంధనలకు విరుద్ధం'అని వాదించే ప్రయత్నం చేశారు. అయితే, ధర్మాసనం వారి వాదనలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, ఆదేశాలను ఖరారు చేసింది.

రోడ్లపై పశువులు కనపడితే..

రహదారులపై పశువులు, ఇతర జంతువుల సంచారంతో జరుగుతున్న ప్రమాదాలపైనా కోర్టు తీవ్రంగా స్పందించింది. రాజస్తాన్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరింది. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇతర ప్రధాన రహదారులపై సంచరించే పశువులను, ఇతర జంతువులను తక్షణమే గోశాలలకు లేదా షెల్టర్ హోంలకు తరలించి, పునరావాసం కల్పించాలి. ఇందుకోసం ప్రత్యేక 'హైవే పెట్రోల్'బృందాలను, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలి.

నాటకీయ పరిణామాల తర్వాత..

ఈ కేసు అనేక నాటకీయ పరిణామాల మధ్య ఈ దశకు చేరుకుంది. జూలైలో జస్టిస్ జేబీ పార్దివాలా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం.. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో కుక్కలన్నింటినీ పట్టుకుని షెల్టర్లకు తరలించాలని, తిరిగి వదలొద్దని సంచలన ఆదేశాలిచ్చింది. ఇది ఏబీసీ నిబంధనలకు విరుద్ధమని జంతుప్రేమికులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఈ కేసు జస్టిస్ విక్రమ్ నాథ్ నేతత్వంలోని త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ అయింది. ఆగస్టు 22న ఈ ధర్మాసనం.. జస్టిస్ పార్దివాలా బెంచ్ ఆదేశాలపై స్టే ఇచ్చింది. స్టెరిలైజేషన్ చేసిన కుక్కలను తిరిగి అదే ప్రాంతంలో వదలాలని స్పష్టం చేసింది. అయితే, తాజాగా శుక్రవారం, తన పాత వైఖరిని పాక్షికంగా సవరిస్తూ, కుక్కకాటు ముప్పు ఎక్కువగా ఉన్న పాఠశాలలు, ఆస్పత్రుల వంటి 'సున్నితమైన ప్రాంతాలకు'మాత్రం పాత ఏబీసీ నిబంధన నుంచి మినహాయింపు ఇస్తూ.. పౌరుల భద్రతకే పెద్ద పీట వేస్తూ ఈ ఆదేశాలను జారీ చేసింది.

3 వారాలు 8 వారాలు

తమ ఆదేశాల అమలును అత్యంత ముఖ్యమైనవిగా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం కోరింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్, ఇమ్యునోగ్లోబులిన్ అన్ని వేళలా అందుబాటులో ఉండాలని పేర్కొంది. కుక్కకాటుకు ప్రాథమిక చికిత్స, తక్షణం చేపట్టాల్సిన ఇతర చర్యలపై ఆయా సంస్థల్లో సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించింది. కుక్కల బెడద నివారణకు ఫెన్సింగ్, తనిఖీలపై 3 వారాల్లోగా, రోడ్లపై పశువుల తొలగింపుపై 8 వారాల్లోగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలు సమగ్ర నివేదికలు దాఖలు చేయాలని ఆదేశించింది. ఆదేశాల అమలులో ఏమాత్రం అలసత్వం వహించినా, లేదా విఫలమైనా సంబంధిత అధికారులను, ముఖ్యంగా చీఫ్ సెక్రటరీలను వ్యక్తిగతంగా బాధ్యులను చేస్తామని ధర్మాసనం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే జనవరి 13వ తేదీకి వాయిదా వేసింది.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో గందరగోళం

- ఏటీసీ సమస్యతో 800 విమానాలు ఆలస్యం
- ఉత్తరాది విమానాశ్రయాలపైనా ప్రభావం
- రాత్రి 9 గంటలకు సమస్య పరిష్కారం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్య తీవ్ర అలజడి రేపింది. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఏటీసీ సరిగా పనిచేయకపోవడంతో 800కు పైగా దేశీయ, అంతర్జాతీయ విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సమస్య ఇబ్బంది పెడుతున్నప్పటికీ శుక్రవారం ఉదయం 5.45 గంటల నుంచి తీవ్రరూపం దాల్చిందని అధికార వర్గాలు తెలిపాయి. రద్దీ తీవ్రరూపం దాల్చడంతో కనీసం ఏడు విమానాలను సమీపంలోని జైపూర్, లక్నో విమానాశ్రయాలకు దారి మళ్లించారు. ఢిల్లీ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోర్డింగ్ గేట్ల వద్ద ప్రయాణికుల భారీ క్యూలు కనిపిస్తున్నాయని, టెర్మినళ్ల వద్ద వందలాది మంది ప్రయాణికులు ఎదురు చూపులు చూస్తున్నారని సమాచారం. ఫ్లైట్ షెడ్యూల్ ఆటో ట్రాక్ సిస్టమ్ ద్వారా అందకపోవడంతో ట్రాఫిక్ కంట్రోలర్లు మాన్యువల్‌గా తయారు చేస్తున్నారు. ఇందుకు చాలా సమయం తీసుకుంటోంది. దీంతో విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. నిత్యం 1,500 విమానాలు రాకపో కలు సాగించే ఢిల్లీ ఎయిర్ పోర్టు ఏటీసీలోని ఆటో మేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టం(ఏఎంఎస్‌ఎస్)లో సాఫ్ట్‌వేర్ సమస్య ఎదురైంది. ట్రాఫిక్ సిస్టమ్‌పై ప్రభావం పడటంతో విమానాల టేకాఫ్, ల్యాండింగ్ షెడ్యూల్‌కు తీవ్ర అవరోధం ఏర్పడింది. ఇంతటి కీలకమైన ఎయిర్ పోర్టులో తలెత్తిన ఈ సమస్యను కేవలం సాంకేతిక పరమైందిగానే అధికా రులు చెబుతున్నా, 'జీపీఎస్ స్పూఫింగ్'అని పిలిచే సైబర్ అటాక్ కావచ్చని నిపుణులు అంటున్నారు.

సమస్య పరిష్కరించాం: ఏఏఐ

ఢిల్లీ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ఆలస్యం కావడానికి కారణమైన ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్(ఏఎంఎస్‌ఎస్)ను ఎట్టకేలకు గాడిన పెట్టినట్లు ఏఏఐ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తెలిపింది. ట్రాఫిక్ కార్యకలాపాలు తక్షణమే ఆటంకం లేకుండా కొనసాగేందుకు అవసరమైన సిబ్బందిని కూడా రంగంలోకి దించామంది.

ఏమిటీ జీపీఎస్ స్పూఫింగ్..?

సాధారణంగా సంక్షోభ ప్రాంతాల్లో జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలకు ఎక్కువగా అవకాశముంటుంది. భారత్–పాకిస్తాన్ సరిహద్దులకు సమీపంలోనూ ఈ రకమైన సైబర్ దాడులు జరుగుతుంటాయి. ఆపరేషన్ సింధూర్ సమయంలో చైనా తయారీ పాక్ గగనతల రక్షణ వ్యవస్థలను అక్కడి మిలటరీ ప్రాంతాలపై దాడుల సమయంలో భారత్ జామ్ చేసింది. ల్యాండవ్వాల్సిన విమానాల పొజిషన్‌పై ఏటీఎస్‌కు తప్పుడు శాటిలైట్ సిగ్నళ్లను పంపించడం ద్వారా వాటిని దారి మళ్లేలా చేయడం, రద్దీ పెంచడం దీని లక్ష్యం. ఢిల్లీ విమానాశ్రయంలో విమానం పొజిషనింగ్ సాధారణ స్థాయి 8 కాగా, గత కొద్ది రోజులుగా 0గా చూపిస్తోంది. ఢిల్లీ పరిధిలో 60 నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా ఇలాంటి తప్పుడు సిగ్నళ్లు అందుతున్నట్లు పైలట్లు ఫిర్యాదు చేస్తున్నారు.

వచ్చే ఏడాది భారత్‌కు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



న్యూయార్క్/వాషింగ్టన్: వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత ప్రధాని నరేంద్రమోదీ తనకు ఆహ్వానం పంపారని గురువారం తన ఓవల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. 'ఆయన (మోదీ) నా మిత్రుడు. నాతో మాట్లాడినప్పుడు భారత్‌లో పర్యటించాలని కోరారు. అందుకే నేను వెళ్తున్నా. అక్కడ మోదీతో కలిసి నా పర్యటన గొప్పగా ఉండబోతోంది. ఆయన గొప్ప వ్యక్తి. బహుశా వచ్చే ఏడాది నా పర్యటన ఉండవచ్చు'అని పేర్కొన్నారు. అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్ సభ్యులుగా ఉన్న క్వాడ్ సమ్మిట్ త్వరలో భారత్‌లో జరుగనుంది. సదస్సు తేదీలను భారత్ ఇంకా ప్రకటించలేదు. 2024లో అమెరికాలోని డెలావేర్‌లో ఈ సదస్సు నిర్వహించారు. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ ఆపేసిందని ట్రంప్ మరోసారి ప్రకటించారు. 'ఇది గొప్ప విషయం. మంచిగా జరుగుతోంది. అతను (ట్రంప్) ఆపేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలును చాలావరకు ఆపేశారు'అని పేర్కొన్నారు. భారత్– పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్టు మరోసారి చెప్పుకున్నారు. 'నేను ఆపిన 8 యుద్ధాల్లో ఐదారు వరకు టారిఫ్‌లు విధిస్తానని బెదిరించి ఆపినవే. అందుకు ఉదాహరణ కూడా ఇస్తా. మీరు భారత్–పాక్‌ను గమనిస్తే.. వాళ్లు యుద్ధం మొదలుపెట్టారు. పైగా ఆ రెండు అణ్వాయుధ దేశాలు. పరస్పరం 8 యుద్ధ విమానాలు కూల్చేసుకున్నారు. గతంలో లెక్క 7 ఉండేది. ఇప్పుడు 8కి పెరిగింది. వాళ్లకు నేను ఒక్కటే చెప్పి.. మీరు ఇలాగే యుద్ధం చేసుకుంటే.. మీ ఇద్దరిపై భారీగా పన్నులు విధిస్తానని తెలిపా. దీంతో వాళ్లు వెనక్కు తగ్గి యుద్ధాన్ని విరమించారు. టారిఫ్‌లే లేకుంటే.. నేను ఆ యుద్ధాన్ని ఆపగలిగేవాడిని కాదు'అని ట్రంప్ పేర్కొన్నారు.

సాక్షి గుంటూరు

శనివారం । 8 । నవంబర్ । 2025

జెడ్పీ హైస్కూలు సందర్శన

భట్టిప్రోలు: వెల్లటూరు జెడ్పీ హైస్కూలును బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ అధికారి కె.శివకుమార్ శుక్రవారం సందర్శించారు.

రుద్రాభిషేకం

కొల్లూరు : కార్తిక పూజల్లో భాగంగా కొల్లూరు శ్రీ గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వర మల్లేశ్వర స్వామికి శుక్రవారం రుద్రాభిషేకం నిర్వహించారు.

బలుసులమ్మ వార్షికోత్సవం

అమరావతి: ధరణి కోట గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగాయి. కృష్ణా జలాలతో అమ్మవారిని అభిషేకించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో శుక్రవారం లోక కళ్యాణార్థం అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. తొలుత మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు గణపతి, రుద్ర హోమం నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణానంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు లక్ష బిల్వార్చన, బాలచాముండేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీనివాస కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవాన్ని కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, వ్రతాలు జరిగాయి. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, చల్ల పార్థరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగాను ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: రాజకీయాల్లోకి అడుగు పెడుతున్న యువతరం ఆచార్య ఎన్జీ రంగాను ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యసభ మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. శుక్రవారం ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సందర్భంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన విగ్రహానికి శివాజీతో పాటు వివిధ రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ రాజకీయవేత్తగా స్వప్రయోజనాల కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం జీవించిన ఎన్జీ రంగా ప్రస్తుత తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి దాయకుడని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధి కల్లూరి మురళీధర్, సూరయ్య చౌదరి, జొన్నలగడ్డ రామారావు, అత్తోట సుబ్బారావు, కందిమళ్ల శివప్రసాద్, పాటిబండ్ల విష్ణువర్ధన్, లాల్ వజీర్, నల్లూరి రాంబాబు పాల్గొన్నారు.

పుసులూరులో సీబీఐ సోదాల అలజడి



ప్రత్తిపాడు: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పుసులూరులో సీబీఐ అధికారుల సోదాలతో అలజడి రేగింది. గ్రామానికి చెందిన గుమ్మడిల్లి శంకరరావు తాడేపల్లిగూడెంలో పలు కంపెనీలకు అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం హైదరాబాద్ సీబీఐ ఏసీబీ హైదరాబాద్ ఎస్పీఈ బ్రాంచికి చెందిన అధికారుల బృందం పుసులూరులో శంకరరావు తండ్రి శివనాగేశ్వరావు నివాసంలో తనిఖీలు నిర్వహించింది. చార్టెడ్ అకౌంటెంట్‌గా చేసిన శంకరరావు హైదరాబాద్‌తో పాటు విజయవాడల్లో కొన్ని కంపెనీలకు ఆడిటర్‌గా వ్యవహరిస్తుంటాడని తెలుస్తోంది. సోదాల అనంతరం సీబీఐ అధికారులు శంకరరావు తండ్రికి తనిఖీలకు సంబంధించిన నోటీసును అందించారు. ఇంట్లో ఏమీ లభ్యం కాలేదని శంకరరావు తండ్రి శివనాగేశ్వరరావు తెలిపారు.

భళా.. బాలోత్సవ్ !

- వీవీఐటీయూలో అట్టహాసంగా ప్రారంభం
- పాల్గొన్న 15 వేల మంది చిన్నారులు

ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్- 2025 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి, ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవికుమార్, ఈనాడు సంపాదకులు ఎం. నాగేశ్వరరావు, వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్‌లు గంట మోగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్న వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ కృషిని కొనియాడారు. తొలిరోజు 15 వేలకు పైగా పోటీదారులతో ప్రారంభమైన బాలోత్సవ్ 20 అంశాలు, 61 విభాగాల్లో మూడు రోజుల పాటు 32 వేదికలపై పండుగ వాతావరణంలో నిర్వహించినట్లు వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. – పెదకాకాని

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

చిక్కరు..దొరకరు !

- జీజీహెచ్‌లో ఆర్ఎంఓలు అదృశ్యం
- రాత్రి సమయాల్లో విధులకు డుమ్మా
- నలుగురు ఉన్నా ఫలితం లేదు
- సొంత పనుల్లో బిజీ
- రాత్రిపూట వైద్యసేవల్లో జాప్యంతో రోగులకు అవస్థలు
- చికిత్సల్లో తీవ్ర జాప్యం

గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: పేదల పెద్దాసుపత్రిగా పేరు గడించిన గుంటూరు జీజీహెచ్‌లో ఆర్ఎంఓ (రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)లు ఉన్నారా..లేరా ? అనే సందేహం రోగుల్లో కలుగుతోంది. ఆసుపత్రిలో అధికారికంగా నలుగురు ఉన్నా రాత్రి పూట ఒక్కరూ కూడా విధుల్లో ఉండటం లేదు. ముఖ్యంగా ఆసుపత్రిలోనే నివాసం ఉండి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ పర్యవేక్షణ చేయాలి. ఆయనతో పాటు డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, అసిస్టెంట్ ఆర్ఎంఓలు కూడా రాత్రిపూట విధుల్లో ఉండటం లేదు. దీంతో వైద్య సేవల్లో జాప్యం వాటిల్లుతోంది. ముఖ్యంగా ఆసుపత్రికి గుండెలాంటి క్యాజువాల్టీలో సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటు, విష ప్రభావం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లాంటి అత్యవసర చికిత్సల కోసం బాధితులు క్యాజువాల్టీకి వస్తుంటారు. వారికి సత్వర వైద్యం అందించేలా చూడాల్సిన బాధ్యత ఆర్ఎంఓలదే ! విధుల్లో ఒక్కరూ కనిపించకపోవడంతో రోగులకు సక్రమంగా సేవలు అందడం లేదు. పలువురు రోడ్డు ప్రమాద బాధితులు, పేద రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు.

అత్యవసర సేవల్లో తీవ్ర జాప్యం

గుంటూరు జీజీహెచ్ అత్యవసర సేవల్లో రోగి వచ్చిన మూడు గంటల వరకు పట్టించుకోవడం లేదని, తీవ్ర జాప్యం జరుగుతోందని ఇటీవల ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓ ప్రజాప్రతినిధి బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ఆసుపత్రి అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు.

ఆర్ఎంఓలదే కీలక బాధ్యత

ఆసుపత్రిలో సూపరింటెండెంట్ తర్వాత సివిల్ సర్జన్ ఆర్ఎంఓదే కీలక బాధ్యత. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు, విశాఖపట్నం, తిరుపతిలలో మాత్రమే ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ అనే ప్రత్యేక కోర్సు చేసిన వారికి మాత్రమే సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా ప్రమోషన్ ఇస్తారు. పాలనలో ఎంతో కీలకమైన ఆయన ఆసుపత్రిలో రాత్రిళ్లు మాట దేవుడెరుగు, పట్టపగలే ఉండటం లేదని పలువురు సిబ్బందే వాపోతున్నారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ గదిలోనే డెప్యూటీ ఆర్ఎంఓ, అసిస్టెంట్ ఆర్ఎంఓలు ఇద్దరూ కూర్చుంటున్నారు. అందరూ ఒకేచోట కూర్చుని తూతూమంత్రంగా కొంతసేపు విధులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం కల్లా సొంత పనుల కోసం వెళ్లిపోతున్నారు. దీనికి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ కార్యాలయం ఎదురుగా ఉన్న సీసీ కెమెరాలు, ప్రతిరోజూ సంతకాలు చేస్తున్న ఫైళ్లే సాక్ష్యాలు.

ఆరు నెలలుగా ఇదే తంతు

ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ చేయాల్సింది ఆర్ఎంఓనే. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, రోగులకు, డ్యూటీలో ఉండే వైద్యులకు అందించే భోజనం నాణ్యతగా ఉండేలా చూడడం ఆయన బాధ్యతే. మెడికో లీగల్ కేసులు, కోర్టు నుంచి వచ్చే కేసులు, ఇతర కీలక వ్యవహారాలన్నీ ఆర్ఎంఓనే దగ్గరుండి చూసుకోవాల్సి ఉంది. ప్రస్తుత ఆర్ఎంఓలు ఎవరూ కూడా ఆ పనులు చేయడం లేదు. క్యాజువాల్టీలో ప్రత్యేకంగా కేటాయించిన గదిలో మెడికల్ ఆఫీసర్‌లను కూర్చోబెట్టి సొంత పనుల్లో బిజీగా ఉంటున్నారు. చికిత్స కోసం వచ్చే రోగులకు సత్వర సేవలందించేలా వైద్య సిబ్బందిని, వైద్యులను పిలిపించి సేవలందేలా చూడటం, అవసరమైతే తాము కూడా సేవలందించే బాధ్యతలు క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)లకు ఉంటాయి. వారితో తమ విధులు చేయిస్తూ ఆర్ఎంఓలు ఆసుపత్రుల్లో లేకుండా ఉడాయిస్తున్నారు. ఈ తంతు ఆరు నెలలుగా నడుస్తున్నా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏమాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

పట్టించుకోని సూపరింటెండెంట్

రాత్రిపూట క్యాజువాల్టీలో వైద్య సేవల్లో జాప్యం జరుగుతున్నా సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. జూన్‌లో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, అసిస్టెంట్ ఆర్ఎంఓలు బదిలీపై ఇతర జిల్లాల నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. గుంటూరు వైద్య కళాశాలలో ఉంటున్న ఓ ఆర్ఎంఓ కూడా డెప్యూటేషన్‌పై ఇక్కడే జీజీహెచ్‌లోనే ఉంటున్నారు. వీరికి తోడు నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కూడా ఆర్ఎంఓ ఉన్నారు. చెప్పుకోవడానికి లెక్కకు ఐదుగురు ఆసుపత్రిలో ఉన్నా ఒక్కరు కూడా రాత్రిపూట కనిపించరు. తనిఖీలు చేయకుండా అలవెన్సులు మాత్రం డ్రా చేసుకుంటున్నారు. గతంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓకు ఆసుపత్రిలో ప్రత్యేకంగా క్వార్టర్స్ ఉండేవి. పీజీ వసతి భవనం నిర్మాణం కోసం దాన్ని తొలగించారు. భవనం తొలగించినప్పటికీ గతంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓలుగా పనిచేసిన పలువురు ఆసుపత్రిలో రాత్రి వేళల్లో ఉండి విధులు నిర్వహించేవారు. దీనికి భిన్నంగా ప్రస్తుత ఆర్ఎంఓలు వ్యవహరించడంతో విమర్శలకు తావిస్తుంది.

ఉచితం మాటున అనుచితం

మున్నంగిలో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్

- కూటమి నాయకుల ఇష్టారాజ్యం
- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- మంత్రి నియోజకవర్గంలో నిబంధనలు బేఖాతర్
- అధికారులను లెక్క చేయకుండా తవ్వకాలు
- పట్టించుకోని జిల్లా కమిటీలు

కొల్లిపర: కృష్ణా నదిలో వరదలు తగ్గడంతో కొల్లిపర మండలంలో ఇసుక దందా మొదలైంది. కూటమి నాయకులు ఇష్టారాజ్యమైంది. సాక్షాత్తూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలో అధికారులు అడ్డుకున్నా ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఫీజు చెల్లించకుండా తీసుకెళ్లేందుకు వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో లేదా పంచాయతీ ఆఫీసులో నిర్మాణం వివరాలను నమోదు చేసుకుని, అనుమతి పత్రాన్ని పొందేలా నిబంధనలు రూపొందించారు. ఇతర ప్రాంతాల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, ప్రభుత్వం కేటాయించిన స్టాక్ పాయింట్లు నుంచి తీసుకెళ్లొచ్చు. ఇందుకు నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

యథేచ్ఛగా విక్రయాలు

కొల్లిపర మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో కూటమి నేతల కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ జరుగుతోంది. పట్టపగలు మున్నంగి రీచ్‌లో నాలుగైదు ట్రాక్టర్లలో లోడింగ్ చేయించుకుని, పట్టణాల్లో విక్రయిస్తున్నారు. తెనాలిలో రూ.4 వేలు, గుంటూరులో రూ.5 వేల చొప్పున దళారులతో అమ్మేస్తున్నారు. దీనికితోడు ఉచిత ఇసుక కోసం వచ్చిన వ్యక్తుల నుంచి రూ.200–300 వరకు అవకాశాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. లోడింగ్ చేసిందుకు కూలీలకు రూ.500–600 వరకు ఇస్తున్నట్టు ట్రాక్టర్ల యజమానులు చేస్తున్నారు. నిజాయతీగా అనుమతి తీసుకుని వచ్చిన నదీ పరీవాహక ప్రాంత ప్రజలకు లోడింగ్‌లో జాప్యం చేస్తున్నారు. అదేమంటే వైఎస్సార్ సీపీ వారంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

అధికారులను ఖాతరు చేయని అక్రమార్కులు

మున్నంగి రీచ్ వద్ద రెండు రోజులుగా దాదాపు 70 ట్రాక్టర్లలో అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు. అధికారులనూ ఖాతరు చేయడం లేదు. ఈనెల 6న రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి స్థానిక ట్రాక్టర్లను పంపేశారు. బిల్లు ఉన్న వారు మాత్రమే రావాలని, ఇతర ప్రాంతాల వారు రావొద్దని హెచ్చరించారు. బయట నుంచి వచ్చిన తొమ్మిది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయినా శుక్రవారం మళ్లీ మామూలుగానే ఇసుక తరలింపు సాగిపోతోంది. మున్నంగి రీచ్‌తో పాటు మండలంలోని వల్లభాపురం, బొమ్మువాని పాలెం, కొల్లిపర దగ్గరలోని నదిలో రాత్రి వేళల్లోనూ ఇసుక తరలింపు జరుగుతోంది. ఇసుక కమిటీలు పేరుకే పరిమితమయ్యాయి మినహా అక్రమ తరలింపును అడ్డుకోవడం లేదు.

తల్లితోపాటు కుమార్తెపై కన్నేసిన మృగాడు

- కుమార్తె చెప్పినా పట్టించుకోకుండా సహకరించాలన్న తల్లి
- మహిళా పోలీస్ ఫిర్యాదుతో వ్యవహారం బట్టబయలు
- విద్యార్థిని మంగళగిరి వన్‌స్టాప్ సెంటర్‌కు తరలింపు



బాధితురాలైన మైనర్ బాలికతో డీసీపీఓ జయరాజు, మహిళా పోలీస్, కానిస్టేబుల్

సత్తెనపల్లి: తల్లితో శారీరక సంబంధం పెట్టుకున్న యువకుడు ఆమె కుమార్తెపై కన్నేసినప్పటికీ తల్లి నివారించకపోగా కుమార్తె ఫిర్యాదు చేసినా కూడా సహకరించాలంటూ ప్రోత్సహించేందుకు యత్నించిన ఘటన సత్తెనపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివాజీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సచివాలయ మహిళా ఉద్యోగికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమె భర్తతో వివాదం కారణంగా తొమ్మిదేళ్ల కిందట విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి సత్తెనపల్లిలో నివసిస్తూ పట్టణానికి చెందిన అక్రమ రేషన్ వ్యాపారి తులసీకృష్ణతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అతడు నిత్యం ఆమె ఇంటికి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో ఆమె కుమార్తెపై కూడా ఎక్కడబడితే అక్కడ చేతులు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగంతో ఆమె తల్లికి చెప్పి విలపించింది. అయినప్పటికీ తల్లి నివారించే ప్రయత్నం చేయకపోగా సహకరించాలంటూ ప్రోత్సహించే ప్రయత్నం చేయడంతో ఆమెకు ఏం చేయాలో అర్థం కాకుండా పోయింది. ఈ క్రమంలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థిని బంధువైన వృద్ధురాలు ఇటీవల శివాజీనగర్‌లోని మహిళా పోలీస్ తిరుమల లక్ష్మి దృష్టికి తీసుకు రావడంతో వ్యవహారం బట్టబయలైంది. మహిళా పోలీస్ ఈనెల 5న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జయరాజుకు సమాచారం అందించింది. ఆయన ఈనెల 6న సత్తెనపల్లి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల నేతృత్వంలో ఆ విద్యార్థిని పట్టణ పోలీసుల వద్దకు తీసుకువచ్చి, జరిగిన ఘటనను వివరించారు. ఆ విద్యార్థిని కనిపించకుండా చేసేందుకు ఆమె తల్లి శతవిధాలా ప్రయత్నించగా పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు తొలుత ఆమెను గురువారం నరసరావుపేట వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించారు. శుక్రవారం మంగళగిరిలోని వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించారు. మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తులసీకృష్ణను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో సత్తెనపల్లి సబ్‌జైలుకు తరలించారు.

వందేమాతరం గీతానికి ప్రత్యేక స్థానం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశభక్తితోపాటు స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర గీతం స్ఫూర్తిగా నిలిచిందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. వందేమాతర గీతాలాపనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో గీత రచయిత బంకించంద్ర చటర్జీ, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయులను బానిసలుగా మార్చి అధికారం చెలాయిస్తున్న బ్రిటిషు వారికి వందేమాతర గీతంతో దీటైన సమాధానం చెప్పారని అన్నారు. జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మాట్లాడుతూ జాతిని ఏకతాటిపైకి తెచ్చి ప్రజల్లో దేశభక్తిభావాన్ని పెంపొందించడంలో వందేమాతర గీతం కీలకపాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రత్నబాబు, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వందేమాతరం.. ఓ చారిత్రాత్మక స్ఫూర్తి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జేసీ, డీఆర్వో

గుంటూరు వెస్ట్: వందేమాతరం గీతం ఒక చారిత్రాత్మక స్ఫూర్తి అని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. 'వందేమాతరం 150 వసంతాల' ఉత్సవం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశభక్తిని, స్వాతంత్ర్యోద్యమాన్ని వందేమాతర గీతం జ్వలింపజేసిందని తెలిపారు. అటువంటి మహత్తర గీతం పుట్టి 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప అనుభూతిని ఇస్తుందని చెప్పారు. 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణ ఇచ్చిందని వివరించారు. ఆనందమఠం అనే నవలలో తొలిసారి వెలుగులోకి వచ్చిన ఈ గీతం 1905 బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమానికి ఊపిరిగా నిలిచిందని పేర్కొన్నారు. బాలగంగాధర్ తిలక్, అరవింద ఘోష్, సుభాష్ చంద్రబోస్, లాలా లజపతిరాయ్ వంటి నేతలు ఈ గీతాన్ని జాతీయ ఉద్యమానికి సంకేతంగా ఉపయోగించారని కలెక్టర్ తెలిపారు. దేశంపై నిష్కపటమైన భక్తి, త్యాగశక్తి, జాతీయ ఏకతను చాటిందని చెప్పారు. 150 వసంతాల తర్వాత కూడా వందేమాతరం భారత ప్రజాస్వామ్య ఆత్మను, ఆత్మగౌరవాన్ని గుర్తు చేస్తూనే ఉందని చెప్పారు. రాబోయే తరాలకు స్వతంత్ర భావజాలాన్ని మరింతగా అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యాసంస్థలు, సాంస్కృతిక సంస్థలు జాతీయ గీతం చరిత్ర, ప్రాధాన్యం, పోరాట వారసత్వాన్ని యువతకు తెలియజేయాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, డ్వామా పీడీ వి.శంకర్, సీపీఓ శేషశ్రీ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వందేమాతర గీతాన్ని లయబద్ధంగా ఆలపించారు.

నోట్లు వెదజల్లి వృద్ధుడికి టోకరా

రూ 3.90 లక్షలు కాజేసిన గుర్తు తెలియని కేటుగాళ్లు

ఇంకొల్లు(చినగంజాం): సినీ ఫక్కీలో 75 ఏళ్ల వృద్ధుని దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు భారీ మొత్తంలో నగదు కాజేసి పారిపోయిన ఘటన శుక్రవారం ఇంకొల్లు గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జి. సురేష్ అందించిన సమాచారం ప్రకారం.. ఇంకొల్లు గ్రామానికి చెందిన చిలంకూరి కాంతయ్య శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బ్యాంక్ ఆఫ్ ఇండియాకు గతంలో తాకట్టు పెట్టిన బంగారు నగలు విడిపించుకునేందుకు వెళ్లారు. తీసుకున్న రూ. 3.90 లక్షలకు రూ. 10 వేలు వడ్డీ అయిందని, మొత్తం రూ. 4 లక్షలు చెల్లించాలని బ్యాంకు సిబ్బంది తెలియజేశారు. దీంతో ఆయన మిగిలిన నగదు తీసుకు రావడానికి సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. నగదు ఉన్న సంచిని వెనుక క్యారేజీపై పెట్టుకున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెనుక నుంచి వచ్చి రూ. 200 నోట్లు పడేసి, డబ్బులు కింద పడిపోయాయని కాంతయ్యకు చెప్పారు. ఆయన కింద పడిన నోట్లను తీసుకునే క్రమంలో సైకిల్ వెనుక క్యారేజ్‌పై డబ్బులున్న ఎర్రటి కవర్‌ను దొంగిలించి పరారయ్యారు. ఈ మేరకు కాంతయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	38,186
అమ్మకాలు	45,026
నిల్వ	6,564

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-16,000
నంబరు-5	10,000-14,300
273	10,500-14,200
341	10,000-16,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-16,000
నంబరు-5	10,000-14,500
341	10,000-17,000
4884	11,000-14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,700
బాడిగ-355	10,500 - 16,700
దేవనూరు డీలక్స్	10,000 - 15,700
ఆర్మూర్	10,000 - 13,500
తాలుకాయలు	5,500 - 8,700

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,500
బాడిగ - 355	10,000-16,300
దేవనూరు డీలక్స్	10,500-15,500
తాలు	5,300 - 8,300

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

పోలీసుల వినతులను త్వరగా పరిష్కరించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోలీస్ సిబ్బంది అందించే ప్రతి అర్జీని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో శుక్రవారం పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ విభాగాల సిబ్బంది వ్యక్తిగత, సర్వీస్, బదిలీలు/ పరిపాలనా సమస్యలపై జిల్లా ఎస్పీకి 13 అర్జీలను అందించారు.

'హాల్‌మార్క్' గోల్‌మాల్!

- జిల్లాలో బంగారు ఆభరణాల్లోనూ బడా మోసాలు
- సొంత మిషన్‌లతో అనుమతి లేకుండా హాల్‌మార్క్ సెంటర్ల ఏర్పాటు
- వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్ ఆభరణాలపై ముద్రణ
- గుంటూరు నగరంలో వెలుగు చూసిన నయా దగా

గుంటూరు జిల్లాలో బంగారానికి సంబంధించిన మోసాలు పెరిగిపోతున్నాయి. నాణ్యతకు మారుపేరుగా భావించే హాల్‌మార్క్‌నూ నకిలీ చేసేశారు. ఈ నెల 6వ తేదీన గుంటూరు పట్నంబజారు దుకాణాల్లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారుల సోదాల్లో ఏకంగా 1.246 కిలోల దొంగ హాల్‌మార్క్‌లు కలిగిన బంగారం దొరకటంపై కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొంది.

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1150కుపైగా బంగారం దుకాణాలు, 25 వరకు భారీ షోరూమ్‌లు ఉన్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. గుంటూరుతోపాటుగా తెనాలి, మంగళగిరి ప్రాంతాల్లో నకిలీ హాల్‌మార్క్, నాణ్యత లేని బంగారానికి తుది మెరుగులు దిద్ది అంటగడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అంటే కేవలం 15 నుంచి 18 టచ్ ఉన్న దానికి 22 టచ్ ఉన్నట్లు ముద్రణ వేసి విక్రయాలు జరుపుతున్నారని సమాచారం.

అధికారికంగా ఉంటేనే...

బీఐఎస్ హాల్‌మార్క్, హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్‌యూఐడీ) ఉన్న బంగారు ఆభరణాలను మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆభరణం మీద ఉన్న హెచ్‌యూఐడీ నంబర్‌ను గూగుల్‌లో సెర్చ్ చేయటం ద్వారా మనం కొనుగోలు చేసిన బంగారు ఆభరణంలో ఎంత బంగారం ఉంది? ఎక్కడ హాల్‌మార్క్ వేశారు..? అనే అంశాలు లభిస్తాయి. లాలాపేటలోని కరీముల్లా జ్యూవెలర్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న లేజర్ మిషనరీతో నకిలీ హాల్‌మార్క్ వేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు.

హాల్‌మార్క్ వేసేందుకు వినియోగించే మిషన్

అవగాహన అవసరం

ప్రతి నగ కొనుగోలు చేసిన తరువాత బీఐఎస్ ద్వారా నగకు సంబంధించిన హాల్‌మార్క్, ఇతర అంశాలు పూర్తిగా బీఐఎస్ సర్వర్‌లో నమోదవుతాయి. ఆ తరువాత బీఐఎస్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఆ ఆభరణానికి ఒక హెచ్‌యూఐడీ నెంబర్ వస్తుంది. బీఐఎస్ యాక్ట్ 2016లోని 14 టూ 16 ప్రకారం బీఐఎస్‌కి బంగారు, వెండి ఆభరణాలకు హాల్‌మార్క్ సర్టిఫికేషన్ ఇవ్వటానికి అధికారం ఉంది. హాల్‌మార్కింగ్ ఆఫ్ గోల్డ్ జ్యూవెలరీ అండ్ ఆర్టీఫ్యాక్ట్ ఆర్డర్ 2020 ప్రకారం... 2021 జూన్ 16వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా బీఐఎస్ హాల్‌మార్క్ ఉన్న నగలనే అమ్మాలని ఆదేశాలు వెలువడ్డాయి. వీటిలో సైతం 14కే, 18కే, 20కే, 22కే, 23కే, 24కే స్వచ్ఛత ఉన్న బంగారాన్ని మాత్రమే విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బీఐఎస్ హాల్‌మార్క్ లేకుండా బంగారం విక్రయించటం చట్టప్రకారం విరుద్ధం అని అధికారులు గుర్తు చేస్తున్నారు.

భరతమాతకు రుణపడిన సమాజం

గుంటూరు వెస్ట్: కొన్ని దశాబ్దాల పాటు మహనీయుల ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించిన స్వాతంత్ర్యం మనదని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్వామి జ్ఞాన ప్రసన్న పేర్కొన్నారు. వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక బొంగరాలబీడు మహాప్రస్థానంలోని ఉచిత భోజనశాలలో స్వామితోపాటు ఆశ్రమ సేవకులు వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ ఈ సమాజం దేశానికి, మహనీయులకు రుణపడి ఉందన్నారు. ధనవంతులు కొంతమంది పేదలనైనా ఆదుకోవాలని తెలిపారు. దేశభక్తి భావోద్వేగం కాదని, జీవితాంతం ఉండాలని చెప్పారు. ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేసి స్వాతంత్ర్య ఉద్యమం నాటి వివరాలను సభ్యులకు వివరించారు. ట్రస్ట్ ట్రెజరర్ అయ్యప్పరాజు, సభ్యులు ఆదిరాజు ధర్మరాజు, ఎం.అరుణ కుమారి, జ్యోతమ్మ, విశ్వనాథ్, ఎ.జానకి తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న స్వామి జ్ఞాన ప్రసన్న

ఎన్జీరంగా జయంతి వేడుకలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాంలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎన్జీరంగా జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గీతం ఆలపించారు. వీసీ మాట్లాడుతూ ఎన్జీరంగా సమరయోధుడని, రైతుల కష్టాలను దూరం చేసేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి తదితరులు

నాయకత్వ లక్షణాల పెంపునకు దోహదం

పోస్టరు విడుదల చేస్తున్న నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతోపాటు సేవాభావం, సమానత్వం వంటివి పెంచేందుకు ప్రతి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రచార పోస్టరు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా నరసింహారావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో యూనిట్ల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో సమాజ సేవా దృక్పథం బలపడుతుందన్నారు. ప్రస్తుతం 935 పాఠశాలలకు రూ.50 వేల చొప్పున పీఎంశ్రీ నిధులు మంజూరు చేశారని, తద్వారా మౌలిక సదుపాయాల మెరుగుతోపాటు శిక్షణ కార్యకలాపాలు మరింత బలపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్కౌట్స్ ఎస్‌ఓసీ పి.శ్రీనివాసరావు, ఎంఈవో జ్యోతికిరణ్, సహాయ కార్యదర్శి ఇ.అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్.. వ్యాపారం కాదు

ఏఐబీఓసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను సమర్థించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫడరేషన్ (ఏఐబీఓసీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శేషసాయి, జయకుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకులను ప్రైవేటు పరం చేయటం వలన ఉద్యోగ భద్రత దెబ్బతినడంతో పాటు, కాంట్రాక్టు పనులు పెరగటం, ముఖ్యంగా రిజర్వేషన్ హక్కులు తగ్గుతాయన్నారు. ప్రజల నిధులు ప్రమాదంలో పడతాయని, దేశ ఆర్థిక సమగ్రత, సామాజిక ప్రయోజనాలపై దుష్ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు సాధారణ ప్రజలు, ఉద్యోగులు, రైతులు, పింఛన్‌దారులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ప్రైవేట్ బ్యాంకులు కేవలం లాభార్జన కోసమే పని చేస్తాయన్నారు. ఎలాంటి నిర్ణయం అయినా ప్రజా సంప్రదింపులు, పార్లమెంటరీ చర్చల ద్వారా నిర్వహించాలని కోరారు. తదుపరి కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని వివరించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి

మేడికొండూరు: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఒక డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని జంగంగుంట్ల పాలెం వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళుతున్న దోస్త్ లారీ, ఆదిలాబాద్ నుంచి చేబ్రోలు వెళుతున్న మరో లారీ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం బొల్లవరం గ్రామానికి చెందిన దోస్త్ లారీ డ్రైవర్ కాలే ప్రసాద్ (23) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు.

సంఘటన స్థలంలో ప్రసాద్ మృతదేహం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 600 గరిష్ఠం : రూ. 1,200

మోడల్ ధర రూ. 900

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంలో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలన్నారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌ఓ) ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నారన్నారు. క్యాన్సర్‌ను తొలిదశ లోనే గుర్తించి, నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్‌సీడీ డాక్టర్ బీఎస్ఎస్ రోహిణి రత్నశ్రీ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక, ఎన్‌సీడీ కన్సల్టెంట్ గిరిధర్, డీపీఓ సైమన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయోద్యమానికి వందేమాతరం ప్రేరణ

గీతం ఆలపిస్తున్న ఐజీ, కార్యాలయపు సిబ్బంది

జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వందేమాతరం దేశ జాతీయోద్యమానికి ప్రేరణగా నిలిచిందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం గుంటూరు కలెక్టర్ బంగ్లారోడ్‌లోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయ ఆవరణలో వందేమాతరం గీతాలాపన చేశారు. రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ ఈ గీతం భారతీయులను ఒక తాటిపైకి తీసుకువచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఐజీ కార్యాలయపు మేనేజర్ సీఐ వినోద్‌కుమార్, సీసీ రాఘవ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లాలోని పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శుక్రవారం జాతీయగీతం ఆలపించారు. తొలుత బకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని కార్యక్రమం ద్వారా స్మరించుకుంటున్నామని అన్నారు. ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి (ఏఆర్), డీసీఆర్‌బీ సీఐ ఆనంద్, కార్యాలయ ఏఓ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు సురేష్, శివరామకృష్ణ, ఆర్ఎస్ఐలు సంపంగి రావు, సునీల్, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెరగాలి

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా సమన్వయ అధికారి కోడూరి గోపీచంద్ కోరారు. గుంటూరులోని కృషి భవన్‌లో రైతు మాస్టర్ ట్రైనర్లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి సాగు చేస్తున్న పాత గ్రామాలతోపాటు మరో 76 కొత్త గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి రైతులను రైతు మాస్టర్ ట్రైనర్లుగా ఎంచుకొని, వారికి రెండు రోజులు శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు. విధులు, బాధ్యతల గురించి, అదేవిధంగా వారితో గ్రామ స్థాయిలో పని చేస్తున్న ట్రైనీ ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్లకు ఏ విధంగా శిక్షణ ఇవ్వాలో అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో గోపీచంద్, రాజకుమారి

జిల్లా కోర్టులో జాతీయ న్యాయ సేవ దినోత్సవం

గుంటూరు లీగల్: న్యాయ సేవ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి జిల్లా జడ్జి, ఒకటవ అదనపు జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సేవల ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ కుమార్, పోక్సో జడ్జి షమీ పర్వీన్ సుల్తానా, రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా పాల్గొన్నారు. చిన్నారులు, పెద్దవారిలో న్యాయవ్యవస్థ గురించి అవగాహన కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ వి. బ్రహ్మారెడ్డి, పారా లీగల్ వలంటీర్లు, పానెల్ అడ్వకేట్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి

3 కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురు అరెస్ట్.. ఇద్దరు పరారీ
- వివరాలు వెల్లడించిన వెస్ట్ డీఎస్పీ

లక్ష్మీపురం: గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కొండా వెంకటప్పయ్య కాలనీలో మూడు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం స్టేషన్‌లో శుక్రవారం వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై రాంబాబులకు గురువారం సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు జిల్లా పరిషత్ కార్యాలయ క్వార్టర్స్ వెనుక ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న ఏడుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. పల్నాడు జిల్లా మాచర్ల నుంచి తెచ్చి మందా ఆదాం, అతని కుమారుడు దావీదు విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. నిమ్మకాయల ఏసుబాబు సహాయంతో కొండా వెంకటప్పయ్య కాలనీ ఒకటో లైన్‌కు చెందిన షేక్ గౌస్ బాషా, ఏటీ అగ్రహారానికి చెందిన రెడ్డి జెమినీ రామ్, శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ అబ్దుల్ రఫీ, చుట్టుగుంటకు చెందిన గుంపు ధరణి కుమార్, కేవీపీ కాలనీకి చెందిన వేముల నందు, మరో బాలుడు తదితరులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. వారిలో ఏడుగుర్ని పట్టుకున్నారు. మంద దావీదు, నిమ్మకాయల ఏసుబాబు పరారీలో ఉన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్

కన్నతల్లి కళ్లెదుటే వ్యక్తి దారుణ హత్య

అడిగినంత డబ్బు ఇవ్వనందుకు మద్యం మత్తులో హత్య చేసిన దుండగులు

దుగ్గిరాల: వారం రోజుల నుంచి డబ్బు అడిగినా ఇవ్వడం లేదని అక్కసుతో వ్యక్తిని దారుణంగా మెడపై కత్తితో నరికి హత్య చేసిన ఘటన కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం దుగ్గిరాల యాదవపాలెంలో నీలాపు వీరబాబు (37) తన తల్లి రాఘవమ్మను ఆరోగ్యం బాగోలేదని ఆర్ఎంపీ వద్దకు బైకుపై తీసుకెళ్లి చూపించాడు. అదే సమయంలో మద్యం మత్తులో ఇద్దరు దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి వీరబాబుని గట్టిగా చాతీపై తన్నారు. కింద పడగానే పదునైన కత్తితో మెడపై నరికారు. తల్లి కేకలు వేయటంతో స్థానికులు అడ్డుకోబోగా దుండగులు వారినీ భయపెట్టారు. సమాచారం అందుకుని వచ్చిన పోలీసులు... కొన ఊపిరితో ఉన్న వీరబాబును ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. వీరబాబు తాపీ పని చేసేవాడు. డబ్బుల విషయమై దుండగులతో రెండు సార్లు ఘర్షణ పడ్డాడని, అందుకే ఇలా చేశారని కన్నీరుమున్నీరు అయ్యారు. వీరబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళగిరి టౌన్ ఇన్‌చార్జి సీఐ వీరాస్వామి, ఎస్ఐ ఎస్.వెంకట రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వీరబాబు (ఫైల్)

Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా - గుంటూరు బ్రాంచ్

రాజీవ్‌గాంధీ భవన్, హిందూ కాలేజ దగ్గర, గుంటూరు. ఫోన్ : 0863-2220244 Mail: guntur@bankofbaroda.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం అమ్మకం ప్రకటన అనుబంధం-IV-A (రూల్ 6(2) & 8(6) చూడగలరు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) నిబంధనల క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

[illegible]	స్థిరాస్తి వివరములు [illegible]	[illegible]	ఇ-వేలం తేది మరియు సమయం	రిజర్వు ధర, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల	[illegible]	ఆస్తి తనిఖీ యొక్క తేది మరియు సమయం
1) మెస్సర్స్ శ్రీ లక్ష్మి ట్రేడర్స్ [illegible] 522007 [illegible] 522017, 2) [illegible] 141, [illegible] 1031128148, [illegible] 522005.	గుంటూరు జిల్లా, [illegible]	[illegible] 05-05-2024 నాటికి రూ.1,58,28,371.91 [illegible] 06-05-2024 [illegible] 19-05-2024 నాటికి రూ.5,58,88,118.58 [illegible] 20-05-2024 [illegible]	24-11-2025 మ. 02.00 గం.ల నుండి సా. 06.00 గం.ల వరకు	రిజర్వు ధర : రూ. 12,05,20,245/- ధరావత్తు: రూ. 1,20,52,024/- బిడ్ పెంపుదల: రూ. 1,00,000/-	భౌతికంగా	19-11-2025 నుండి 22-11-2025 వరకు ఉ. 11.00 గం.ల నుండి సా. 05.00 గం.ల వరకు [illegible]

ఇతర వివరాల కోసం ఈ క్యూఆర్ కోడును స్కాన్ చేయగలరు.

[illegible]

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్‌సైట్ : https://www.bankofbaroda.in/e-auction.htm మరియు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ : https://Baanknet.com లింకును చూడగలరు. [illegible] ఫోన్ : 0863-2220244, మొబైల్ నెం.: 8977513906 [illegible]

ప్రదేశం : గుంటూరు, తేది : 07-11-2025 సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో వినుకొండ టౌన్‌లో 12 గం. పనిచేయుటకు స్త్రీ/పు॥ సె॥గార్డ్స్, అ: 10th పాస్/ఫెయిల్, మంచి జీతం. Ph: 8897169133, 9515524430

■ గుంటూరులోని రెస్టారెంట్‌లో పని చేయుటకు అనుభవం గల కెప్టెన్స్, వెయిటర్స్ కావలెను. మంచిజీతం రూమ్ + భోజనం ఫ్రీ. సంప్ర: 94936 80998

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 Wpm Typing Speed, MS Office Skills, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35000/- నుండి 45000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ ఫెయిల్ to PG, ఫోన్: 73307 11162

■ ప్రముఖ ఫైనాన్స్ అనుబంధ సంస్థనందు పని చేయుటకు అనుభవం కలిగిన టెలికాలర్స్ & మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. Q: ఇంటర్ /డిగ్రీ, Sal: 9000/- + Inc. ✆ 95051 77327

■ గుంటూరు జిల్లా "వన్ లైఫ్ - వన్ కార్డ్" హెల్త్ కేర్ కంపెనీలో 1. హెల్త్ కార్డ్ ప్రమోషన్ కొరకు (కనోపిటెంట్ / Canopy Tent), 2.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, 3.ప్రొక్యూర్మెంట్ మేనేజర్లుగా పని చేయుటకొరకు (స్త్రీలు/ పురుషులు) ఉద్యోగులు కావలెను. అర్హత : 10th/ ఇంటర్ / డిగ్రీ, సంప్రదించగలరు : 9030150481, 9494022442

■ కేర్ టేకర్స్ (మెడికల్) జీతం 18వేలు, ఇంటివంట 18 వేలు, వార్డెన్స్ డిగ్రీ పి.జి. జీతం 18వేలు, రిసెప్షనిస్ట్ జీ. 18 వేలు, భోజనం వసతి కలదు. 98854 26486

■ తెనాలి దగ్గర, దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 80961 61777, 70939 24466.

■ గుంటూరులో బస్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qual: 10th-డిగ్రీ, టైం: 9 AM - 5-30 PM, Sal: 9000 ✆ 99893 98775

■ వేదం ఓల్డ్ ఏజ్ హోమ్ తక్కెళ్ళపాడు వృద్ధులకు సేవ చేయుటకు అనుభవం కలిగిన వర్కర్ వంట మనిషి కావలెను. భార్య భర్తలు. 7780791297, 9642791297

■ మాచర్ల లోని గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ నందు పని చేయుటకు బ్రాంచ్ మేనేజర్, లోన్ ఆఫీసర్స్ కావలెను. అర్హత: డిగ్రీ/ పి.జి రిటైర్డ్ బ్యాంకింగ్/ NBFC ఎంప్లాయిస్‌కి మరియు మాచర్ల లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర: Ph: 7893794796, 7207494496, 8121294296, 7337394396

■ ప్రముఖ Ltd కంలో సూపై, Asts, స్టోర్ ఇంచార్జి, డ్రైవర్స్ ITI Dip, B.Tech All Ex అర్మీ కావలెను, రూం+భో PF+ ESI జీ. 18-32 వేలు. ✆ 91007 91079

■ తాడేపల్లి, రేవేంద్రపాడు, పెద్దేశ్వరం ఏరియాలో నైట్ షిఫ్ట్స్ (8 PM-8 AM)లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం. డ్యూటీ, 15,000 శాలరీ, అర్హత : టెన్త్, 50 సం.లలోపు ✆ 88014 97437

సాక్షి క్లాసిఫైడ్స్

గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)

ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి

గుంటూరు

7075167663
7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి పిదప స్పందించాల్సిందిగా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి

తాడేపల్లి రూరల్: మొక్కలను దత్తత తీసుకుని వాటిని సంరక్షించాలని కేఎల్‌యూ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని వలంటీర్లు అధ్యాపకులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం దానోత్సవం కార్యక్రమంలో భాగస్వాములైన వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ–2 విభాగాధిపతి డాక్టర్ బి. తిరుపతి రెడ్డి, ఉప విభాగాధిపతి డాక్టర్ కేవీడీ కిరణ్, ఆచార్యులు డాక్టర్ ఎంఆర్‌ఎస్ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయ కర్త పి.సురేష్‌ను, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు తదితరులు అభినందించారు.

స్కిల్ కాంపిటేషన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

దుగ్గిరాల: జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్స్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టుల్లో ప్రతి విభాగం నుంచి ఒక్కో ప్రాజెక్టు సెలెక్టు చేసి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారని హెచ్.ఎం బి.వి. కృష్ణారావు, శోభాదేవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలిక పాఠశాల విద్యార్థులు, రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు.

కోనేటి చెరువు పరిశీలన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కోనేటి చెరువును శుక్రవారం ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం పరిశీలించారు. తాగునీటి ట్యాంకులను పరిశీలించి ఎప్పటికప్పుడు ట్యాంకులో, చుట్టు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు శుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ మేడాబాబు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో ఏకేబాబు పాల్గొన్నారు.

సీఆర్డీఏ గ్రీవెన్స్‌కు 19 ఫిర్యాదులు

తాడికొండ: సీఆర్డీఏ పరిధిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నోడల్ అధికారి పి.జయశ్రీకి పిర్యాదులు అందజేశారు.

మొత్తం 19 ఫిర్యాదులు రాగా అందులో అమరావతిలో భూమి వ్యవహారాలు 13, సామాజిక సంక్షేమ విభాగం(ఇంజినీరింగ్) 2, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ 1, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రా 1, ఆఫీస్ మేనేజ్‌మెంట్ 1, సామాజిక సంక్షేమ విభాగం 1 ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.ఎస్.భాగ్యరేఖ, జి. భీమారావు, జి. రవీందర్, ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, బి. శ్రీనివాస్ నాయక్, ఎస్టేట్స్ విభాగ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఎల్ఏ) ఎస్. రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సమస్యలను పరిష్కరించాలని వినతి

మంగళగిరి టౌన్ : రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ గాంధీనగర్‌లో ఉన్న ఏపీ నాన్ గజిటెడ్, గజిటెడ్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సంఘ అధ్యక్షులు విద్యాసాగర్‌కు మంగళగిరి కార్యాలయం నుంచి రాష్ట్ర ఔట్ సోర్సింగ్ జేఏసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ జేఏసీ, రాష్ట్ర జెఎసి ఎగ్జిక్యూటివ్ మెంబర్ కిషోర్‌బాబు ఆర్చివ్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వీరాస్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు వెంకటేష్, షేక్ చాన్‌బాషా వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

విద్యార్థుల హక్కుల రక్షణలో కఠినంగా ఉండాలి

మంగళగిరి టౌన్: విద్యార్థుల హక్కుల రక్షణలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి రూరల్ పరిధిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్ ఘటన ఆందోళన కలిగిస్తోందని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత యాజమాన్య బాధ్యత అన్నారు. కలెక్టర్, సబ్ కలెక్టర్ నేతృత్వంలో జరుగుతున్న విచారణలో మీడియాకు కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో నష్టం

ఆత్మకూరు దళితవాడలో కోటి సంతకాల సేకరణలో నేతలు

డోలాస్‌నగర్‌లో సంతకాల సేకరణ

వైఎస్సార్ సీపీ నేతలు

దుగ్గిరాల మండలం పెదపాలెంలో..

మంగళగిరి టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో ప్రజారోగ్యానికి భరోసా లేకుండా పోతుందని, దీంతో తీరని నష్టం వాటిల్లుతుందని మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు దళిత వాడలో గ్రామ అధ్యక్షుడు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్‌కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు వైద్యవిద్యతో పాటు మెరుగైన వైద్యాన్ని అందించే లక్ష్యంతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, అందులో 5 కళాశాలలను పూర్తిచేసి తరగతులను కూడా ప్రారంభించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం ద్వారా పేదల బతుకులపై దెబ్బకొట్టాలని చూస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో మంగళగిరి మండల ఉపాధ్యక్షులు మండేపూడి బుజ్జి, ఆర్‌టీఐ విభాగ మండల అధ్యక్షులు రాంబాబు, గ్రామ ఉపాధ్యేఉలు విజయ్, యూత్ అధ్యక్షులు జాలాది ప్రేమ్‌చంద్, నాయకులు సాంబయ్య, కిషోర్ రెడ్డి, యేసుపాదం, ప్రభుదాసు, పాములు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి పట్టణపరిధిలోని డోలాస్‌నగర్ 10వ వార్డులో వార్డు ప్రధాన కార్యదర్శి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మున్సిపల్ విభాగ అధ్యక్షులు చిట్టిమళ్ల సుబ్బారావు, వార్డు కార్యదర్శి సురేష్, యూత్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాగార్జున, సాయి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: పెదపాలెంలో జోరుగా సంతకాల సేకరణ జరుగుతోంది. వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, దుగ్గిరాల మండల అధ్యక్షులు టి.శివగోపయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యస్.రత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ వడ్డేశ్వరం రజనీ కాంత్, గ్రామ పార్టీ అధ్యక్షులు చిలకా తిమోతి, కె.కోటేశ్వరరావు, కె.రాజేష్, సురేష్, పూర్ణిమ, మల్లేశ్వరి, సుప్రియ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

తనిఖీల్లో 15మందిపై కేసులు

వాహన పత్రాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మంగళగిరి టౌన్: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంగళగిరి పట్టణ ఎస్‌ఐ రవీంద్రనాయక్ వాహనచోదకులను హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్‌తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టినట్లు తెలియజేశారు. 15 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశామని, వారికి రూ. 16,535 అపరాధ రుసుము విధించినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోల్లో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. పలువురు యువకులకు రహదారి నిబంధనలను వివరిస్తూ అతివేగంతో కలిగే అనర్థాలను వివరించారు.

వాలీబాల్‌లో విద్యార్థి ప్రావీణ్యం

క్రీడాకారుడు మహేంద్రను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

మంగళగిరి టౌన్: రాష్ట్రం తరపున నవంబర్ 10,11,12 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి వాలీబాల్ టీమ్‌కు మంగళగిరికి చెందిన మహేంద్ర ఎంపిక కావడం హర్షణీయమని సీకే జూనియర్ కళాశాల యాజమాన్య అధ్యక్షులు చింతక్రింది కనకయ్య తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని సీకే జూనియర్ కళాశాలలో క్రీడాకారుడు మహేంద్రను శుక్రవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్ 19 విభాగంలో జరిగిన సెలక్షన్స్‌లో మహేంద్ర ఎంపిక కావడం హర్షణీయమన్నారు. తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి కనబరుస్తూ జాతీయ స్థాయిలో కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తెచ్చాడని కొనియాడారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గంజి చిరంజీవి, పాలకవర్గ సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్ రత్నబాబు, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో సమస్యల పరిష్కారం

నిరసనలో కార్మికులు, నాయకులు

మంగళగిరి టౌన్: పోరాటాలతో కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ నాయకులు జవహర్‌లాల్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎయిమ్స్ హాస్పిటల్ వద్ద కార్మికులు ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. జవహర్‌లాల్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లేబర్ కోర్టులో కేసు వేశామని, ఎరియర్స్ చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా యాజమాన్యం ఇవ్వడం లేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌ను ఎయిమ్స్ యాజమాన్యం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఎయిమ్స్‌లో ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, బాలాజీ, యూనియన్ నాయకులు రవి, శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రశంసా పత్రాలతో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు

మంగళగిరి టౌన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి అన్నారు. ˇత్నాలచెరువులో నిర్మల ఫార్మసీ కళాశాల మంగళగిరి జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిర కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎన్విరాన్‌మెంట్ సస్టైన్‌బులిటీ, రెన్యువల్ ఎనర్జీ అండ్ డిజిటల్ లిటరసీ అంశంపై విద్యార్థులకు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ క్లబ్ స్టూడెంట్ కో ఆర్డినేటర్లకు ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ పాముల రెడ్డి, కళాశాల అధ్యాపకులు సౌజన్య, స్పందన తదితరులు పాల్గొన్నారు.

తుళ్ళూరులో ప్రభుత్వ సత్రం స్థలం ఆక్రమణ!

సత్రం స్థలం ఆక్రమించి టీడీపీ నాయకుడు నిర్మిస్తున్న షెడ్లు

తాడికొండ: తుళ్ళూరు నడిబొడ్డున కోర్టు పరిధిలో ఉన్న విలువైన భూములైన ప్రభుత్వ సత్రం ఆక్రమణలకు టీడీపీ నాయకుడు మరోసారి తెరలేపాడు. ఈ సత్రం ప్రభుత్వానికి చెందినదిగా గ్రామస్తులు కోర్టులో కేసు వేశారు. ఇది తమ పూర్వీకులకు చెందినదిగా చెబుతున్న గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అద్దెలకు ఇచ్చుకుంటున్నాడు. ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని ఆదేశాలు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తుండటంతో శుక్రవారం గ్రామస్తులు కార్యదర్శి రమణకు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించుకొని నిర్మిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లైబ్రరీ సెంటర్‌లో ఉన్న సత్రం కోర్టు పరిధిలో ఉందని, కోర్టు నుంచి ఉత్తర్వులు, అనుమతులు రాకుండానే రావెల శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని త్వరలో నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మంగళగిరి డి.ఇ. జి. సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పట్టణ పరిధిలోని కేకే టవర్స్, ఎస్ఎల్‌వీ అపార్ట్‌మెంట్ ప్రాంతం, ఎన్ఎస్ఆర్ విల్లాస్ రోడ్, కొండపనేని టౌన్‌షిప్, పెద్దపెట్రోల్ బంక్ రోడ్డు, రత్నాల చెరువు, బైపాస్‌రోడ్ ప్రాంతాల్లోను, మండల పరిధిలోని కృష్ణాయపాలెం, బాపూజీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కుష్ఠును నిర్లక్ష్యం చేయొద్దు

మంగళగిరి టౌన్: కుష్ఠు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం తప్పదని మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాల డెర్మటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ హరిత తెలిపారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆశలకు, ఏఎన్ఎంలకు మంగళగిరి నగర పరిధిలోని ఇందిరా నగర్ యూపీహెచ్‌సీలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30 వరకు కుష్ఠు వ్యాధి నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల్లో ఆశలు, ఏఎన్ఎంలు పాల్గొంటారని, మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి లక్షణాలు పరిశీలించి కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించే ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జోసఫ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

చిలువూరు నాగరాజు మాదిగ

దుగ్గిరాల: పెద్ద మాదిగ అంటూనే మాదిగ జాతికి ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా వర్గీకరణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం రూపొందించిందని ఆయన తెలిపారు. పెద్ద మాదిగ గా నటించిన ముఖ్యమంత్రి నమ్మక ద్రోహం పాల్పడటంపై నిలదీశారు. భవిష్యత్ పోరాటాలకు సిద్ధమని నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో అర్హులైన దివ్యాంగులు డ్రైవింగ్ లైసెన్స్ ఉండి డిగ్రీ ఆపై ఉన్నత విద్యార్థులకు త్రీవీలర్ మోటారు సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులై, స్వయం ఉపాధితో జీవించే వారు, 18నుంచి 45ఏళ్ల లోపు ఉండి 70శాతం అంగవైకల్యం ఉన్నవారు దీనికోసం ఈనెల 25వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఏపీడీఏఎస్‌సీఏసీ. ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

9న ఇప్పటంలో 'గౌడ' కార్తీక వన సమారాధన

తాడేపల్లి రూరల్: ఇప్పటంలోని మామిడి తోటలో ఈ నెల 9వ తేదీ గౌడ సంఘం కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వన సమారాధన ఆర్గనైజింగ్ కన్వీనర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017లో 150 మందితో ఈ వనసమారాధన ప్రారంభించామని తెలిపారు. నాటి నుంచి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు మంగళగిరి నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సుమారు 5 వేల మంది హాజరు కానున్నారని పేర్కొన్నారు. ప్రముఖులు పాల్గొంటారని గౌడ కుటుంబ సభ్యులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వనసమారాధన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు వాకా మాధవ్, లచ్చి తులసీదాస్, తాత కోటయ్య, కంచర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా జయంతి

ఎన్జీ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధిలోని పెదవడ్లపూడి రామాలయం సెంటర్‌లో ఆచార్య ఎన్జీ రంగా విగ్రహం వద్ద శుక్రవారం పలు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధులు, ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల గురించి ఎన్నో పోరాటాలు చేసిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పెదవడ్లపూడి గ్రామానికి ఎన్జీ రంగాకు ఎంతో అనుబంధం ఉందని, గ్రామంలో మాగాణి సాగులేని సమయంలో ఆయన చొరవతో హైలెవల్ కెనాల్ వచ్చిందని గుర్తుచేశారు. భారత రైతాంగ ఉద్యమ పితగా పిలుచుకునే ఆచార్య రంగా భారతరత్న అవార్డుకు అర్హులన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నె చంద్రశేఖర్, వివిధ పార్టీల నాయకులు నందకిషోర్, రమేష్, శివరామయ్య, కోటయ్య, రత్న గోపాల్, శంకర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వడ్డేశ్వరం విద్యార్థులు

ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14 బాలబాలికల వాలీబాల్ పోటీలను పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్‌లో టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించారని, వీటిలో బాలికల విభాగంలోతమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. 9వ తరగతి విద్యార్థినులు చదరాసిపల్లి నవీన, బానపల్లి లేఖన చంద్ర, 8వ తరగతి విద్యార్థిని ఎస్కే రహీమాలు నెల్లూరు జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులకు మాజీ సర్పంచ్ షేక్ చినరంగా షరీఫ్ రూ. 50 వేల విలువైన స్పోర్ట్స్ కిట్స్, రెజ్లింగ్ మ్యాట్స్, స్కిప్పింగ్స్, అందజేశారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, పి. సతీష్ కుమార్‌ను, క్రీడాకారులకు పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ షేక్ బషీరా, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

మంగళగిరి జాతీయ రహదారిపై సైకిల్ యాత్రలో తునికి చెందిన యువకులు

మంగళగిరి టౌన్: పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు కాకినాడ జిల్లా తునికి చెందిన యువకులు పేర్కొన్నారు. గత నెల 23న ప్రారంభించిన సైకిల్‌యాత్ర శుక్రవారం మంగళగిరి పరిధి జాతీయ రహదారిలో కొంతమంది విద్యార్థులకు పరిరక్షణపై అవగాహన కల్పించారు. తుని మండలానికి చెందిన జేవీఆర్ ప్రసాద్, బిఎస్సీ కెమిస్ట్రీ చదువుకున్నాడు. అఖిలేష్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మరో యువకుడు శ్రీహరి ఇంటర్ పూర్తిచేశాడు. శుక్రవారానికి 11 రోజుల యాత్ర పూర్తయ్యిందని, అరుణాచలం వరకు చేరుకోవడానికి 20 రోజులకు పైగా పట్టవచ్చని ఆ యువకులు తెలిపారు. సుమారు వెయ్యి కిలోమీటర్ల వరకు సైకిల్ యాత్ర చేస్తున్నామని, తుని నుంచి చలం వరకు మధ్యలో వున్న అన్ని దేవాలయాలను సందర్శించి, రాత్రి సమయాల్లో అక్కడే విశ్రాంతి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ యువకులు మాట్లాడుతూ చెట్లు లేకపోవడంతో సకాలంలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని విద్యార్థులకు వివరించారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన

మానవహారంలో విద్యార్థులు

ఫిరంగిపురం: మేరికపూడిలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ పి.లింగరాజు మాట్లాడుతూ ప్రపంచాన్ని క్యాన్సర్ మహమ్మారి పట్టి పీడిస్తోందని చెప్పారు. మనోధైర్యంతో ఎదుర్కోవాలని, బాధితులకు ధైర్యం చెప్పాలన్నారు. ధూమపానం, పొగాకు కాల్చడం, నమలడం వంటి అలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు క్యాన్సర్‌తో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం దేవకృప, ఆశ కార్యకర్తలు రమణ, అనూష పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: నేషనల్ క్యాన్సర్ ఎవేర్‌నెస్ డేను పురస్కరించుకుని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ మంగళగిరి బ్రాంచ్ విద్యార్థులులు శుక్రవారం మంగళగిరి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా ఆపివేయాలని, మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్లు జోసఫ్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రీజనల్ ఇన్‌చార్జి అమీనా బేగమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'వందేమాతరం' ఎందరికో స్ఫూర్తి

మేడికొండూరు సెంటర్లో వందేమాతరం గురించి వివరిస్తున్న సీఐ నాగుల్ మీరా సాహెబ్

వందేమాతరం ఆలపిస్తున్న సర్పంచ్ శివకుమారి, విద్యార్థి

మేడికొండూరు : 'వందేమాతరం' గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం మేడికొండూరు పులకించింది. మేడికొండూరు సెంటర్‌లో సీఐ నాగుల్ మీరా సాహెబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో మేడికొండూరు పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బండి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలపరిషత్ కార్యాలయంలో వందేమాతరం గీతం ప్రాశస్త్యాన్ని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం శుక్రవారం వివరించారు. ఈవో పీఆర్డీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ కె.రవి, పలువిభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

వేమవరంలో: మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మున్నంగి శివకుమారి, కార్యదర్శి జోజి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలువురు చిరు వ్యాపారులకు, దివ్యాంగులకు మంత్రి లోకేష్ సహకారంతో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు చేయూతనందించారు. బడ్డీ కొట్టు, టిఫిన్స్, తోపుడు బండ్లు, ట్రై సైకిళ్లు, ఇస్త్రీ బండ్లు, ప్లాట్‌ఫారమ్ రిక్షాలను పలువురికి అందజేశారు. ఎవరికి అవసరమైనా చేతనైన సాయం చేస్తామని నేతలు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

గోవుల అక్రమ తరలింపు
15 గోవులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోవూరు: గోవులను కంటైనర్ లారీలో కబేళాలకు అక్రమంగా తరలిస్తుండగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. కంటైనర్ లారీలో గోవులను తరలిస్తున్నారని సమాచారం అందడంతో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై కోవూరు బైపాస్ రోడ్డు జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. కంటైనర్‌లో 15 గోవులు ఉండటం గుర్తించారు. కొందరు వ్యక్తులు నెల్లూరులోని సంతలో 12 గోవులను, కోవూరులో మరో మూడు గోవులను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది. వాటిని ఒంగోలు తరలించి, అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పంపేందుకు సిద్ధం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

కదం తొక్కిన చెరకు రైతులు

బెళగావి (శివాజీనగర): చెరకు పంటకు మద్దతు ధర కోసం అన్నదాతలు రోడ్డెక్కడంతో కర్ణాటకలోని బెళగావి నగరం రణరంగమైంది. టన్ను చెరకుకు రూ.3,500 చెల్లించాలని వారం రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో శుక్రవారం రోడ్లపై టైర్లకు నిప్పంటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బెళగావి సెంట్రల్ బస్టాండ్ నుంచి రాణి చెన్నమ్మ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి రహదారిని దిగ్బంధించారు. అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులపై, బస్సులు, ఇతర వాహనాలపై రాళ్లు రువ్వారు. దీంతో నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసేందుకు యత్నించగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో డీఎస్పీ తీవ్రంగా గాయపడ్డారు. రాళ్లు రువ్విన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

దివ్యాంగురాలిపై ఎమ్మెల్యే నల్లమిల్లి వేధింపులు ఆపాలి

రామచంద్రపురం రూరల్: బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కొర్ల రాముపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేధింపులు ఆపాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగురాలు గతంలో ప్రభుత్వం నిర్వహించిన వైద్య పరీక్షలకు హాజరై సదరం ధ్రువీకరణ పత్రం పొందిందన్నారు. ఆమె భర్త కొర్ల వీరబాబుతో ఉన్న రాజకీయ వైరంతో దివ్యాంగురాలైన రాము పింఛన్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఇ-టెండరు నోటీస్ నం. GNT/E.19 & 20/TrD/2025-26

దిగువ తెలిపిన పనుల కోసం **01-12-2025**న 15.30 గం.ల వరకు కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండర్లు కోరబడుతున్నవి.

క్ర.సం. : 01, **టెండరు రిఫరెన్స్ నం.:** GNT/E.19/TrD/2025-26, తేది : 04-11-2025 **టెండరు టైటిల్:** GNT డివిజన్- 2 లేన్ & 4 లేన్ ROBల నిర్మాణం-5 నం.లు-OHE మాడిఫికేషన్ మరియు II) GNT డివిజన్-డివిజన్‌లో భద్రతకు సంబంధించి పోర్సిలీన్ ఇన్సులేటర్లతో కాంపోజిట్ ఇన్సులేటర్ల రీప్లేస్‌మెంట్. **సుమారు విలువ:** రూ. 2,64,15,330.47, **బయానా :** రూ. 2,82,100/–, **టెండరు ఫారం ధర (వాపసు రాదు) :** లేదు.

క్ర.సం. : 02, **టెండరు రిఫరెన్స్ నం.:** GNT/E.20/TrD/2025-26, తేది : 04-11-2025 **టెండరు టైటిల్:** GNT డివిజన్- 35 బ్రిడ్జిల కోసం PSC శ్లాబ్స్‌తో ప్రస్తుతం గల స్టీల్ గర్డర్స్ రీప్లేస్‌మెంట్ OHEకి మాడిఫికేషన్స్. **సుమారు విలువ:** రూ. 1,62,89,713/–, **బయానా :** రూ.2,31,500/–, **టెండరు ఫారం ధర (వాపసు రాదు) :** లేదు.

ఇ-బిడ్స్ ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు ఆఖరి తేది : **01-12-2025న 15.30 గం.లు.**
టెండరు తెరచు గడువు తేదీ మరుసటి తేదీన సెలవు రోజుగా ప్రకటించబడితే, టెండర్లు మరుసటి పని రోజున తెరువబడును.
ఏదేని వివరమైన సమాచారం కోసం **04-11-2025**న లేదా ఆ తరువాత నుండి **01-12-2025న 15.30 గం.** వరకు వెబ్‌సైట్ **www.ireps.gov.in** కి లాగాన్ కావలెను. ఏదేని తదుపరి సమాచారం /సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా మాత్రమే తెలియజేయబడును.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, TRD, గుంటూరు
A1763

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
e-Procurement TENDER NOTICE
APTRANSCO invites bids online for the following work: Spec. No.APT-e-15/2025 for Supply, Erection, Testing and Commissioning of i) 132kV DC line by making LILO of 132KV Kandukur-Kavali SC line to 132KVSS Ulavapadu ii) Repleacement of ACSR Lynx with ACSS Lynx Conductor on 132KV Kandukur-Kavali SC line from Ulavapadu SS (LILO Point) to Kavali SS iii) Stringing of 2nd Circuit on 132 KV Kandukur-Ulavapadu DC/SC Line iv) 3 Nos 132KV bays at Ulavapadu SS in SPSR Nellore District on turnkey basis. "Date & availability of tenders in **http://www.apeprocurement.gov.in** from **07.11.2025**. Phone No. 7075270101.
Sd/- Chief Engineer/Projects
DIPR RO No.4556PP/CL/Advt/1/1/2021-22, Dt: 07.11.2025

నా సోమి రంగా..

కృష్ణపట్నం పోర్టులో 'ఎస్' ట్యాక్స్‌తో ఇష్టారాజ్యంగా దోపిడీ
ఆయిల్ ట్యాంకర్ల నుంచి బలవంతపు వసూళ్లు

ఏపీ రిజిస్ట్రేషన్ ట్యాంకర్‌కు రూ.300, ఇతర రాష్ట్రాల వాహనాలకు రూ.7 వేలు నుంచి రూ.15వేలు వసూలు

- అలాగే, రోజూ 87లక్షల లీటర్ల ఆయిల్ రవాణా
- ఇందులో లీటర్‌కి రూపాయి చొప్పున వసూలు
- మొత్తం దందాలో ముఖ్యనేతకు నెలనెలా రూ.10 కోట్లకు పైగా వాటా
- 'ఎస్' ట్యాక్స్ దోపిడీతో విసుగెత్తి రోడ్డెక్కిన ట్యాంకర్ల యజమానులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పడిన ఆయిల్ పరిశ్రమలు, రవాణా వాహనాలపట్ల టీడీపీ మూకల ఆగడాలు శృతిమించుతున్నాయి. వీటి నిర్వాహకుల నుంచి ముక్కుపిండి మరీ లక్షల్లో 'ఎస్'ట్యాక్స్ వసూలుచేస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే పన్నులతోపాటు 'ఎస్' ట్యాక్స్ చెల్లించకపోతే ఆయిల్ ట్యాంకర్ టైర్ కూడా కదలదంటూ సర్వేపల్లి ముఖ్యనేత అనుచరులు హెచ్చరిస్తూ చెలరేగిపోతున్నారు. ఈ దౌర్జన్యాలు, దాదాగిరి భరించలేక.. విసిగిపోయిన తిరుపతి జిల్లా ఆయిల్ ట్యాంకర్ల నిర్వాహకులు రోడ్డెక్కారు. అలాగే, అసోసియేషన్ ప్రెసిడెంట్ యోగానంద్ మీడియా ముఖంగా ఇదే విషయాన్ని ఆరోపించడం పోర్టులో 'ఎస్' ట్యాక్స్ తీవ్రతకు అద్దంపడుతోంది. జిల్లాలో ఇప్పుడీ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలంలో బిహార్ తరహా రౌడీరాజ్యం నడుస్తోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ముఖ్యనేత కనుసన్నల్లో 'ఎస్' ట్యాక్స్ పేరుతో బలవంతపు వసూళ్లకు తెగబడుతున్నారు. నేలటూరు ఏపీ జెన్‌కో వద్ద బూడిద రవాణా చేసే బల్కర్ల (ట్యాంకర్లు) నుంచి టీడీపీ మూకలు రౌడీమామూళ్లు వసూళ్లుచేస్తున్నారు. కృష్ణపట్నం పోర్టు అనుబంధంగా ఉన్న ఆయిల్ పరిశ్రమల వద్ద కూడా టీడీపీ మూకలు చెలరేగిపోతున్నాయి. ప్రత్యేకంగా టోల్‌గేట్ పెట్టి రోజుకు రూ.లక్షల్లో దండుకుంటున్నారు.

ఇలా 'ఎస్' ట్యాక్స్ వసూళ్ల దందాతో విసుగెత్తిన ఆయిల్ ట్యాంకర్ల యజమానులు, వ్యాపారులు రోడ్డెక్కారు. శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు వ్యాపారులు యోగానంద్‌తోపాటు మరొకరు సర్వేపల్లి ముఖ్యనేత పేరుతో సాగుతున్న ఈ దందా వ్యవహారాన్ని మీడియా సమక్షంలో వెల్లడించారు. వసూళ్ల దందాపై ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, కాళ్లు చేతులు తీసేస్తామంటూ భయపెడుతున్నారని వారు ఆరోపించారు. రెండ్రోజుల క్రితం దందాపై ప్రెస్‌మీట్ పెట్టారనే కారణంతో శ్రీకాళహస్తిలో ఉన్న తమ నివాసాలను ధ్వంసం చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 'ఎస్' ట్యాక్స్ వ్యవహారాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.

కాళ్లు, చేతులు తీసేస్తామని అంటున్నారు

ప్రత్యేక టోల్‌గేట్ పెట్టి మరీ

ముత్తుకూరు మండలం పంటపాళెంలో ఉన్న ఎడిబుల్ ఆయిల్‌తో పాటు పెయింట్ ఆయిల్, బిస్కెట్ల ఆయిల్, మెడిసిన్ తయారీ ఆయిల్ పరిశ్రమలున్నాయి. వీటి నుంచి రోజుకు దాదాపు 250 ట్యాంకర్ల ఆయిల్ దేశ నలుమూలలకు రవాణా జరుగుతుంది. ఇందుకు దాదాపు వెయ్యి ట్యాంకర్లు ఉన్నాయి. వీటిల్లో ఏపీకి చెందినవి దాదాపు 300 ఉంటే.. మిగిలిన 700 ఆయిల్ ట్యాంకర్లు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, డెహ్రాడూన్ రాష్ట్రాలకు చెందినవి. టీడీపీ నేతలు ముఠాగా ఏర్పడి ఏపీకి చెందిన ట్యాంకర్లకు 'ఎస్' ట్యాక్స్‌ను రూ.300.. దక్షణాది రాష్ట్రాలకు చెందిన వాహనాలకు రూ.7 వేలు, ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం రూ.15 వేలు చొప్పున 'ఎస్' ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ముఖ్యనేత నుంచి పార్టీ పెద్దల వరకు ఇందులో వాటాలు వెళ్తున్నాయని ట్యాంకర్ల యజమానులు చెబుతున్నారు.

ఆయిల్‌పై లీటర్‌కి రూపాయి చొప్పన వసూలు

ఇదిలా ఉంటే.. ఆయిల్ కంపెనీలకు డీలర్లు డిపాజిట్ కట్టి ఆయిల్ కొనుగోలు చేస్తారు. రాష్ట్రంలో ఉన్న ఇతర ఆయిల్ వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి లోకల్ జిల్లా వ్యాపారుల కనుసన్నల్లో వ్యాపారం సాగిస్తుంటారు. వీరు రోజూ రవాణా చేసే ఆయిల్‌పై లీటర్‌కి రూపాయి పచ్చమూకలు చొప్పున వసూలుచేస్తున్నాయి. దీంతో ప్రతి ట్యాంకర్ నుంచి పచ్చ మాఫియాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు వస్తోంది. ఇది కాకుండా మొత్తం దోపిడీ నుంచి 'ఎస్' ట్యాక్స్ రూపంలో ముఖ్యనేత సింహభాగం వాటా దండుకుంటున్నారు. ఇలా ప్రతిరోజు దాదాపు 250 ట్యాంకర్ల నుంచి 87 లక్షల లీటర్ల ఆయిల్ రవాణా అవుతుంది. లీటర్‌కి రూపాయి చొప్పున చూసుకున్నా రోజుకు రూ.85 లక్షల వరకు టీడీపీ మాఫియా వసూలుచేస్తోంది. ఇందులో సింహభాగం అంటే రూ.10 కోట్లకు పైగా 'ఎస్' ట్యాక్స్ కింద ముఖ్యనేతకు చేరుతోంది.

వైభవంగా బాలోత్సవ్ - 2025 ప్రారంభం

బాలోత్సవ్ వేడుకల్లో చిన్నారుల నృత్యప్రదర్శన

పెదకాకాని: దేశం నలుమూలల నుంచి తరలి వచ్చిన తెలుగు విద్యార్థులతో ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీయూ బాలోత్సవ్–2025 మూడు రోజుల వేడుకలు శుక్రవారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ వర్సిటీలో వైభవంగా ప్రారంభమైనట్లు వర్సిటీ ప్రొ. చాన్సలర్ వాసిరెడ్డి మహాదేవ్ తెలిపారు. తొలి రోజున 20 అంశాలలో 9 విభాగాలలో 32 వేదికలపై చిన్నారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 330 పాఠశాలల నుంచి 4,000 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, సంప్రదాయ నృత్యం, సంప్రదాయ వస్త్ర ధారణ వంటి విభాగాలు తొలిరోజు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యధికంగా చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం విభాగంలో 1,800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు వక్తృత్వం, తెలుగులోనే మాట్లాడదాం, తెలుగు పద్యం వంటి విభాగాల్లో పెట్టిన పోటీలు విద్యార్థుల్లో తెలుగుపై ఉన్న మక్కువను తెలిపాయి. పోటీల అనంతరం కాకినాడకు చెందిన తోట బాలకృష్ణ బృందంతో ఏర్పాటు చేసిన తోలు బొమ్మలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

తుపాను బియ్యం పంపిణీలో తోపులాట

స్పృహతప్పి పడిపోయిన ఇద్దరు మహిళలు

- సరైన ఏర్పాట్లు చేయని కూటమి ప్రభుత్వం
- దుకాణాల వద్ద బాధితుల పడిగాపులు

కాట్రేనికోన: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం మరో తోపులాటకు దారితీసింది. తుపాను బాధితులకు బియ్యం పంపిణీలో ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో బాధితుల మధ్య తోపులాట జరిగ్గా, ఇద్దరు మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలోని బియ్యం పంపిణీ కేంద్రం వద్ద శుక్రవారం జరిగింది. బలుసుతిప్పలోని రెండు రేషన్ దుకాణాల పరిధిలో సుమారు 2,300 రేషన్ కార్డుదారులకు ఒకే మెషీన్‌తో పంపిణీ చేయడం, దానికి తోడు డీలరు, అధికారులపై అధికార పార్టీ నాయకుల పెత్తనంతో పంపిణీలో జాప్యం జరిగింది. నాలుగు రోజులుగా పడిగాపులు కాస్తున్న మహిళలు గురువారం రాత్రి ఒక్కసారిగా తోపులాటకు దిగడంతో ఘర్షణ జరిగింది. ఈ తోపులాటలో ఇద్దరు మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. కూటమి ప్రభుత్వం బియ్యం పంపిణీకి సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై నిలదీసిన ముగ్గురు యువకులపై అధికార పార్టీ నాయకులు, డీలర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో ఈ ఘటనలు వైరల్ కావడంతో ముమ్మిడివరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం అధికారులు నాలుగు ఈ–పోస్ మెషీన్లు ఏర్పాటు చేసి బియ్యం పంపిణీ చేపట్టారు. కొందరు లబ్ధిదారులు బియ్యం కోసం థంబ్ వేయగా దళారులు వాటిని కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ బియ్యం స్టాక్ పాయింట్ వద్దే ఉన్నట్టు సమాచారం. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు ప్రారంభం

విలువిద్యను ప్రదర్శిస్తున్న ఆర్చరీ క్రీడాకారులు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14, 17, 19 విభాగాల విలువిద్య పోటీలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వందేమాతరం గీతాన్ని ఆలపించిన అనంతరం జాతీయ జెండాతో పాటు క్రీడా జెండాలను కలెక్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 950మంది విలువిద్య క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. కలెక్టర్ దినేష్ కుమార్ విల్లు ఎక్కుపెట్టి ఈ పోటీలను ప్రారంభించారు.

ఎస్వీయూలో చిరుత సంచారం

తిరుపతి సిటీ: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చిరుత ప్రతినిత్యం సంచరిస్తోంది. గురువారం అర్ధరాత్రి తర్వాత పాపులేషన్ స్టడీస్, ఐ బ్లాక్ ప్రాంతాల్లో శునకాలను చిరుత వేటాడిన దృశ్యాలు సీసీ టీవీలో నమోదయ్యాయి. దీంతో వర్సిటీలోని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అటవీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం బోన్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని విద్యార్థులు మండిపడుతున్నారు.

షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం

- రెండో ఫ్లోర్‌లోని సర్వర్ రూమ్ నుంచి మంటలు
- ఐదు అంతస్తుల నిండా ఆవరించిన పొగ

మంటలను ఆర్పేందుకు రంధ్రాలు చేస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

నరసరావుపేట: పల్నాడుజిల్లా నరసరావుపేటలోని సత్తెనపల్లి బస్టాండ్‌సెంటర్‌లో ఉన్న స్వాతీ షాపింగ్ మాల్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. రెండో ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏర్పడిన మంటలతో భవనం మొత్తం పొగ వ్యాపించింది. పొగ పీల్చడంతో ఊపిరాడక ఇద్దరు మహిళా సిబ్బంది స్పృహ కోల్పోయారు. వారిని బయటకు తీసుకొచ్చి వైద్యం చేయడంతో కోలుకున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేటకు చెందిన రెండు అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సాయంత్రం ఐదున్నరకు పూర్తిగా పరిస్థితి అదుపులోకి వచ్చిందని స్థానిక అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఐదు అంతస్తులు ఉన్న మాల్‌కు నిర్వాహకులు ఎటువంటి అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడంతో మంటలు ఆర్పడం అగ్నిమాపక సిబ్బందికి కష్టతరంగా మారింది. లోపలికి వెళ్లేందుకు కూడా అవకాశంలేకుండా భవన నిర్మాణం ఉంది. ఉదయం 10 గంటల సమయంలో రెండో ఫ్లోర్‌లోని సర్వర్ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయని మాల్ సిబ్బంది తెలిపారు. బిల్డింగ్‌కు ముందు వైపు మినహా మిగతా మూడువైపులా మూసేసి ఉండటంతో పొగ బయటకు వెళ్లే మార్గం లేక భవనం మొత్తం ఆవరించింది. షాపింగ్‌మాల్ ఉద్యోగులు, సందర్శకులు వెంటనే బయటకు పరుగులు తీశారు. పై అంతస్తులో ఉన్న సిబ్బంది బయటకు వచ్చేందుకు కష్టపడాల్సివచ్చింది. 10.30 సమయంలో తమకు సమాచారం రావడంతో అగ్నిమాపక వాహనంతో ఘటనా స్థలానికి వెళ్లామని అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పక్కనున్న భవనాలపైకి ఎక్కి మాల్ గోడలకు రంధ్రాలు చేశారు. వాటి గుండా మూడు, నాలుగు అంతస్తుల్లోని లోపల ఉన్న పొగ బయటకు వచ్చింది. ఆ రంధ్రాల ద్వారానే పైపులతో నీటిని పంపి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై మాల్ యజమానులు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదని టూటౌన్ సీఐ ప్రభాకరరావు చెప్పారు.

నకిలీ మద్యంతో కల్లుగీత వృత్తికి ఇబ్బందులు

ఏపీ కల్లుగీత కార్మిక సంఘం

ధర్నా చేస్తున్న కల్లుగీత కార్మికులు

భీమవరం: అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మద్యం ప్రదేశ్‌గా మార్చాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమని కల్లుగీత కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కల్లుగీత వృత్తిని కాపాడాలంటూ శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దివ్య ఔషధం లాంటి తాటికల్లు అమ్మకాలను నకిలీ మద్యంతో దెబ్బతీస్తే పోరాటాల ద్వారా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పెద్దల ప్రయోజనాల కోసం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ మద్యం కంపెనీలను ప్రవేశపెట్టి గీత వృత్తిని సంక్షోభంలోకి నెట్టడం దుర్మార్గమన్నారు. ఆదరణ పథకానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని, కల్లుగీత కుటుంబాలకు ఉపాధి పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎక్సైజ్ కార్యాలయంలో అందజేశారు. ధర్నాలో ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి, ఉపాధ్యక్షుడు బొక్కా చంటి, సంఘం నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

తుపాను సాయం అడిగితే అట్రాసిటీ కేసులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): తుపాను సాయం కోసం పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీకి చెందిన మత్స్యకార నాయకుడు, రాజయ్యపేట మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలుపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇతనికి మద్దతుగా ఎటువంటి ఆందోళనలు చేయకుండా వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణను గృహ నిర్బంధంలో ఉంచారు. వివరాలివీ.. మొంథా తుపాను సమయంలో ప్రభుత్వం పునరావాస కేంద్రాల్లో భోజన వసతి ఏర్పాటు చేసింది. అయితే, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో ఉన్న మత్స్యకారులందరికీ కాకుండా కొంతమందికి మాత్రమే ఈ భోజనాలు ఏర్పాటుచేశారు. దీనిపై పిక్కి తాతీలు, పిక్కికోటి అలియాస్ రామ్‌చరణ్‌లతో పాటు మరికొందరు కలిసి పంచాయతీ కార్యదర్శి సత్యంను నిలదీశారు. దీంతో.. తాతీలు, పిక్కికోటి తదితరులు తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వీరిరువురితో పాటు మరో 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేశారు. ఈ క్రమంలో.. శుక్రవారం తాతీలు, కోటిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు.. పిక్కి తాతీలు బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

డేటా ఆధారిత పాలనంటూ బాబు మార్కెటింగ్

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపాటు
- ఇన్నాళ్లూ డేటా లేకుండానే పాలన సాగుతోందా?
- స్థానిక స్వపరిపాలనకు రూపునిచ్చింది వైఎస్ జగన్
- అన్నీ తానే తెచ్చానంటూ చంద్రబాబు క్రెడిట్ చోరీ

మాట్లాడుతున్న కన్నబాబు

కాకినాడ రూరల్ : లండన్ పర్యటన నుంచి వచ్చిన సీఎం చంద్రబాబు డేటా ఆధారితర పరిపాలన సాగిస్తానంటూ మార్కెటింగ్ చేసుకుంటుండటం ఆశ్చర్యంగా ఉందని, ఇన్నాళ్లు డేటా లేకుండా పరిపాలన సాగిస్తున్నారా.. అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రశ్నించారు. కాకినాడలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో తుపానుకు ఎంత మంది రైతులు పంట నష్టపోయిందంటే డేటా లేదు. ఎన్ని రోడ్లు పాడైపోయాయంటే డేటా లేదు. 16 నెలల పాలనలో ఎంత మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారంటే డేటా లేదు. ఎన్ని హత్యలు జరిగాయంటే డేటా లేదు. ఎంత మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే డేటా లేదు. కానీ, డేటా ఆధారిత పరిపాలన అని కొత్త పదంతో చంద్రబాబు మార్కెటింగ్ చేసుకుంటున్నారు' అని మండిపడ్డారు. మొంథా తుపానుతో రైతులు అతలాకుతలమై, లక్షలాది ఎకరాలు దెబ్బతిని ప్రభుత్వ సాయం అందుతుందనే ఆశ నిరాశై ఏం చేయాలో తెలియని అయోమయంలో ఉంటే సరికొత్త పదాలతో సీఎం మాయాజాలం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపాను ఉన్నప్పుడే చంద్రబాబు లండన్ వెళ్లిపోయారని, ఆయన కుమారుడు క్రికెట్ చూడడానికి ముంబై వెళ్లారని, మిగతా మంత్రులు ఎవరికి వారు ఉండిపోయారన్నారు.

అది వైఎస్ జగన్ విజన్

స్థానిక స్వపరిపాలన, ప్రజల వద్దకు పాలన.. ఇలాంటి విజన్ ఉన్న సీఎంగా వైఎస్ జగన్ గత ప్రభుత్వంలో వాటికి నిజమైన రూపం ఇచ్చారని కన్నబాబు తెలిపారు. సచివాలయాల పేరు మారుస్తున్నట్టు పత్రికల్లో చూశామని, అది దేశం మొత్తం గుర్తించిన జగన్ విజన్ అన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వలంటీర్ వ్యవస్థ, వైఎస్సార్ క్లినిక్‌లు పెట్టిన జగన్ విజనరీయా.. లేక ఉత్తుత్తి మాటలు చెప్పే చంద్రబాబు విజనరీయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో గందరగోళం నెలకొందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ అమలవుతుంటే లోకేశ్‌కు ఎందుకు అంతలా ఫిర్యాదులు వస్తున్నాయని నిలదీశారు. లండన్ నుంచి వచ్చిన చంద్రబాబు పంట నష్టపోయిన రైతుల గురించి, కాశీబుగ్గ సంఘటనపై మాట్లాడుతారనుకుంటే.. చిత్రంగా టీవీ 5లో లోకేశ్ స్ఫూర్తితోనే భారత మహిళ జట్టు ప్రపంచ కప్పు గెలుచుకున్నట్టు చెప్పడం జాకీలు ఎత్తడమే అన్నారు. జగన్ సీఎంగా తెచ్చిన కంపెనీలు తాను తెచ్చానని, వైఎస్సార్ పోలవరం తెస్తే తానే తెచ్చానని చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులను భయపెట్టేందుకు నోటీసులు, కేసులు, అరెస్టులు తప్ప పాలన మాత్రం లేదన్నారు. కనీసం ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించలేదని విమర్శించారు.

సోషల్ మీడియా ఎన్నారై యాక్టివిస్టును చితకబాదిన పోలీసులు

- టీడీపీ నేతలపై పోస్టులు పెట్టాడని.. పోలీసులపై దాడి చేశాడని రెండు అక్రమ కేసులు నమోదు
- తండ్రి మరణంతో లండన్ నుంచి వచ్చిన ఆయన్ను అరెస్టు చేసిన పోలీసులు
- విపరీతంగా కొట్టారని మీడియా ఎదుట బాధితుడి ఆవేదన
- విజయవాడ కోర్టులో హాజరు.. రిమాండ్ విధింపు
- అవనిగడ్డ సబ్‌జైలుకు తరలింపు

భాస్కర్‌రెడ్డిని అరెస్టుచేసి తీసుకెళ్తున్న పోలీసులు (కుడివైపు గళ్ల చొక్కా)

పెనమలూరు (కృష్ణాజిల్లా)/విజయవాడ లీగల్: సోషల్ మీడియా యాక్టివిస్టు, ఎన్నారై మాలపాటి భాస్కర్‌రెడ్డిని కృష్ణాజిల్లా పెనమలూరు పోలీసులు చితకబాదారు. దెబ్బలు తట్టుకోలేక తాను గట్టిగా అరిచినా సీఐ, ఎస్ఐ కొట్టారని ఆయన శుక్రవారం విజయవాడ కోర్టు వద్ద మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. తన తండ్రి మరణించడంతో ఇటీవలే ఆయన లండన్ నుంచి పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి వచ్చారు. అయితే, వైద్య పరీక్షల నిమిత్తం గురువారం పోరంకి కామినేని ఆస్పత్రికి వెళ్లిన ఆయన్ను పోలీసులు కాపుకాసి ఆయనతోపాటు ఆయన సోదరుడు ఓబుల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. తొలుత భాస్కర్‌రెడ్డిని రహస్య ప్రాంతానికి తరలించారు. అయితే, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తున్నారన్న విషయం తెలుసుకుని పోలీసులు భాస్కర్‌రెడ్డిని ఉన్నపళంగా పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు.

రెండు అక్రమ కేసులు నమోదు..

అనంతరం.. భాస్కర్‌రెడ్డిపై రెండు అక్రమ కేసులు నమోదుచేశారు. టీడీపీ నేతలపై పోస్టులు పెట్టాడని ఒక కేసు.. కామినేని ఆస్పత్రి వద్ద పోలీసులపై దాడిచేశాడని మరో కేసు పెట్టారు. చోడవరం గ్రామానికి చెందిన గౌతమ్ చౌదరి ఫిర్యాదు మేరకు మొదటి కేసు నమోదు కాగా.. భాస్కర్‌రెడ్డి, అతని సోదరుడు ఓబుల్‌రెడ్డి దాడిచేసినట్లు కానిస్టేబుల్ ఎ. శ్రీనివాస్ (1234) ఫిర్యాదు మేరకు మరో అక్రమ కేసు పెట్టారు. అయితే, భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు ఎక్కువమంది ఉండడంతో ఎలా దాడిచేశారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పోలీసులు తీవ్రంగా కొట్టారు

ఈ నేపథ్యంలో.. పోలీసులు భాస్కర్‌రెడ్డిని శుక్రవారం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు తనను విపరీతంగా కొట్టారని చెప్పారు. దెబ్బలు తట్టుకోలేక గట్టిగా అరిచినా సీఐ, ఎస్ఐ కొట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. తాను దెబ్బలు తట్టుకోలేక అరిచి.. అరిచి గొంతునొప్పి వచ్చిందని వాపోయారు. టీడీపీ కార్యకర్తలు జగన్‌పై అసభ్యకరమైన పోస్టులు పెట్టారని, కౌంటర్‌గా తాను కూడా కొన్ని పోస్టులు పెట్టానని ఆయన తెలిపారు. కోర్టు ఆయనకు రిమాండ్ విధించడంతో అవనిగడ్డ సబ్‌జైలుకు తరలించారు.

క్లుప్తంగా...

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

అనంత, వైఎస్సార్ కడప జిల్లాల్లో బలవన్మరణాలు

కళ్యాణదుర్గం/ సిద్ధవటం: కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి భరోసా కరువై, మద్దతు ధర లభించక అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి చెందిన గొల్ల రంగన్న (42)కు రెండెకరాల పొలం ఉంది. టమాటా, మిరప పంటలను సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. దిగుబడి గణనీయంగా తగ్గడం, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. దీంతో అనంతపురం ప్రధాన రహదారి పక్కన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య రాధమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా, మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు వెళ్తున్న నేతలు కొందరు రోడ్డు పక్కనే నిర్జీవంగా పడి ఉన్న రంగన్నను చూసి కూడా పట్టించుకోలేదు. వాహనాలు ఆపకుండా వెళ్లడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లికి చెందిన మామిడి వెంకటనరసారెడ్డి (60) కౌలు రైతు. పెట్టుబడుల కోసం రూ.40 లక్షల దాకా అప్పులు చేశాడు. అయితే పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం పని మీద కడపకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సిద్ధవటంలో ఆత్మహత్య చేసుకున్నాడని శుక్రవారం పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

మద్యం అక్రమ కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో రిమాండ్ ముగియడంతో విజయవాడ జైలులో రిమాండ్‌లో ఉన్న రాజ్ కేసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య, అలాగే గుంటూరు జైలులో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణలను శుక్రవారం ఏసీబీ న్యాయస్థానంలో పోలీసులు హాజరుపరిచారు. వీరితోపాటు ఇదే కేసులో గోవిందప్ప బాలాజీ మినహా బెయిల్‌పై ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, పైలా దిలీప్ శుక్రవారం ఏసీబీ న్యాయస్థానంలో హాజరయ్యారు. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, కంపెనీలో గతంలో డైరెక్టర్‌గా ఉన్నా, తర్వాత రాజీనామా చేశానని, అయినా ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నానంటూ తనపై కేసు నమోదుచేశారని న్యాయమూర్తి ఎదుట శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కేసు పురోగతిపై న్యాయమూర్తి విచారణాధికారిని ప్రశ్నించగా, సాక్ష్యాలు సేకరించామని, వాటిని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కు పంపించామని, త్వరలో నివేదిక వస్తుందని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి రిమాండ్‌ను ఈనెల 21వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చూడాలి

12వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి/ గుంటూరు రూరల్ : పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు, అవి కార్యరూపం దాల్చేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 12వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గత పాలకులు భూమి కేటాయించినా, ఇప్పటికీ ప్రారంభం కాని ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో సమీక్షించాలని ఆదేశించారు. నిర్మాణ పురోగతి లేకపోతే అనుమతులు రద్దు చేయాలన్నారు. ప్రైవేట్ ల్యాండ్ ఓనర్లు తమ భూములను పరిశ్రమలకు, కంపెనీలకు ఇవ్వడానికి ముందుకు వస్తే.. అలాంటి వారిని ప్రోత్సహించాలని చెప్పారు. 'అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను మెగా సిటీగా అభివృద్ధి చేయాలి. తిరుపతి, అమరావతి నగరాలను కూడా మెగా సిటీలుగా చేయాలి. ఇప్పటికే అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతి మెగా సిటీలకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ప్రస్తుతం ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమల్లో వేగంగా శంకుస్థాపనలు జరిగేలా చూడాలి.' అని సీఎం చెప్పారు. కాగా, ఈ సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించి రూ.1,01,899 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనల్ని ఎస్ఐపీబీ ఆమోదించింది.

ఎన్జీ రంగాతో నాకు ప్రత్యేక అనుబంధం

రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. శుక్రవారం గుంటూరులో ఆచార్య ఎన్జీ రంగా జయంతి ఉత్సవాలకు సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్జీ రంగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ.. ఆయన జీవితమంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి వెచ్చించారని కొనియాడారు. 'ఎన్జీ రంగాతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది.' అని అన్నారు. అనంతరం 'ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు' అనే పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు.

అప్పుల్లో బాబే నంబర్‌వన్

తిరోగమనంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

ఈ ఆర్థిక సంవత్సరం 6 నెలల్లో బడ్జెట్ అప్పుల్లో బాబు సర్కారు దేశంలోనే టాప్



సాక్షి, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి ఆరు నెలల్లో సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా బడ్జెట్ అప్పులు చేసింది. మిగతా పెద్ద రాష్ట్రాల కన్నా కూడా ఆంధ్రప్రదేశ్ సర్కారే ఎక్కువ రుణాలు తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి ఆరు నెలల బడ్జెట్ కీలక సూచికలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) శుక్రవారం వెల్లడించింది. దీనిప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్–సెప్టెంబరు మధ్య నెలకు రూ.10 వేల కోట్లకు పైగా ఆరు నెలల్లో రూ.63,052 కోట్లు చంద్రబాబు ప్రభుత్వం అప్పు చేసింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రాలు ఈ స్థాయిలో రుణాలు తీసుకోకపోవడం గమనార్హం. అయినా సంపద సృష్టిలో మాత్రం బాబు పాలన తిరోగమనంలో సాగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో వైఎస్ జగన్ హయాంలో వచ్చినదాని కంటే ఇప్పుడు రెవెన్యూ రాబడులు పడిపోయాయి.

- కూటమి సారథిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వరుసగా ప్రతి నెల అమ్మకం పన్ను రాబడి తగ్గుతూనే ఉంది. వైఎస్ జగన్ పాలనలో వచ్చినదాని కన్నా పడిపోతోందని కాగ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇది ఆర్థిక వెనుకబాటే...

అమ్మకం పన్ను తగ్గడం అంటే ప్రజల కొనుగోలు శక్తి పడిపోతోంది అని స్పష్టం. సాధారణంగా ఏటా, ప్రతి నెలా రాబడులు పెరుగుతాయి తప్ప తగ్గడం ఉండదు. అందుకు భిన్నంగా చంద్రబాబు పాలనలో రెవెన్యూ రాబడులు తగ్గిపోతున్నాయి.

- 2023–24లో తొలి ఆరు నెలల్లో వైఎస్ జగన్ పాలనలో వచ్చిన రెవెన్యూ రాబడుల కంటే 2025–26లో బాబు హయాంలో 8.4 శాతం పడిపోయాయి. రూ.7,903.96 కోట్లు తగ్గిపోయాయి. అమ్మకం పన్ను రాబడులు రూ.517.55 కోట్లు తగ్గిపోయాయి. అంటే 5.52 శాతం క్షీణించాయి. అంటే, రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందని తేటతెల్లం అవుతోంది.

అప్పుల వృద్ధి... సంపద శూన్యం

అమ్మకం పన్ను సహా అంతకు రెండేళ్ల ముందు వచ్చిన రెవెన్యూ రాబడులు కూడా రాకుండా క్షీణించడం అంటే చంద్రబాబు అస్తవ్యస్త, అసమర్థ పాలనకు నిదర్శనం అని ఆర్థిక నిపుణులు తేల్చిచెబుతున్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి కేంద్ర గ్రాంట్లు కూడా భారీగా తగ్గిపోయాయి.

- వైఎస్ జగన్ హయాంలో 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో వచ్చిన కేంద్ర గ్రాంట్లతో పోలిస్తే 2025–26లో 81.12 శాతం మేర తగ్గిపోయాయి. గ్రాంట్లు ఏకంగా రూ.17,255 కోట్లు తగ్గిపోయాయి.
- మరోపక్క ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో బడ్జెట్ వ్యయం సైతం తిరోగమనంలో ఉంది. 2023–24 ఏప్రిల్–సెప్టెంబరు కన్నా 2025–26లో 3.4 శాతం తగ్గింది.
- సాధారణంగా ఏటా బడ్జెట్ వ్యయం పెరగాలి తప్ప తగ్గడం అంటే రాష్ట్రం ఆర్థికంగా దిగజారిపోతోందని స్పష్టం అవుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.
- విజన్ డాక్యుమెంట్లు, జీఎస్డీపీ, సంపద సృష్టి అంటూ గొప్పలుపోతూ ఏడాదిన్నరగా బాబు చేస్తున్న పాలనకు... బడ్జెట్ రాబడులు, వ్యయాలకు ఎక్కడా పొంతన లేకపోవడం గమనార్హం.
- రాష్ట్రం పురోగమించకపోగా తిరోగమనంలోకి వెళ్తోందని బడ్జెట్ కీలక సూచికలు స్పష్టం చేస్తున్నాయి. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చంద్రబాబు చెబుతున్నప్పటికీ అవన్నీ మాటలకే పరిమితం తప్ప ఆచరణలో లేదని కాగ్ గణాంకాలే తేల్చాయి. ఈ రంగాలకు చేసే ఖర్చు సామాజిక రంగం కిందకు వస్తుంది. 2023–24 ఏప్రిల్–సెప్టెంబరుతో పోల్చితే 2025–26లో సామాజిక రంగ వ్యయం 11.10 శాతం తగ్గింది. అంటే వైఎస్ జగన్ పాలనలో చేసిన వ్యయం కంటే సామాజిక రంగంపై బాబు సర్కారు చేసింది చాలా తక్కువని కాగ్ గణాంకాలు నిరూపించాయి.

2023-24 ఏప్రిల్-సెప్టెంబర్, 2025-26 ఏప్రిల్-సెప్టెంబర్ బడ్జెట్ కాగ్ గణాంకాలు ఇలా.. (రూ.కోట్లలో)

వివరం	2023-24 ఏప్రిల్-సెప్టెంబర్	2025-26 ఏప్రిల్-సెప్టెంబర్
బడ్జెట్ వ్యయం	1,37,360.47	1,32,602.44
రెవెన్యూ రాబడులు	82,138.90	74,234.94
అమ్మకం పన్ను	9,375.33	8,857.78
కేంద్ర గ్రాంట్లు	21,270.21	4,014.23
మూలధన వ్యయం	16,576.88	11,715.09
సామాజిక రంగ వ్యయం	72,621.96	64,556.85
ఆర్థిక రంగ వ్యయం	32,484.08	26,631.03

2025-26 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య బడ్జెట్‌లో వివిధ రాష్ట్రాలు చేసిన అప్పులు

రాష్ట్రం	అప్పులు (రూ.కోట్లలో)
ఆంధ్రప్రదేశ్	63,052
మధ్యప్రదేశ్	49,100
తెలంగాణ	45,139
రాజస్థాన్	35,877
కేరళ	30,772
పశ్చిమబెంగాల్	28,390
కర్ణాటక	16,806
పంజాబ్	14,435
గుజరాత్	14,332
మహారాష్ట్ర	10,262
ఉత్తరప్రదేశ్	9,322

మూలధన వ్యయమూ అంతంతే..!

ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లోనే బడ్జెట్‌లో రూ.63,052 కోట్లు అప్పు చేయడం ద్వారా దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాల కన్నా బాబు సర్కారు ఎక్కువ వృద్ధి నమోదు చేసింది. అయినా, మూలధన వ్యయం అంతంతమాత్రంగానే ఉంది. 2023–24 ఏప్రిల్–సెప్టెంబరు మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన మూలధన వ్యయం కన్నా 2025–26లో బాబు సర్కారు చేసిన మూలధన వ్యయం 29.38 శాతం తక్కువ కావడం గమనార్హం. ఇన్ని అప్పులు చేసినా బాబు సర్కారు మూలధన వ్యయం కేవలం రూ.11,715.09 కోట్లే అని కాగ్ గణాంకాలు స్పష్టం చేశాయి.

'అప్పు'డంతా ప్రగల్భాలే.. ఇప్పుడంతా లోటే..!

చేసిన అప్పులను ఆస్తుల కల్పనకు వ్యయం చేయాలంటూ ఎన్నికలకు ముందు బాబు పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చాక మాత్రం దానికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు అడ్డుఅదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. రెవెన్యూ లోటును రూ.33,185 కోట్లకు పరిమితం చేస్తామని బడ్జెట్‌లో పేర్కొంది చంద్రబాబు సర్కారు. కానీ, ఆర్థిక సంవత్సరం ఇంకో ఆరు నెలలు ఉండగానే అంతకుమించి రెవెన్యూ లోటులోకి తీసుకెళ్లింది. ఇప్పటికే రెవెన్యూ లోటు రూ.46,652.41 కోట్లకు చేరింది. 2023–24 ఏప్రిల్–సెప్టెంబరు మధ్య వచ్చిన రెవెన్యూ రాబడులు రాకుండా తగ్గిపోవడంతోపాటు బడ్జెట్ వ్యయమూ తగ్గిపోయి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతోందని ఆర్థిక శాఖ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

నిధులు మళ్లిస్తే పోల'వరం' ఎప్పుడు?

రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులను నిలదీసిన పీపీఏ సీఈవో అతుల్ జైన్

సాక్షి, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. ఆర్థిక సమస్యలు ఉత్పన్నం కాకుండా సకాలంలో ప్రాజెక్టును పూర్తి చేయడానికి అడ్వాన్సుగా రూ.5052.71 కోట్లు విడుదల చేసింది. కానీ.. ఆ నిధులను ఎస్ఎన్ఏ (సింగిల్ నోడల్ ఏజెన్సీ) ఖాతాలో జమ చేయకుండా, ఇతర అవసరాలకు మళ్లిస్తే గడువులోగా ప్రాజెక్టు ఎలా పూర్తవుతుంది?' అంటూ రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులను పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సీఈవో, సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) చైర్మన్ అతుల్ జైన్ నిలదీశారు. నేటికీ ఎస్ఎన్ఏ ఖాతాలో జమ చేయని రూ.1,077.47 కోట్లను తక్షణమే జమ చేయాలని ఆదేశించారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిందేనంటూ, ఆలోగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిందేనని తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లోని పీపీఏ కార్యాలయంలో శుక్రవారం సీఈవో అతుల్ జైన్ అధ్యక్షతన పీపీఏ 17వ సమావేశం జరిగింది. ప్రాజెక్టు పనుల పురోగతిపై పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన డ్యాం గ్యాప్–2లో డయాఫ్రం వాల్ (డీ వాల్) పనులు నిర్దేశించిన లక్ష్యం కంటే ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. డీ వాల్ పనులను జూన్ నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ చెబుతోందన్నారు. దీనిపై సీఈవో అతుల్ జైన్ స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లో డీ వాల్ పనులు మార్చి నాటికే పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. విదేశీ నిపుణుల కమిటీ సూచనల మేరకు ప్రధాన డ్యాం గ్యాప్–1 నిర్మాణ పనుల్లో ప్రాథమిక పనులు చేస్తున్నామని.. గ్యాప్–2లో డీ వాల్ పూర్తయిన చోట్ల ప్రధాన డ్యాం ప్రాథమిక పనులు చేస్తున్నామని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి వివరించారు. ఎడమ కాలువ పనులు.. కుడి, ఎడమ కాలువ అనుసంధానం పనులు కొలిక్కి వస్తున్నాయన్నారు. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను పీపీఏకు వివరించారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో 14,371 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించామని.. ఇంకా 23,689 కుటుంబాలకు కల్పించాల్సి ఉందని ఆర్అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి వివరించారు.

ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదా?

- 2024 నుంచి ఇప్పటి వరకు పునరావాస కాలనీల్లో ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయకపోవడంపై పీపీఏ సీఈవో అతుల్ జైన్‌ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పునరావాస కాలనీల్లో ఇళ్లు, మౌలిక సదుపాయాల నిర్మాణ పనుల టెండర్లు రద్దు చేసి.. కొత్తగా ఇటీవల టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించామని, 2027 డిసెంబర్ లోగా నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనులు పూర్తి చేస్తామని ఆర్అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య జరగాల్సిన ఒప్పందం(ఎంవోయూ)పై తక్షణమే ఆమోదించాలని కోరారు.
- పీపీఏ కార్యాలయాన్ని ఒకే దశలో రాజమహేంద్రవరానికి తరలించాలని.. తద్వారా ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి అవకాశం ఉంటుందని కేంద్ర జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి గౌరవ్ ఆదేశించారు.
- బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల తెలంగాణలోని భూ భాగం ముంపునకు గురయ్యే విషయమై సంయుక్త సర్వే చేయాలని తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కోరారు. ప్రాజెక్టులో 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేస్తున్న నేపథ్యంలో ముంపు సమస్య ఉత్పన్నం కాదని పీపీఏ సీఈవో అతుల్ జైన్ స్పష్టం చేశారు. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు గురించి ప్రస్తావించగా, అది అంతర్రాష్ట్ర వివాదమని.. దానిపై మరో వేదికలో చర్చించాలని సూచించారు.
- పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం విడుదల చేసిన నిధుల్లో 2023–24, 2024–25 వ్యయంపై ఆడిట్ చేస్తున్నారని.. పూర్తవ్వగానే నివేదిక అందజేస్తామని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో నావిగేషన్ టన్నెల్‌ను క్లాస్–3 ప్రమాణాలతో పూర్తి చేయడానికి నిధులు కేంద్రం ఇస్తుందా? లేక ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ) ఇస్తుందా? చెప్పాలని కోరారు. ఈ అంశంపై ఐడబ్ల్యూఏఐతో సమావేశం నిర్వహించి స్పష్టత ఇస్తామని పీపీఏ సీఈవో అతుల్ జైన్ తెలిపారు.

దళిత, గిరిజనులకు అవమానం

లోకేశ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

లోకేశ్ క్షమాపణ చెప్పాలని నిరసన

కళ్యాణదుర్గం: నారా లోకేశ్ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పర్యటన సందర్భంగా దళిత, గిరిజనులకు అవమానం జరిగింది. శుక్రవారం సాయంత్రం కళ్యాణదుర్గం వచ్చిన లోకేశ్.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండానే వెళ్లిపోయారు. దీంతో ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక అలంకరణతో విగ్రహాన్ని ముస్తాబు చేసిన దళిత, గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ వెళ్లగానే వారు కొవ్వొత్తులతో నిరసనకు దిగారు. అంబేడ్కర్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అంబేడ్కర్‌ను అవమానించిన లోకేశ్.. వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులు ఓటు బ్యాంకుగా మాత్రమే పనికొస్తారా అంటూ మండిపడ్డారు. దళిత, గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దీనిపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని నిరసన విరమించాలని చెప్పగా.. దళిత, గిరిజనులు నిరాకరించడంతో పోలీసులకు, వారికి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మండిపాటు

సాక్షి, అమరావతి: ఇటీవల కర్నూలు వద్ద బస్సు ప్రమాదానికి రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం అమ్మకాలే కారణమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం ద్వారా భయపెట్టాలని సర్కారు చూస్తోందని మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బస్సు ప్రమాదానికి కారణమైన బైకిస్ట్ ఎక్కడ మద్యం తాగాడు.. అతని దేహంలో ఆల్కహాల్ శాతం ఎంత అని ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పకుండా సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల ఆధారంగా తమ పార్టీ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శికి నోటీసులు ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా పార్టీ అంతర్గత సమావేశాలపై స్పందించే హోం మంత్రి ఇవాల్టి వరకు విశాఖలో దొరికిన డ్రగ్స్ వివరాలు ఎందుకు బయట పెట్టడం లేదో సమాధానం చెప్పాలి. మా పార్టీకి చెందిన కొండారెడ్డిపై కేసు పెట్టి అరెస్ట్ చేశారు. ఆయనను అరెస్ట్ చేసిన సమయమే ఇది తప్పుడు కేసు అనేందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీ నేతలపై ఎన్ని అక్రమ అరెస్టులు పెట్టినా.. కూటమి ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించడం ఆగదు' అని సుధాకర్‌బాబు స్పష్టం చేశారు.

పర్యాటకం.. పెద్దలకు 'ఫలహారం'

అభివృద్ధి ముసుగులో కూటమి సర్కారు భూ పందేరం

టెండర్లు, బిడ్లు లేకుండా డీపీఆర్‌ల ఆధారంగా సంతర్పణ

ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి విలువైన ప్రభుత్వ ఆస్తులు..

డీపీఆర్ ప్రకారం నిర్మాణాలు చేయకున్నా భూములు వెనక్కి తీసుకోవడం కష్టమే!

కేవలం రూ.50 లక్షల పెట్టుబడి చూపిస్తే ఖరీదైన ప్రాంతాల్లో మూడెకరాలు ఇచ్చేస్తారట

పర్యాటక ఆస్తులను అప్పనంగా అనుయాయులకు దోచిపెట్టే కుట్ర

ఇప్పటికే 3,913.96 ఎకరాల పర్యాటక భూముల వివరాలతో నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: టూరిజం అభివృద్ధి ముసుగులో విలువైన పర్యాటక భూములను పప్పుబెల్లాల మాదిరిగా టీడీపీ పెద్దల సన్నిహితులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది! అత్యంత ఖరీదైన పర్యాటక భూములతో పాటు ఇతర శాఖలకు చెందిన భూములను కూటమి సర్కారు టెండర్లు లేకుండా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోంది. విశాఖ, విజయవాడ, తిరుపతి లాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు రాష్ట్రం నలుమూలల జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న భూములను అప్పనంగా దోచిపెడుతోంది. కొండలు, కోనలు, సముద్ర తీరం, ఘాట్ ప్రాంతాల్లోని భూములను పెట్టుబడుల పేరుతో సంతర్పణ చేసేందుకు రోడ్ మ్యాప్ రూపొందించింది. హోటళ్లు, రిసార్టులు, వెల్‌నెస్ సెంటర్లు, వినోద పార్కుల ఏర్పాటుకు, టెండర్లు, బిడ్లతో పని లేకుండా డీపీఆర్ ఆధారంగా భూములు కట్టబెట్టి ప్రోత్సాహకాలు విడుదలకు ఏకంగా జీవో 41 విడుదల చేయడం చర్చనీయాంశమైంది. భూ కేటాయింపులపై తాజాగా యూనిఫాం ఫ్రేమ్‌వర్క్ విడుదలైంది.

రూ.50 లక్షలకే ఖరీదైన చోట మూడు ఎకరాలా?

టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) దివాళా అంచున నిలిచింది. ఏపీటీడీసీకి చెందిన ఒక్క ఆస్తిని (హోటళ్లు) కూడా మిగల్చకుండా లీజు పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తోంది. ఈ క్రమంలోపర్యాటక సంస్థకు చెందిన 3,913.96 ఎకరాల భూమిని నోటిఫై చేసిన చంద్రబాబు సర్కారు.. డీపీఆర్‌లతో వస్తే చకచకా కేటాయింపులు చేస్తామని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు విలువను బట్టి భూములు కేటాయింపులపై మార్గదర్శకాలు విడుదల చేసి భూ పందేరానికి సిద్ధమైంది. విచిత్రం ఏమిటంటే.. 3 స్టార్ హోటల్ కడతామంటూ రూ.50 లక్షలతో ముందుకొస్తే ఏకంగా మూడు ఎకరాల వరకు భూములు కేటాయించే వెసులుబాటు కల్పించడం, అంటే ఎకరం రూ.16.60 లక్షలకే దొరుకుతోంది. నగరాల్లో ఖరీదైన చోట్ల భూములను కారుచౌకగా కట్టబెడుతుండటం అనుమానాలకు తావిస్తోంది. అల్ట్రామెగా/మార్క్యూ ప్రాజెక్టులకు అయితే ప్రత్యేక వెసులుబాటు కల్పించి ఒక్కోదానికి ఒక్కో విధంగా భూ కేటాయింపులు, ప్రోత్సాహకాలు ఇవ్వనుంది.

టెండర్లు లేకుండా..

నీతి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వ టెండర్ విధానాలను తోసిపుచ్చి పీపీపీ పేరుతో పర్యాటక భూములను కూటమి సర్కారు పందేరం చేస్తోంది. ఖరీదైన భూములను దక్కించుకున్న అనంతరం ప్రాజెక్టు ముందుకు సాగకున్నా సంబంధిత సంస్థపై చర్యలు తీసుకోలేని నిస్సహాయ పరిస్థితుల్లోకి అధికార యంత్రాంగాన్ని నెట్టేసింది. భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే మధ్యవర్తిత్వం, న్యాయ పోరాటమే శరణ్యం! అదే టెండర్ల వ్యవస్థ ఉంటే పారదర్శకతకు పెద్దపీట, తప్పులు చేస్తే జరిమానా విధించే అవకాశం ఉంటుంది. పైగా భూమి ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. లాటరీ పద్ధతిలో విలువైన భూములు పంచిపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఆ భూములపై పెట్టుబడిదారులు రుణాలు తీసుకుంటే బ్యాంకులకు అనుకూలంగా నిబంధనలు రూపొందించడం గమనార్హం.

నచ్చినవారికి పందేరం..

టెండర్లు లేకుండా కేవలం డీపీఆర్ ఆధారంగా పర్యాటక ప్రాజెక్టులకు భూములు కేటాయిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఒక ప్రాంతంలో హోటల్/రిసార్టుల నిర్మాణానికి ఎక్కువ మంది ముందుకొస్తే సంస్థ బ్రాండింగ్, పెట్టుబడి, ఉపాధి కల్పన ఆధారంగా కేటాయిస్తామని చెబుతోంది. కాగితాలపై అధిక పెట్టుబడులు చూపిస్తూ మాయాజాలానికి తెర తీశారని, ఇదంతా టీడీపీ పెద్దల సన్నిహితులకు లబ్ధి చేకూర్చే ఎత్తుగడగా నిర్మాణ రంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. దేశంలో సిమెంట్, ఇనుము, ఇటుక లాంటి వాటి రేట్లు దాదాపు ఒకేలా ఉన్నప్పటికీ నిర్మాణ ఖర్చులు ఎక్కువగా చూపించి భారీ ప్రాజెక్టు చేపట్టినట్లు మభ్యపుచ్చే యత్నమని పేర్కొంటున్నారు. ఆతిథ్య రంగంలో ఎలాంటి అనుభవం లేని సంస్థలకు కన్సార్షియం ముసుగులో చంద్రబాబు సర్కారు భూముల పందేరానికి తెర తీసిందని స్పష్టం చేస్తున్నారు.

3. Typical Land Ranges

Project Type	Typical Keys	Minimum Investment / Key (₹ Lakh)	Usual Land Range	Indicative Built-up Area / Key (m^2)
3-Star Hotel	80-120	50 and above	Up to 3 acres	45-60
4-Star/Upper Upscale	100- 150	75 and above	Up to 4 acres	60-80
5-Star/Luxury	100- 150	100 and above	Up to 5 acres (max)	80-100
Resort (Hill / Beach/ Jungle	50-150	50 and above	5 - 15 acres	70-120
MICE/ Convention Hotel	80-200 + hall	As per applicable hotel category above + ₹ 1.0 - 1.5 lakh per seat for convention facility	4 - 10 acres	70-100 + event space
Marquee/ Ultra-Mega	Variable	Case-by-case	Case- by-case	As proposed

4. Explaining Land Requirement in the DPR

ప్రాజెక్టు విలువను బట్టి భూ కేటాయింపునకు ప్రభుత్వం విడుదల జారీచేసిన పట్టిక

జీవో 41 ప్రకారం భూ కేటాయింపులు ఇలా..

ప్రాజెక్టు	సగటు పెట్టుబడి	కేటాయించే భూమి
3 స్టార్ హోటల్	రూ.50 లక్షలు	3 ఎకరాల వరకు
4 స్టార్/అప్పర్ అప్‌స్కేల్	రూ.75లక్షలకు పైగా	4 ఎకరాల వరకు
5 స్టార్/లగ్జరీ	రూ.కోటికిపైగా	5 ఎకరాలు వరకు
రిసార్టు (కొండలు, అటవీ, బీచ్)	రూ.50 లక్షలు	5-15ఎకరాలు
ఎంఐసీఈ/కన్వెన్షన్ హాల్	హోటల్ కేటగిరీని బట్టి భూ కేటాయింపు కన్వెన్షన్ హాల్‌లో ఒక్కో సీటుకు రూ.1-1.5లక్షల వరకు పెట్టుబడి	4-10 ఎకరాలు
మార్క్యూ/అల్ట్రామెగా	ప్రాజెక్టును బట్టి పెట్టుబడి పరిశీలన	పెట్టుబడిదారు కోరిన మేరకు భూమి కేటాయింపు

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
శనివారం ॥ 8-11-2025

“మనకు వచ్చే ఆలోచనల గురించి ఆలోచించడమే... మెటాకాగ్నిషన్. ఒక ముక్కలో చెప్పాలంటే సెల్ఫ్-అబ్సర్‌వేషన్. సవ్యంగా ఆలోచించేలా, సరియైన నిర్ణయాలు తీసుకునేలా ఇది మనకు ఉపకరిస్తుంది. లోపాలను ఎప్పటికప్పుడూ విశ్లేషించుకోవడం, సెల్ఫ్-టాక్ ద్వారా మెటాకాగ్నిషన్‌ను మెరుగుపరుచుకోవచ్చు.”

తల్లి మీరా నాయర్‌తో జొహ్రాన్ మమ్దానీ

• న్యూస్‌మేకర్

ప్రతి పురుషుడి విజయం వెనుకా ఒక అమ్మ ఉంటుంది. న్యూయార్క్ మేయర్‌గా గెలిచి చరిత్ర సృష్టించిన జొహ్రాన్ మమ్దానీ తన ఆలోచనా విధానం, వ్యక్తిత్వం ద్వారానే ఓటర్లను ఆకట్టుకున్నాడు. ‘మా అమ్మ మీరా నాయర్ సినిమాలే నా ఆలోచనలను తీర్చిదిద్దాయి’ అన్నారాయన. మీరా నాయర్ ప్రపంచ సినిమాలో భారతీయ ప్రతిభను చాటిన దర్శకురాలు.

అమ్మ సినిమాలు వాస్తవం తెలిపాయి

‘ఢిల్లీకి రాజైనా అమ్మకు కొడుకే’ అంటుంటారు. ఇప్పుడు కాస్త మార్చి ‘న్యూయార్క్‌కు మేయర్ అయినా..అమ్మకు కొడుకే’ అనాలేమో. అవును! 400 ఏళ్ల చరిత్ర ఉన్న న్యూయార్క్ మహా నగరానికి మేయర్‌గా ఎన్నికైన దక్షిణాసియా తొలి వ్యక్తిగా జొహ్రాన్ మమ్దానీ (34) తాను వార్తలలో ఉండటమే కాదు తల్లి మీరా నాయర్‌ను కూడా వార్తలలోకి ఎక్కించారు. మేయర్‌గా గెలిచినందుకు మమ్దానీ ఎంత గర్వపడుతున్నారో అతణ్ణి చూసి మీరా నాయర్ కూడా అంతే గర్వపడుతున్నారు. మమ్దానీ కోసం ఆమె స్వయంగా ప్రచారం చేశారు కూడా. సంచలన సినీ దర్శకురాలిగా పేరు తెచ్చుకుని ఆస్కార్‌కు నామినేట్ అయిన మీరా ప్రత్యక్షంగా పరోక్షంగా కుమారుణ్ణి ప్రభావితం చేశారు. ప్రత్యక్షంగా పెంపకం ద్వారా అయితే పరోక్షంగా తన సినిమాల ద్వారా.

‘ఎల్ల లోకము ఒక్క ఇల్లై’

న్యూయార్క్ మేయర్ ఎలక్షన్ ప్రచారం మొదలైనప్పుడు గెలుపు అవకాశం ఉన్న వ్యక్తుల జాబితాలో పదవ స్థానంలో ఉన్న మమ్దానీ ఒకటవ స్థానానికి ఎగబాకి విజయం సాధించడం సినిమాటిక్‌గా అనిపించవచ్చు. కాని అతని గెలుపు సినిమాటిక్ కాదు. మమ్దాని ఇచ్చిన నినాదం ‘న్యూయార్క్ వలసవాదుల నగరంగానే ఉంటుంది’ అనేది యాదృచ్ఛికంగా రాలేదు. తల్లి మీరా నాయర్ సినిమాల ప్రభావంతో అంది పుచ్చుకున్నది. మీరా నాయర్ తీసిన ‘సలాం బాంబే’, ‘మిసిసిపి మసాలా’ పరాయి దేశాల్లో, పరాయి నగరాల్లో తమ స్థాయి, స్థానం కోసం పెనుగులాడే వలసజీవుల కథలు. ‘మీరు మావాళ్లు కాదు వెళ్లిపోండి’ అంటే మానవ పరిణామక్రమం, వలసతో వికసించిన నాగరికతలను నిరాకరించడమే. అందుకే మమ్దాని వలసవాదుల కోసం గట్టిగా నిలబడ్డారు. అలాగే నగరంలో సగటు వ్యక్తి జీవించగలిగేలా, అన్ని సంస్కృతులను ఇనుమడించేలా చూస్తానని మమ్దాని హామీ ఇవ్వడం మీరా నాయర్ ప్రభావమే. యువకుడిగా ఉన్నప్పుడు ఆమె సినిమా సెట్‌లలో పని చేసేవారు మమ్దాని. స్వతహాగా అతను రాప్ సింగర్ కూడా.

తల్లి మీరా నాయర్, తండ్రి మహబూబ్ మమ్దానీలతో జొహ్రాన్ మమ్దానీ

వాస్తవ ప్రపంచం

‘అమ్మ సినిమాలు చూడటం అంటే వాస్తవ ప్రపంచంలో ఉండటమే’ అంటారు మమ్దాని. వాస్తవికవాద సినిమాలనే మీరానాయర్ తీశారు. ఆమె తీసిన ‘మాన్‌సూన్ వెడ్డింగ్’ భారతీయ సంపన్న కుటుంబాల్లో చోటు చేసుకుంటున్న బోలుతనాన్ని చూపితే, ‘నేమ్‌సేక్’ వలస జీవనంతో భారతీయులు తమ సాంస్కృతిక అస్తిత్వం కోసం చేసే అన్వేషణను చూపుతుంది. మీరా చిత్రాల్లో స్త్రీవాదం ఉంటుంది. అయితే ఆమె మహిళా కథానాయకులు బాధితులు కారు, ఆ బాధల్లోంచి బయటపడాలని భావించేవారు, అందుకు తగ్గ పోరాటాలు చేసేవారు. ఇప్పుడు మమ్దాని ఏ న్యూయార్క్ నగరానికైతే మేయర్ అయ్యారో అదే నగరంపై జరిగిన 9/11 దాడి నేపథ్యంలో మీరానాయర్ ‘ది రిలక్టెంట్ ఫండమెంటలిస్ట్’ సినిమా తీశారు. తల్లికి ఉన్న ఈ బలమైన దృష్టికోణం, వ్యక్తిత్వం, సత్యం వైపు నిలబడే ధీమత్వం తనకు దిశా నిర్దేశం చేసిందంటారు మమ్దాని. తండ్రి మహమూద్ మమ్దానీ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ మాత్రమే కాదు సామ్రాజ్యవాద రాజకీయాల నిపుణుడు కావడం జొహ్రాన్ మమ్దానీకి లాభించింది.

మమ్దాని సలహా- మీరా ‘ది నేమ్‌సేక్’

తన జీవితంలోని అతి ముఖ్యమైన నిర్ణయాల్లో తన కుమారుడి సలహా ఉందని మీరా నాయర్ అంటారు. అందుకు ఒక ఉదాహరణ చెబుతారు. ‘ది నేమ్‌సేక్’ సినిమా తీద్దామనుకుంటున్న సమయంలో ‘హ్యారీ పోటర్-4’కు దర్శకత్వం వహించే అవకాశం మీరాకు వచ్చింది. వార్నర్ బ్రదర్స్ సంస్థ నుంచి వచ్చిన ఆఫర్, ప్రపంచ ప్రఖ్యాత నవల, బోలెడంత డబ్బు, పేరు. కానీ అప్పటికే ‘ది నేమ్‌సేక్’ పనుల్లో ఆమె నిమగ్నమయ్యారు. ఆ సమయంలో మమ్దానీకి 14 ఏళ్లు. ఇప్పుడేం చేయాలని కొడుకును అడగ్గా, ’అమ్మా! హ్యారీ పోటర్ తీయడానికి చాలామంది దర్శకులున్నారు. కానీ ‘ది నేమ్‌సేక్’ సినిమా నువ్వే తీయగలవు’ అని చెప్పాడు. అది చాలా స్వేచ్ఛాయుతమైన, స్పష్టమైన ప్రకటన అని, అందుకే తాను ‘హ్యారీపోటర్’ అవకాశం వదులుకున్నానని ఆమె వివరించారు.

‘నేను ముగింపును నమ్మను, ప్రారంభాలను నమ్ముతాను.’ అంటారు మీరా నాయర్. ఆ లెక్కన మమ్దానీకి ఇది ప్రారంభం. మేయర్‌గా ఆయన ఎదుర్కోవాల్సిన సమస్యలు బోలెడున్నాయి. ఎల్లప్పుడూ తల్లి పంచే స్ఫూర్తి ఆయనకు తోడుగా ఉంటుంది.

ఏఐలో మహిళలకు బ్రైట్ ఫ్యూచర్

• రిపోర్ట్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించిన శ్రామిక శక్తిలో ఇప్పుడు అయిదుగురిలో ఒకరు మాత్రమే మహిళ ఉన్నారని, 2027 నాటికి మహిళల సంఖ్య గణనీయంగానే కాదు, ఘననీయంగానూ పెరగనుందని చెబుతోంది వెంచర్ క్యాపిటల్ సంస్థ కలరి క్యాపిటల్ తాజా నివేదిక. ఏఐ, ఎంఎల్ (మెషిన్ లెర్నింగ్)కు సంబంధించి మన దేశంలో 84,000 మహిళలు పనిచేస్తున్నారని, 2027 నాటికి వారి సంఖ్య 3.4 లక్షలకు చేరవచ్చు అని అంచనా వేస్తోంది కలరి రిపోర్ట్. ఏఐ ఎడ్యుకేషన్ మరింత ఎక్కువ మందికి అందుబాటులోకి రావడం, ఎక్కువగా అవకాశాలు అందుబాటులోకి రావడం... మొదలైన కారణాల వల్ల ఏఐ రంగంలో మహిళల సంఖ్య పెరుగుతుందని అంచనా వేసింది ఆ రిపోర్ట్.

‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది పురుష ఉద్యోగుల కోసం మాత్రమే అన్నట్లుగా ఉండకూడదు. ఈ రంగంలో స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు ఉన్నప్పుడే వైవిధ్యం కనిపిస్తుంది. ఏఐ నిర్మాణంలో అందరి భాగస్వామ్యం ఉంటే పక్షపాతం కనిపించదు. వైవిధ్యమైన, ప్రభావంతమైన ఏఐ భవిష్యత్ కోసం స్త్రీ, పురుషుల సమానభాగస్వామ్యం ఉండాలి’ అంటుంది ఒపెన్ఏఐ కంపెనీ పాలసీ అండ్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ ప్రగ్యా మిశ్రా. ప్రపంచవ్యాప్తంగా స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం)కి సంబంధించి మన దేశంలో మహిళలు ముందంజలో ఉన్నారని నివేదిక పేర్కొంది. అయితే కంప్యూటర్ సైన్స్, ఏఐలాంటి క్లిష్టమైన విభాగాలలో పరిస్థితి వేరే విధంగా ఉంది. ఐఐటీ విద్యార్థులలో మహిళలు 15 శాతం మంది మాత్రమే ఉన్నారు. స్టార్టప్ ప్రపంచంలో కూడా లింగ అంతరం స్పష్టంగా కనిపిస్తుంది. మన దేశంలోని ఏఐ స్టార్టప్‌లలో ఉమెన్ ఫౌండర్స్ పది శాతం మాత్రమే ఉన్నారు. దేశంలో అత్యధికంగా నిధులు సమకూర్చుకున్న 24 ఏఐ స్టార్టప్‌లలో ఏ ఒక్కదానిలో ఉమెన్ ఫౌండర్ లేరు.

అయితే, ఆశారేఖలాంటి విషయం ఏమిటంటే జనరేటివ్ ఏఐ కోర్సులలో మహిళల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. టెక్ రంగంలో యువతులకు ఏఐ, ఎంఎల్ టాప్ కెరీర్ ఆప్షన్‌గా మారింది.

‘మన దేశంలోని మహిళలు యూజర్ల స్థాయి నుండి ఏఐ రూపకర్తల స్థాయికి చేరుకోవడానికి ఎన్నో ద్వారాలు తెరవాలి. బాలికలకు పాఠశాల స్థాయి నుంచే ఏఐకి సంబంధించిన ప్రాథమిక జ్ఞానాన్ని అందించాలి. మహిళల నేతృత్వంలోని ఏఐ పరిశోధన సంస్థలు, స్టార్టప్‌లకు తగిన నిధులు సమకూర్చాలి’ అంటుంది మైక్రోసాఫ్ట్ సీనియర్ ప్రిన్సిపల్ రిసెర్చర్ కలిక బాలి.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) నవంబర్ 7న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,21,510	బంగారం (24 క్యారెట్లు)	1,23,,530	బంగారం (24 క్యారెట్లు)	1,22,020	బంగారం (24 క్యారెట్లు)	1,24,140	బంగారం (24 క్యారెట్లు)	1,21,600	బంగారం (24 క్యారెట్లు)	1,22,940
బంగారం (22 క్యారెట్లు)	1,10,750	బంగారం (22 క్యారెట్లు)	1,12,250	బంగారం (22 క్యారెట్లు)	1,11,850	బంగారం (22 క్యారెట్లు)	1,15,200	బంగారం (22 క్యారెట్లు)	1,11,870	బంగారం (22 క్యారెట్లు)	1,12,700
వెండి	1,53,000	వెండి	1,48,200	వెండి	1,65,000	వెండి	1,51,800	వెండి	1,52,500	వెండి	1,65,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

ఇఫీకి సంక్రాంతికి వస్తున్నాం... తుడరుమ్

• ఇండియన్ పనోరమాకి ఎంపిక

సంక్రాంతి పండగ సందర్భంగా కావాల్సినంత వినోదాన్ని ప్రేక్షకులకు అందించి, బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ‘సంక్రాంతికి వస్తున్నాం’ చిత్రానికి అరుదైన ఘనత దక్కింది. ఈ నెల 20 నుంచి 28 వరకూ గోవా వేదికగా జరగనున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో (ఇఫీ) ఇండియన్ పనోరమా విభాగంలో ‘సంక్రాంతికి వస్తున్నాం’ ప్రదర్శనకు ఎంపికైంది. అలాగే ‘కమిటీ కుర్రోళ్లు’కి గాను దర్శకుడు యదు వంశీకి ఉత్తమ నూతన దర్శకుల విభాగంలో నామినేషన్ దక్కింది. మరోవైపు మలయాళం నుంచి ‘తుడరుమ్’ కూడా ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శనకు ఎంపికైంది. ఇంకా పలు భాషలకు సంబంధించిన చిత్రాలను, నామినేషన్ దక్కించుకున్నవారినీ శుక్రవారం ‘ఇఫీ’ ప్రకటించింది.

‘సంక్రాంతికి వస్తున్నాం’కి మరో మైలు రాయి

వెంకటేశ్, ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి లీడ్ రోల్స్‌లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో ‘దిల్’ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన చిత్రం ‘సంక్రాంతికి వస్తున్నాం’. జనవరి 14న విడుదలైన ఈ యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కి మంచి ఆదరణ లభించింది. గోవాలో జరగనున్న ‘ఇఫీ’కి ఈ చిత్రం ఎంపిక కావడం పట్ల చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ‘‘ఇండియన్ పనోరమా విభాగానికి మా ‘సంక్రాంతికి వస్తున్నాం’ అధికారికంగా ఎంపికైంది. ప్రాంతీయ చిత్రాలకు ఒక కొత్త ప్రమాణాన్ని నిర్దేశించిన చిత్రానికి (సంక్రాంతికి వస్తున్నాం) సంబంధించిన మరో గొప్ప మైలు రాయి ఇది’’ అని నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది.

యదు వంశీకి చోటు దక్కడం ఆనందం

నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన చిత్రం ‘కమిటీ కుర్రోళ్లు’. నూతన నటీనటులతో యదు వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ రూపొందించిన ఈ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. సందీప్ సరోజ్, త్రినాథ్ వర్మ, పి. సాయికుమార్, గోపరాజు రమణ, రాధ్య, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేశ్ కుమార్ పరిమి, యశ్వంత్ పెండ్యాల కీలక పాత్రల్లో నటించారు. ‘‘మన సంస్కృతి, సంప్రదాయాలకు, విలువలకు అద్దం పట్టే కంటెంట్‌తో రూపొందించిన మా ‘కమిటీ కుర్రోళ్లు’ దర్శకుడు యదు వంశీకి ‘ఇఫీ’లో చోటు దక్కడం హ్యాపీగా ఉంది’’ అని చిత్రబృందం పేర్కొంది.

‘వృషభ’ ఎంపిక ఓ గౌరవం

మోహన్‌లాల్, శోభన లీడ్ రోల్స్‌లో నటించిన మలయాళ యాక్షన్ ఎమోషనల్ థ్రిల్లర్ ‘తుడరుమ్’ చిత్రం కూడా ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శనకు ఎంపికైంది. ‘‘మా ‘తుడరుమ్’ అధికారికంగా ఎంపికైందనే వార్తను మీ అందరితో పంచుకోవడం ఆనందంగా, గౌరవంగా ఉంది. ఈ గుర్తింపు దక్కేలా చేసినందుకు అందరికీ థ్యాంక్స్’’ అని సోషల్ మీడియా వేదికగా మోహన్ లాల్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. తరుణ్ మూర్తి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఎం. రంజిత్ నిర్మించారు.

నా ఒళ్లంతా ఆడిందే తైతక్కా!

• జాన్వీ కపూర్, రామ్‌చరణ్

‘చికిరి చికిరి...’ అంటూ హుషారైన స్టెప్పులేశారు రామ్‌చరణ్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘పెద్ది’. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘చికిరి చికిరి...’ అంటూ సాగే తొలి లిరికల్ వీడియో సాంగ్‌ని శుక్రవారం విడుదల చేశారు. ‘చికిరి చికిరి... నా ఒళ్లంతా ఆడిందే తైతక్కా...’ అంటూ ఈ పాట సాగుతుంది. బాలాజీ సాహిత్యం అందించిన ఈ పాటని మోహిత్ చౌహాన్ పాడగా, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ‘‘ఫోక్ ఎనర్జీ, మోడ్రన్ బీట్స్‌తో ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేసిన ఈ పాట అదిరిపోతుంది. రామ్‌చరణ్ రాకింగ్ డ్యాన్స్ మూమెంట్స్, హుక్ స్టెప్స్, జాన్వీ కపూర్ గ్రేస్, చార్మ్ అద్భుతంగా ఉంటాయి’’ అని చిత్రయూనిట్ తెలిపింది.

కరడుగట్టిన కుంభ

• పృథ్వీరాజ్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం ‘ఎస్ఎస్ఎమ్‌బీ 29’ (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమా గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్‌ని ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రంలో కుంభ అనే ప్రతినాయకుడి పాత్రను పృథ్వీరాజ్ సుకుమారన్ పోషిస్తున్నట్లు శుక్రవారం చిత్రయూనిట్ ప్రకటించి, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేసింది. ‘‘ఏమాత్రం దయాదాక్షిణ్యం లేని, కరడుగట్టిన కమాండింగ్ ప్రతినాయకుడు కుంభ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. వరల్డ్ ఆఫ్ గ్లోబ్ ట్రాటర్ నుంచి ఫస్ట్ ఎసెట్ కింద ఈ ఫస్ట్ లుక్‌ని రివీల్ చేశాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ‘‘హైదరాబాద్‌లో వేసిన సెట్లో ప్రధాన తారాగణంపై ప్రస్తుతం పతాక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. మరోవైపు నవంబరు 15న ‘గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్’కి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాం’’ అని రాజమౌళి పోస్ట్ చేశారు.

కొత్త వెలుగు వచ్చింది

• కత్రినా, విక్కీ

బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ తల్లిదండ్రులయ్యారు. శుక్రవారం మగబిడ్డకు జన్మనిచ్చారు కత్రినా కైఫ్. ఈ సంతోషకరమైన విషయాన్ని తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు విక్కీ కౌశల్. ‘‘మా ప్రేమకు ప్రతిరూపంగా బాబు జన్మించాడు. చాలా ఆనందంగా ఉంది. తన రాకతో మా జీవితాల్లో కొత్త వెలుగు వచ్చింది. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి’’ అంటూ విక్కీ కౌశల్ పోస్ట్ చేశారు. ఇదిలా ఉంటే... కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ 2021 డిసెంబర్ 9న రాజస్థాన్‌లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.

హంట్ మోడ్ ఆన్

ప్రముఖ నటుడు కమల్‌హాసన్ బర్త్ డే (నవంబరు 7) సందర్భంగా కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ఈ సినిమా ద్వారా స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్ (అన్బు మణి, అరివు మణి) దర్శకులుగా పరిచయం కానున్నారు. ‘కేహెచ్ఏఏ’ వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని ‘హంట్ మోడ్ ఆన్’ అనే ట్యాగ్‌లైన్‌తో ప్రకటించారు. ఈ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు ఆర్. మహేంద్రన్‌తో కలిసి కమల్‌హాసన్ నిర్మించనున్నారు. ఇది హై ఓల్టేజ్ యాక్షన్ మూవీ అని టాక్.

• అన్బరివ్‌తో కమల్‌హాసన్

మహిళలు భావోద్వేగానికి గురవుతున్నారు

- అల్లు అరవింద్

• దీక్షిత్, అల్లు అరవింద్, రాహుల్ రవీంద్రన్, ధీరజ్

‘‘ది గర్ల్ ఫ్రెండ్’ చిత్రానికి కలెక్షన్స్‌పెరుగుతున్నాయి. మా సినిమా చూసి, మహిళలు భావోద్వేగానికి గురవుతున్నారు. ఇది చాలు కదా అనిపించింది. మా మూవీ విజయానికి మొదటి కారణం దర్శకుడే. రష్మిక, దీక్షిత్ ఏ వంకా పెట్టలేనంత అద్భుతంగా నటించారు’’ అని నిర్మాత అల్లు అరవింద్ చెప్పారు. రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘ది గర్ల్ ఫ్రెండ్’. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ– ‘‘మా సినిమా బాగుందంటూ చాలా మంది రివ్యూలు పంపుతున్నారు’’ అని తెలిపారు. ‘‘మా మూవీ ప్రీమియర్ షో అయ్యాక బయటకు వస్తున్న వారి కళ్లల్లో నీరు చూశాను. ఈ విజయం సంతృప్తినిచ్చింది’’ అన్నారు ధీరజ్ మొగిలినేని. ‘‘మా సినిమాకి మహిళల నుంచి వస్తున్న స్పందన చూశాక దర్శకుడిగా నేను మరో సినిమా చేయకున్నా ఫర్వాలేదు అనేంత సంతృప్తి కలిగింది’’ అని రాహుల్ పేర్కొన్నారు. ‘‘మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన సంతోషాన్నిస్తోంది’’ అని విద్య కొప్పినీడి అన్నారు.

నవ్వుల విందుకి శ్రీకారం

• సత్య, రితేష్ రానా

‘మత్తు వదలరా’ మూవీ ఫేమ్ రితేష్ రానా దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. ఈ చిత్రంలో హాస్య నటుడు సత్య హీరోగా, మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ (నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి) సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ‘‘ఈ సినిమా ప్రేక్షకులకు మరో నవ్వుల విందును అందిస్తుంది’’ అని యూనిట్ తెలిపింది. ‘వెన్నెల’ కిశోర్, అజయ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాల భైరవ, కెమెరా: సురేష్ సారంగం.

అందమైన ప్రయాణం

• దీప్సిక

దీప్సిక, సూర్య వశిష్ట ప్రధాన పాత్రల్లో విజయ్ ఆదిరెడ్డి స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం ‘రమణి కళ్యాణం’. ‘కోర్ట్’ వంటి బ్లాక్ బస్టర్ చిత్రానికి దర్శకత్వం వహించిన రామ్ జగదీష్ ఈ చిత్రానికి డైలాగ్స్, స్క్రీన్ ప్లే అందించడం విశేషం. ఈ చిత్రం టైటిల్ లుక్‌ని కిరణ్ అబ్బవరం, వశిష్ట, విజయ్ ఆంటోని, జీవీ ప్రకాశ్‌కుమార్ తదితర ప్రముఖులు ఆవిష్కరించి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు. ‘‘జీవితంలో ఎదురయ్యే సవాళ్ల మధ్య ప్రేమ, విలువలు, బలమైన భావోద్వేగాలతో సాగే అందమైన ప్రయాణంగా ఈ చిత్రం ఉంటుంది’’ అని చిత్రబృందం పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
95	17
83,216	25,492

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,699	▽	355
డోజోన్స్	46,573	▽	339
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,676	▽	59
డాక్స్	23,536	▽	198
షాంఘై	3,998	▽	10
నికాయ్	50,276	▽	607

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.97	117.92
€	యూరో	ఎస్‌బీఐ	101.01	103.79
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.11	58.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.54	59.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.59	69.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.71	24.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.19	24.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.56	13.39

ఎలాన్ మస్క్‌కు లక్ష కోట్ల డాలర్ల ప్యాకేజీ

- ఆమోదించిన టెస్లా షేర్‌హోల్డర్లు
- కార్పొరేట్ చరిత్రలోనే అత్యధికం

న్యూఢిల్లీ: కార్పొరేట్ చరిత్రలోనే కనీవిని ఎరుగని భారీ ప్యాకేజీని అమెరికన్ ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అందుకోనున్నారు. ఇందుకు సంబంధించి దాదాపు 1 లక్ష కోట్ల (ట్రిలియన్) డాలర్ల ప్యాకేజీకి టెస్లా షేర్‌హోల్డర్లు ఆమోదముద్ర వేశారు. దీని ప్రకారం వచ్చే దశాబ్ద కాలంలో 2 కోట్ల వాహనాలను డెలివరి చేయాలి. 10 లక్షల రోబోట్యాక్సీలను వినియోగంలోకి తేవాలి. 10 లక్షల రోబోలను విక్రయించాలి. 400 బిలియన్ డాలర్ల లాభాలు చూపించాలి. ఇదే సమయంలో టెస్లా మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రస్తుతమున్న 1.5 ట్రిలియన్ డాలర్ల నుంచి ముందుగా 2 ట్రిలియన్ డాలర్లకు, ఆ తర్వాత క్రమంగా 8.5 ట్రిలియన్ డాలర్లకు చేరాలి. ఒక్కో లక్ష్యం, వేల్యుయేషన్ మైలురాయిని అధిగమించే కొద్దీ 1 శాతం స్టాక్.. మస్క్‌కి దక్కుతుంది. అన్ని టార్గెట్‌లను చేరుకుంటే అప్పటికి ఆయనకు మొత్తం 12 శాతం వాటా లభిస్తుంది. ఒకవేళ చేరుకోకపోయినా బిలియన్ల కొద్దీ డాలర్ల మేర లబ్ధి చేకూరుతుంది. అయితే 1 ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ అయినప్పటికీ, డీల్ స్వరూపరీత్యా ఆయనకు దక్కే షేర్ల విలువ వాస్తవానికి 878 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. ఇప్పటికే కంపెనీలో ఆయనకున్న వాటాలను కూడా పరిగణనలోకి తీసుకోవడమే ఇందుకు కారణం. పే ప్యాకేజీ మీద కన్నా తనకు టెస్లాలో ఓటింగ్ హక్కులను పెంచుకోవడంపైనే ఎక్కువ ఆసక్తిగా ఉన్నట్లు ఎలాన్ మస్క్ తెలిపారు.

ప్రపంచ టాప్ 10లో 3 భారతీయ బ్యాంకులు!

- లిస్టులో ఎస్‌బీఐ, మరో రెండు ప్రైవేట్ బ్యాంకులు
- 2030 నాటికి సాధ్యమే: ఎస్‌బీఐ చీఫ్ శెట్టి వెల్లడి

ముంబై: మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా 2030 నాటికి అంతర్జాతీయంగా టాప్ 10 బ్యాంకుల్లో మూడు భారతీయ బ్యాంకులు ఉంటాయని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి చెప్పారు. ప్రభుత్వ రంగ దిగ్గజమైన తమ బ్యాంకుతో పాటు మరో రెండు ప్రైవేట్ బ్యాంకులు వీటిలో ఉంటాయని వివరించారు. ఎస్‌బీఐ మార్కెట్ క్యాప్ 100 బిలియన్ డాలర్ల స్థాయిని తాకిందని, అలాగే ప్రైవేట్ రంగంలోనూ మరో రెండు బ్యాంకుల వేల్యుయేషన్ భారీ స్థాయిలో ఉందని చెప్పారు. నిర్దిష్టంగా పేర్లు ప్రస్తావించనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌ని ఉద్దేశించి శెట్టి ఈ విషయం చెప్పారని భావిస్తున్నారు. కన్సాలిడేషన్ ద్వారా భారీ బ్యాంకులను సృష్టించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వ్యాపార పరిమాణంపరంగా ఎస్‌బీఐ ప్రస్తుతం అంతర్జాతీయంగా 43వ స్థానంలో ఉంది. ఎస్‌బీఐలో చేరేందుకు ఇంజినీర్ గ్రాడ్యుయేట్లు బాగా ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో సిబ్బందికి టెక్నాలజీ శిక్షణకు వెచ్చించే సమయం గణనీయంగా తగ్గుతోందని ఆయన పేర్కొన్నారు.

అందుకే నిబంధనలు సరళతరం: ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

అప్రమత్తంగా ముందుకెళ్తూనే, కొంత సాహసోపేతంగా వ్యవహరించాల్సిన అవసరం నెలకొన్నందునే బ్యాంకింగ్ నిబంధనలను సరళతరం చేసినట్లు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ప్రతి చిన్న విషయాన్ని పర్యవేక్షించడం ఆర్‌బీఐ ఉద్దేశం కాదన్నారు. పని తీరు, గవర్నెన్స్‌ను మెరుగుపర్చుకోవడం వల్లే బ్యాంకులకు మరింతగా బాధ్యతలను అప్పగిస్తున్నట్లు మల్హోత్రా చెప్పారు. తప్పుగా వ్యవహరిస్తే కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ దగ్గర అనేక సాధనాలు ఉన్నాయన్నారు. స్వల్పకాలిక వృద్ధి వెనుక పరుగులు తీస్తూ ఆర్థిక స్థిరత్వం విషయంలో రాజీ పడితే, దీర్ఘకాలిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. రెగ్యులేటర్ పాత్రనేది తోటమాలిలాగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. మొక్కల (బ్యాంకింగ్ వ్యవస్థ) పెరుగుదలను పర్యవేక్షిస్తూనే, అనవసరమైన వాటిని కత్తిరిస్తూ, ఉద్యానవనం ఒక పద్ధతిగా, అందంగా ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సెంట్రల్ బ్యాంకుపై ఉంటుందని మల్హోత్రా పేర్కొన్నారు.

డిజిటల్ మోసాలు పెరిగాయ్
ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి. రవిశంకర్

ఈ ఏడాది జూలై వరకు కొంత నెమ్మదించిన డిజిటల్ మోసాలు, ఆ తర్వాత నుంచి గణనీయంగా పెరుగుతున్నాయని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి. రవిశంకర్ తెలిపారు. బహుశా సీజనల్ లేదా ఇతరత్రా అంశాలేవైనా ఇందుకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. ఏదేమైనా మోసాల పెరుగుదల వెనుక కారణాలను ఆర్‌బీఐ పరిశీలిస్తోందన్నారు. ఫ్రాడ్ ద్వారా వచ్చే డబ్బును మళ్లించేందుకు ఉపయోగిస్తున్న అకౌంట్లను గుర్తించేందుకు మ్యూల్ హంటర్‌లాంటి డిజిటల్ మౌలిక సదుపాయాలను ఉపయోగిస్తోందని రవిశంకర్ వివరించారు. మరోవైపు, చెల్లింపుల వ్యవస్థ విషయానికొస్తే కొన్ని పరిమితులరీత్యా యూపీఐ సామర్థ్యాలను బ్యాంకులు అంచనా వేయలేకపోయాయని, కానీ ఫిన్‌టెక్ సంస్థలు మాత్రం అవకాశాలను అందిపుచ్చుకున్నాయని చెప్పారు.

బజాజ్ ఆటో లాభం హైజంప్

క్యూ2లో రూ. 2,122 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 53 శాతం జంప్‌చేసి రూ. 2,122 కోట్లను తాకింది. ఎగుమతి మార్కెట్ల అమ్మకాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 1,385 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,247 కోట్ల నుంచి రూ. 15,735 కోట్లకు ఎగసింది. వాహన అమ్మకాలు 6 శాతం పుంజుకుని 12,94,120 యూనిట్లకు చేరాయి. గత క్యూ2లో 12,21,504 యూనిట్లను విక్రయించింది. వీటిలో దేశీ అమ్మకాలు 5 శాతం క్షీణించి 7,40,793 యూనిట్లకు పరిమితంకాగా.. ఎగుమతులు 24 శాతం ఎగసి 5,53,327 యూనిట్లను తాకాయి. జీఎస్‌టీ రేట్ల ప్రతిపాదనలతో అమ్మకాలు నీరసించినప్పటికీ తదుపరి బలంగా పుంజుకున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ పేర్కొన్నారు. సమీక్షా కాలంలో అన్ని బిజినెస్ యూనిట్లు పటిష్ట పనితీరు ప్రదర్శించినట్లు తెలియజేశారు. అయితే ఈవీల విషయంలో సరఫరా సవాళ్లు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ చివరికి వీటిని అధిగమించడంతో అక్టోబర్ నుంచి చేతక్‌సహా ఈవీ అమ్మకాలు ఊపందుకున్నట్లు వివరించారు.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు బీఎస్‌ఈలో స్వల్పంగా బలపడి రూ. 8,724 వద్ద ముగిసింది.

పతనం నుంచి కోలుకున్నా.. తప్పని నష్టాలు

- అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూలతలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం
- మూడోరోజూ సూచీలు వెనకడుగు

ముంబై: ఇంట్రాడే పతనం నుంచి కోలుకున్నా.., స్టాక్ సూచీలకు శుక్రవారం నష్టాల ముగింపు తప్పలేదు. ట్రేడింగ్‌లో 640 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 95 పాయింట్ల స్వల్ప నష్టంతో 83,216 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17 పాయింట్లు నష్టపోయి 25,492 వద్ద నిలిచింది. రోజంతా 25,318 – 25,551 శ్రేణిలో ట్రేడైంది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, దేశీయ కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం వంటి అంశాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయమే నష్టాలతో మొదలైన సూచీలు ఆరంభంలోనే భారీగా పతనమయ్యాయి. కీలక మద్దతు స్థాయిల వద్ద కొనుగోళ్లు నెలకొనడంతో కోలుకోగలిగాయి. అయితే చివర్లో మరోసారి అమ్మకాలు తలెత్తడంతో సూచీలకు మూడో రోజూ నష్టాలు తప్పలేదు. ఆసియా, యూరప్ మార్కెట్లు 1% నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు అర శాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ, టెలికమ్యూనికేషన్, విద్యుత్, సర్వీసెస్ షేర్లు నష్టపోయాయి. మెటల్, ఫైనాన్సియల్ సర్వీసెస్, కమోడిటీస్, బ్యాంకులు, ఆటోమొబైల్ షేర్లు రాణించాయి.
- హెల్మెట్ల తయారీ కంపెనీ స్టడ్స్ యాక్సెసరీస్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర(రూ.585)తో పోలిస్తే బీఎస్‌ఈలో 2.5% డిస్కౌంటుతో రూ.570 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 5% పతనమై రూ.556 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 4% నష్టంతో రూ.560 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మరిన్ని సంస్కరణలు అవసరం: ప్రపంచ బ్యాంక్ | 42 రోజుల్లో 52 లక్షల వాహన విక్రయాలు

ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా విక్రయం

డీల్ విలువ రూ. 10,353 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌లో సింగపూర్‌లో లిస్టయిన సింగ్‌టెల్ 0.8 శాతం వాటా విక్రయించింది. ఒక్కో షేరుకి రూ. 2,030 ధరలో వాటా విక్రయించినట్లు సింగపూర్ ఎక్స్ఛేంజీ(ఎస్‌జీఎక్స్)కు సింగ్‌టెల్ వెల్లడించింది. సొంత అనుబంధ సంస్థ పాస్టెల్ ద్వారా 5.1 కోట్ల షేర్లను అమ్మివేసినట్లు పేర్కొంది. వీటి విలువ రూ. 10,353 కోట్లు(1.5 బిలియన్ సింగపూర్ డాలర్లు)కాగా.. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా సంస్థాగత ఇన్వెస్టర్లకు వాటా విక్రయాన్ని చేపట్టినట్లు తెలియజేసింది. దీంతో 1.1 బిలియన్ సింగపూర్ డాలర్లు(ఎస్‌జీడీ) లాభం ఆర్జించినట్లు అంచనా. దీంతో ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 27.5%కి దిగివచ్చింది. ఈ వాటా విలువ 51 బిలియన్ ఎస్‌జీడీ(రూ. 3.46 లక్షల కోట్లు).

ఎయిర్‌టెల్ షేరు 4.5% పతనమై రూ. 2,001 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు సునీల్ ఛెత్రి గుడ్‌బై

ఆసియా కప్–2027 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు టీమిండియా అర్హత సాధించడంలో విఫలం కావడంతో... భారత దిగ్గజం సునీల్ ఛెత్రి మళ్లీ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. గత ఏడాది జూన్‌లో సునీల్ ఛెత్రి తొలిసారి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు గుడ్‌బై చెప్పాడు. ఛెత్రి నిష్క్రమణ తర్వాత భారత జట్టు ప్రదర్శన తీసికట్టుగా మారింది. ఈ నేపథ్యంలో టీమిండియా అప్పటి హెడ్ కోచ్ మనోలో మార్కెజ్ అభ్యర్థన మేరకు ఈ ఏడాది సునీల్ ఛెత్రి రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని జాతీయ జట్టుకు అందుబాటులోకి వచ్చాడు. పునరాగమనం తర్వాత ఆరు మ్యాచ్‌లు ఆడిన ఛెత్రి ఒక్క గోల్ మాత్రమే చేశాడు. మరోవైపు ఆసియా కప్–2027 టోర్నీ బెర్త్ కూడా టీమిండియాకు దక్కలేదు. దాంతో న్యూఢిల్లీకి చెందిన 41 ఏళ్ల సునీల్ ఛెత్రి మరోసారి అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు. భారత్ తరఫున 157 మ్యాచ్‌లు ఆడిన సునీల్ ఛెత్రి 95 గోల్స్ సాధించాడు.



వాకిటి శ్రీహరి, అరుంధతి రెడ్డి

విజేతలకు స్వాగత సత్కారాలు

- స్వస్థలాలకు చేరిన భారత మహిళా క్రికెటర్లు
- మహారాష్ట్ర ప్లేయర్లు ఒక్కొక్కరికి రూ.2.25 కోట్లు

ముంబై: తొలిసారి వన్డే వరల్డ్ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించిన భారత మహిళా క్రికెటర్లపై ప్రశంసల వర్షం కొనసాగుతోంది. దేశ రాజధానిలో వరుసగా ప్రధాని, రాష్ట్రపతిలను కలిసిన తర్వాత శుక్రవారం ఈ ప్లేయర్లంతా తమ స్వస్థలాలకు చేరుకున్నారు. ఆయా నగరాల్లో ఘన స్వాగతాలు లభించడంతో పాటు నగదు ప్రోత్సాహకాల అందజేత కొనసాగుతోంది. టీమ్‌లో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు ప్లేయర్లు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రాధ యాదవ్ ఉన్నారు. టోర్నీ విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ ముగ్గురికి మహారాష్ట్ర ప్రభుత్వం తలా రూ.2.25 కోట్లు ప్రకటించింది. దీనికి సంబంధించిన చెక్‌లను శుక్రవారమే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ క్రికెటర్లకు అందజేశారు. ప్లేయర్లను చూస్తుంటే తమకు చాలా గర్వంగా ఉందని ఫడ్నవీస్ అన్నారు. మహారాష్ట్రకే చెందిన భారత హెడ్ కోచ్ అమోల్ మజుందార్‌కు కూడా ప్రభుత్వం రూ.22 లక్షల 50 వేల నగదు పురస్కారాన్ని అందించింది. టీమ్ సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్న అనిరుధ దేశ్‌పాండే, అపర్ణ గంబీర్‌రావు, మిహిర్ ఉపాధ్యాయ్, పూర్వ కాటే, మమత శిరురుల్లాలతో పాటు మాజీ క్రికెటర్ డయానా ఎడుల్జీలకు కూడా తలా రూ.11 లక్షలను సీఎం బహుమతిగా అందించారు. భారత జట్టులోని ఇతర సభ్యులు క్రాంతి గౌడ్ (మధ్యప్రదేశ్), అమన్‌జోత్ కౌర్, హర్లీన్ డియోల్ (పంజాబ్), రిచా ఘోష్ (బెంగాల్), అరుంధతి రెడ్డి (తెలంగాణ)లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఘన స్వాగతం పలికాయి. రిచా స్వస్థలం సిలిగురిలో ఓపెన్ టాప్ జీప్‌లో ఆమె విజయోత్సవ ర్యాలీని నిర్వహించగా... భోపాల్‌లో క్రాంతి గౌడ్‌ను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్... అరుంధతి రెడ్డిని తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి సత్కరించారు.

2029 మహిళల వన్డే వరల్డ్ కప్‌లో 10 జట్లు

దుబాయ్: తదుపరి మహిళల వన్డే వరల్డ్ కప్‌లో జట్ల సంఖ్యను 8 నుంచి 10కి పెంచాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ణయించింది. దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ సమావేశంలో పలు నిర్ణయాలు బోర్డు తీసుకుంది. ఐసీసీ లోని అసోసియేట్ దేశాలకు ఇచ్చే నిధులను 10 శాతం పెంచనున్నారు. అమెరికా క్రికెట్ బోర్డుపై నిషేధం ఉన్నా... దాని ప్రభావం ఆటగాళ్లపై పడరాదని భావిస్తూ మ్యాచ్‌ల నిర్వహణకు తగిన చర్యలు తీసుకునేందుకు కూడా ఐసీసీ సిద్ధమైంది. క్రికెట్ భాగంగా ఉన్న 2028 ఒలింపిక్స్ అమెరికాలో జరగనుండటం కూడా దీనికి కారణం. మరోవైపు ఐసీసీ మహిళల క్రికెట్ కమిటీలో భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌కు చోటు కల్పించారు. యాష్లీ డిసిల్వా, అమోల్ మజుందార్, చార్లెట్ ఎడ్వర్డ్స్, స్టెల్లా సియాలె ఈ కమిటీలో ఇతర సభ్యులుగా ఉన్నారు.

సిరీస్ విజయమే లక్ష్యంగా...

నేడు ఆస్ట్రేలియాతో భారత్ చివరి టి20

- ఒత్తిడిలో ఆతిథ్య జట్టు
- మధ్యాహ్నం గం. 1:45 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిస్బేన్: గత టి20 వరల్డ్ కప్ విజయం తర్వాత సూర్యకుమార్ యాదవ్ భారత టి20 జట్టు కెప్టెన్‌గా పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టాడు. అతని సారథ్యంలో ఆడిన నాలుగు ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచిన టీమిండియా... ఆసియా కప్‌ను కూడా సొంతం చేసుకుంది. ఇప్పుడు మరో సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు జట్టు సిద్ధమైంది. ఆస్ట్రేలియాతో ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు చివరిదైన ఐదో మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిస్తే భారత్ 3–1తో సిరీస్ గెలుచుకుంటుంది. ఒకవేళ ఓడినా సిరీస్ చేజారిపోయే ప్రమాదం ఉండదు. మరోవైపు ఆతిథ్య ఆస్ట్రేలియా మాత్రం తీవ్ర ఒత్తిడిలో ఉంది. స్వదేశంలో సిరీస్ కోల్పోరాదని ఆ జట్టు పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో ఆసీస్ శైలికి తగినట్లు చక్కటి బౌన్స్ ఉండే గాబా మైదానంలో ఆసక్తికర పోరు ఖాయం. మ్యాచ్ రోజు స్వల్ప వర్షసూచన ఉంది.

గిల్ సత్తా చాటేనా...

ఆసీస్ పర్యటనకు ముందు శుబ్‌మన్ గిల్ వన్డే, టి20 ఫామ్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిజంగానే అతను పూర్తి స్థాయిలో ఇక్కడ తడబడ్డాడు. రెండు ఫార్మాట్‌లలో ఏడు ఇన్నింగ్స్‌లు కలిపి ఒక్క అర్ధ సెంచరీ కూడా అతను నమోదు చేయలేకపోయాడు. ఇలాంటి స్థితిలో బాగా ఆడి ఘనంగా ముగింపు పలకాలని గిల్ భావిస్తున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ దూకుడును కొనసాగిస్తుండగా, సూర్యకుమార్ ఫామ్ కూడా అంతంత మాత్రమే. గత 18 ఇన్నింగ్స్‌లలో సూర్య ఒక్కసారి కూడా హాఫ్ సెంచరీ దాటలేదు. తిలక్ వర్మ కూడా తనదైన శైలిలో ఒక మంచి ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. గత మ్యాచ్‌లో భారత్ చక్కటి బౌలింగ్ ప్రదర్శనతో నెగ్గినా, మన బ్యాటింగ్ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. స్పిన్ బౌలింగ్ **ఆల్‌రౌండర్లు అక్షర్, సుందర్‌లతో పాటు దూబే రెండు విభాగాల్లోనూ మంచి ప్రదర్శన కనబర్చడం సానుకూలాంశం. మరో స్పిన్నర్ వరుణ్‌ను** ఎదుర్కోవడం ప్రత్యర్థిని మరోసారి కష్టంగా మారనుంది. వరుసగా రెండు విజయాలు అందించిన తుది జట్టులో టీమిండియా మార్పులు చేయకపోవచ్చు. అంతర్జాతీయ టి20ల్లో 100 వికెట్ల మైలురాయికి ఒకే ఒక వికెట్ దూరంలో ఉన్న స్టార్ బౌలర్ బుమ్రా చెలరేగితే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు.

బ్యాటింగ్ తడబాటు...

ప్రధాన ఆటగాళ్లు హేజల్‌వుడ్, హెడ్‌లాంటి వాళ్లు సిరీస్ మధ్యలో తప్పుకున్న తర్వాత ఆసీస్ జట్టులో పూర్తి తడబాటు కనిపిస్తోంది. ముఖ్యంగా భారత్ తరహాలో నెమ్మదైన పిచ్‌లు ఉన్న హోబర్ట్, కరారాలలో ఆ జట్టు బ్యాటర్లు పూర్తి చేతులెత్తేశారు. మన స్పిన్నర్లను ఎదుర్కోవడం ఎవరి వల్లా కావడం లేదు. ఫలితంగా తక్కువ స్కోర్లతో జట్టుకు పరాజయాలు ఎదురయ్యాయి. అభిమానులందరి దృష్టీ యాషెస్ సిరీస్‌పై ఉండటంతో ఈ టి20 సిరీస్ ఫలితం జట్టుకు పెద్దగా నష్టం కలిగించకపోవచ్చు కానీ వరుసగా మూడు టి20 మ్యాచ్‌లు ఓడటం టీమ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది. ఇలాంటి స్థితిలో కనీసం సిరీస్‌ను 'డ్రా'గానైనా ముగించాలని జట్టు కోరుకుంటోంది. మిచెల్ మార్ష్ ఒక్కడే బ్యాటింగ్‌లో నిలకడ కనబరుస్తుండగా, మిగతా వారంతా విఫలమయ్యారు. టాప్–4లో షార్ట్, ఇన్‌గ్లిస్, టిమ్ డేవిడ్ రాణిస్తే భారీ స్కోరు సాధ్యమవుతుంది. మ్యాక్స్‌వెల్ ఇక్కడైనా మెరుస్తాడేమో చూడాలి. జట్టు బౌలింగ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపిస్తోంది. భారత స్పిన్నర్లు చెలరేగిన చోట ఆడమ్ జంపా భారీగా పరుగులిస్తున్నాడు.

రికార్డు రేటింగ్స్...

ముంబై: మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీ వీక్షణ పరంగా డిజిటల్ వేదికపై సరికొత్త రికార్డు సృష్టించింది. ఏకంగా 446 మిలియన్ల మంది వీక్షకులు ఈ టోర్నీని జియో హాట్‌స్టార్‌లో చూసినట్లు ప్రసారకర్తలు వెల్లడించారు. ఇది మహిళల క్రికెట్‌లో అత్యధికమని పేర్కొంది. మరోవైపు భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ కూడా కొత్త రికార్డు నమోదు చేసింది. ఫైనల్‌ను 185 మిలియన్ల మంది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వీక్షించారని...2024 టి20 పురుషుల వరల్డ్ కప్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఫైనల్‌తో ఇది సమానమని నిర్వాహకులు ప్రకటించడం విశేషం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్రికెటర్ శ్రీచరణికి ఏపీ ప్రభుత్వం నజరానా

- రూ.2.5 కోట్ల నగదు పురస్కారం
- వెయ్యి చదరపు గజాల ఇంటి స్థలం
- గ్రూప్–1 ఉద్యోగం ఇవ్వనున్నట్లు సీఎం వెల్లడి

సాక్షి, అమరావతి: మహిళల వన్డే ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యురాలైన ఆంధ్రప్రదేశ్ క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 కోట్ల 50 లక్షల నగదు పురస్కారం ప్రకటించింది. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను శ్రీచరణితోపాటు భారత జట్టు మాజీ కెప్టెన్, ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) కన్సల్టెంట్ మిథాలీ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రపంచ వేదికపై భారత్ కీర్తిని చాటడంతోపాటు యావత్ తెలుగు ప్రజలు సగర్వంగా తలెత్తుకునేలా అద్భుత ప్రతిభ కనబరిచారని చంద్రబాబు శ్రీచరణిని అభినందించారు. ఆమెకు నగదు ప్రోత్సాహకంతో పాటు వైఎస్సార్ కడప జిల్లాలో వెయ్యి చదరపు గజాల్లో ఇంటి స్థలం... త్వరలో గ్రూప్–1 ఉద్యోగం కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో శ్రీచరణి పంచుకున్నారు. ఈ సందర్భంగా వరల్డ్‌కప్ విజేత భారత జట్టు సభ్యులు సంతకాలు చేసిన టీషర్ట్‌ను శ్రీచరణి సీఎంకు అందించారు.

అక్కడా మన వైద్యులే!

అభివృద్ధి చెందిన దేశాల్లోని వైద్య రంగంలో మన భారతీయ వైద్యులు, నర్సులు వెన్నెముకగా నిలిచారు. ఈ దేశాల్లో పనిచేస్తున్న వైద్యుల సంఖ్య పరంగా తొలి స్థానంలో, నర్సుల సంఖ్యలో రెండవ స్థానంలో నిలిచి భారత్ తన హవాను కొనసాగిస్తోంది.

ఓఈసీడీ సభ్య దేశాల్లో భారత డాక్టర్లదే హవా

నర్సుల సంఖ్యలో రెండవ స్థానంలో మనదేశం

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో భారతీయుల సత్తా ప్రపంచానికి తెలియనిది కాదు. ఒక్క ఐటీ నిపుణులే కాదు.. మన వైద్య నిపుణులకూ ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. అభివృద్ధి చెందిన దేశాల్లోని ఆరోగ్య వ్యవస్థలకు భారతీయ వైద్య నిపుణులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) విడుదల చేసిన ఇంటర్నేషనల్ మైగ్రేషన్ అవుట్‌లుక్–2025 నివేదిక వెల్లడించింది. అమెరికా, కెనడా, యూరోపియన్ దేశాలు, ఆస్ట్రేలియాతో సహా 38 ఓఈసీడీ సభ్య దేశాలు ఆరోగ్య సంరక్షణ సిబ్బంది కోసం ఇతర దేశాలపై ఆధారపడటం పెరుగుతోందని తెలిపింది.

మనమే టాప్

ఓఈసీడీ సభ్య దేశాల్లో ఇతర దేశాలకు చెందిన 8.30 లక్షల మంది వైద్యులు, 17.5 లక్షల మంది నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. 38 ఓఈసీడీ సభ్య దేశాల్లోని మొత్తం వైద్యుల్లో 25 శాతం, నర్సుల్లో ఆరింట ఒక వంతు ఇతర దేశాలకు చెందినవారు. వైద్యుల్లో 40%, నర్సుల్లో 37% మంది ఆసియాకు చెందినవారు కావడం విశేషం. ఓఈసీడీ దేశాల్లో సేవలు అందిస్తున్న వైద్యుల విషయంలో సంఖ్య పరంగా భారత్, జర్మనీ, చైనా టాప్–3లో నిలిచాయి. ఇక నర్సుల విషయంలో ఫిలిప్పీన్స్, భారత్, పోలాండ్ మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఐదుగురు వైద్యులు, నర్సులలో ఒకరు యూరోపియన్ ఎకనామిక్ ఏరియాకు (ఈఈఏ) చెందినవారు.

ఆ నాలుగు దేశాలే

విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, వృత్తిపరమైన ఉన్నత విద్యా కార్యక్రమాలలో 18 లక్షల నూతన విద్యార్థులకు 2024లో ఓఈసీడీ దేశాలు ఆతిథ్యం ఇచ్చాయి. యునైటెడ్ స్టేట్స్ 3.90 లక్షలు, యునైటెడ్ కింగ్‌డమ్ 3.84 లక్షల మంది విద్యార్థులకు అనుమతులను జారీచేసి అగ్రగామిగా నిలిచాయి. కెనడా 2.13 లక్షలు, ఆస్ట్రేలియా 1.82 లక్షల మంది విద్యార్థులతో ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి.

ప్రధాన దేశంగా..

చాలా కాలంగా ఓఈసీడీ దేశాలకు వలస వెళ్తున్న వారిలో అత్యధికులు భారత్, చైనాకు చెందినవారే. కోవిడ్–19 మహమ్మారి సమయంలో ప్రధాన దేశంగా ఉన్న చైనాను అధిగమించి 2023 వరకు కూడా భారత్ ఆధిక్యంలో కొనసాగింది. ఆ ఏడాది దాదాపు 6,00,000 మంది భారతీయ పౌరులు ఓఈసీడీ సభ్య దేశాలకు వలస వెళ్లారు. 2022తో పోలిస్తే ఈ సంఖ్య 8% పెరిగింది.

నలుగురిలో ఒకరు బ్రిటన్‌కు

2023లో భారత్ నుంచి వలసదారులలో దాదాపు నలుగురిలో ఒకరు యునైటెడ్ కింగ్‌డమ్‌ను (1,44,000) ఎంచుకున్నారు. ఇందులో 97,000 మంది ఆరోగ్య, సంరక్షణ కార్మిక వీసాలపై వెళ్లారు. కెనడాలో 2023లో 1,40,000 మంది అడుగుపెట్టారు. యునైటెడ్ స్టేట్స్‌కు 68,000 మంది భారతీయులు ఉపాధి కోసం వలస వెళ్లారు.

75వేల డాక్టర్లు మనవాళ్లే

2021–23 మధ్య.. ఓఈసీడీ సభ్య దేశాల్లో పనిచేస్తున్న 6.06 లక్షల మంది విదేశీ వైద్యుల్లో 12 శాతం (75,000) మంది భారతీయ డాక్టర్లు. అలాగే 7.33 లక్షల మంది విదేశీ నర్సుల్లో 17 శాతం మంది (1.22 లక్షలు) భారతీయ నర్సులు కావడం విశేషం. అత్యధిక డాక్టర్లు యూకేలో, అత్యధిక నర్సులు యూఎస్‌లో ఉన్నారు.

దేశం	వైద్యుల సంఖ్య	శాతం	నర్సుల సంఖ్య	శాతం
యూకే	17,250	23	36,000	18
యూఎస్	16,800	8	55,000	5
కెనడా	4,000	6	7,000	14
ఆస్ట్రేలియా	6,000	10	8,000	16

గిరిజన బిడ్డల ప్రాణాలకు విలువ ఇవ్వరా?

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పిల్లల మృత్యువాత
- మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఫైర్

కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపుతున్న పుష్పశ్రీవాణి

సాక్షి, పార్వతీపురం మన్యం: 'ఇక్కడ ఇద్దరు అసమర్థులున్నారు. ఒకరేమో మంత్రి.. ఇంకొకరేమో విప్. గిరిజన నియోజకవర్గాల నుంచి వీరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో గిరిజనులకు కష్టమొస్తే వీరేం చేస్తున్నారు? ఇద్దరు గిరిజన విద్యార్థులు చనిపోతే వారు కనీసం ఎక్స్‌గ్రేషియా ఇప్పించలేని చేతకాని వారు. గిరిజన బిడ్డల ప్రాణాలకు విలువ ఇవ్వరా?'.. అని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పాముల పుష్పశ్రీవాణి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఆమె కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డిని కలిశారు. కురుపాం నియోజకవర్గంలో ఇద్దరు విద్యార్థుల మరణాలు, పరిహారం.. అసంపూర్తిగా నిలిచిపోయిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం.. ధాన్యం కొనుగోలు తదితర సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం.. కలెక్టరేట్ వెలుపల మీడియాతో ఆమె మాట్లాడారు. విద్యార్థులు కల్పన, అంజలి మరణాలపై మంత్రి సంధ్యారాణి వాస్తవాలను దాచి అబద్ధాలు చెబుతున్నారని పుష్పశ్రీవాణి విమర్శించారు. దసరా సెలవులకని పాఠశాల నుంచి వెళ్లిపోయాకే అనారోగ్యం పాలయ్యారని, మరణాలు సంభవించాయని మంత్రి చెప్పడం ఎక్స్‌గ్రేషియా ఎగ్గొట్టే ప్రయత్నమంటూ ఆమె ఆరోపించారు. 'వివిధ సందర్భాల్లో పరిహారం ప్రకటిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. గిరిజన విద్యార్థుల మరణాలను ఎందుకు పట్టించుకోవడంలేదు? మేం ప్రతిపక్షంలో ఉన్నా సరే.. మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి కేజీహెచ్‌కు తీసుకెళ్లాం. ఘటనను చూసి చలించిన ఆయన.. అక్కడే మృతిచెందిన ఇద్దరి పిల్లల కుటుంబాలకు మా పార్టీ తరపున రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తం కూడా వెంటనే అందజేశాం' అని గుర్తుచేశారు.

హైకోర్టు కారుణ్యం

- రాజధాని భూసేకరణ బాధితులపై మానవీయ దృష్టి
- కారుణ్య మరణం కోరిన వృద్ధురాలికి భరోసా
- బాధితురాలి సొంత గ్రామానికి న్యాయవాదిని సొంత కారులో పంపిన న్యాయమూర్తి
- పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశం

సాక్షి, అమరావతి: రాజధాని భూసేకరణ బాధితుల గోడును క్షేత్రస్థాయిలో పరిశీలించి మానవీయ దృష్టితో చర్యలు చేపట్టేందుకు హైకోర్టు శ్రీకారం చుట్టిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, రాయపూడికి చెందిన నెల్లూరు శేషగిరమ్మకు చెందిన ఐదు సెంట్ల భూమిని సీఆర్‌డీఏ అధికారులు తీసుకున్నారు. దీంతో శేషగిరమ్మ, అనారోగ్యంతో ఉన్న 70 ఏళ్ల ఆమె కూతురు వెంకాయమ్మ, మతిస్థిమితం లేని మనుమరాలు శ్యామల పరిస్థితి దుర్భరంగా మారింది. ఈ క్రమంలో శేషగిరమ్మ కుమార్తె వెంకాయమ్మ మరణించింది. తమ నుంచి తీసుకున్న 5 సెంట్ల భూమిని తమకు ఇవ్వాలని శేషగిరమ్మ సీఆర్‌డీఏ అధికారులను కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో శేషగిరమ్మ, ఆమె మనుమరాలు విధి లేని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించారు. తమ బాగోగులను చూసుకునేందుకు ఓ కేర్‌టేకర్‌ను నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని, లేని పక్షంలో తమకు కారుణ్య మరణం ప్రసాదించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ జరుపుతున్న న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ 90 ఏళ్ల ఆ వృద్ధురాలి సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. శేషగిరమ్మ, ఆమె మనుమరాలి బాగోగులే తమకు ప్రధానమని చెప్పిన న్యాయమూర్తి కేవలం మాటలకే పరిమితం కాలేదు. ఆ అవ్వ, మనుమరాలి సంరక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, అసలు క్షేత్రస్థాయిలో వారి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా న్యాయమూర్తి శుక్రవారం తన సొంత కారులో డ్రైవర్‌నిచ్చి రూపేష్ అనే న్యాయవాదిని ఆ వృద్ధురాలు, ఆమె మనుమరాలు ఉంటున్న రాయపూడి గ్రామానికి పంపారు. వారి పరిస్థితిని పూర్తిగా తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఆ న్యాయవాదిని ఆదేశించారు. వారి పునరావాసం, బాగోగుల కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని, సీఆర్‌డీఏను ఆదేశించారు. చర్యలు సైతం సంతృప్తికరంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి అక్రమ అరెస్టులు చేస్తున్న నియంత పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నూలు బస్సు ప్రమాదంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు ఇప్పటికే 27 మందిపై కేసులు పెట్టిన కూటమి ప్రభుత్వం, దానికి పరాకాష్టగా వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ పూడి శ్రీహరికి నోటీసులు ఇచ్చిందని విమర్శించారు. ఈ కేసుతో ఆయనకు ఏ సంబంధం లేకపోయినా డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే పనిగా పెట్టుకున్న ప్రభుత్వం ఈ రకంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి టీడీపీ నాయకులు చేసే నేరాల్లోనూ వైఎస్సార్‌సీపీ వారిని అక్రమంగా ఇరికిస్తున్నారని మనోహర్‌రెడ్డి దుయ్యబట్టారు. తండ్రి చనిపోతే కడసారి చూపుకోసం లండన్ నుంచి వచ్చిన మాలేపాటి భాస్కర్‌రెడ్డి అనే ఎన్నారైని అక్రమ కేసులో ఇరికించి నడవలేని విధంగా దారుణంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలిటికల్ బాస్‌ల ఆదేశాలతో పోలీసులే ఆర్గనైజ్డ్ నేరాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పాలన చేతకాక, హామీలు అమలు చేయలేక 18 నెలలకే చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం ఇలాంటి నియంతపోకడలకు పోతోందని, చరిత్రలో ఎంతోమంది నియంతలు మట్టికరిచిన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవాలని హితవు పలికారు. నెల్లూరులో బస్సు ప్రమాదంపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలను పోస్టు చేస్తే కేసులు పెట్టడం దారుణమని చెప్పారు. కర్నూలు టూటౌన్ డీఎస్పీ ముందు హాజరుకావాలని ఇప్పటికే దాదాపు 27 మందిపై కేసులు పెట్టిన పోలీసులు తాజాగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చి పార్టీ మీడియా వ్యవహారాలు చూసే జనరల్ సెక్రటరీ పూడి శ్రీహరికి నోటీసులు ఇచ్చి వెళ్లారని తెలిపారు. నకిలీ మద్యం కేసులో కీలకపాత్ర పోషించిన టీడీపీ నేతలను వదిలేసి వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్‌ను అరెస్టు చేయడం దారుణమన్నారు.

మయన్మార్ నుంచి భారత్‌కు చేరుకున్న సైబర్ బాధితులు

సాక్షి, న్యూఢిల్లీ: మయన్మార్‌లో సైబర్ నేరగాళ్ల శిబిరాల్లో చిక్కుకున్న 270మంది కేంద్ర ప్రభుత్వం చొరవతో ఎట్టకేలకు గురువారం రాత్రి భారత వైమానిక దళం విమానంలో స్వదేశానికి చేరుకున్నారు. వారిలో ఏపీకి చెందినవారు 11మంది ఉన్నారు. శుక్రవారం విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు తగిన విచారణ, ధ్రువీకరణ అనంతరం ఢిల్లీలోని ఏపీ అధికారులకు వారిని అప్పగించారు.

సాక్షి SAKSHI.COM
సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం..
చట్టరీత్యా నేరం...
సాక్షి టీవీ ప్రసారాలు మీ హక్కు..
ప్రసారాలను అడ్డుకోవడం చట్టవిరుద్ధం...
ప్రజల కోసమే మా పోరాటం ప్రజా గొంతుకై నినదిస్తాం
వార్తల వెనుక వాస్తవాలు తెలియాలంటే
సాక్షి టీవీ చూడండి
సాక్షి టీవీ ప్రసారాల కోసం...
మీ స్థానిక కేబుల్ ఆపరేటర్‌ను వెంటనే సంప్రదించండి.
డీటీహెచ్‌లో సాక్షి ప్రసారాల కోసం: 1456 | 2449 | airtel 907 | SUN 184
ఇంటర్నెట్‌లో సాక్షి ప్రసారాల కోసం: youtube.com/SakshiNews | Jio Fiber | Xstream
సత్యమేవ జయతే

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



ఇళ్లకు తాళాలు వేసి, మూటాముల్లె సర్దుకుని, పిల్లాపాపలతో కలసి వాహనాల్లో దూరప్రాంతాలకు వలస వెళ్తున్న వీరు కోసిగి మండలానికి చెందిన వారు. 'ఉపాధి' పనులు చేసినా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో వీరు వలస బాట పట్టారు. విద్యార్థులను సైతం తమ వెంట తీసుకెళ్లడంతో గ్రామీణ ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి.

ఖాళీ ఊళ్లు.. ఇంటింటా కన్నీళ్లు!

కరువు నేలపై 'కూటమి' కాఠిన్యం

పాఠశాలల్లో గణనీయంగా తగ్గిన విద్యార్థుల సంఖ్య

ధరల పతనంతో నష్టాల్లో కూరుకు పోయిన 'ఉల్లి' రైతు

రైతులకు అందని సబ్సిడీ శనగ విత్తనాలు

ఎల్లెల్సీ కింద రెండో పంట సాగు కష్టమే

కర్నూలు(అర్బన్): కరువు నేలపై కూటమి ప్రభుత్వం కాఠిన్యాన్ని ప్రదర్శిస్తోంది. కరువును అధిగమించాల్సిన కార్యక్రమాలపై దృష్టి సారించడం లేదు. కర్నూలు జిల్లాలోని పశ్చిమ పల్లెలు ఖాళీ అవుతున్నాయి. గ్రామాల్లో పనుల్లేక, పస్తులుండలేక వేల సంఖ్యలో ప్రజలు దూర ప్రాంతాలకు పనుల కోసం వలసలు వెళ్తున్నారు. ఇళ్ల వద్ద వృద్ధులను మాత్రమే ఉంచి పిల్లలను సైతం తమ వెంట తీసుకెళ్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు గణనీయంగా తగ్గినట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

ఆర్థిక కష్టాలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు జిల్లా వ్యాప్తంగా ఐదు వేలకు మంచి కూలీలు హాజరు కావడం లేదంటే, వలసల ప్రభావం ఎంత మాత్రం ఉందో ఊహించుకోవచ్చు. పైగా కూలీలకు చెల్లించాల్సి వేతనాలు ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం బకాయి పడినట్లు తెలుస్తోంది. అలాగే ఉపాధి నిధులతో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులకు (సీసీ రోడ్లు, డ్రైనేజీ, ప్రహరీగోడలు, పశువుల షెడ్లు, సోక్‌పిట్స్) కూడా దాదాపు రూ.100 కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ కూలీల పరిస్థితి ఈ విధంగా ఉంటే ... రైతుల పరిస్థితి చెప్పనలవి కాదు. అతివృష్టి, అనావృష్టితో ఏయేటికాయేడు జిల్లాలోని రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలకు గురవుతున్నారు. ఈ ఏడాది అధిక శాతం పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి రైతులు తీవ్ర ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

వివిధ కారణాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఖరీఫ్‌లో దాదాపు 59 వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం తగ్గింది. కర్నూలు జిల్లాలో 4.22 లక్షల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 2.38 లక్షల హెక్టార్లు సాగు విస్తీర్ణం కాగా, కర్నూలు జిల్లాలో 3.86 లక్షలు, నంద్యాల జిల్లాలో 2.15 లక్షల హెక్టార్లలో మాత్రమే రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. సెప్టెంబర్ నెలలో కురిసిన అధిక వర్షాలతో పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు పూర్తి స్థాయిలో నష్టపోవడమే గాక, పంటల దిగుబడి కూడా తగ్గింది. రెండు జిల్లాల్లో దాదాపు 30 వేలకు పైగా హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. అయితే నష్టపోయిన పంటలకు పరిహారం అందించే ప్రక్రియలో పూర్తి జాప్యం చోటు చేసుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెజారిటీ మండలాల్లో నష్ట పరిహారం అందించేందుకు చేపట్టిన ఎన్యుమరేషన్ నేటికి పూర్తి కాలేదు.

ఉల్లి రైతుకు కన్నీరే మిగిలింది!

ఈ సీజన్‌లో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక, పండిన ఉల్లిని కొనేవారు లేక రైతులు నరకయాతనను అనుభవించారు. అనేక మంది రైతులు ఉల్లి పంటను మేకలు, గొర్రెలకు వదిలి వేయగా, మరి కొందరు పంటను పూర్తిగా దున్నేశారు. మరి కొంత మంది కోసిన ఉల్లిని మార్కెట్‌కు తీసుకువచ్చినా, ఎలాంటి లాభం లేకపోవడంతో హంద్రీనీవా కాలువలో పడవేశారు. ఉల్లి రైతుల నుంచి పూర్తి స్థాయిలో వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా 2,554 మంది రైతుల వద్ద నుంచి దాదాపు 10 వేల టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. ఉల్లిని విక్రయించిన 250 మంది రైతుల ఖాతాల్లోకి ఇప్పటి వరకు కేవలం రూ.1.50 కోట్లు మాత్రమే జమ అయినట్లు తెలుస్తోంది. ఇంకా ప్రభుత్వం రూ.16.50 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేయాల్సి ఉంది. ఉల్లిని కొనుగోలు చేసి నెల రోజులు దాటి పోయినా, నేటి వరకు నగదు జమ చేయకపోవడంపైరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందని సబ్సిడీ శనగ విత్తనాలు

ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులకు అందించాల్సిన శనగ విత్తనాలను కూడా ప్రభుత్వం అందించలేని పరిస్థితి ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకొనింది. కర్నూలు జిల్లాలో 46 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 23 వేల క్వింటాళ్లను మాత్రమే సరఫరా చేశారు. అలాగే నంద్యాల జిల్లాలో 37 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా, కేవలం 12,654 క్వింటాళ్లు మాత్రమే సరఫరా అయ్యాయి. రైతులకు అవసరాలకు అనుగుణంగా సకాలంలో శనగ విత్తనాలను అందించక పోవడం పట్ల రైతులు బయటి మార్కెట్లపై ఆధారపడి కొనుగోలు చేశారు.

ఎల్లెల్సీ పరిధిలో రెండో పంట సాగు కష్టమే

తుంగభద్ర దిగువ కాలువ కింద ఈ ఏడాది రెండో పంటకు నీరందే పరిస్థితి లేదు. టీబీ డ్యాం గేట్ల మార్పుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినా, నీటిని వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఈ కారణంగా ఎల్ఎల్‌సీ పరిధిలో 1,07,615 ఎకరాలు, కేసీ కెనాల్ కింద 1.50 లక్షల ఎకరాలు, ఎగువ కాలువ పరిధిలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ ఆయకట్టుకు (20 వేల ఎకరాలు) నీరందని పరిస్థితి నెలకొంది. డ్యాంలో నీరు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గేట్ల మార్పు సాకుతో ఆయకట్టు రైతులకు అన్యాయం చేస్తుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. శ్రీశైలం నీటిపై ఆధారపడిన తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ కాలువల పరిధిలో రెండో ఆయకట్టు సాగుపై ఇప్పటి వరకు స్పష్టత లోపించింది.

కాఫీ తోటల్లో ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్న పర్యాటకులు

పర్యాటక సిగలో కాఫీ ఘుమఘుమ

అల్లూరి జిల్లా ఏజెన్సీలో గిరి రైతులకు ప్రధాన ఆదాయ వనరు అయిన కాఫీ తోటలు పర్యాటక రంగంలో కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి. మంచు సోయగాలు మాదిరిగానే కాఫీ తోటలు, వలిసె పూల తోటలు అబ్బురపరున్నాయి. లంబసింగి- గూడెంకొత్తవీధి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా కాఫీ పండ్లతో ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలో 1.5 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతుండగా చింతపల్లి మండలంలో 38,145 ఎకరాలు, గూడెంకొత్తవీధి మండలంలో 41,635 ఎకరాల విస్తీర్ణంలో తోటలు ఉన్నాయి. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా దిగుబడి బాగుంది. లంబసింగి నుంచి బురదవీధి, రాజుపాకల, మడిగుంట, కృష్ణాపురం, చింతలూరు, పెదగెడ్డ, రౌరింతాడ, చిన గెడ్డ, అంతర్ల, పెంటపాడు, రింతాడ, ముళ్లిమెట్ట, ఏబులం, ఆర్వీ నగర్, గూడెంకొత్తవీధి వరకు సుమారు 40 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్నాయి. రంపుల, లంబసింగి, కొక్కిరాపల్లి ఘాట్ మార్గాల్లో కూడా కనువిందు చేస్తున్నాయి. ఏజెన్సీకి వచ్చే పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తుంటారు. కాఫీ తోటలను సందర్శించి, స్థానిక కాఫీ రుచిని ఆస్వాదిస్తుంటారు. ఈ ప్రాంతంలో కావేరి, చంద్రగిరి, రొబస్టా రకాలను గిరి రైతులు సాగు చేస్తున్నారు.

\- చింతపల్లి

కమల్ నాయగన్ రీరిలీజ్‌కు కర్ణాటకలో అడ్డంకులు

ఆందోళన చేస్తున్న కన్నడ సంఘాల ప్రతినిధులు

యశవంతపుర: తమిళం నుంచి కన్నడ పుట్టినట్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటుడు కమల్ హాసన్ 'థగ్ లైఫ్' కర్ణాటకలో ఫ్లాప్ అయింది. ఇప్పుడు కమల్ హాసన్ నటించిన పాత సినిమా 'నాయగన్' శుక్రవారం దేశవ్యాప్తంగా రీ రిలీజ్ అయింది. అయితే కర్ణాటకలో సినిమా విడుదలను కన్నడ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. శుక్రవారం రిలీజ్‌ను అడ్డుకున్నాయి. సారా గోవింద్ నేతృత్వంలో బెంగళూరులో ఒరాయన్ మాల్ వద్ద ఆందోళన చేశారు. దీంతో ప్రదర్శనను రద్దు చేశారు. కర్ణాటకలో అనేక చిత్రమందిరాలు ఈ సినిమా ప్రదర్శనకు అనుమతి తీసుకున్నా కన్నడ సంఘాల ఆందోళనతో ప్రదర్శనను రద్దు చేసుకున్నాయి. కమల్ క్షమాపణలు చెప్పేవరకు ఆయన సినిమాల విడుదలను అడ్డుకుంటామని కన్నడ సంఘాలు హెచ్చరించాయి.

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవసరం: సీపీఐ

సాక్షి, అమరావతి: అక్టోబరు మహా విప్లవం స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులంతా పునరేకీకరణ కావాలని, ఆ దిశగా భారత్‌లో నూతన శక్తిని తీసుకురావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పునరుద్ఘాటించారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 1917లో అక్టోబరు మహావిప్లవం జరిగి నవంబరు 7న రష్యాలో మొదటిసారిగా శ్రామికరాజ్యం ఏర్పాటైందన్నారు. కమ్యూనిస్టు పార్టీ బలహీనంగా ఉండే అమెరికాలోనూ కమ్యూనిస్టుల జయకేతనం శుభ సూచకమన్నారు. నేపాల్‌లో 9 కమ్యూనిస్టు పార్టీలు ఐక్యతతో ముందుకు రావడం శుభపరిణామమన్నారు. డిసెంబరు 26న తెలంగాణలోని ఖమ్మంలో లక్షలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించి కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోనున్నామని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, జనగణనలో కులగణన చేపట్టాలని ఈనెల 18న దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నామన్నారు.

నూతన ఉపాధ్యాయుల జీతభత్యాలకు ఆదేశాలు

సాక్షి, అమరావతి : గత నెలలో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు జీతభత్యాల విషయమై ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా ఈ ఏడాది అక్టోబర్ 3 నుంచి పరిగణనలోకి తీసుకుని వారి జీతభత్యాల చెల్లింపులు చేయాలని ట్రెజరీస్, అక్కౌంట్స్ డైరెక్టర్ మోహనరావు శుక్రవారం శాఖాపరమైన సర్క్యూలర్ జారీ చేశారు.

కారు ఢీకొని నలుగురు టీచర్లకు గాయాలు

తగరకుంట వద్ద ప్రమాదానికి గురైన ప్రైవేటు పాఠశాల వాహనం

కొడవలూరు: టాటా మ్యాజిక్ వాహనాన్ని కారు వేగంగా ఢీకొట్టడంతో నలుగురు టీచర్లు గాయపడిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని టపాతోపు హైవే క్రాసింగ్ వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు నెల్లూరు నుంచి రోజూ టాటా మ్యాజిక్ వాహనంలో విధులకు వెళ్తుంటారు. శుక్రవారం కూడా వాహనంలో ఏడుగురు టీచర్లు విధులకు బయలుదేరారు. నార్తురాజుపాళెం టపాతోపు వద్ద హైవే క్రాస్ చేస్తుండగా కావలి వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయులు భారతి, శ్రీలక్ష్మి, రవికుమార్, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వారిని నెల్లూరులోని అపోలో వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లుకు అత్యవసర సేవలందిస్తున్నారు. విడవలూరు మండలం రామతీర్థం జెడ్పీ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పోలేపల్లి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి తెలిపారు.

వారం రోజుల క్రితం గుడిబండ సంతలో కనిపించిన దృశ్యమిది. ఒకే వాహనంలో ఇలా పదుల సంఖ్యలో మూగజీవాలను కుక్కి ఎక్కించారు. ఆ తర్వాత తలుపు మూసేసి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లారు. మేత లేదు.. నీరు లేదు.. కనీసం నిలబడే చోటు లేదు. కానీ ఆ మూగజీవాలు ఇలా గంటల సమయం నరక ప్రయాణం చేయాల్సిందే. హిందూపురం, గోరంట్లలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. అయినా ఎవరికీ ఈ మూగవేదన పట్టడం లేదు.

మూగ రోదన.. ఆగని రవాణా

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

కాళ్లు విరిచి .. వాహనాల్లో కుక్కి తరలింపు

చిత్ర హింసలకు కన్నీరు పెడుతున్న పశువులు

రాత్రి వేళల్లో దర్జాగా సరిహద్దు దాటుతోన్న వైనం

పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోన్న అధికార యంత్రాంగం

సాక్షి, పుట్టపర్తి వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో పాడిపశువులను ప్రతి ఒక్కరూ పూజిస్తారు. రైతులైతే వాటిపై ప్రేమ పెంచుకుంటారు. కుటుంబ సభ్యుల్లా చూస్తారు. సాగులో సాయంగా ఉండే వాటికి పూజలూ చేస్తారు. ఇక పాడి వట్టి పోయినా..వయసు మీదపడినా కబేళాలకు మాత్రం అప్పగించరు. కానీ కొందరు వ్యాపారులు తామూ రైతులమేనంటూ ముగజీవాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కబేళాలకు తరలిస్తూ రూ.కోట్లు కూడబెడుతున్నారు. ఇలా వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన పశువులను అక్రమంగా వాహనాల్లో కుక్కి తరలిస్తున్నారు.

సరిహద్దులో.. జోరుగా అక్రమ రవాణా..

సత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు గానూ 16 మండలాలకు కర్ణాటక సరిహద్దుగా ఉంది. ఆయా సరిహద్దు ప్రాంతాల్లో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా వాహనాల్లో పశువులను జిల్లా సరిహద్దులు దాటించి.. బెంగళూరు, పావగడ, చిత్రదుర్గం, తుమకూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరు వ్యాపారులు ఈ దందాను సాగిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. తెల్ల పశువుల్లో ఆవుల అక్రమ రవాణాపై నిషేధం ఉన్నా... కాసులకు కక్కుర్తి పడిన కొందరు ఈ దందాను ఆపడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో పశువులు తరలిస్తున్నారు. ఏ మాత్రం మానవత్వం లేకుండా ఇరుకు వాహనాల్లో కుక్కి.. కాళ్లు విరిచి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పశువుల అక్రమ రవాణా వాహనాలను జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు. ఇక రైతులు కూడా వేసవి ఆరంభంలో తీవ్రమైన పశుగ్రాసం ఏర్పడుతుందనే భయంతో ముందుగానే పశువులను అమ్మేస్తున్నారు. ఈ అవకాశాన్ని అదునుగా తీసుకున్న వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇరుగు పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

రైతుల ముసుగులో..

పశువులు కబేళాలకు తరలించే ముఠా సభ్యులు అధికారులను సైతం బోల్తా కొట్టిస్తున్నారు. తాము కూడా రైతులమేనని, పెంచి పోషించుకునేందుకే పశువులను కొంటున్నామంటూ అబద్ధాలు అల్లి అన్నదాతల వద్ద మూగజీవాలను కొనుగోలు చేస్తున్నారు. అనంతరం ఓ చోటకు చేర్చి అక్కడి నుంచి వాహనాల్లో సంతలు జరిగే ప్రదేశాలకు కొన్ని తరలించి మరి కొన్నింటిని కబేళాల్లో విక్రయాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. వ్యవసాయంలో యంత్రీకరణ విప్లవం రావడం, గ్రాసం కష్టాలు వెంటాడటం వెరసి పశు సంపద నానాటికీ క్షీణించిపోతోంది. ఆ ముసుగులో గోవుల విక్రయం పెరిగిందని విశ్లేషకులు అంచనా.

నిబంధనలు గాలికి..

వాహనాల్లో పశువులు తరలించే విషయంలో నిబంధనలు తప్పక పాటించాల్సి ఉంటుంది. సుదూరు ప్రాంతాలకు పశువులను తరలించాల్సి వస్తే వ్యవసాయ, పాడి అవసరాల నిమిత్తం తరలిస్తున్నట్టు అధికారులతో అనుమతులు పొందాలి. పశువులకు గాలి, వెలుతురు తగిలేలా చూసుకోవాలి. పశు వైద్య కిట్లు, గ్రాసం, వాహనంలో నిల్చునే వెసులుబాటు ఉండాలి. కానీ ఈ నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. రెండు పశువులు పట్టే వాహనంలో నాలుగు ఎక్కించి కుక్కేస్తున్నారు. గ్రాసం, నీరు అందించక పోవడంతో గంటల తరబడి నిల్చున్న పశువులు ఎండకు సొమ్మసిల్లిపోతున్నాయి.

గత ప్రభుత్వంలో రైతులకు అండగా..

వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగడుగునా పాడి రైతులకు అండగా నిలిచారు. టీకాలతో పాటు టీఎంఆర్ గడ్డి, దాణ, గడ్డి విత్తనాలు ఉచితంగా అందించారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పోషకులు విధి లేక కబేళాలకు విక్రయిస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం

పశువుల అక్రమ రవాణాకు అడ్డకట్ట వేస్తాం. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఎవరైనా పశువులను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తూ ఉంటే వెంటనే వాహనాలు సీజ్ చేయిస్తున్నాం. పశు సంపద అక్రమంగా తరలిపోకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నాం. పశువుల అక్రమ రవాణా గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. తగిన చర్యలు తప్పక తీసుకుంటాం. – సతీశ్ కుమార్, జిల్లా ఎస్పీ



● గుడ్ న్యూస్

ఇండియాలో బూ బూ ల్యాండ్

పిల్లలూ స్కూల్ వెకేషన్స్‌కి ఎక్కడికి అర్థం కావడం లేదా? ప్రతీసారి వెళ్ళినచోటకే వెళ్ళి బోర్ కొడుతుందా? అయితే కాస్త ఓపిక పట్టండి. మరికొన్ని రోజుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఇండోర్ గేమింగ్ లలో ఒకటైన 'బూ బూ ల్యాండ్' మన దేశానికి వస్తుంది. దుబాయ్ కేంద్రంగా నడిచే ఈ సంస్థ వచ్చే ఏడాది తన మొదటి ఇండోర్ లగ్జరీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పేస్ ని ముంబై లోని జియో వరల్డ్ ప్లాజాలో ఏర్పాటు చేయనుంది.

ఇందులో ఒకటినుండి ఎనిమిది సంవత్సరాల వయసుగల పిల్లలు ఎన్నోరకాల వర్చువల్ రియలిస్టిక్ గేమ్స్, ఫిజికల్ గేమ్స్ తో పాటు అడ్వెంచర్ జోన్స్, పెయింటింగ్, ఆర్ట్ వర్క్ షాప్స్, మ్యూజిక్, సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ వంటి వివిధ రకాల సజనాత్మకతను పెంపొందించే ఆర్ట్స్ కూడా ఈ ఎంటర్‌టైన్‌మెంట్ స్పేస్ లో అందుబాటులో ఉంటాయి.

ఇది కేవలం ఆటలకు మాత్రమే పరిమితమైన స్పేస్ కాదు. ఇక్కడ మీరు మీకిష్టమైన సూపర్ హీరోల గెటప్స్ వేసుకోవచ్చు. వారిని అనుకరించవచ్చు. చెఫ్ లా, ఆర్టిస్ట్ లా, మీకు నచ్చిన ఫేమస్ గెటప్స్ వేసుకొని కాసేపు వారిలా అనుభూతి చెందవచ్చు. ఆ పనులు కూడా చేయవచ్చు. అంతేకాకుండా మీలాంటి పిల్లలతో గ్రూప్ గేమ్స్ ఆడి నూతన స్నేహాలను పెంపొందించుకోవడానికి 'బూ బూ' మంచి వేదిక కానుంది.

పిల్లలకు అతిపెద్ద వినోద వేదిక కానున్న ఈ బూ బూ మన హైదరాబాద్ కి రావడానికి మాత్రం మరికొంతకాలం ఎదురుచూడాల్సిందే. ముంబై తర్వాత హైదరాబాద్ తో పాటు మరో ఇరవై ప్రధాన నగరాల్లో ఈ ఇండోర్ లగ్జరీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పేస్ ని ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకటించాడు.

ఇప్పటివరకు షాపింగ్ మాల్స్ లో, మల్టీప్లెక్స్ లలో కేవలం వీడియో గేమ్స్, చిన్న చిన్న ఇండోర్ గేమ్స్ మాత్రమే ఆడుకోవడానికి అవకాశం ఉంది. కానీ బూ బూ 15000 నుండి 18000 చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యంత విశాలంగా, ఆడుకోవడానికి, పాడుకోవడానికి, డ్యాన్స్ చేయడానికి అనువుగా ఉండబోతుంది. మరి ఇన్ని సౌకర్యాలు ఉన్న 'బూ బూ' మన దగ్గరకి వస్తే మీలో ఎంత మంది వెళ్తారు?

● తెలుసుకుందాం

బాల కార్మికుల కోసం పోరాడిన యోధుడు ఇక్బాల్ మాసిహ్

చదువుకునే వయసులో చదువుకోవాలి. పని చేయాల్సిన వయసులో పనిచేయాలి. చదువుకునే వయసులో బడికి వెళ్లకుండా పనికి వెళ్లే బాలలుంటారని మీకు తెలుసా? వారిని 'బాలకార్మికులు' అంటారు. చట్టప్రకారం 14 ఏళ్లలోపున్న పిల్లల్ని ఎవరూ పనిలో పెట్టుకోకూడదు. అయితే కొందరు వారిని పనిలో పెట్టుకొని జీతం తక్కువగా ఇస్తూ, వారి చేత రోజంతా చాకిరీ చేయించుకుంటున్నారు. అటువంటి దారుణానికి వ్యతిరేకంగా ఓ బాలుడు పోరాడాడు. అతని గురించి తెలుసుకుందాం.

ఇక్బాల్ మాసిహ్ 1983, జనవరి 1న పాకిస్తాన్‌లోని పంజాబ్‌లోని లాహోర్ సమీపంలోని మురిడ్కే అనే గ్రామంలో పుట్టాడు. వారిది నిరుపేద కుటుంబం. అతని తల్లిదండ్రులు సైఫ్ మాసిహ్, ఇనాయత్ బీబీ.

1986లో సైఫ్ తన కూతుళ్లలో ఒకరి పెళ్లి చేయాలని అనుకున్నాడు. కానీ అతని దగ్గర డబ్బు లేదు. తాకట్టు లేకుండా ఎవరూ అప్పు ఇవ్వనంటున్నారు. దీంతో తన కొడుకు ఇక్బాల్‌ను ఓ కార్పెట్ ఫ్యాక్టరీ యజమాని దగ్గర తాకట్టు పెట్టి రూ.600 అప్పు తీసుకున్నాడు. అప్పటికి ఇక్బాల్ వయసు నాలుగేళ్లు. అతను ఆ పరిశ్రమలో పనిచేసి యజమాని వద్ద తండ్రి చేసిన అప్పు తీర్చాలనేది ఒప్పందం. అక్కడ చేరిన ఇక్బాల్‌ని ఒక మగ్గానికి బంధించి రోజుకు 14 గంటలు పని చేయించుకున్నారు. తిండి సరిగ్గా పెట్టేవారు కాదు. అక్కడి నుంచి తప్పించుకోవడానికి అతని ప్రయత్నిస్తే తిండి పెట్టకుండా, విపరీతంగా కొట్టేవారు. ఎన్నో ఏళ్ల పాటు అతను అక్కడే ఆ బాధలు భరిస్తూ ఉన్నాడు.

10 సంవత్సరాల వయస్సులో ఇక్బాల్ అక్కడి నుంచి తప్పించుకున్నాడు. తన యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించాడు. కానీ పోలీసులు అతన్ని తిరిగి ఫ్యాక్టరీకి తీసుకువచ్చారు. ఇక్బాల్ రెండోసారి తప్పించుకుని మాజీ బాల కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫ్రంట్ (BLLF) పాఠశాలలో చేరాడు. తనలాగే ఇబ్బందులు పడ్డ చిన్నారులకు రక్షణ కల్పించాలని నిర్ణయించుకున్నాడు. సుమారు 3,000 మందికి పైగా పిల్లలు స్వేచ్ఛ పొందేందుకు అతను సాయం చేశాడు. ప్రపంచవ్యాప్తంగా బాలకార్మికుల వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక ప్రసంగాలు ఇచ్చాడు. అక్కడి దారుణమైన పరిస్థితులను వివరించాడు. 1994లో ఆయన బోస్టన్‌లో రీబాక్ హ్యూమన్ రైట్స్ అవార్డును అందుకున్నాడు. అతను చేస్తున్న పనులు కొందరికి కంటగింపుగా మారాయి. అతను బతికి ఉంటే తమకు ప్రమాదమని గ్రహించారు. 1995 ఏప్రిల్ 16న మురిడ్కే గ్రామంలోఇక్బాల్ తన స్నేహితులతో కలిసి సైక్లింగ్ చేస్తున్నప్పుడు కొందరు దుండగులు తుపాకీతో అతణ్ని బలిగొన్నారు. బాల కార్మికుల కోసం పోరాడిన వీరుడు ఇక్బాల్. నేటికీ ప్రపంచవ్యాప్తంగా అతణ్ని గుర్తుచేసుకుంటారు. అతని స్మారకంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.

● మహనీయులు

మహిళల్లో చైతన్యం నింపిన సంగం లక్ష్మీబాయి

దేశస్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల్ని మనం నిత్యం స్మరించుకోవాలి. వారు అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలి. అటువంటి వారిలో ఒకరు సంగం లక్ష్మీబాయి. ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళ ఆమె.

సంగం లక్ష్మీబాయి 1911 జూలై 27న హైదరాబాద్ నగర ఘటకేసర్ సమీపంలో ఒక కుగ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి డి.రామయ్య. లక్ష్మీబాయికి చిన్నతనంలోనే వివాహమైంది. కొద్దిరోజులకే ఆమె తల్లిదండ్రులు, భర్త చనిపోవడంతో ఆమె ఒంటరి అయ్యారు. అలాగే కుంగిపోకుండా ధైర్యంగా జీవించాలని భావించారు. ఆమెకు మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం దొరికింది. అక్కడ చదువు పూర్తయ్యాక మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో లక్ష్మీబాయి చదువుకున్నారు. విద్యార్థినిగా ఉండగానే సైమన్ కమీషన్‌ను వ్యతిరేకించారు. ఉప్పు సత్యాగ్రహంలో చురుగ్గా పాల్గొని ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు.

ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుని నారాయణగూడలో ఉన్న రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసుకోవడం ప్రారంభించారు. అదే సమయంలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు. ఈ క్రమంలో రాజకీయాల్లో చేరి 1952లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. రాష్ట్రప్రభుత్వంలో విద్యాశాఖ ఉపమంత్రిగా పనిచేశారు. 1957లో మెదక్ నియోజక వర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. చివరిదాకా సమాజ శ్రేయస్సుకు, బాలికల సంక్షేమానికి కృషి చేసిన లక్ష్మీబాయి 1979లో జూన్ 3న మరణించారు.

● మన పుస్తకాలు

ఆహారంపై ఆసక్తి



చిన్నారులకు తాము తినే ఆహారంపై ఆసక్తి కలిగించేందుకు ఉపకరించే పుస్తకం ఇది. ఈ పుస్తకంలో అనేక ప్రశ్నలు, వాటికి సమాధానాలు ఉంటాయి. పిల్లలు తమ ప్లేట్‌లో ఏముందనే ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవచ్చు. హాస్యం కలిసిన ప్రత్యేకమైన శైలిలో సాగే ఈ పుస్తకం పిల్లలతోపాటు యువ పాఠకులనూ అలరిస్తుంది. తినే ఆహారంపై అవగాహన, ఇష్టాన్ని పెంచే పుస్తకాలు పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయి.

చక్కటి తెలుగు పాటల నెలవు

చక్కటి తెలుగు పాటలతో పిల్లల్లో ఆహ్లాదాన్ని నింపే పుస్తకం ఇది. పిల్లలు రోజువారీ జీవితాల్లో చూసే అంశాలనే చిట్టిపొట్టి మాటలతో పాటలుగా రాశారు పారనంది శోభాదేవి. కేవలం సరదా కోసమే కాకుండా పిల్లలకు రకరకాల అంశాలను నేర్పేందుకు ఉపకరించే పాటలు ఇందులో ఉన్నాయి. అన్నీ హాయిగా పాడుకోవచ్చు. అందమైన బొమ్మలకు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. పిల్లలకు బహుమతిగా ఇవ్వదగ్గ పుస్తకం.

● మీకు తెలుసా

వణికించే చలి... స్వెటర్ ఉందిగా!

పిల్లలూ! చలికాలం మొదలైంది. రాత్రివేళ చలిగాలులు ఇబ్బంది పెట్టకుండా స్వెటర్ వేసుకుంటారు. అది ఒంటిని చలి నుంచి రక్షించి వెచ్చగా ఉంచుతుంది. మరి ఈ సెట్వర్ సంగతులేమిటో చూసేద్దామా?

మనం 'స్వెటర్' అని పిలిచే దీన్ని కొన్ని దేశాల్లో 'జెర్సీ' లేదా 'జంపర్' అని కూడా అంటారు. 19వ శతాబ్దం ప్రారంభంలో ఐర్లాండ్, స్కాట్లాండ్‌లోని మత్స్యకారులు సముద్రాలలో వెచ్చగా ఉండటానికి కొన్ని రకాల దుస్తులు వాడారని, తొలిసారి అక్కడే స్వెటర్లు తయారై ఉంటాయని కొందరు భావిస్తున్నారు. మొదట్లో ఈ స్వెటర్లు బరువైన ఉన్నితో తయారు చేశారు. ఉన్ని నీటితో తడిచిపోకుండా దానికి నూనె రాసేవారు. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరీ 1882లో 'స్వెటర్' అనే పదాన్ని మొదటిసారి ముద్రించింది. 20వ శతాబ్దం ప్రారంభం నాటికి పురుషులు, మహిళలు స్వెటర్లు వాడటం మొదలుపెట్టారు. గోల్ఫ్, టెన్నిస్ ఆడేవారు తప్పకుండా వీటిని ధరించేవారు. 1930లలో హాలీవుడ్ సినిమాల్లో నటీనటులు స్వెటర్లు వాడటం మొదలుపెట్టాక వీటి గురించి అందరికీ తెలిసింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సైనిక యూనిఫాంలో స్వెటర్లను భాగంగా ఉపయోగించారు.

గతంలో కేవలం ఉన్నితోనే స్వెటర్లు తయారు చేసేవారు. కానీ ఇప్పుడు కాటన్, సింథటిక్ ఫైబర్స్‌తోనూ చేస్తున్నారు. విదేశాల్లో ఈ స్వెటర్లను వేడుకల్లో కానుకలుగా ఇస్తుంటారు. చిన్నపిల్లలు తరచూ జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. వారి కోసం తల్లులు స్వెటర్ అల్లుతుంటారు. రకరకాల అల్లికలతో చేసిన స్వెటర్లు పిల్లలకు వేసి తమ ముచ్చట తీర్చుకుంటారు. గతంలో ఇళ్లల్లోనే స్వెటర్లు తయారు చేసుకునేవారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల డిజైన్లలో స్వెటర్లు దొరుకుతున్నాయి.

● కథ

అదృష్టం దురదృష్టం



బాగ్దాద్ నగరాన్ని పాలించే రాజుకు తన రాజ్యంలో అత్యంత అదృష్టవంతుడు ఎవరని సందేహం వచ్చింది. అటువంటి వాడిని కనుగొనాలని భావించాడు. ఈ విషయాన్ని తన మంత్రితో చర్చించాడు. 'రాజా! అదృష్ట, దురదృష్టాలనేవి మనిషి బుద్ధి, వివేకం మీద ఆధారపడి ఉంటాయి. ఈ సష్టిలో ఎవరూ శాశ్వతంగా అదృష్టవంతుడు, శాశ్వతంగా దురదృష్టవంతుడు ఉండరు' అని మంత్రి అన్నాడు.

ఆ మాటలతో రాజు సంతృప్తి చెందలేదు. తన రాజ్యంలో అత్యంత అదృష్టవంతుడు ఎవరనేది తెలుసుకోవాలని పట్టుబట్టాడు. అందుకు తన దగ్గర ఓ ఉపాయం ఉందని మంత్రి అన్నాడు. వెంటనే దాన్ని అమలు చేయమని రాజు ఆదేశించాడు.

మంత్రి వంటశాలకు వెళ్లి నమ్మకస్తుడైన వంటవాణ్ని పిలిచాడు. అతని చేతికి కొన్ని బంగారు నగలు ఇచ్చి, ఓ పిండిలో వాటిని పెట్టి రొట్టె తయారు చేయమని అన్నాడు. అదే పరిణామంలో మరో మామూలు రొట్టె కూడా తయారు చేయమన్నాడు. వంటవాడు నగల రొట్టె, మామూలు రొట్టె తయారు చేసి మంత్రికి ఇచ్చాడు.

రాజ్యంలో అత్యంత ధనికుడైన వజ్రాల వ్యాపారినీ, మరో నిరుపేద కూలీని రాజభవనానికి ఆహ్వానించాడు మంత్రి. తన వద్ద వజ్రాలు కొనడానికి తనను పిలిపించి ఉంటారని వ్యాపారి ఠీవీగా రాజభవనానికి వచ్చాడు. రాజు తనకు ఏం శిక్ష వేస్తాడన్న భయంతో కూలీ భయపడుతూ వచ్చాడు. ఇద్దరితోనూ కాసేపు మాట్లాడిన మంత్రి నగలున్న రొట్టెను వ్యాపారికీ, మామూలు రొట్టెను కూలీకి ఇచ్చాడు. వారిద్దరూ ఆశ్చర్యపడుతూనే ఆ రొట్టెల్ని తీసుకుని బయటికి వచ్చారు.

మంత్రి, రాజు భవనంపై నిలబడి వెళ్తున్న ఆ ఇద్దరినీ గమనిస్తున్నారు. బయటకి వెళ్లిన వ్యాపారి, కూలీ రాజభవనంలో రొట్టెలు కానుకగా ఇవ్వడం ఏమిటోనని ఆశ్చర్యపడ్డారు. పోనీలే తినేందుకు రొట్టె దొరకిందని కూలీ సంతోషపడ్డాడు. వ్యాపారి మాత్రం రొట్టె తినడానికి భేషజానికి పోయి కూలీ వైపు తిరిగి 'రేయ్! చూస్తే తిండికి లేని పేదవాడిలా ఉన్నావ్. ఇదిగో ఈ రొట్టె కూడా తీసుకొని తినుపో' అంటూ ఆ రొట్టె అతనికి ఇచ్చేశాడు. మరో రొట్టె కూడా తనకు దక్కినందుకు కూలీ మరింత సంబరపడ్డాడు. చేతులు దులుపుకుంటూ వ్యాపారి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఇదంతా గమనించిన మంత్రి 'చూశారా రాజా! రాజ్యంలో అతను అత్యంత ధనవంతుడు. అతనికి నగలున్న రొట్టె ఇచ్చాం. కానీ అతను తీసుకున్న నిర్ణయం ఆ రొట్టెను నిరుపేదకు అందేలా చేసింది. రాజభవనంలో కానుకగా రొట్టెలెందుకు ఇచ్చారనేది ఆ వ్యాపారి వివేకంతో ఆలోచించి ఉంటే నగలు అతని సొంతమయ్యేవి. ఇప్పటికైనా అర్థమైందా, అదృష్ట, దురదృష్టాలనేవి మన నిర్ణయాలను బట్టి మారుతుంటాయి' అన్నాడు మంత్రి. నిజమేనని రాజు అంగీకరించాడు.

అడవి పావురాళ్లు

నగరాల్లో, మనుషుల మధ్యన పావురాలు నివసిస్తాయి. అయితే అడవుల్లో, చెట్ల మీద నివసించే పావురాళ్లు కూడా ఉంటాయి. వాటిని 'ఉడ్ పిజియన్స్' అంటారు. ఫ్రాన్స్‌లో వీటిని పెంచడం, ఆదరించడం జాస్తి. ఫ్రాన్స్ వారు వీటిని ఆహారంగా కూడా భుజిస్తారు. ఈ నవంబర్, డిసెంబర్ మాసాలలో అక్కడ అడవి పావురాళ్లను వేటాడటం ఆచారం. వలలు వేసి పడతారు. ప్రకృతిలో ఆహార చక్రం విచిత్రమైనవి. ఒక జీవి మరో జీవిని తింటుంది. అలాగే ఆయా దేశాల సంస్కృతులను బట్టి అక్కడి మనుషుల ఆహార అలవాట్లు ఉంటాయి. ఒకరికి తప్పు మరొకరికి ఒప్పు. అందుకే ఇలాంటి ఆచారాలను తెలుసుకుంటూ మన కామన్‌సెన్స్‌ను బట్టి వ్యవహరించాలి. ఆ ఆచార వ్యవహారాల సంగతి ఏదీ తెలియని అడవి పావురాళ్లు ఫ్రాన్స్‌లో ఎత్తయిన చెట్టు మీద సేద తీరుతున్న దృశ్యం ఇది.

● ఫొటో చెప్పిన కథ

మరిన్ని సంస్కరణలు అవసరం

- 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు
- ప్రపంచ బ్యాంక్ నివేదిక సూచన

ప్రైవేటు మూలధన నిధులను ప్రోత్సహించాలి

న్యూఢిల్లీ: భారత్ 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు సంస్కరణలకు మరింత ప్రేరణనివ్వాలని, ప్రైవేటు మూలధన నిధుల సమీకరణకు ఊతమివ్వాలని ప్రపంచ బ్యాంక్ సూచించింది. ప్రపంచ స్థాయి డిజిటల్ ప్రజా సదుపాయాలు, ప్రభుత్వ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ఆర్థిక సేవలను అందరికీ చేరువ చేసినట్టు తాజా నివేదిక (ఆర్థిక రంగ మదింపు/ఎఫ్ఎస్ఏ) లో పేర్కొంది. ఇకపై మహిళలు తమ బ్యాంక్ ఖాతాలను మరింతగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరింది. వ్యక్తులు, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సేవలను మరింత విస్తృతం చేయాలని పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్య నిధితో కలసి ప్రపంచ బ్యాంక్ దేశాల ఆర్థిక రంగాన్ని లోతుగా, సమగ్రంగా విశ్లేషించి ఎఫ్ఎస్ఏ నివేదికను విడుదల చేస్తుంటుంది. ఈ నివేదికను ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన విడుదల చేసింది. భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలంగా, వైవిధ్యంగా, సమ్మిళితంగా మారినట్టు ప్రపంచ బ్యాంక్ ఎఫ్ఎస్ఏ నివేదిక తెలిపింది. ఆర్థిక రంగ సంస్కరణల ఫలితంగా **భారత్ కరోనా సహా పలు సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోగలిగినట్టు పేర్కొంది. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరు**కునేందుకు వీలుగా మరిన్ని ఆర్థిక రంగ సంస్కరణలతో ప్రైవేటు మూలధన పెట్టుబడులకు ఊతమివ్వాలని సూచించింది.

మెరుగైన నియంత్రణలు..

సహకార బ్యాంకులకు సైతం నియంత్రణలను విస్తరించడం వాటి సమర్థతను పెంచుతుందని ప్రపంచబ్యాంక్ పేర్కొంది. అలాగే, ఎన్‌బీఎఫ్‌సీలకు వాటి స్థాయిల ఆధారంగా నియంత్రణలను అమలు చేయడాన్ని సైతం ఆహ్వానించింది. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలకు సంబంధించి మరింత మెరుగైన పర్యవేక్షణకు వీలుగా క్రెడిట్ రిస్క్ నిర్వహణ కార్యాచరణను బలోపేతం చేయాలని సూచించింది. 2017లో చివరి ఎఫ్ఎస్ఏ నివేదిక నుంచి చూస్తే భారత జీడీపీలో క్యాపిటల్ మార్కెట్ల పరిమాణం 144 శాతం నుంచి 175 శాతానికి విస్తరించినట్టు తెలిపింది.

కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు

పీఎఫ్‌సీ లాభం అప్

- క్యూ2లో రూ. 7,834 కోట్లు
- షేరుకి రూ. 3.65 డివిడెండ్

న్యూఢిల్లీ: విద్యుత్ రంగానికి ఆర్థిక సౌకర్యాలు కల్పించే ప్రభుత్వ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 9 శాతం పుంజుకుని రూ. 7,834 కోట్లను అధిగమించింది. ఆదాయం బలపడటం ప్రధానంగా ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 7,215 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 25,755 కోట్ల నుంచి రూ. 28,901 కోట్లకు ఎగసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.65 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 26 రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. ఇంతక్రితం రూ. 4 చొప్పున తొలి డివిడెండ్ చెల్లించిన సంగతి తెలిసిందే. కాగా.. సెప్టెంబర్30తో ముగిసిన తొలి 6 నెలల కాలానికి స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.62 శాతం నుంచి 1.45 శాతానికి వెనకడుగు వేయగా.. నికర ఎన్‌పీఏలు 0.8 శాతం నుంచి 0.3 శాతానికి దిగివచ్చాయి. నెట్‌వర్త్ 15 శాతం వృద్ధితో రూ. 1,66,821 కోట్లను తాకింది. లోన్ అసెట్ బుక్ 10 శాతం మెరుగుపడి రూ. 11,43,369 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం క్షీణించి రూ. 380 వద్ద ముగిసింది.

హిందాల్కో లాభం జూమ్

క్యూ2లో రూ. 4,741 కోట్లు

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ మెటల్ రంగ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 4,741 కోట్లను తాకింది. దేశీయంగా అమ్మకాలు పుంజుకోవడం, పటిష్ట వ్యయ నియంత్రణలు, నిర్వహణ సామర్థ్యం ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,909 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతం వృద్ధితో రూ.66,058 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 58,203 కోట్ల టర్నోవర్ అందుకుంది. న్యూయార్క్ ప్లాంటులో అగ్నిప్రమాదం జరిగినప్పటికీ విదేశీ అనుబంధ సంస్థ నోవెలిస్ పనితీరు ఆదాయానికి మద్దతిచ్చినట్లు కంపెనీ పేర్కొంది. బీమా ద్వారా నష్టాలను దాదాపు భర్తీ చేసుకునే వీలున్నట్లు పేర్కొంది. అల్యూమినియం అప్‌స్ట్రీమ్ విభాగం నిర్వహణ లాభం(ఇబిటా) 22 శాతం ఎగసి రూ. 4,524 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్ఈలో స్వల్ప లాభంతో రూ. 790 వద్ద ముగిసింది.

నాల్కో లాభం రూ.1,430 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ నాల్కో సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.1,430 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.1,046 కోట్లతో పోల్చి చూస్తే 37 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.4,001 కోట్ల నుంచి రూ.4,292 కోట్లకు వృద్ధి చెందింది. వచ్చే ఐదేళ్ల కాలంలో రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికను అమలు చేయాలని నాల్కో నిర్ణయించింది. రూ.18,000 కోట్లతో కొత్త అల్యూమినియం స్మెల్టర్, రూ.12,000 బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అంతేకాదు వచ్చే ఐదేళ్లలో మహారత్న హోదా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో నాల్కో షేరు ధర 2 శాతం పెరిగి రూ.235 వద్ద స్థిరపడింది.

మెరిసిన కల్యాణ్ జ్యువెలర్స్

సెప్టెంబర్ క్వార్టర్‌లో రెట్టింపు లాభం

న్యూఢిల్లీ: ఆభరణాల విక్రయ సంస్థ కల్యాణ్ జ్యుయెలర్స్ సెప్టెంబర్ త్రైమాసికంలో పనితీరు పరంగా మెరిసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే రెట్టింపై రూ.260 కోట్లకు చేరింది. ఆదాయం సైతం 30 శాతం ఎగసి రూ.7,907 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.130 కోట్లు, ఆదాయం రూ.6,091 కోట్ల చొప్పున ఉన్నాయి. ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో రూ.264 కోట్ల లాభంతో పోల్చి చూస్తే ఫ్లాట్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. స్టోర్‌వారీ అమ్మకాల వృద్ధి 16 శాతంగా ఉంది. స్టడెడ్ (రాళ్లు, వజ్రాలు పొదిగిన) జ్యుయెలరీ ఆదాయం 36 శాతం పెరిగి రూ.2,115 కోట్లుగా ఉంది. ఫ్రాంచైజీ షోరూమ్‌ల ఆదాయం 49 శాతం పెరిగింది. మార్జిన్లు ఒక శాతం పెరిగి 6.3 శాతానికి చేరాయి. కల్యాణ్ జ్యువెలర్స్‌కు దేశవ్యాప్తంగా, మధ్యప్రాచ్య దేశాలు, యూఎస్‌లో మొత్తం 436 షోరూమ్‌లు ఉన్నాయి. దక్షిణాది కాకుండా ఇతర ప్రాంతాల్లో తన నెట్‌వర్క్‌ను ఫ్రాంచైజీ షోరూమ్‌ల రూపంలో పెంచుకోవాలని కంపెనీ నిర్ణయించింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు ఎలాంటి మార్పు లేకుండా రూ.513 వద్ద ముగిసింది.

నిరాశపరిచిన పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ

- తగ్గుముఖం పట్టిన లాభం, ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.7 డివిడెండ్

న్యూఢిల్లీ: పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ సెప్టెంబర్ త్రైమాసికంలో బలహీన పనితీరు చూపించింది. లాభం 5 శాతం తగ్గి రూ.806 కోట్లకు పరిమితమైంది. ఆదాయం 15 శాతం తగ్గి రూ.11,009 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.848 కోట్లు, ఆదాయం రూ.13,024 కోట్ల చొప్పున ఉండడం గమనార్హం. గుజరాత్‌లోని దహేజ్ ఎల్ఎన్‌జీ టెర్మినల్‌లో 211 బ్రిటిష్ థర్మల్ యూనిట్ (టీబీటీయూ) ఎల్ఎన్‌జీని ప్రాసెస్ చేసింది. మొత్తం మీద సెప్టెంబర్ త్రైమాసికంలో 228 టీబీటీయూ మేర ఎల్ఎన్‌జీని ప్రాసెస్ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలోనూ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.1,989 కోట్ల నుంచి రూ.1,656 కోట్లకు తగ్గింది. ఒక్కో షేరుకు రూ.7 చొప్పున డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు ధర ఒక శాతంపైగా పెరిగి రూ. 278 వద్ద ముగిసింది.

స్ట్రింగ్ మెటావర్స్ ఆదాయం రూ. 233 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గేమింగ్, వెబ్3 ఇన్‌ఫ్రా సేవలందించే లిస్టెడ్ సంస్థ స్ట్రింగ్ మెటావర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 233 కోట్ల ఆదాయంపై సుమారు రూ. 22 కోట్ల లాభం నమోదు చేసింది. క్రితం క్యూ2తో పోలిస్తే ఆదాయం 165 శాతం, లాభం 221 శాతం పెరిగాయి. అర్ధ సంవత్సరానికి గాను ఆదాయం రూ. 432 కోట్లకు, లాభం రూ. 40 కోట్లకు చేరాయి. గత క్యూ2లో ఆదాయం రూ. 138 కోట్లుగా, లాభం రూ. 12 కోట్లుగా నమోదయ్యాయి.

ఆస్టర్ డీఎం లాభం రూ. 110 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లాభం 13 శాతం పెరిగి రూ. 110 కోట్లుగా నమోదైంది. గత క్యూ2లో ఇది రూ. 97 కోట్లు. మరోవైపు ఆదాయం రూ. రూ. 1,086 కోట్ల నుంచి రూ. 1,197 కోట్లకు చేరింది. రెండో త్రైమాసికంలో స్థిరమైన పనితీరు సాధించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఆజాద్ మూపెన్ తెలిపారు. క్వాలిటీ కేర్ ఇండియా విలీనం విషయంలో పురోగతి సాధించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి నో అబ్జెక్షన్ లెటర్లు వచ్చినట్లు వివరించారు.

టెన్నెకో క్లీన్ ఎయిర్ @రూ. 378-397

రూ. 3,600 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల కంపెనీ టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా పబ్లిక్ ఇష్యూకి రూ. 378–397 ధరల శ్రేణి నిర్ణయించింది. ఇష్యూ ఈ నెల 12న ప్రారంభమై 14న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 11న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా రూ. 3,600 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ ప్రమోటర్ టెన్నెకో మారిషస్ హోల్డింగ్స్ విక్రయించనుంది. తద్వారా ప్రమోటర్ సంస్థ రూ. 3,600 కోట్లు అందుకోనుంది. కంపెనీ జూన్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పుడు తొలుత రూ. 3,000 కోట్ల సమీకరణకు మాత్రమే ప్రతిపాదించినప్పటికీ తదుపరి మరో రూ. 600 కోట్లమేర హెచ్చించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 37 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. యూఎస్ కంపెనీ టెన్నెకో గ్రూప్ సంస్థ ఇది. ప్రధానంగా క్లిష్టమైన, అత్యున్నత ఇంజినీర్డ్, టెక్నాలజీ ఆధారిత క్లీన్ ఎయిర్, పవర్‌ట్రెయిన్, సస్పెన్షన్ సొల్యూషన్స్ అందిస్తోంది. దేశీ ఆటో దిగ్గజాల అవసరాలకు అనుగుణంగా ప్రొడక్టులను రూపొందించడంతోపాటు విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఈ నెల 19న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే వీలుంది.

వృద్ధి 6.8 శాతానికి చేరుకోవచ్చు

- జీఎస్‌టీ తగ్గింపుతో పెరగనున్న వినియోగం
- సీఈఏ అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.8 శాతంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్ల కోత, ఆదాయపన్ను మినహాయింపులతో పెరిగే వినియోగం వృద్ధికి ఊతమిస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ''ప్రస్తుతం 6.8 శాతం వృద్ధి రేటు విషయంలో సౌకర్యంగా ఉన్నాను.

వాస్తవానికి 2025–26 సంవత్సరానికి సంబంధించి నా అంచనా 6.3–6.8 శాతం (ఆర్థిక సర్వే ప్రకారం). కనీసం 6–7 శాతం శ్రేణిలో కనిష్ట స్థాయికి వెళతామేమోనన్న ఆందోళన ఆగస్ట్‌లో వ్యక్తమైంది. ఇప్పుడు ఇది 6.5 శాతం, అంతకు మించి 6.8 శాతానికి కూడా చేరుకోవచ్చని సౌకర్యంగా చెబుతున్నాను. 7 శాతం వృద్ధి రేటు అంచనాలను వ్యక్తీకరించాలంటే, రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలు వచ్చే వరకు ఆగాల్సిందే''అని నాగేశ్వరన్ ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. 2025–26 జూన్ త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం తెలిసిందే. దీనికంటే ముందు 2024 జనవరి–మార్చి త్రైమాసికంలో 8.4 శాతం స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదైంది. ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తున్న దేశంగా భారత్ మొదటి స్థానంలో ఉండగా, 5.2 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది.

అమెరికాతో ఒప్పందం సానుకూలం

అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే దేశ వృద్ధి రేటు మరింత వేగాన్ని అందుకుంటుందని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. త్వరలోనే ఈ ఒప్పందం సాకారం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందం విషయంలో పరిష్కారం పట్ల ఇప్పటికీ సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు. భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు అమలు చేస్తుండడం తెలిసిందే. నవంబర్ నాటికి తొలి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతుండడం గమనార్హం.

రిస్క్ నియంత్రణకు కలసి పనిచేయాలి

ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్‌సేత్



ముంబై: సంస్థాగత ఆర్థిక, వాతావరణ మార్పుల రిస్క్‌ను సకాలంలో గుర్తించి, చర్యలు తీసుకునేందుకు వీలుగా సమగ్రమైన కార్యాచరణను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు సంయుక్తంగా కలసి పనిచేయాలని బీమారంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ అజయ్‌సేత్ అన్నారు.

కార్పొరేట్ గవర్నెన్స్ 10వ సదస్సును ఉద్దేశించిన ఆయన మాట్లాడారు. ఆర్థిక రంగానికి సంబంధించిన సైబర్ భద్రతా రిస్క్ నిర్వహణ విధానం ముసాయిదా 2026 ఆరంభంలో ఐఆర్‌డీఏఐ ముందుకు వస్తుందని చెప్పారు. వాతావరణ సంబంధిత రిస్క్, అవకాశాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం ద్వారా దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. అదే సమయంలో దేశ అభివృద్ధి ఆకాంక్షలు, ప్రాధాన్యతల విషయంలో రాజీపడరాదన్నారు. ఆర్థిక రంగంలో ఎన్నో విభాగాల మధ్య అంతర్గత అనుసంధానం పెరుగుతోందంటూ.. ఒక విభాగంలో సమస్యలు ఏర్పడితే ఇతర విభాగాల్లోనూ ఆర్థిక ఇబ్బందులు, అస్థిరతలు ఎదురవుతున్నట్టు అజయ్‌సేత్ చెప్పారు.

దివీస్ ల్యాబ్స్ లాభం రూ. 689 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా సంస్థ దివీస్ ల్యాబరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 689 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 510 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 35 శాతం అధికం. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2,338 కోట్ల నుంచి రూ. 2,715 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ. 1,722 కోట్ల నుంచి రూ. 1,948 కోట్లకు చేరాయి.

శుక్రవారం బీఎస్ఈలో దివీస్ ల్యాబ్స్ షేరు సుమారు మూడు శాతం క్షీణించి రూ. 6,656 వద్ద ముగిసింది.

42 రోజుల్లో 52 లక్షల వాహన విక్రయాలు

- పండుగ సీజన్ రిటైల్ అమ్మకాల్లో రికార్డు
- డీలర్ల సమాఖ్య ఫాడా గణాంకాలు వెల్లడి

న్యూఢిల్లీ: పండుగ సీజన్ 42 రోజుల్లో 52,38,401 వాహనాలు అమ్ముడైనట్లు డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో 43,25,632 యూనిట్ల విక్రయాలతో పోలిస్తే ఇవి 21% అధికమని పేర్కొంది. ప్యాసింజర్ వాహనాలు, టూ వీలర్స్ రికార్డు స్థాయి రిజిస్ట్రేషన్లు, జీఎస్టీ క్రమబద్ధీకరణతో వివిధ విభాగాల్లో వాహన ధరలు దిగిరావడంతో ఈ వృద్ధి సాధ్యమైందని ఫాడా వివరించింది. నవరాత్రి తొలిరోజు మొదలై ధనత్రయోదశి తర్వాత 15 రోజుల వరకు కొనసాగిన 42 రోజుల ఈ పండుగ సీజన్ భారత ఆటో రిటైల్ రంగంలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. అన్ని విభాగాల్లో అత్యధిక విక్రయాలు, అత్యుత్తమ వృద్ధి నమోదైందని ఫాడా అధికారులు తెలిపారు.

- ప్రయాణికుల వాహన విక్రయాలు 6,21,539 యూనిట్ల నుంచి 23% పెరిగి 7,66,918 యూనిట్లకు చేరాయి. ''సామాన్యులకు వాహన ధరలు అందుబాటులో ఉండేలా చేయడం, మధ్య తరగతి వినియోగ సామర్థ్య పెంపు లక్ష్యంగా అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ 2.0 విజన్ డీలర్‌షిప్ స్థాయి వద్ద విజయవంతమైంది. పన్ను రేట్లు తగ్గడంతో కాంపాక్ట్, చిన్న కార్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. కొన్ని మోడళ్ల డిమాండ్ సరఫరాను మించింది'' అని ఫాడా చైర్మన్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.
- ద్విచక్ర వాహన విక్రయాల్లో 22% వృద్ధి నమోదైంది. గతేడాది 33,27,198 యూనిట్లు అమ్ముడుకాగా., ఈసారి 40,52,503 యూనిట్లకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ పుంజుకోవడం, మెరుగైన ద్రవ్యలభ్యత, జీఎస్‌టీ సంస్కరణలతో ధరలు దిగిరావడంతో ఈ విభాగంలో అమ్మకాలు పెరిగినట్లు విఘ్నేశ్వర్ తెలిపారు. మోటార్‌సైకిళ్లు, స్కూటర్లతో పాటు ఈవీలకూ డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు.
- వాణిజ్య విక్రయాలు వరుసగా 15% పెరిగి 1,39,586 యూనిట్లకు చేరుకున్నాయి. త్రీ వీలర్ల రిజిస్ట్రేషన్లు 1,59,959 యూనిట్ల నుంచి 9% పెరిగి 1,74,189 యూనిట్లకు చేరాయి. ట్రాక్టర్ల అమ్మకాలు 85,199 యూనిట్ల నుంచి 97,314 యూనిట్లకు పెరిగాయి. అయితే కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్స్ 10,387 యూనిట్ల నుంచి 7,891 యూనిట్లకు తగ్గాయి. ఈ ఒక్క విభాగపు అమ్మకాల్లోనే క్షీణత నమోదైంది.
- ఇక ఒక్క అక్టోబర్‌లోనే 40,23,923 వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 28,63,354 యూనిట్లతో పోలిస్తే ఇవి 41% అధికం. తద్వారా దేశీయ ఆటో చరిత్రలో అత్యధిక రిటైల్ వాహనాలు అమ్ముడైన నెలగా అక్టోబర్ నిలిచిపోయింది.

''జీఎస్‌టీ 2.0 ప్రభావం కొనసాగింపు, స్థిరమైన గ్రామీణ ఆదాయం, పెళ్లిళ్లు, పంట సీజన్ల డిమాండ్ కారణంగా మరో 3 నెలల పాటు వాహన విక్రయాల్లో వృద్ధి నమోదు కావచ్చు. పండుగ స్పిల్‌ఓవర్ బుకింగ్స్, డీలర్ల వద్ద తగినంత నిల్వలు, ఆటో కంపెనీల కొత్త మోడళ్ల ఆవిష్కరణలు రిటైల్ విక్రయాల్లో కొనసాగుతున్న మూమెంటమ్‌ను కొనసాగిస్తాయి. ఇయర్‌ఎండ్ ఆఫర్లు, కొత్త ఏడాది రిజిస్ట్రేషన్లు కూడా మద్దతుగా నిలుస్తాయి'' ఫాడా అంచనా వేసింది.

అక్టోబర్‌లో విభాగాల వారీగా అమ్మకాలు

విభాగం	2025	2024	వృద్ధి
ప్యాసింజర్	5,57,373	5,00,578	11%
టూ వీలర్స్	31,49,846	20,75,578	52%
త్రీ వీలర్స్	1,29,517	1,22,848	5%
ట్రాక్టర్లు	73,577	64,416	14%

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-11-2025

విశాఖ	585–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	585–00
వరంగల్	587–00
రిటైల్ ధర	6.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	817.7	3.81
BAJFINANCE	1,069.60	2.66
ADANIENT	2,374.80	2.61
TATASTEEL	181.5	2.39
BAJAJFINSV	2,110.00	2.27

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	2,001.50	-4.46
TATACONSUM	1,167.00	-1.97
TECHM	1,387.20	-1.87
APOLLOHOSP	7,642.00	-1.8
INDIGO	5,604.50	-1.55

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,518
ఎన్ఎస్ఈ	1,18,391
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,91,239
ఎఫ్ఐఐ	+ 4,581
డీఐఐ	+ 6,675

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	59.69	$	59.43
బ్రెంట్	63.52	$	63.38

నెలకు రూ.4 లక్షలు సరిపోవడం లేదు!

సుప్రీంకోర్టును ఆశ్రయించిన షమీ భార్య హసీన్ జహాన్



న్యూఢిల్లీ: భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ తనకు చెల్లిస్తున్న నెలవారీ ఖర్చుల మొత్తం సరిపోవడం లేదని, దానిని మరింత పెంచాలంటూ అతని భార్య హసీన్ జహాన్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు గత రెండేళ్లుగా షమీ నెలకు రూ.4 లక్షలు హసీన్ జహాన్‌కు చెల్లిస్తున్నాడు. అయితే ఈ మొత్తం తనకు సరిపోవడం లేదని దీనికి రూ. 10 లక్షలకు పెంచమని ఆమె సుప్రీంలో కేసు వేసింది. తన కోసం రూ.7 లక్షలు, కూతురి కోసం రూ.3 లక్షలు అవసరమని ఆమె ఇందులో పేర్కొంది. షమీ ఎంతో విలాస జీవితం గడుపుతుండగా... అతను ఇస్తున్న మొత్తంతో కనీస అవసరాలు పూర్తి కాక తాను తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నానని హసీన్ పేర్కొంది. ఈ విషయంపై తగిన విధంగా స్పందించాలంటూ షమీకి సుప్రీం కోర్టుకు నోటీసులు జారీ చేసింది.

ప్రపంచకప్ పతకం అందుకోనున్న ప్రతీక

న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్‌లో చాంపియన్‌గా నిలిచిన జట్టులో కీలక పాత్ర పోషించినా... భారత ఓపెనర్ ప్రతీక రావల్‌కు విజేతకు దక్కాల్సిన పతకం లభించలేదు. టోర్నీలో 7 మ్యాచ్‌లు ఆడిన ఆమె 308 పరుగులు సాధించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం 15 మందికే ఈ మెడల్ ఇస్తారు. అయితే గాయంతో ప్రతీక టోర్నీ నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలోకి వచ్చిన షఫాలీ వర్మకు పతకం దక్కింది. దీనిపై అన్ని వైపుల నుంచి ప్రతీకపై సానుభూతి వ్యక్తమైంది. ఐసీసీ ఈ విషయంలో తమ నిబంధనలు సడలించాలని అభిమానులు కోరారు. చివరకు అందరి కోరిక నెరవేరనుంది. త్వరలోనే ఐసీసీ నుంచి తాను పతకం అందుకోనున్నట్లు ప్రతీక స్వయంగా వెల్లడించింది. 'నా పతకం విషయంలో సోషల్ మీడియాలో బాగా చర్చ జరిగింది. అయితే ఐసీసీ చైర్మన్ జై షా నాకు పతకం పంపించినట్లుగా తెలిసింది. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు నాకు కూడా పతకం ఉంది. కొంత ఆలస్యమైనా నాకు అది దక్కబోతోంది' అని ప్రతీక వ్యాఖ్యానించింది.

కన్నుల పండుగగా... హాకీ 'శతాబ్ది' వేడుక

వందేళ్ల వేడుకల్లో పాల్గొన్న దిగ్గజాలు ● అలరించిన ఎగ్జిబిషన్ మ్యాచ్ ● ఆకట్టుకున్న ఫొటో గ్యాలరీ

న్యూఢిల్లీ: భారత హాకీ శతాబ్ది వేడుక ఓ పెద్ద పండగలా నిర్వహించారు. మన జాతీయ క్రీడ అయిన హాకీకి వంద వసంతాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రముఖ మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో కేంద్ర క్రీడాశాఖ, హాకీ ఇండియా (హెచ్ఐ) ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఇందులో అలనాటి ఒలింపిక్ చాంపియన్లు గుర్‌బక్ష్ సింగ్, అస్లాం షేర్ ఖాన్ తదితర దిగ్గజాలు పాల్గొన్నారు. తదుపరి తరాలకు స్ఫూర్తిగా నిలిచిన వీరందరిని హాకీ ఇండియా పెద్దలు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, క్రీడా శాఖ సహాయ మంత్రి రక్షా ఖాడ్సే... తమ అసమాన ప్రతిభా పాటవాలతో హాకీ క్రీడకే వన్నెతెచ్చిన గుర్‌బక్ష్, అస్లామ్, హర్బిందర్, అజిత్ పాల్ సింగ్, అశోక్ కుమార్ (దివంగత దిగ్గజం ధ్యాన్‌చంద్ కుమారుడు), బీపీ గోవింద, జఫర్ ఇక్బాల్, బ్రిగేడియర్ హర్‌చరణ్ సింగ్, వినీత్ కుమార్, మీర్ రంజన్ నేగి, రోమియో జేమ్స్, అసుంత లాక్రా, సుభద్ర ప్రధాన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, క్రీడా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరంతా హాకీ దిగ్గజాల నిరుపమాన సేవల్ని కొనియాడారు. 'హాకీ క్రీడ ఎన్నో దశల్ని దాటింది. ఒలింపిక్స్ విశ్వక్రీడల్లో హాకీ ద్వారా భారత్ సత్తా ఏంటో యావత్ ప్రపంచానికి మనం చూపించాం. ఆ తర్వాత ఈ క్రీడలో భారత్ ఏడాడూ వెనక్కి తిరిగిచూసుకునే అవసరమే రాలేదంటే ఈ దిగ్గజాల విశేష కృషే కారణం. ఘనమైన చరిత్ర కలిగిన హాకీ ఇకముందు కూడా ఘనమైన విజయాలతో ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తుంది' అని క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. ముందుగా వందేళ్ల వేడుకకి ఎగ్జిబిషన్ మ్యాచ్‌తో శ్రీకారం చుట్టారు. మాండవీయ నేతృత్వంలోని స్పోర్ట్స్ మినిస్టర్స్ ఎలెవన్, హెచ్ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ సారథ్యంలో హాకీ ఇండియా జట్ల మధ్య ఈ మ్యాచ్ సరద సరదాగా జరిగింది. మహిళలు, పురుషులు కలిసే ఈ మ్యాచ్ ఆడారు. ఇందులో స్పోర్ట్స్ మినిస్టర్ జట్టు 3–1తో గెలుపొందింది. డుంగ్ డుంగ్, సలీమా టేటే, కృష్ణ ప్రసాద్‌లు చెరో గోల్ చేశారు. హాకీ ఇండియా తరపున ఏకైక గోల్‌ను మన్‌ప్రీత్ సింగ్ సాధించాడు. అ సందర్భంగా ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన చిరస్మరణీయ స్వర్ణ పతక విజయాలకు సంబంధించిన ఆ పాత మధురాలకు సంబంధించిన ఫొటో గ్యాలరీ ఆకట్టుకుంది. తన ప్రయాణం మొదలైన ఈ క్రీడ వందేళ్ల వేడుకలో పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చిందని దిలీప్ టిర్కీ అన్నారు. శతాబ్ది హాకీకి మైలురాయిలా నిలిచేలా దేశవ్యాప్తంగా 500 పైచిలుకు జిల్లాల్లో వెయ్యికి పైగా మ్యాచ్‌ల్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో పలువురు జాతీయ క్రీడాకారులతో పాటు పాఠశాల స్థాయి విద్యార్థులు సుమారు 36, 000 మంది పాల్గొన్నట్లు క్రీడాశాఖ వర్గాలు తెలిపాయి. త్వరలోనే తమిళనాడు జూనియర్ పురుషుల హాకీ ప్రపంచ కప్‌కు ఆతిథ్యమివ్వబోతోంది. ఈసందర్భంగా దేశంలోని 20 ప్రధాన నగరాల్లో ప్రపంచకప్ టూర్ జరుగుతోంది. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 10 వరకు చెన్నై, మదురై నగరాల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. మొత్తం 24 జట్లు ఆరు గ్రూపుల్లో తలపడతాయి.

చికిత

జ్యోతి సురేఖ

ఆసియా ఆర్చరీ టోర్నీకి జ్యోతి సురేఖ, చికిత

న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత స్టార్ ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, తనిపర్తి చికిత మరో మెగా ఈవెంట్‌కు సిద్ధమయ్యారు. ఆదివారం బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మొదలయ్యే ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్), చికిత (తెలంగాణ) భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిద్దరు కాంపౌండ్ విభాగంలో పోటీపడతారు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ పురుషుల రికర్వ్ విభాగంలో బరిలోకి దిగుతాడు.

ఆసియా ఆర్చరీ పోటీలకు భారత జట్లు

మహిళల కాంపౌండ్ విభాగం: వెన్నం జ్యోతి సురేఖ, తనిపర్తి చికిత, ప్రీతిక, దీప్షిక. పురుషుల కాంపౌండ్ విభాగం: అభిషేక్ వర్మ, ప్రథమేశ్ పుజి, ప్రథమేశ్ జావ్కర్, సాహిల్ జాదవ్. **పురుషుల రికర్వ్ విభాగం:** బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, యశ్‌దీప్, రాహుల్. మహిళల రికర్వ్ విభాగం: అంకిత, దీపిక కుమారి, అన్షిక కుమారి, సంగీత.

అర్జున్

అర్జున్, హరికృష్ణ విజయం

హరికృష్ణ

పనాజీ: ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మూడో రౌండ్‌లో భారత నంబర్ వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్... చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణ... తమిళనాడుకు చెందిన ప్రణవ్ శుభారంభం చేశారు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ తొలి గేమ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ అర్జున్ 30 ఎత్తుల్లోషమ్సిదిన్ వొఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్)పై, ప్రపంచ 36వ ర్యాంకర్ హరికృష్ణ 25 ఎత్తుల్లో డేనియల్ దర్ధా (బెల్జియం) పై... ప్రపంచ 86వ ర్యాంకర్ ప్రణవ్ 102 ఎత్తుల్లో టిటాస్ స్ట్రెమావిసియస్ (లిథువేనియా)పై విజయం సాధించారు. నేడు జరిగే రెండో గేమ్‌ను అర్జున్, హరికృష్ణ, ప్రణవ్'డ్రా' చేసుకుంటే నాలుగో రౌండ్‌కు అర్హత సాధిస్తారు.

మరోవైపు భారత్‌కే చెందిన క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, ప్రాణేశ్, దీప్తాయన్ ఘోష్, ఎస్ఎల్ నారాయణన్, విదిత్ సంతోష్ గుజరాతి, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ మూడో రౌండ్‌లో తమ తొలి గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. గుకేశ్–ఫ్రెడరిక్ స్వేన్ (జర్మనీ) గేమ్ 34 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద–రాబర్ట్ హోవ్‌నిసియాన్ (అర్మేనియా) గేమ్ 30 ఎత్తుల్లో... ప్రాణేశ్–విన్సెంట్ కీమర్ (జర్మనీ) గేమ్ 85 ఎత్తుల్లో... దీప్తాయన్–గాబ్రియేల్ సర్గాసియన్ (అర్మేనియా) గేమ్ 60 ఎత్తుల్లో... నారాయణన్–యు యాంగీ (చైనా) గేమ్ 117 ఎత్తుల్లో... విదిత్–స్యామ్ షాంక్‌లాండ్ (అమెరికా) గేమ్ 32 ఎత్తుల్లో... కార్తీక్ వెంకటరామన్–డేనియల్ బొగ్డాన్ (రొమేనియా) గేమ్ 65 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. నేడు వీరి మధ్య జరిగే గేమ్‌లో గెలిచిన వారు నాలుగో రౌండ్‌కు చేరుకుంటారు. గేమ్‌లు 'డ్రా' అయితే ఆదివారం టైబ్రేక్ ద్వారా విజేతలను నిర్ణయిస్తారు.

హడలెత్తించిన ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్

దక్షిణాఫ్రికా 'ఎ' 221 ఆలౌట్

అకెర్మన్ సెంచరీ ● భారత్ 'ఎ'కు 34 పరుగుల ఆధిక్యం

ప్రసిధ్ కృష్ణ

ఆకాశ్‌దీప్

మార్కెస్ అకెర్మన్

బెంగళూరు: భారత పేస్ త్రయం ప్రసిధ్ కృష్ణ (3/35), ఆకాశ్ దీప్ (2/28), సిరాజ్ (2/61) దక్షిణాఫ్రికా 'ఎ'పై నిప్పులు చెరిగారు. దీంతో రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ'కు తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగుల స్వల్ప ఆధిక్యం సంపాదించింది. రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ ఆడిన సఫారీ 'ఎ' జట్టు 47.3 ఓవర్లలో 221 పరుగుల వద్ద ఆలౌటైంది. మొత్తం 11 మందిలో ఏకంగా 8 మంది బ్యాటర్లు సెనొక్వనే (0), జుబేర్ హమ్జా (8), బవుమా (0), ఎస్తర్‌హ్యూజెన్ (0), టియాన్ వాన్ (6), కైల్ సిమండ్స్ (5), షెపొ మొరెకి (4 నాటౌట్), ఒకులె సెలె (0)లను భారత సీమర్లు సింగిల్ డిజిట్‌కే కట్టడి చేశారు. అయితే మిడిలార్డర్ బ్యాటర్, కెప్టెన్ మార్కెస్ అకెర్మన్ (118 బంతుల్లో 113; 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కడం వల్లే దక్షిణాఫ్రికా 'ఎ' జట్టు 200 పైచిలుకు స్కోరు చేయగలిగింది. ఓపెనర్ జోర్డాన్ హెర్మన్ (26), టెయిలెండర్ ప్రెనెలన్ సుబ్రేన్ (20) రెండు పదుల స్కోర్లు చేశారు. స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, హర్ష్ దూబేలకు చెరో వికెట్ దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్ మొదలు పెట్టిన భారత్ 'ఎ' జట్టు ఆట నిలిచే సమయానికి 24 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (0) డకౌట్ కాగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (26 బ్యాటింగ్; 3 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. సాయి సుదర్శన్ (23; 5 ఫోర్లు), దేవదత్ పడిక్కల్ (24; 3 ఫోర్లు) ఇరవై పైచిలుకు స్కోర్లు చేశారు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన కుల్దీప్ యాదవ్ (0 బ్యాటింగ్)తో కలిసి రాహుల్ క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని ప్రస్తుతం భారత్ ఓవరాల్‌గా 112 పరుగుల ఆధిక్యంలో ఉంది. చేతిలో ఏడు వికెట్లున్నాయి.

ఉతప్ప, చిప్లి సిక్సర్లతో...

● పాక్‌ను చిత్తు చేసిన భారత్ ● హాంకాంగ్ సిక్సెస్ టోర్నీ

హాంకాంగ్: రాబిన్ ఉతప్ప (11 బంతుల్లో 28; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), భరత్ చిప్లి (13 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించడంతో పాకిస్తాన్ చిత్తయ్యింది. హాంకాంగ్ ఇంటర్నేషనల్ సిక్సెస్ 6–ఎ–సైడ్ క్రికెట్ టోర్నీలో పూల్ 'సి'లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 2 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. మొదట భారత్ నిర్ణీత 6 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. కెప్టెన్ దినేశ్ కార్తీక్ (6 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడాడు. మొహమ్మద్ షహజాద్ 2, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీశారు. అనంతరం వర్షం వల్ల లక్ష్యాన్ని 3 ఓవర్లలో 44 పరుగులుగా సవరించారు. అయితే పాక్ ఈ 3 ఓవర్లలో వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది. ఖాజా నఫే (9 బంతుల్లో 18 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), సమద్ (6 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) గెలిపించేందుకు విఫల యత్నం చేశారు. స్టువర్ట్ బిన్నీకి ఒక వికెట్ దక్కింది.

అఫ్గాన్ 6 ఓవర్లలోనే 148/2

పూల్ 'ఎ'లో అఫ్గానిస్తాన్ 49 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. మొదట అఫ్గాన్ 6 ఓవర్లలో 2 వికెట్లకు 148 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ నయీబ్ (12 బంతుల్లో 50), కరీమ్ జనత్ (11 బంతుల్లో 46) చెలరేగారు. తర్వాత దక్షిణాఫ్రికా నిర్ణీత 6 ఓవర్లలో 2 వికెట్లకు 99 పరుగులు చేసి ఓడింది.

స్కూలులోని మసీదులో పేలుళ్లు.. 55 మందికి గాయాలు

జకార్తా: ఇండోనేసియా రాజధాని జకార్తాలోని ఓ స్కూలులో ఉన్న మసీదులో పేలుళ్లు సంభవించాయి. శుక్రవారం మధ్యాహ్నం నమాజు సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 55 మందికి గాయాలయ్యాయి. వీరిలో అత్యధికులు విద్యార్థులని అధికారులు తెలిపారు. మసీదు వెలుపల, లోపల వెంటవెంటనే సంభవించిన రెండు పేలుళ్లతో విద్యార్థులు భయకంపితులై పరుగులు తీశారు. గాయపడిన 55 మందిలో సుమారు 30 మంది ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోగా, మరో 20 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. బొమ్మ తుపాకులు మసీదు వద్ద లభించాయని, పేలుళ్లకు కారణాలు తెలుసుకునే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు.

అమెరికాలోని న్యూయార్క్ నగరం గ్రీన్‌బుష్ ప్రాంతంలో 75 అడుగుల ఎత్తు, 11 టన్నుల బరువైన నార్వే స్ప్రూస్ చెట్టును ఇలా భారీ క్రేన్ సాయంతో పెకిలించి, ట్రక్కులో న్యూయార్క్ నగరంలోని రాక్‌ఫెల్లర్ సెంటర్‌కు తరలించారు. శనివారం దీన్ని క్రిస్మస్ ట్రీగా అలంకరించనున్నారు.

'ప్రాణం పోసుకున్న' పెద్దాయన!

అంత్యక్రియలకు ముందే అద్భుతం

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లోని ఒక ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. చనిపోయాడనుకున్న 70 ఏళ్ల పెద్దాయన అంత్యక్రియల ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుడే ఊహించని అద్భుతం జరిగింది. పెద్దాయన తిరిగి శ్వాస తీసుకోవడం ప్రారంభించాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది.

ఆశలన్నీ వదిలేసుకున్నాక..

'నవంబర్ 1న మా తండ్రి మఖన్ లాల్ వైద్య్‌కు బ్రెయిన్ హెమరేజ్ కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాం. మా నాన్నకు ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. కానీ కొంత సమయం తర్వాత ఆయన ఆరోగ్యం క్షీణించడంతో లైఫ్ సపోర్ట్‌పై ఉంచారు'.. అని వృద్ధుని కొడుకు సంజయ్ వైద్య్ వివరించారు. ఎన్నాళ్లయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో, ఆయన్ను ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. గురువారం ఆస్పత్రిలో లైఫ్ సపోర్ట్ తీసేసిన తర్వాత, వృద్ధుని శ్వాస ఆగిపోయి, చనిపోయారని కుటుంబం భావించింది.

ఇంటికి తెచ్చిన అర్ధగంటలో..

'నేను మా నాన్నగారి మరణ వార్తను, అంత్యక్రియల వివరాలతో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలుపెట్టాం, మా బంధువులు, పరిచయస్తులు ఇంటికి రావడం ప్రారంభించారు'.. అని సంజయ్ వివరించారు. అయితే.. ఆయనను ఇంటికి తీసుకువచ్చిన అర్ధగంటలోనే పెద్దాయన మళ్లీ శ్వాస తీసుకోవడం ప్రారంభించారు!. ఈ సంఘటనను అద్భుతంగా అభివర్ణించిన సంజయ్ వైద్య్, తన తండ్రి ప్రస్తుతం ఇంట్లో కోలుకుంటున్నారని చెప్పారు. 'మా నాన్న త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం'.. అని చెప్పిన వైద్య్, తన తండ్రి క్షేమంగా ఉన్నారని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

\- ఇండోర్

ఢిల్లీ దర్బార్‌లో బారాత్!

కల్యాణ వేదికలుగా చారిత్రక కట్టడాలు

ఇకపై ఢిల్లీలోని పలు చారిత్రక ప్రదేశాలలో వివాహాలు జరుపుకోవడం ఇక కల కానేకాదు.. ఎందుకంటే, త్వరలోనే ఈ అద్భుతమైన కట్టడాలను వివిధ వేడుకల కోసం అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎంపిక చేసిన వారసత్వ కట్టడాలను పెళ్లిళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు బుక్ చేసుకునేందుకు అనుమతించే పథకం ప్రస్తుతం సిద్ధమవుతోందని ఓ అధికారి తెలిపారు. ఢిల్లీ ఆర్కియాలజీ శాఖ పరిధిలోని అనేక స్మారక చిహ్నాలను ఇప్పటికే ఎంపిక చేశారు.

నార్తర్న్ రిడ్జ్‌లోని మ్యుటినీ మెమోరియల్

1857 తిరుగుబాటులో మరణించిన సైనికులకు గుర్తుగా 1863లో నిర్మితమైంది.

కశ్మీర్ గేట్‌లోని దారా షికో లైబ్రరీ

ఇది ఒకప్పుడు మొఘల్ యువరాజు దారా షికో నివాసం, ఆ తర్వాత బ్రిటిష్ కార్యాలయంగా మారింది.

మక్బరా పైక్

మొఘల్ కాలం నాటి సమాధి. ఇది ఇంపీరియల్ కొరియర్‌లలో ఒకరికి చెందినదని భావిస్తున్నారు.

సాధనా ఎన్‌క్లేవ్‌లోని సమాధి

ఇది లోడీ కాలం నాటి నిర్మాణం. ఇది తొలి ఇండో–ఇస్లామిక్ నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తుంది.

ఖుద్సియా గార్డెన్‌లోని పెవిలియన్లు

18వ శతాబ్దపు ప్యాలెస్ కాంప్లెక్స్‌లో భాగం. చక్రవర్తి ముహమ్మద్ షా భార్య అయిన ఖుద్సియా బేగం దీనిని నిర్మించారు. వీటితో పాటు, లోడి, సయ్యద్ కాలాల నాటి మధ్య యుగపు సమాధులు, గోడల అవశేషాలున్న వసంత విహార్‌లోని ప్రాంతాలు, ప్రఖ్యాత ఉర్దూ కవి మీర్జా గాలిబ్ నివాసమైన గాలిబ్ హవేలీ (చాందినీ చౌక్), ప్రయాణికుల విశ్రాంతి గృహంగా భావించే 14వ శతాబ్దపు గోపుర నిర్మాణమైన బరాలాయో కా గుంబద్ వంటివి కూడా పెళ్లి వేడుకలకు వేదికలుగా మారే అవకాశం ఉంది. ఇలాంటి వారసత్వ వేదికల బుకింగ్ ఫీజుపై జీఎస్టీలో సడలింపు కూడా అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. మరి ఈ అద్భుతమైన చారిత్రక వేదికల్లో వేడుకలు జరుపుకోవాలనే ఆలోచన మీకు ఉందా?..

\- న్యూఢిల్లీ

పోలీసు బాస్ 'గీతోపదేశం'

శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు భగవద్గీత తరగతులు

పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికై శిక్షణ పొందుతున్న వారందరికీ భగవద్గీత తరగతులు నిర్వహించాలని మధ్యప్రదేశ్ పోలీసుల శిక్షణ విభాగం నిర్ణయించింది. ఇది వారు ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని ఎనిమిది శిక్షణ పాఠశాలల సూపరింటెండెంట్లకు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (శిక్షణ) రాజాబాబు సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో దాదాపు 4,000 మంది యువతీ యువకులు తొమ్మిది నెలల పాటు కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్నారు, ఇది గత జూలైలో ప్రారంభమైంది.

రామచరితమానస్ పఠనం

ఐపీఎస్ అధికారి సింగ్, ఈ శిక్షణ తరగతులను జూలైలో ప్రారంభించినప్పుడే.. రామచరితమానస్ పఠనానికి కూడా ఆదేశించారు. ఇది వారిలో క్రమశిక్షణను పెంపొందిస్తుందని అప్పుడే ఆయన స్పష్టం చేశారు. తాజాగా, శిక్షణ పాఠశాలల డైరెక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, సాధ్యమైతే, శ్రీకృష్ణుడి పవిత్ర మాసమైన మార్గశిరంలో శిక్షణలో భాగంగా... కనీసం భగవద్గీతలోని ఒక అధ్యాయాన్ని చదవడం ప్రారంభించాలని సూచించారు. కాగా, ఈ అధికారి గతంలో 2019 ప్రాంతంలో గ్వాలియర్ రేంజ్ పోలీసు అధిపతిగా పనిచేస్తున్నప్పుడు కూడా ఇలాంటి ప్రచారాన్ని ప్రారంభించి, స్థానిక జైలు ఖైదీలు, ఇతరులకు భగవద్గీత ప్రతులను పంపిణీ చేశారు.

\- భోపాల్

మోదీ-నితీశ్ ట్రాక్ రికార్డుపై జన విశ్వాసం

- తొలి దశలో రికార్డు స్థాయి ఓటింగ్‌కు అదే నిదర్శనం
- బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై పరోక్షంగా మండిపాటు

పట్నా: మోదీ–నితీశ్ ట్రాక్ రికార్డుపై బిహార్ ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబర్చారని, తొలి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు కావడానికి ఇదే నిదర్శనమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే బ్రహ్మాండమైన విజయం సాధించడం తథ్యమని పునరుద్ఘాటించారు. రాబోయే ఓటమికి కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే సాకులు వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. శుక్రవారం బిహార్‌లోని ఔరంగాబాద్, బబువాలో ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. తొలి దశలో 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసినందుకు సంతోషంగా ఉందన్నారు. పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘాన్ని ప్రశంసించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైందని, ఈ ఘనత మన తల్లులు, సోదరీమణులకు దక్కుతుందని స్పష్టంచేశారు. పోలింగ్ బూత్‌లకు వెల్లువలా తరలివచ్చి, ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తానని మోదీ స్పష్టంచేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక అంశాలను ప్రస్తావించారు.

కాంగ్రెస్ అసలు రంగు ఏమిటో తెలుసుకోవాలి

''కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని ఆ పార్టీ నాయకుడు(తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి) అంటున్నారు. దీనిపై మరోసారి మాట్లాడుతా. కాంగ్రెస్ అసలు రంగు ఏమిటో ప్రజలు తెలుసుకోవాలి. నెహ్రూ–గాంధీ కుటుంబం చాలామందిని రాజకీయంగా అణచివేసింది. బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను రాజకీయంగా అంతం చేయడానికి ప్రయత్నించింది. రాజకుటుంబం కంటే మరొకరు ఉన్నతంగా ఎదగడం కాంగ్రెస్‌కు నచ్చదు. బిహార్ బిడ్డలు బాబు జగ్జీవన్‌రామ్, సీతారామ్ కేసరీలను కాంగ్రెస్ అవమానించింది''అని ప్రధాని మోదీ మండిపడ్డారు.

పైలట్‌పై నెపం వేయొద్దు

ఎయిరిండియా విమాన ప్రమాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా ఘోర విమాన ప్రమాదానికి చీఫ్ పైలట్‌దే కారణమని ఎవరూ నిందవేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రాథమిక నివేదికలో కూడా ఆయనపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఈ విషయమై ఎలాంటి మనోవేదనకు గురికావద్దని చీఫ్ పైలట్ తండ్రి అయిన 91 ఏళ్ల వృద్ధుడిని కోరింది. 'ఇదో ప్రమాదం మాత్రమే. ఘటనకు కారణాలు ఏవైనా కావచ్చు, అందుకు పైలట్‌దే బాధ్యతని ఈ దేశంలోని 142 కోట్ల మందిలో ఏ ఒక్కరూ భావించడం లేదు. అవసరమైన పక్షంలో, ఆ దురదృష్టకర ఘటనకు చీఫ్ పైలట్ బాధ్యుడు కాదంటూ వివరణ కూడా ఇస్తాం'అని కూడా తెలిపింది. జూన్ 12వ తేదీన చోటుచేసుకున్న ఈ విషాదంలో 260 మంది ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. అహ్మదాబాద్ ఘటనకు దారితీసిన కారణాలపై సుప్రీం రిటైర్డు న్యాయమూర్తి సారథ్యంలో విచారణ జరిపించాలంటూ పుష్కరాజ్ సభర్వాల్, భారత పైలట్ల సమాఖ్య పిటిషన్లు వేశారు. తన కుమారుడి 30 ఏళ్ల సర్వీసులో ఎన్నడూ ఎలాంటి ఆరోపణలు రాలేదని పుష్కరాజ్ పేర్కొన్నారు. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం శుక్రవారం పైవ్యాఖ్యలు చేసింది.

ఈ విషయంలో కేంద్రంతోపాటు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కు నోటీసు జారీ చేసింది. పైలట్ చేసిన తప్పిదాలంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన కథనం, గుర్తు తెలియని అధికార వర్గాల సమాచారమే ఈ అనుమానాలన్నిటికీ ప్రధాన కారణమని ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు సీనియర్ లాయర్ శంకర నారాయణన్ అన్నారు. 'విదేశీ మీడియా కథనాలను మేం పట్టించుకోం. భారత్‌పై నెపం వేసే ఉద్దేశంతో వెలువడిన కథనమది. పైలట్ తప్పిదమేనంటూ ఈ దేశంలో ఎవరూ విశ్వసించడం లేదు'అని ధర్మాసనం పేర్కొంది. ఆ కథనం కారణంగా పిటిషనర్ బాధపడుతున్నట్లయితే, ఇందుకు విరుగుడు అమెరికా కోర్టులోనే ఉంది. ఆయన అక్కడ పిటిషన్ వేయొచ్చు. మీ ఆవేదనను అర్థం చేసుకోగలం. అక్కడ వాస్తవం వేరు, విదేశీ మీడియా కథనాలు వేరు'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జూలై 12వ తేదీన విమాన ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్(ఏఏఐబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదికలోని ఒక పేరాను చదివిన ధర్మాసనం.. అందులో పైలట్, కోపైలట్ మధ్య జరిగిన సంభాషణ మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలన్న శంకరనారాయణన్ వినతిపై స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతం చేపట్టిన దర్యాప్తు పద్ధతి ప్రకారమే సాగుతోందని వ్యాఖ్యానించింది. దర్యాప్తును సవాల్ చేయడమంటే, ఎయిర్‌క్రాఫ్ట్ చట్టాన్ని కూడా అనుమానించినట్లేనని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీన మిగతా పిటిషన్లతో కలిపి విచారిస్తామని పేర్కొంది.

వివాదాస్పద భూ ఒప్పందం రద్దు

- అది ప్రభుత్వ భూమి అని పార్థకు తెలియదు
- కుమారుడిని వెనకేసుకొచ్చిన అజిత్ పవార్

ముంబై: ప్రభుత్వ భూమిని డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కుమారుడి సంస్థకు కట్టబెట్టడం వివాదాస్పదం కావడంతో మహారాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే సంబంధిత తహశీల్దార్‌పై సస్పెండ్ వేటు వేసిన ప్రభుత్వం, తాజాగా రూ.300 కోట్ల విలువైన ఆ భూ విక్రయ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ విషయాన్ని అజిత్ పవార్ శుక్రవారం మీడియాకు తెలిపారు. అంతకుముందు, ఆయన సీఎం ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. 'పుణె నగరంలోని మౌజె ముంధ్వా ప్రాంతంలో ఉన్న ఆ 40 ఎకరాల భూమి ప్రభుత్వ ఆస్తి. దానిని విక్రయించరాదు. ఈ విషయం తన కుమారుడు పార్థ పవార్‌కు, అతడి వ్యాపార భాగస్వామి దిగ్విజయ్ పాటిల్‌కు తెలియదు. భూ విక్రయం, రిజిస్ట్రేషన్ వెనుక ఎవరున్నారనేది దర్యాప్తులోనే తేలుతుంది. ఆ భూమిని పార్థకు చెందిన సంస్థకు విక్రయించాలంటూ ప్రభుత్వం ఒత్తిడి చేయలేదు'అని అజిత్ పవార్ వివరించారు. భూ రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లిన ముగ్గురిలో తన కుమారుడు లేడన్నారు. కేవలం భూ ఒప్పందం మాత్రమే జరిగిందని చెప్పిన ఆయన.. భూ బదిలీ, చెల్లింపులు చేయలేదని చెప్పారు. ఈ సేల్‌డీల్‌ను రద్దు చేయాలంటూ సంబంధిత అధికారులకు తిరిగి పత్రాలను పంపించారని చెప్పారు. ఈ విషయంలో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రభుత్వ భూమిని అనధికారికంగా రిజిస్ట్రేషన్ చేసిన ఈ మొత్తం వ్యవహారంపై అదనపు ప్రధాన కార్యదర్శి వికాస్ ఖర్గే సారథ్యంలోని బృందం దర్యాప్తు చేపట్టనుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టాన్ని కూడా ఈ బృందం అంచనా వేసి నెలరోజుల్లో నివేదిక అందిస్తుందని పేర్కొన్నారు. అయితే, ఈ భూమి మార్కెట్ విలువ రూ.1,800 కోట్ల వరకు ఉంటుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దళితులకు కేటాయించిన ఆ భూమిని ప్రభుత్వం కొట్టేసిందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ మొత్తం వ్యవహారం డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కనుసన్నల్లోనే జరిగిందని ఉద్యమ కారుడు అన్నా హజారే తప్పుబట్టారు.

ఎన్నికల చోరీతోనే మోదీ ప్రధాని అయ్యారు..!

ఢిల్లీలో ఓటేసిన వాళ్లే... బిహార్‌లోనూ వేశారు

- బీజేపీ నేతలపై కాంగ్రెస్ నేత రాహుల్ ఆరోపణలు



బంకా: ఓట్లనే కాదు, కాషాయ దళం ఏకంగా ఎన్నికలనే చోరీ చేస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల చోరీతోనే నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యారన్నారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో చేసినట్లే బీజేపీ చోరీ చేసిందని, గుజరాత్‌లో మళ్లీ మళ్లీ ఇదే జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని జెన్ జెడ్‌కు, యువతకు ఆధారాలతో సహా కాంగ్రెస్ చూపిస్తుందని, ఇందులో సందేహమే లేదని తెలిపారు. బీజేపీ నేతలే లక్ష్యంగా ఆయన మరోసారి ఓట్ చోరీ ఆరోపణలు చేశారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఓటేసిన బీజేపీ నేతలు కొందరు, బిహార్ అసెంబ్లీ మొదటి విడత పోలింగ్‌లోనూ పాల్గొని ఓటేశారని విమర్శించారు. సంబంధించిన పేర్లు తదితర వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. బిహార్‌లోని బంకాలో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. హరియాణాలో చోటుచేసుకున్న ఓట్ చోరీపై కాంగ్రెస్ పార్టీ ఆధారాలను అందజేసినా ఎన్నికల కమిషన్ మాత్రం ఖండించలేదన్నారు. హరియాణా ప్రభుత్వం చోరీతో ఏర్పాటైన ప్రభుత్వమని ధీమాతో చెప్పగలనన్నారు. గతేడాది జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందన్నారు. రాష్ట్ర ఓటరు జాబితాలోని 2 కోట్లకుగాను కనీసం 25 లక్షల నకిలీ పేర్లున్నాయని, బీజేపీని గెలిపించేందుకు ఎన్నికల కమిషన్ ఆ పార్టీతో కుమ్మక్కయిందని విమర్శించారు. ఈసారి బిహార్‌లో అలా కానివ్వబోమన్నారు. ఇందుకు ప్రజలు అనుమతించరని తెలిపారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఎన్డీయే ప్రభుత్వం యువతను సోషల్ మీడియాలో రీల్స్ చేసుకోవాలంటూ ప్రేరేపిస్తోందని రాహుల్ వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దపు వ్యసనమే రీల్స్ అన్నారు. బిహార్ రైతులకు బ్యాంకులు రుణాలివ్వడం లేదు, రుణాలను మాఫీ చేయడం లేదని భాగల్పూర్‌లో జరిగిన ర్యాలీలో ఆయన ఆరోపించారు. కానీ, ఇష్టమైన కార్పొరేట్ సంస్థల రుణాలను మాత్రం రద్దు చేస్తోందన్నారు. బీజేపీ మీడియాను చెప్పుచేతల్లో పెట్టుకుందన్నారు. రోజులో 24గంటలూ ప్రధాని మోదీ మొహం చూపించేందుకు టీవీ చానెళ్లకు బీజేపీ భారీగా చెల్లింపులు చేస్తోందని పేర్కొన్నారు.

రహస్య అణుకార్యకలాపాలు పాక్‌కు అలవాటే: భారత్

న్యూఢిల్లీ: పాకిస్తాన్ అణ్వాయుధాలను రహస్యంగా పరీక్షిస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం స్పందించింది. దశాబ్దాలుగా కొనసాగిస్తున్న దొంగ రవాణా, ఎగుమతి నియంత్రణ నిబంధనల ఉల్లంఘనలు, రహస్య ఒప్పందాల చుట్టూ పాకిస్తాన్ రహస్య అణు కార్యకలాపాలు కేంద్రీకృతమై ఉన్నాయని వ్యాఖ్యానించింది. పాకిస్తాన్ అణు బాంబు రూపకల్పనలో ప్రముఖంగా ఉన్న ఏక్యూ ఖాన్ చర్యలతోపాటు ఆ దేశం అణ్వస్త్రాలను సమకూర్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలపై అంతర్జాతీయ సమాజాన్ని భారత్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వస్తోందని తెలిపింది. దొంగచాటుగా అణు పరీక్షలు జరిపిన చరిత్ర పాకిస్తాన్ సొంతమని ఎద్దేవా చేసింది. పాకిస్తాన్, చైనాలు గుట్టుచప్పుడు కాకుండా అణ్వస్త్రాలను పరీక్షిస్తున్నందున, తాము కూడా అలా చేస్తే తప్పేలా అవుతుందని ట్రంప్ ఇటీవల సమర్థించుకోజూడటం తెల్సిందే.

రష్యా సైన్యంలో 44 మంది భారతీయులు

న్యూఢిల్లీ: రష్యా ఆర్మీలో పనిచేస్తున్న భారత పౌరుల సంఖ్య 44కు చేరుకుందని కేంద్రం శుక్రవారం తెలిపింది. ఈ విషయాన్ని రష్యా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, మిలటరీలోకి భారత పౌరుల నియామకాలను నిలిపివేయాలని కోరినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. రష్యాలో చదువుకునే, వ్యాపార వీసాలపై వెళ్లిన భారతీయులను బలవంతంగా మిలటరీలో చేర్చుకుని, ఉక్రెయిన్‌లోని యుద్ధ క్షేత్రాలకు పంపిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి చర్యలను ఆపేయాలని రష్యా సర్కారును కోరామని విదేశాంగ శాఖ తెలిపింది.

చైనా అమ్ముల పొదిలో అత్యాధునిక నౌక

నేవీ చేతికి ఫుజియాన్ విమాన వాహన నౌక

- ప్రపంచంలో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ వ్యవస్థ ఉన్న రెండో నౌకగా గుర్తింపు
- ఇప్పటివరకు అమెరికా యూఎస్ఎస్ గెరాల్డ్ ఫోర్డ్‌కు మాత్రమే ఈ సామర్థ్యం
- చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమక్షంలో ఫుజియాన్ కమిషనింగ్

బీజింగ్: వాణిజ్యంలోనూ, సైనిక శక్తిలోనూ అమెరికాను ఢీకొడుతున్న చైనా.. తన నౌకాదళాన్ని మరింత శక్తిమంతం చేసే చర్యల్లో మరో ముందడుగు వేసింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫుజియాన్ విమాన వాహక నౌకను నౌకాదళానికి అందించింది. ఇందులో అత్యంత ఆధునికమైన ఎలక్ట్రోమ్యాగ్నటిక్ వ్యవస్థ (ఈమల్స్)ను అమర్చారు. ఈ వ్యవస్థ ఇప్పటివరకు ప్రపంచంలో అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లో మాత్రమే ఉంది. ఇటీవల హైనాన్ ప్రావిన్స్‌లోని సన్యా పోర్టులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్వయంగా ఈ నౌకను నౌకాదళానికి అందించినట్టు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ జిన్‌హువా పేర్కొంది. అయితే, ఈ నౌకలో ఇంకా ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం వాడారన్న విషయాన్ని చైనా అత్యంత గోప్యంగా ఉంచుతోంది. అయితే, ఆ దేశ మీడియా రిపోర్టుల ప్రకారం ఈ నౌకపై జే–15టీ, జే–35, కాంగ్‌జింగ్–600 వంటి యుద్ధ విమానాలను మోహరించనున్నట్టు తెలిసింది. నౌకపై ఈ విమానాల టేకాఫ్, ల్యాండింగ్ టెస్టులు పూర్తయ్యాకే కమిషనింగ్ చేశారని జిన్‌హువా పేర్కొంది. ఈ నౌక బరువు 80 వేల టన్నులు.

ఎమిటీ ఈమల్స్?

విమాన వాహక నౌక పైనుంచి యుద్ధ విమానాలు రాకపోకలు సాగించటమే అత్యంత కీలకమైన అంశం. చాలా తక్కువ నిడివి ఉండే రన్‌వే పై టేకాఫ్ కావటం, ల్యాండింగ్ చేయటం క్లిష్టమైన పని. సంప్రదాయ విమానవాహక నౌకలో ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో విమానాన్ని బయటి నుంచి నియంత్రించేందుకు టర్బైన్ టెక్నాలజీని వాడుతారు. గెరాల్డ్ ఆర్ ఫోర్డ్, ఫుజియాన్‌లో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ టెక్నాలజీని వాడారు. ఈ వ్యవస్థ ద్వారా యుద్ధ విమానం తక్కువ సమయంలో ఎక్కువ శక్తి పుంజుకుని గాల్లోకి ఎగిరేందుకు బయటి నుంచి శక్తిని అందిస్తారు. ల్యాంగింగ్ సమయంలోనూ విమానం నిర్దేశిత ప్రదేశాన్ని దాటి ముందుకు వెళ్లి సముద్రంలో పడిపోకుండా ఈ అయస్కాంత శక్తి నియంత్రిస్తుంది. సంప్రదాయ టెక్నాలజీలతో పోల్చితే ఎలక్ట్రో మ్యాగ్నటిక్ వ్యవస్థ సాంకేతికంగా క్లిష్టమైనదే అయినప్పటికీ.. దాని నిర్వహణ సులభం. అయితే, ఏవైనా సమస్యలు వస్తే మాత్రం రిపేర్లకు చాలా ఖర్చవుతుంది.

అమెరికాను మించి చైనా నౌకాశక్తి

ప్రపంచంలో అత్యంత భారీ నౌకాదళం ఉన్న దేశంగా అమెరికాను వెనక్కు నెట్టి చైనా అవతరించింది. అమెరికా వద్ద ప్రస్తుతం 219 యుద్ధ విమానాలు ఉండగా, చైనా వద్ద 234 ఉన్నాయి. చైనా వద్ద ఇప్పటికే ఉన్న మూడు విమాన వాహక నౌకలు సంప్రదాయ ఇంధన శక్తితో పనిచేస్తాయి. దీంతో ఆ దేశం కొత్తగా అణుశక్తితో నడిచే దలియాన్ అనే నాలుగో విమాన వాహక నౌకను నిర్మిస్తోంది. భారత్ వద్ద ఐఎస్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య అనే రెండు విమాన వాహక నౌకలు ఉన్న సంగతి తెలిసిందే. దక్షిణ చైనా సముద్రంతోపాటు సుదూర సముద్ర ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని చాటుకొనేందుకు చైనా నౌకా శక్తిని భారీగా పెంచుతోందని చైనా మిలిటరీ వ్యవహారాల నిపుణుడు ఝాంగ్ జున్‌షే ఆ దేశ వార్తా సంస్థ గ్లోబల్ టైమ్స్‌తో తెలిపారు.

రేప్ బాధితులకు పరిహారం ఇప్పించండి

దిగువ కోర్టులను ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ: అత్యాచారం, లైంగిక దాడి కేసుల్లో అవసరమని భావించిన పక్షంలో బాధితులకు పరిహారం కూడా చెల్లించేలా ఆదేశాలివ్వాలని సుప్రీంకోర్టు శుక్రవారం సెషన్స్ కోర్టులు, పోక్సో కోర్టులను ఆదేశించింది. ఈ విషయంలో అభిప్రాయం తెలపాల్సిందిగా శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి, జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ(నల్సా)ను ఆదేశించింది. అధికారుల నిర్లక్ష్యం, చిన్నచూపు కారణంగా అత్యాచార బాధితులకు న్యాయపరంగా దక్కాల్సిన పరిహారం దక్కడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన 25 ఏళ్ల మానసికలోపం కలిగిన బాధితురాలికి సీఆర్‌పీసీలోని 357ఏ ప్రకారం ఇవ్వాల్సిన పరిహారాన్ని అధికారులు నిరాకరిస్తున్నారని పిటిషన్‌దారు పేర్కొన్నారు. ఈ విషయంలో సెషన్స్ కోర్టులు లేదా స్పెషల్ కోర్టులు సరైన ఆదేశాలివ్వకపోవడం, అవగాహన లోపమే ఈ పరిస్థితికి కారణమని ధర్మాసనం తెలిపింది.

ప్రాపర్టీ రిజిస్ట్రేషన్‌కు బ్లాక్‌చైన్ టెక్నాలజీ: సుప్రీం

న్యూఢిల్లీ: ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నవీకరించేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ వాడకంపై ఒక సమగ్ర నివేదికను తయారు చేసి ఇవ్వాలని సుప్రీంకోర్టు శుక్రవారం లా కమిషన్‌ను ఆదేశించింది. వలస పాలన కాలం నాటి చట్టాల్లో సంస్థాగతమైన లోపాలున్నాయంది. మ్యుటేషన్ రుజువులు లేదా జమాబందీ లేకుండా సేల్/గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కుదరదంటూ 2019లో బిహార్ ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ చట్టాన్ని కొట్టివేసింది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ వాడకంతో అన్ని ప్రాపర్టీ లావాదేవీల్లో పారదర్శకత, భద్రతతోపాటు, మార్పులకు అవకాశం లేని డిజిటల్ రికార్డు సాధ్యమని పేర్కొంది. ఇందులో మ్యాపులు, సర్వే డేటా, రెవెన్యూ రికార్డులు కలిసి ఉంటాయని, చాలా సులువైన విధానమని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్యా బగ్చీల ధర్మాసనం తెలిపింది.

1303లో ఓరుగల్లుపై దండెత్తిన ఢిల్లీ సుల్తాన్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

అనపోతనాయకుడు తన రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు.

కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

ప్రసాదిత్య నాయకుడి కుమారుడు వెన్నమ నాయకుడు ప్రతాపరుద్రుడి సేనానిగా ప్రసిద్ధుడు. 1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కాకతీయ రాజ్యంపై చేసిన దండయాత్రను తిప్పికొట్టిన వారిలో ఇతడు ప్రముఖుడు. వెన్నమ నాయకుడి కుమారుడు ఎరదాచానాయకుడు, సబ్బినాయకుడి కుమారుడు(ప్రసాదిత్య నాయకుడి మనవడు) నలదాచా నాయకుడు కూడా ప్రతాపరుద్రుడి సేనానులే. కాకతీయులకు పాండ్య రాజుల (1316)తో, హోయసాల రాజులతో జరిగిన యుద్ధాల్లో ఎరదాచానాయకుడు కీలక పాత్ర పోషించాడు. ప్రతాపరుద్రుడు ఇతడి పరాక్రమానికి మెచ్చి పంచ పాండ్యదళ విభాళ, పాండ్య గజకేసరి అనే బిరుదులిచ్చాడు.

ఎరదాచానాయకుడికి ముగ్గురు కుమారులు. వారు ఒకటో సింగమనాయకుడు, వెన్నమనాయకుడు, ఏచమనాయకుడు. నలదాచానేనికి మాధవ నాయకుడు, దామానేడు అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో సింగమనాయకుడు (1326–1361) ప్రసిద్ధుడు. తండ్రితోపాటు పాండ్య యుద్ధంలో పాల్గొని చిన్నతనంలోనే పరాక్రమం చూపాడు. కంపిలి రాజ్యంతో జరిగిన యుద్ధం (1320)లో కూడా విజయం సాధించి ప్రతాపరుద్రుడి ప్రశంసకు పాత్రుడయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ల దాడిలో ప్రతాపరుద్రుడు బందీ అయ్యాక మహ్మద్ బిన్ తుగ్లక్ మాలిక్‌ను ఓరుగల్లు పాలకుడిగా నియమించాడు. ముసునూరి ప్రోలయ నాయకుడు, సింగమనాయకుడు, వేమారెడ్డి ముస్లింలను ఎదిరించి స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. ముసునూరి ప్రోలయనాయకుడు తీరాంధ్ర నుంచి తురుష్కులను వెళ్లగొట్టాడు. ఇతడి తర్వాత పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు రాజయ్యాడు. కాపయనాయకుడి నాయకత్వంలో సింగమనాయకుడు, వేమారెడ్డి తదితరులు ఏకమై 1336లో ఓరుగల్లును ఆక్రమించారు. కాపయ ఓరుగల్లు పాలకుడయ్యాడు. సింగమ నాయకుడు వారసత్వంగా వచ్చిన ఆమనగల్లు రాజ్యంలో స్వతంత్రించాడు. అంతేగాక ఈ సమయంలో సింగమనాయకుడు తన కుమారులతో కలిసి మహబూబ్ నగర్ ప్రాంతాన్ని, కృష్ణా, తుంగభద్ర మధ్య ప్రాంతాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

రెడ్డి, వెలమ రాజ్యాల వైరం

చక్రవర్తి కావాలనుకున్న కాపయనాయకుడు సింగమనీడు పాలిస్తున్న ఆమనగంటి రాజ్యాన్ని ఆక్రమించి తన ప్రతినిధిగా ఎరబోతు లెంకను నియమించాడు. కాపయ ఆక్రమించిన ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని సింగమనీడు 1360 ప్రాంతంలో తిరిగి జయించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన కాపయ సామంతులు, స్నేహితులైన క్షత్రియులు సింగమనేని బావమరిదైన చింతపల్లి సింగమ నాయుడిని ఓరుగల్లు మండలంలోని జల్లపల్లి కోటలో బంధించారు. సింగమనీడు ఈ కోటను ముట్టడించాడు. క్షత్రియులు సంధి పేరుతో తంబళ్ల బ్రహ్మజీని రాయబారిగా పంపి సింగమను హత్య చేయించారు. అతడి కుమారులు అనపోతా నాయకుడు, మాదానాయుడు రాజులై జల్లిపల్లి, ఇనుగుర్తి కోటలను ముట్టడించి క్షత్రియులను చంపి పగతీర్చుకున్నారు. కొందరు క్షత్రియులు హుజూరాబాద్, మొలంగూరు కోటల్లో దాచుకున్నారు. కరీంనగర్ జిల్లా మొలంగూరు సమీపంలోని చెంజర్ల వద్ద దాక్కొన్న సోమవంశ క్షత్రియులనందరినీ 1361లో సంహరించారు.

ఈ సమయంలో కాపయ ప్రోత్సాహంతో క్షత్రియులకు సహాయంగా వచ్చిన రెడ్డి రాజులను మాదానాయకుడు, నాగానేడు చేజెర్ల, మొగళ్లూరు ప్రాంతం నుంచి తరిమి వేశారు. శ్రీశైలం ప్రాంతమంతటినీ జయించి తమ రాజ్యంలో కలుపుకున్నారు. తర్వాత రెడ్డి రాజ్యభాగమైన ధరణికోటను ముట్టడించి అనపోతారెడ్డిని ఓడించారు. ఈ యుద్ధం 1361లో చెంజర్ల యుద్ధం తర్వాత జరిగింది. ఈ యుద్ధంతో మొదలైన రెడ్డి, వెలమ రాజ్యాల వైరం ఈ రాజ్యాల పతనం దాకా కొనసాగింది. క్షత్రియుల్లో కొందరు భువనగిరి ప్రాంతం చేరి అనపోతనాయకుడి శత్రువులను కలుపుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు. అనపోతా నాయకుడు భువనగిరి సమీపంలో మూసీనది తీరంలో ఇంద్ర్యాల వద్ద వీరిని జయించాడు. ఈ యుద్ధం కూడా 1361లోనే జరిగింది. భువనగిరి కోట అనపోతనాయకుడి వశమైంది.

పద్మనాయకుల పైచేయి

ఈ విజయాల అనంతరం అనపోతనాయకుడు రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు. ఇరు రాజ్యాల ఆధిపత్య పోరే ఈ యుద్ధానికి కారణం. ఆంధ్ర దేశాధీశ్వరులమని ఇరువురూ చెప్పుకోవడం అందుకు నిదర్శనం. ఈ యుద్ధం 1369లో ముగిసింది. ఓరుగల్లు ప్రాంతం పద్మనాయకుల వశమైంది. ముసునూరి వంశం అంతమైంది. ఓరుగల్లు, భువనగిరి, సింగవరం మొదలైన ప్రాంతాలను అనపోతానాయకుడు స్వాధీనం చేసుకున్నాడు.

ఓరుగల్లు స్వాధీనమయ్యాక ఆంధ్రదేశమంతటినీ జయించాలనే ఉద్దేశంతో అనపోతా నాయకుడు కళింగ మీద దండెత్తాడు. వీర నరసింహదేవుడు యుద్ధంలో ఓడిపోయి తన కుమార్తె కనక లక్ష్మీదేవిని అనపోతనాయకుడి మనవడైన రెండో అనపోతనకిచ్చి సంధి చేసుకున్నాడు. ఇది 1380కి ముందు జరిగింది. అప్పటికి పద్మనాయక రాజ్యానికి ఉత్తరాన గోదావరి, దక్షిణాన శ్రీశైలం, తూర్పున కొండవీటి రాజ్యం, పశ్చిమాన బహమనీ రాజ్యం సరిహద్దులు. అంటే తెలంగాణ ప్రాంతమంతా పద్మనాయకుల పాలనలోకి వచ్చింది. అప్పటి నుంచి ఒక శతాబ్దం వరకూ పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర అని చరిత్రకారులు చెప్పిన మాట వాస్తవం.

దాయాదుల పాలన

పై విజయాలు పూర్తయ్యాక రాజ్యవిస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా దేవరకొండ ప్రాంతానికి తన సోదరుడైన మాదానాయకుడిని అధిపతిగా నియమించాడు. అప్పట్నుంచి రాచకొండ రాజ్యంలోని దక్షిణభాగాన్ని మాదానాయకుడి సంతతి పరిపాలించింది. రెండు రాజ్యకేంద్రాలు ఏర్పడినప్పటికీ ఇరు కుటుంబాల మధ్య ఎన్నడూ పొరపొచ్చాలు రాకపోవడం చరిత్రలో అరుదైన అంశం. అనపోతానాయకుడి కుమారులు రెండో సింగభూపాలుడు, ధర్మానాయకుడు. మాదానాయకుడి కుమారుడు వేదగిరి నాయకుడు.

అనపోతానాయకుడి తర్వాత రెండో సింగభూపాలుడు 1384లో రాచకొండలో సింహాసనం అధిష్టించాడు. అదే సంవత్సరం దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు అధికారంలోకి వచ్చాడు. సింగభూపాలుడి రాజ్య ఆరంభకాలంలో విజయనగరరాజు రెండో హరిహరరాయలు రాచకొండ రాజ్యంలోని కొత్త కొండ (మహబూబ్‌నగర్)పై దండెత్తాడు. సింగ భూపాలుడు విజయనగర సైన్యాలను ఓడించాడు. తాను యువ రాజుగా ఉన్నప్పుడే కల్యాణి (గుల్బర్గా) దుర్గాన్ని ఆక్రమించిన అనుభవం ఈ యుద్ధంలో ఉపయోగపడింది. ఈ యుద్ధం తర్వాత సింగ భూపాలుడు కళింగ దేశాన్ని జయించడానికి వెళ్లి గోదావరి జిల్లాలోని బెండపూడి, వేములకొండ ప్రాంతాల్ని జయించి 1387లో సింహాచల క్షేత్రంలో శాసనం వేయించాడు.

1397లో రెండో బుక్కరాయలు పాత పగతో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని పానుగల్లు కోటను రెండు సంవత్సరాల యుద్ధానంతరం స్వాధీనం చేసుకున్నాడు. ఈ సమయంలోనే రెండో బుక్కరాయలు దేవరకొండ మీద దండెత్తగా, పెద వేదగిరినాయకుడు తన కుమారుడైన మూడో మాదానీడును పంపి ఓడించాడు. ఇతడు విజయనగర సైన్యాధ్యక్షుడైన గుండదండాధీశుడిని సంహరించి ఓరుగల్లును ఆక్రమించాడని వెలుగోటి వంశావళి తెలుపుతోంది. రెండో సింగభూపాలుడికి ఆరుగురు కుమారులు. వారిలో పెద్దవాడైన రెండో అనపోతానాయకుడు (1400–1420), సింగభూపాలుడి అనంతరం రాజ్యానికి వచ్చాడు. అధికారం చేపట్టగానే మెదక్ దుర్గాన్ని ఆక్రమించిన విజయనగర సైన్యాలను తరిమేశాడు.

విజయనగర రాజులతో మైత్రి

రెండో హరిహరరాయల మరణానంతరం వారసుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి రెడ్డి పెద కోమటి వేమారెడ్డి మధ్య వైరం మొదలైంది. ఇదే అదనుగా భావించిన అనపోతానాయుడు విజయనగర రాజ్యంపై దండెత్తి చెన్నపట్నం వరకు ఉన్న భూభాగాలను ఆక్రమించాడు. కొండవీటి రెడ్ల ఆధీనంలోని వాడపల్లి, చిలుకూరు, వేదాద్రులను జయించాడు. దీంతో కొండవీటి రాజులు, బహమనీ ఫిరోజ్ షాలు ఒక్కటయ్యారు. దీంతో అనపోతానాయకుడు విజయనగర రాజులతో మైత్రి చేసి, వారి సాయంతో పానగల్లు (మహబూబ్‌నగర్) మీద దాడిచేసిన ఫిరోజ్‌షా సైన్యాలను ఓడించి తమ పూర్వరాజ్య భాగమైన పానగల్లును వశపరచుకున్నాడు.

ఇదే సమయంలో కొండవీటి రాజు పెద కోమటి వేమారెడ్డి దేవరకొండ రాజ్యంపై దండెత్తి పినవేదగిరిని సంహరించాడు. దీంతో అనపోతానాయుడు విజయనగర రాజుల సహాయంతో కొండవీడును ముట్టడించి వేమారెడ్డిని సంహరించాడు. కొండవీడు రాజ్యాన్ని పద్మనాయకులు, విజయనగరాధీశులు, గజపతులు ఆక్రమించారు (మిగిలిన కొద్ది భాగాన్ని పాలించిన రాచవేమారెడ్డితో కొండవీటి రాజ్యం అంతరించింది.) పద్మనాయకుల ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన గొప్ప పరాక్రమవంతుడు అనపోతానాయుడు. ఇతడు విజయనగర రాజులతో మైత్రి చేసినందువల్ల బహమనీయులు శత్రుభావం పెంచుకున్నారు. అందువల్ల పద్మనాయక రాజ్యానికి ముప్పు తలెత్తింది.

రెండో అనపోతానాయుడి తర్వాత అతడి కుమారులు చిన్న వారు కావడం వల్ల అతడి చిన్న తమ్ముడు రావు మాదానాయుడు రాజయ్యాడు. దేవరకొండ రాజ్యంలో అంతకు ముందే పెదవేదగిరి మూడో మనవడూ, మూడో మాదానీ చిన్న కుమారుడూ అయిన లింగమనీడు రాజ్యానికొచ్చాడు. బహమనీ ఫిరోజ్‌షా కుమారుడు అహ్మద్‌షా పానగల్లు యుద్ధంలో జరిగిన అవమానానికి ప్రతీకారంగా విజయనగరంపై దండెత్తాడు. విజయనగర రాజులతో మైత్రి ఉండటం వల్ల మాదానీడు, లింగమనీడు విజయనగరం పక్షాన యుద్ధం చేశారు. ఇరు సైన్యాల ధాటికి తట్టుకోలేక అహ్మద్‌షా లొంగిపోయి 1422లో విజయనగరంతో సంధి చేసుకున్నాడు.

ఈ యుద్ధంలో మాదానీడు విజయనగర పక్షం వహించడం వల్ల బహనీయులు (అహ్మద్ షా) పద్మనాయకులపై పగ పెంచుకున్నారు. తమ ఇరువురి మధ్య జరిగిన సంధి వల్ల విజయనగర రాజులు పద్మనాయకులకు దూరమయ్యారు. దీంతో పద్మనాయకుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇదే అదనుగా అహ్మద్‌షా ఓరుగల్లు మీద దాడి చేశాడు. మూడో సింగభూపాలుడు తన పినతండ్రి రావు మాదానీడు, లింగమనేనిల సహాయంతో అజిమ్‌ఖాన్‌లాంటి సర్దారులను ఓడించి 1425లో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. రెండో అనపోతానేని కుమారుడైన సింగభూపాలుడు సింహాసనాన్ని అధిష్టించాడు. సింగమనాయకుడు పదేళ్లపాటు ఏ ఇబ్బంది లేకుండా రాజ్యాన్ని పాలించాడు. ఇతడు పోతనను, శ్రీనాథుడిని ఆదరించి కవి పండిత పోషకుడిగా పేరొందాడు.

బహమనీల దాడి

మాళవ, గుజరాత్ దేశాలతో పోరాడుతున్న అహ్మద్‌షా వారితో సంధి చేసుకొని తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. కళాపోషకుడైన సింగమ నాయకుడు సహజంగానే యుద్ధ విముఖుడు కాబట్టి అహ్మద్‌షాను ఎదుర్కొనకుండానే సంధి చేసుకొని భువనగిరిని వదులుకున్నాడు. పైకి సంధికి అంగీకరించిన అహ్మద్‌షా భువనగిరిలో సంజర్‌ఖాన్‌ను నియమించి వెళ్లాడు. కానీ తెలంగాణ మొత్తాన్నీ జయించమని సంజర్‌ఖాన్‌ను ఆదేశించాడు. సంజర్‌ఖాన్ 1436లో ఓరుగల్లును ఆక్రమించాడు. దేవరకొండ మినహా తెలంగాణ అంతా బహమనీయుల వశమైంది. బహమనీ రాకుమారుడు దాసూర్‌ఖాన్ రాచకొండ ప్రతినిధి అయ్యాడు. ఆ తర్వాత సింగమనాయకుడి చరిత్ర, పద్మనాయక చరిత్ర లింగమనీడు చరిత్రతో కలిసిపోయింది. 1420లో దేవరకొండ శాఖలో రాజ్యానికొచ్చిన లింగమనీడు పద్మనాయక రాజుల్లో మరో గొప్ప పరాక్రమవంతుడు లింగమనీడు ఏకధాటిగా 32 దుర్గాలను జయించడం అందుకు నిదర్శనం. ఇతడు సింగమనాయకుడితో కలిసి అహ్మద్‌షా ఆక్రమించిన ఓరుగల్లును 1425లో జయించాడు. తర్వాత 1428 నాటికి తూర్పు దండయాత్రల్లో అల్లయ వేమారెడ్డిని, వీరభద్రారెడ్డిని ఓడించి రాజమండ్రి, సింహాచలాన్ని జయించాడు.

తర్వాత వేములకొండ, మామిడాల, సప్తమాడియాలు, ఆవంచ, గంగవరాలను ఆక్రమించాడు. ఈ సమయంలోనే కళింగ గంగరాజైన నాలుగో భానుదేవుణ్ణి తొలగించి కపిలేశ్వర గజపతి కళింగ సింహాసనాన్ని అధిష్టించాడు. అధికారంలోకి రాగానే రెడ్డి రాజ్యభాగాల్లో ప్రవేశించాడు. ఈ ఆక్రమణను, లింగమనీడు విజృంభణనూ సహించని విజయనగర దేవరాయలు తెలుంగ రాయలను సింహాచలంపైకి పంపాడు. దీంతో గజపతులు, లింగమనీడు వెనక్కి మరలాల్సి వచ్చింది. ఈ పరిస్థితి వీరిద్దరూ చేయికలపడానికి దారితీసింది. అలా కపిలేశ్వర గజపతి సహాయంతో లింగమనీడు మెదట కొండవీడు ప్రాంతాలను జయించాడు. శ్రీశైలాన్ని ఆక్రమించాడు.

అతిథి గ్రహాలు అని వేటిని పిలుస్తారు?

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

సాంఘిక శాస్త్రం

జాగ్రఫీ

1. లిటిల్ అండమాన్ -కార్ నికోబార్ దీవుల మధ్య ఉన్న చానల్?
   1) 8° 2) 9°
   3) 10° 4) డంకన్ చానల్
2. ముంబై – పుణెల మధ్య ఉన్న కనుమ ఏది?
   1) పాల్ ఘాట్ 2) థాల్ ఘాట్
   3) బోర్ ఘాట్ 4) షీన్ ఘాట్
3. ఉష్ణోగ్రత వల్ల అధికంగా బీటలు వారే నేలలు ఏవి?
   1) ఒండలి నేలలు 2) నల్ల నేలలు
   3) లాటరైట్ నేలలు 4) ఎర్ర నేలలు
4. భారతదేశం ఏ నిల్వలను అధికంగా కలిగి ఉంది?
   1) ప్లుటోనియం 2) ప్లాటినం
   3) థోరియం 4) యురేనియం
5. 2011 భారతదేశ జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనాభా గల రెండో రాష్ట్రం ఏది?
   1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
   3) మహారాష్ట్ర 4) బిహార్
6. ఆంధ్రప్రదేశ్‌లో ఏ జిల్లాలో వంశధార ప్రవహిస్తోంది?
   1) నెల్లూరు 2) విశాఖపట్నం
   3) శ్రీకాకుళం 4) కర్నూలు
7. విజ్జేశ్వరం సహజవాయువు విద్యుత్ కేంద్రాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
   1) 1989 2) 1990
   3) 1980 4) 1979
8. నువ్వుల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ఎన్నో స్థానంలో ఉంది?
   1) 2 2) 4 3) 5 4) 7
9. క్వార్ట్జ్ నిక్షేపాలు ఉన్న జిల్లా?
   1) గుంటూరు 2) నెల్లూరు
   3) ప్రకాశం 4) పైవన్నీ
10. '+' దేనికి సాంకేతిక చిహ్నంగా వాడతారు?
   1) నూనె బావి 2) ఊట బావి
   3) బావి 4) ఏదీకాదు
11. వాతావరణంలో ఎక్కువగా ఉండే మూలకం ఏది?
   1) ఆక్సిజన్ 2) ఆర్గాన్
   3) నైట్రోజన్ 4) కార్బన్‌డైఆక్సైడ్
12. 'ధూళి మేఘ' సిద్ధాంత కర్త ఎవరు?
   1) చాంబర్లీన్ మౌల్టన్
   2) క్లాడియసెటాలమ్ 3) లాప్లెస్
   4) ఇమ్మాన్యుయేల్ కాంట్
13. అతిథి గ్రహాలు అని వేటిని పిలుస్తారు?
   1) ఉల్కలు 2) తోకచుక్కలు
   3) ప్లానిటాయిడ్స్ 4) ఉపగ్రహాలు
14. ప్రతి గ్రహణం మళ్లీ అదే రీతిలో ఏర్పడాలంటే పట్టే కాలం?
   1) 10సం॥ 18 రో॥ 2) 18సం॥ 10రో॥
   3) 16సం॥ 18రో॥ 4) 18సం॥ 18రో॥
15. కిందివాటిలో విలుప్త అగ్నిపర్వతాన్ని గుర్తించండి?
   1) వెసూవియస్ 2) హెల్రా కోలా
   3) అకన్ గువా 4) ఆరావళి
16. భూకంప నాభి లోతు పెరిగే కొద్దీ?
   1) భూకంప నాభి విస్తరిస్తుంది
   2) భూకంపం సంభవించే ప్రాంతం విస్తరిస్తుంది
   3) భూకంప తీవ్రత పెరుగుతుంది.
   4) R తరంగాలు ఏర్పడవు
17. సమాచార వ్యవస్థ పొర అని ఏ వాతావరణ పొరని పేర్కొంటారు?
   1) ఎక్సో ఆవరణం 2) థర్మో ఆవరణం
   3) మిసో ఆవరణం 4) స్ట్రాటో ఆవరణం
18. భూమి సగటు ఉష్ణోగ్రత?
   1) 11°C 2) 13°C
   3) 9°C 4) 22°C
19. కిందివాటిలో పర్వత పాద పీఠభూమి?
   1) మెక్సికో 2) యాంట్రిమ్
   3) పెటగోనియా 4) ఓజార్క్
20. యూరప్ ఖండానికి వెచ్చని దుప్పటిగా అభివర్ణించే సముద్ర ప్రవాహం?
   1) ఉత్తర భూమధ్యరేఖా ప్రవాహం
   2) ఉత్తర అట్లాంటిక్ డ్రిఫ్ట్
   3) బెంగ్యులా ప్రవాహం
   4) దక్షిణ అట్లాంటిక్ డ్రిఫ్ట్
21. ఆస్ట్రేలియా ఎడారిలో నివసించే తెగ?
   1) బుష్‌మెన్‌లు 2) బిడానియన్స్
   3) బిండిబాలు 4) హిన్స్ పల్లా
22. శృంగాకారపు అడవులు ఉన్న ప్రాంతం?
   1) ఆర్కిటిక్ ప్రాంతం
   2) ఉప ఆర్కిటిక్ ప్రాంతం
   3) మధ్యధరా ప్రాంతం
   4) రుతుపవన మండలం
23. ప్రపంచ సార్డైన్ రాజధాని మాంటెరె ఏ మండలంలో ఉంది?
   1) స్టెప్పీ మండలం 2) సవన్నా మండలం
   3) మధ్యధరా మండలం
   4) భూమధ్యరేఖా మండలం
24. ఆసియాలో గొప్ప జలపాతం?
   1) ఏంజెల్ 2) నయాగరా
   3) కోహినే 4) జోగ్‌ఫాల్స్
25. దక్షిణ అమెరికా ఖండంలో మధ్యధరా శీతోష్ణస్థితి గల ప్రాంతం?
   1) పెరూ 2) పరాగ్వే
   3) ఈక్వెడార్ 4) చిలీ

హిస్టరీ

26. ఏ ప్రజలు తమ అనుభవాలను గుహ చిత్రాలుగా గీసేవారు?
   1) రామాపిథికస్ 2) ఆస్ట్రోపిథికస్
   3) హోమో ఎరక్టస్ 4) హోమోసెపియన్స్
27. సూర్యుడు ప్రధానదైవంగా గల నాగరికత?
   1) ఈజిప్ట్, సుమేరియా
   2) మెసపటోమియా, సుమేరియా
   3) పర్షియన్, సుమేరియా
   4) ఈజిప్ట్, చైనా
28. ఆర్యుల కాలంలో 'భాగ' అంటే?
   1) భూస్వాములు 2) పురోహితులు
   3) సేనాపతి 4) భాగదుగ
29. అకామినిడ్ రాజ్యంలో అధికార భాష?
   1) మాండరిన్ 2) పర్షియన్
   3) గ్రీకు 4) హిబ్రూ
30. కజ్ రాజధాని నగరంగా గల నాగరికత?
   1) మయా 2) ఇన్‌కాస్
   3) అజెటెక్స్ 4) కుష్
31. చైనాలో ఏ రాజ వంశస్తులు ఫార్మోసాను జయించి తమ భూభాగంలో కలుపుకున్నారు?
   1) టాంగ్ 2) సుంగ్
   3) సూయి 4) మింగ్
32. సింధు నాగరికత లక్షణం కానిది?
   1) హరప్పా, మొహంజొదారోల్లో కోటల నిర్మాణం
   2) సర్కోతాదలో గుర్రం ఎముకలు లభించాయి
   3) సింధు ప్రజలది మాతృస్వామిక వ్యవస్థ
   4) హరప్పా ప్రజలు ద్రవిడ లిపిని ఉపయోగించారు
33. సోమ, సుర పానీయాల గురించి వివరించిన వేదాలు ఏవి?
   1) యజుర్వేదం 2) రుగ్వేదం
   3) సామవేదం 4) అథర్వణ వేదం
34. జైన మతం వాస్తు శిల్పకళ ఉన్న ఉదయగిరి గుహలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) రాజస్థాన్ 2) కర్ణాటక
   3) మహారాష్ట్ర 4) ఒడిశా
35. ఉగ్రసేనుడు అనే బిరుదు ఉన్న రాజు?
   1) శిశునాగుడు 2) కాలాశోకుడు
   3) ధననందుడు 4) మహాపద్మనందుడు
36. మెహరోలి ఉక్కుస్తంభం ఏ గుప్తరాజు కాలానికి చెందింది?
   1) సముద్రగుప్తుడు 2) రామగుప్తుడు
   3) రెండో చంద్రగుప్తుడు
   4) రెండో కుమారగుప్తుడు
37. చేబ్రోలు భీమేశ్వరాలయం నిర్మాత ఎవరు?
   1) రెండో పులకేశి 2) కుబ్జవిష్ణువర్ధనుడు
   3) నరసింహవర్మ 4) చాళుక్య భీముడు
38. పల్లవుల కాలంలో గ్రంథమైన 'కురుశ్' రచయిత ఎవరు?
   1) తిరుమంగై 2) నామల్ వార్
   3) తిరువల్లువర్ 4) భారవి
39. మొదటి తరైన్ యుద్ధం జరిగిన కాలం?
   1) 1191 2) 1192
   3) 1195 4) 1190
40. ఇల్‌టుట్‌మిష్.. ముల్తాన్ పాలకుడు నాసిరుద్దీన్ కుబాచాను ఏ సంవత్సరంలో ఓడించాడు?
   1) 1216 2) 1217
   3) 1218 4) 1219
41. పశ్చిమ బెంగాల్‌లో భక్తి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన భక్తి ఉద్యమకారులు?
   1) రామానందుడు, మీరాబాయి
   2) నామదేవ్, తుకారాం
   3) చైతన్యుడు, వల్లభాచార్యుడు
   4) తుకారాం, చైతన్యుడు
42. గోపాలకృష్ణ గోఖలే సూచన మేరకు అహ్మదాబాద్‌లో గాంధీజీ సబర్మతీ ఆశ్రమాన్ని ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1914 2) 1915
   3) 1916 4) 1918
43. ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్యుద్ధంలో ఉరిశిక్షకు గురైన ఇంగ్లండ్ రాజు?
   1) మొదటి జేమ్స్ 2) 2వ ఛార్లెస్
   3) మొదటి ఛార్లెస్ 4) 2వ జేమ్స్
44. రూసోను మార్గదర్శకుడిగా ప్రకటించుకున్న ఫ్రాన్స్ జాతీయ ఉద్యమ నాయకుడు?
   1) జోసెఫ్ మాజినీ 2) గారిబాల్డీ
   3) బిస్మార్క్ 4) నెపోలియన్
45. కాంగో, సెనెగల్, ఐవరీకోస్ట్‌లను ఆక్రమించుకున్న దేశం?
   1) పోర్చుగల్ 2) ఇటలీ
   3) ఫ్రాన్స్ 4) ఇంగ్లండ్
46. నానాజాతి సమితి వైఫల్యానికి కారణం?
   1) 26 రాజ్యాల ప్రతినిధులు ప్రపంచశాంతి పరిరక్షణకు చేసిన ప్రయత్నం విఫలం
   2) గ్రీస్– బల్గేరియా వివాదం
   3) పోలండ్.. లిత్వేనియాకు చెందిన విల్నాను ఆక్రమించడం
   4) డాంజింగ్‌ను స్వేచ్ఛా నగరంగా ప్రకటించడం
47. జపాన్‌లో భూస్వామ్య విధానం రద్దు చేసి, పాశ్చాత్య విధానాలు, యూరప్ తరహా విధానాలను ప్రవేశపెట్టిన జపాన్ చక్రవర్తి?
   1) టోకుగవా షోగునేట్
   2) ముత్సుషిటో (మెయిజీ)
   3) కోమిన్ టర్న్ 4) షెమొనోషికి

ఎకనామిక్స్

48. ఆర్థిక శాస్త్రంలో ఆర్థిక వృద్ధి భావనకు ప్రాధాన్యతను ఇచ్చిన ఆర్థికవేత్త?
   1) జాకోబ్ వైనర్
   2) లయోనల్ రాబిన్స్
   3) పాల్ శామ్యూల్ సన్ 4) ఆల్‌ఫ్రెడ్ మార్షల్
49. బొగ్గు, విద్యుత్ మొదలైన శక్తి వనరులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మూలధన వస్తువులు
   3) మాధ్యమిక వస్తువులు 4) ఏదీకాదు
50. డిమాండ్ రేఖ ఎడమ నుంచి కుడికి కిందికి వాలి ఉండటానికి కారణం?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ప్రత్యామ్నాయ ప్రభావం
   3) ఆదాయ ప్రభావం 4) పైవన్నీ
51. సప్లయ్‌ని నిర్ణయించే అంశం కానిది?
   1) ప్రభుత్వ విధానాలు
   2) ఉత్పత్తి కారకాల ధరలు
   3) వస్తువు ధరలు
   4) వినియోగదారుని ఆదాయం
52. విత్త విధానాన్ని రూపొందించి అమలు పరిచే ప్రధాన విభాగం?
   1) RBI 2) వాణిజ్య బ్యాంక్
   3) కేంద్ర ప్రభుత్వం 4) ప్రపంచ బ్యాంక్
53. ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తిని జాతీయాదాయం అని అంటారు. దీని సమీకరణాన్ని సూచించండి?
   1) C+I+G+(x–m)+(R–P)
   2) C+I+G+(x–m)+(R–P)–D
   3) C+I+G+(x–m)+(R–P)–IT+S–D
   4) C+I+G+(x–m)+(R–P)–IT+S
54. స్థూల జాతీయోత్పత్తికి, పరోక్ష పన్నులకు మధ్య తేడా?
   1) వ్యయార్హ ఆదాయం 2) వ్యక్తిగత ఆదాయం
   3) మార్కెట్ ధరల వద్ద జాతీయాదాయం
   4) ఉత్పత్తి కారకాల వ్యయం వద్ద జాతీయాదాయం
55. వార్షిక ఆర్థిక నివేదికలో కోశ లోటు, వడ్డీ చెల్లింపుల భేదాన్ని ఏమంటారు?
   1) రెవెన్యూ లోటు 2) బడ్జెట్ లోటు
   3) కోశ లోటు 4) ప్రాథమిక లోటు
56. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1974 2) 1975
   3) 1976 4) 1978
57. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కనీస సభ్యుల సంఖ్య ఎంత?
   1) 5 2) 4 3) 2 4) 3
58. ద్వితీయ రంగ ఆర్థిక వ్యవస్థకు ఉదాహరణ?
   1) అడవులు 2) పశు సంవర్ధనం
   3) నీటి సరఫరా 4) రియల్ ఎస్టేట్
59. స్వచ్ఛమైన సేవలకు ఉదాహరణ?
   1) గాలి 2) రోడ్డు
   3) రైల్వే 4) దేశ రక్షణ
60. ద్రవ్యోల్బణం సంవత్సరానికి 3 శాతం కంటే తక్కువ ఉన్నట్లయితే దానిని ఇలా అంటారు?
   1) నడిచే ద్రవ్యోల్బణం
   2) దూకుడు ద్రవ్యోల్బణం
   3) పరుగెత్తే ద్రవ్యోల్బణం
   4) పాకే ద్రవ్యోల్బణం

సివిక్స్

61. ప్రపంచ నాగరికతకు మూలమైన అంశం?
   1) ప్రభుత్వం 2) సంస్కృతి
   3) సమాజం 4) కుటుంబం
62. భారతదేశంలో గృహహింసా నిరోధక చట్టం ఏ సంవత్సరంలో అమలు జరిగింది?
   1) 1961 2) 2004
   3) 2005 4) 2006
63. మూడువేల నుంచి ఐదువేల మంది గ్రామ సభ సభ్యులకు ఎంతమంది గ్రామవార్డ్ సభ్యులు ఉంటారు?
   1) 9 2) 13
   3) 15 4) 11
64. రాష్ట్రపతి పార్లమెంటుకు ఎంతమంది సభ్యులను నామినేట్ చేస్తారు?
   1) 12 2) 8 3) 14 4) 2
65. గవర్నర్ తన శాసనాధికారాల్లో భాగంగా విధాన పరిషత్‌కు ఎంతమందిని నామినేట్ చేస్తారు?
   1) 1/3వ వంతు 2) 1/6వ వంతు
   3) 1/12వ వంతు 4) 1/4వ వంతు
66. ₹ 500 జరిమానా, 6 మాసాల కఠిన కారాగార శిక్షను విధించే కోర్టులు?
   1) ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   2) సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   3) థర్డ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు 4) ఏదీకాదు
67. భారతదేశంలో ప్రస్తుతం లోకాయుక్త (పౌర నియంత్రణ) విధానం ఎన్ని రాష్ట్రాల్లో అమలులో ఉంది?
   1) 15 2) 16 3) 17 4) 18
68. సమాచార హక్కు చట్టాన్ని పార్లమెంట్ ఎప్పుడు ఆమోదించింది?
   1) 2005, జూన్ 15 2) 2005, అక్టోబర్ 12
   3) 2007, జూలై 15 4) 2008, జూన్ 15
69. సామ్యవాద విధానాన్ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో చేర్చారు?
   1) 42వ రాజ్యాంగ సవరణ
   2) 43వ రాజ్యాంగ సవరణ
   3) 44వ రాజ్యాంగ సవరణ
   4) 48వ రాజ్యాంగ సవరణ
70. 1983లో అలీన దేశాల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
   1) హరారే 2) హవానా
   3) కొలంబో 4) న్యూఢిల్లీ

సమాధానాలు

1) 3	2) 2	3) 2	4) 3	5) 3
6) 3	7) 2	8) 2	9) 4	10) 2
11) 3	12) 4	13) 2	14) 2	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 2
21) 3	22) 2	23) 3	24) 3	25) 4
26) 4	27) 1	28) 3	29) 2	30) 2
31) 3	32) 4	33) 2	34) 4	35) 4
36) 3	37) 4	38) 3	39) 1	40) 2
41) 3	42) 3	43) 3	44) 4	45) 3
46) 3	47) 2	48) 3	49) 2	50) 4
51) 4	52) 3	53) 3	54) 4	55) 4
56) 2	57) 3	58) 4	59) 4	60) 4
61) 4	62) 3	63) 2	64) 3	65) 2
66) 2	67) 3	68) 1	69) 1	70) 4

తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

1. ఇస్రో ఏ దేశ సౌజన్యంతో సరళ్ అనే ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఫ్రాన్స్ బి) ఇజ్రాయెల్
సి) స్విట్జర్లాండ్ డి) అమెరికా
2. హబుల్ స్పేస్ టెలిస్కోపు తరహాలో భారత్ అభివృద్ధి చేస్తున్న ఖగోళశాస్త్ర పరిశోధన ఉపగ్రహం ఏది?
ఎ) ఆదిత్య బి) ఏస్ట్రోశాట్
సి) గెలీలియో డి) ఏదీకాదు
3. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లను నిర్మించే కేంద్రం ఏది?
ఎ) విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం
బి) సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం
సి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ & టెక్నాలజీ
4. సుదూర రోదసిలోకి ప్రయోగించే చంద్రయాన్, మంగళ్‌యాన్ లాంటి ఉపగ్రహాల నుంచి సమాచారాన్ని తీసుకోవడానికి ఉద్దేశించిన ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్ (IDSN) అనే గ్రౌండ్ వ్యవస్థను ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ) గాదంకి, తిరుపతి
బి) బైలాలు, బెంగళూరు
సి) తిరువనంతపురం డి) హైదరాబాద్
5. మంగళ్‌యాన్ బరువు ఎంత?
ఎ) 2562 కిలోలు బి) 3333 కిలోలు
సి) 1337 కిలోలు డి) 5555 కిలోలు
6. ఇండియన్ రీజినల్ నేవిగేషనల్ శాటిలైట్ సిస్టమ్ ఇప్పటివరకు ఎన్ని ఉపగ్రహాలను ప్రయోగించింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
7. భారత్ తొలిసారిగా రాకెట్‌ను ఎప్పుడు ప్రయోగించింది?
ఎ) 1963 నవంబర్ 21
బి) 1975 ఏప్రిల్ 1
సి) 1969 ఆగస్టు 15
డి) 1975 ఏప్రిల్ 19
8. ఇస్రో వాణిజ్య విభాగం ఏది?
ఎ) ఇస్రో శాటిలైట్ సెంటర్
బి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
సి) యాంట్రిక్స్ కార్పొరేషన్
డి) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్
9. యురోపియన్ యూనియన్ అభివృద్ధి చేస్తున్న ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ?
ఎ) క్వాశీజెనిథ్ బి) బిడే
సి) గెలీలియో డి) గ్లోనాస్
10. నాసా ప్రయోగించిన ఏ ఉపగ్రహం సౌర వ్యవస్థ వెలుపల అంతర నక్షత్ర ప్రాంతానికి చేరింది?
ఎ) క్యూరియాసిటీ బి) మావెన్
సి) అట్లాంటిస్ డి) వాయేజర్
11. ఇండియన్ రీజినల్ నావిగేషనల్ శాటిలైట్ వ్యవస్థ భారత భూభాగ సరిహద్దుల నుంచి ఎంత దూరం వరకు సేవలు అందిస్తుంది?
ఎ) 1500 కి.మీ. బి) 3000 కి.మీ.
సి) 5000 కి.మీ. డి) 6500 కి.మీ.
12. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలో సేవలకు కనీసం ఎన్ని ఉపగ్రహాలు అవసరం?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 6
13. ఇస్రో ప్రయోగించిన స్పాట్-6, స్పాట్-7 ఉపగ్రహాలు ఏ దేశానికి చెందినవి?
ఎ) ఫ్రాన్స్ బి) ఆస్ట్రేలియా
సి) జపాన్ డి) జర్మనీ
14. IRNSS-1D ఉపగ్రహం బరువు?
ఎ) 2,500 కిలోలు బి) 1425 కిలోలు
సి) 3,500 కిలోలు డి) 750 కిలోలు
15. దేశీయ క్రయోజనిక్ ఇంజన్‌ను విజయ వంతంగా ప్రయోగించిన నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 27
బి) పీఎస్ఎల్‌వీ సీ 25
సి) జీఎస్ఎల్‌వీ డీ 3
డి) జీఎస్ఎల్‌వీ డీ 5
16. ఉపగ్రహ ఆధారిత విమానయానానికి ఉద్దేశించిన వ్యవస్థ?
ఎ) ఆకాశ్ బి) గగన్
సి) భువన్ డి) IRNSS
17. తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?
ఎ) బ్రిటన్ బి) ఫ్రాన్స్
సి) అమెరికా డి) రష్యా
18. 'మార్స్ వన్' కార్యక్రమానికి భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కిందివారిలో దీనికి ఎవరు ఎంపిక కాలేదు?

ఎ) రితికా సింఘ్ బి) అవినాష్ సక్సేనా
సి) శ్రద్ధ ప్రసాద్
డి) తరన్‌జిత్ సంఘ్ భాటియా
19. అమెరికా అభివృద్ధి చేసిన గ్లోబల్ పొజిష నింగ్ సిస్టంలోని ఉపగ్రహాల సంఖ్య?
ఎ) 16 బి) 24 సి) 28 డి) 32
20. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
ఎ) డెహ్రాడూన్ బి) ముంబై
సి) తిరువనంతపురం డి) బెంగళూరు
21. చంద్రయాన్-1 ప్రయోగాన్ని ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 2007 బి) 2008
సి) 2009 డి) 2010
22. చంద్రయాన్-1లో భారత్‌తో భాగస్వామ్యం కాని దేశం ?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) యురోపియన్ యూనియన్
డి) బెల్జియం
23. 4500-5000 కిలోల బరువున్న ఉపగ్రహాలను సైతం ప్రయోగించగలిగే భారత అంతరిక్ష నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ - XL
బి) జీఎస్ఎల్‌వీ - మార్క్ I
సి) జీఎస్ఎల్‌వీ - మార్క్ II
డి) జీఎస్ఎల్‌వీ - మార్క్ III
24. పీఎస్ఎల్‌వీ ఇప్పటివరకు వరుసగా ఎన్ని విజయాలను నమోదు చేసుకుంది?
ఎ) 30 బి) 29 సి) 28 డి) 27
25. ఇస్రో ఆధ్వర్యంలో పనిచేసే ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) అహ్మదాబాద్ బి) పుణే
సి) తిరువనంతపురం డి) శ్రీహరికోట
26. సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో పూర్తిస్థాయిలో ఎన్ని రాకెట్ లాంచింగ్ పాడ్‌లు ఉన్నాయి?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
27. ఇప్పటివరకు ఎన్ని జీఎస్ఎల్‌వీ ప్రయోగాలు నిర్వహించారు?
ఎ) 7 బి) 8 సి) 9 డి) 10
28. చుట్టూ స్ట్రాప్-ఆన్ మోటార్లు లేని పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ రూపం లిఫ్ట్-ఆఫ్ సమయంలో బరువు ఎంత?
ఎ) 294 టన్నులు బి) 320 టన్నులు
సి) 230 టన్నులు డి) 630 టన్నులు
29. అత్యధికంగా ఒకేసారి పది ఉపగ్రహాలను ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ నౌక ఏది?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 8
బి) పీఎస్ఎల్‌వీ సీ 9
సి) పీఎస్ఎల్‌వీ సీ 10
డి) పీఎస్ఎల్‌వీ సీ 11
30. నేషనల్ అట్మాస్ఫెరిక్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) తిరుపతి
సి) చెన్నై డి) బెంగళూరు
31. ఇస్రో ప్రయోగించిన జపాన్ ఉపగ్రహం?
ఎ) టెక్సర్ బి) అజైల్
సి) యూనిబ్రైట్ డి) ప్రొ మెటరస్
32. ఇస్రో ఇప్పటివరకు కిందివాటిలో ఏ దేశ ఉపగ్రహాలను ప్రయోగించలేదు?
ఎ) అల్జీరియా బి) లక్సెంబర్గ్
సి) అర్జెంటీనా డి) నైజీరియా
33. భారత వ్యోమగామి అధికారిక పేరు?
ఎ) వ్యోమోనాట్ బి) రోదసీనాట్
సి) ఖగోళనాట్ డి) పైవేవీకావు
34. 'అడ్వైజరీ కమిటీ ఫర్ స్పేస్' చైర్మన్ ఎవరు?
ఎ) మాధవన్ నాయర్
బి) కస్తూరి రంగన్ సి) యు.ఆర్. రావు
డి) రాధాకృష్ణన్
35. అంగారక కక్ష్యలోకి విజయవంతంగా మంగళ్‌యాన్ చేరినట్లు మొదట గుర్తించింది?
ఎ) ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్
బి) కాన్‌బెర్రా డీప్ స్పేస్ నెట్‌వర్క్
సి) నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్
డి) యురోపియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్
36. అంగారకుడిపై ప్రధానంగా ఏ వాయువును గుర్తిస్తే జీవ సంకేతాలకు సమాచారం లభించే అవకాశముంటుంది?
ఎ) అమ్మోనియా బి) మీథేన్
సి) హైడ్రోజన్ డి) ఆక్సిజన్
37. చంద్రయాన్-1లో భాగంగా ఏ దేశానికి చెందిన పరికరం చంద్రునిపై నీటి జాడలను గుర్తించింది?
ఎ) భారత్ బి) అమెరికా
సి) బెల్జియం డి) జర్మనీ
38. ఇస్రో పీఎస్ఎల్‌వీ - సీ 18 ద్వారా ప్రయోగించిన జుగ్ను ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఐఐటీ, లక్నో బి) ఐఐటీ, చెన్నై
సి) ఐఐటీ, కాన్పూర్ డి) ఐఐటీ, ముంబై
39. ఈశాన్య రాష్ట్రాల్లో అంతరిక్ష సేవలను విస్తరించే లక్ష్యంతో ఏర్పాటైన నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) యుమియం, మేఘాలయ
బి) పాకియాంగ్, సిక్కిం
సి) దిస్పూర్, అసోం డి) అగర్తల, త్రిపుర
40. క్రయోజనిక్ ఇంజన్‌లో వినియోగించే ప్రొపెల్లెంట్?
ఎ) ద్రవ ఆక్సిజన్
బి) డై మిథైల్ హైడ్రోజన్
సి) ద్రవ హైడ్రోజన్
డి) పాలిబ్యుటాడైఈన్
41. ఇస్రో ఇనర్షియల్ సిస్టం యూనిట్ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) అహ్మదాబాద్
సి) తిరువనంతపురం డి) ముంబై
42. జీఎస్ఎల్‌వీ కార్యక్రమం ఎప్పుడు మొదలైంది?
ఎ) 1990 బి) 1993
సి) 1995 డి) 1997

సమాధానాలు

1) ఎ;	2) బి;	3) ఎ;	4) బి;
5) సి;	6) డి;	7) ఎ;	8) సి;
9) సి;	10) డి;	11) ఎ;	12) సి;
13) ఎ;	14) బి;	15) డి;	16) బి;
17) సి;	18) బి;	19) బి;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) డి;	24) సి;
25) ఎ;	26) బి;	27) బి;	28) సి;
29) బి;	30) బి;	31) డి;	32) డి;
33) ఎ;	34) సి;	35) బి;	36) బి;
37) బి;	38) సి;	39) ఎ;	40) సి;
41) సి;	42) ఎ..		

Writing on a Currency Note is..

BANK EXAMS

BANKING AWARENESS

1. Cash Management Bills (CMBs)
a) Government of India, in consultation with the Reserve Bank of India, has decided to issue a new short-term instrument, known as Cash Management Bills (CMBs), to meet the temporary mismatches in the cash flow of the Government.
b) The CMBs have the generic character of T-bills but are issued for maturities less than 91 days.
c) Like T-bills, they are also issued at a discount and redeemed at face value at maturity.
d) The tenure, notified amount and date of issue of the CMBs depends upon the temporary cash requirement of the Government.
e) All the above
2. Which of the following banking System is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
a) Tiered Banking
b) Shadow Banking
c) Multiple banking
d) Universal banking
e) Multicity Banking
3. BPSS stands for:
a) Banking Payment Settlement Systems
b) Board for Payment and Settlement Systems
c) Bank for Payment and Settlement Sector
d) Board for Payment Service Sector
e) None of the above
4. The main purpose of Anti Money Laundering is CFT, which stands for:
a) Criminal Financial Terrorism
b) Combating Financing of Terrorism
c) Combating Factional Terrorism
d) Common Financial Terrorism
e) None of the above
5. Own Your NPA' campaign to push managers to focus on top 20 bad loan accounts in their jurisdiction
a) IDBI Bank b) ICICI Bank
c) HDFC Bank
d) Karur Vysya Bank
e) Union Bank of India
6. What are the provisions of remuneration of the banking ombudsman?
a) He is eligible for remuneration and other perquisites
b) This will be determined by the RBI
c) This has to be borne by banks proportionately
d) All the above
e) None of the above
7. Which of the following entity was set up in 1994 to oversee the Indian Financial System, comprising not only commercial banks, state cooperative banks, but also the All India Financial Institutions (AIFIs) and Non-Banking Finance Companies (NBFCs).?
a) Central Board of Directors (CBD)
b) RBI
c) Board of Financial Supervision (BFS)
d) IDBI e) NABARD
8. Which of the following specialised financial institutions has not been created by RBI?
a) National Bank for Agriculture and Rural Development (NABARD)
b) Deposit Insurance and Credit Guarantee Corporation of India (DICGC)
c) National Housing Bank(NHB)
d) Mudra bank
e) None of the above
9. National Institute of Bank Management (NIBM) is located at:
a) Mumbai b) Hyderabad
c) Pune d) Kolkata
e) New Delhi
10. Certificates of Deposit (CDs) and Commercial Paper (CPs) are the instruments widely used in which of the following Financial Sector market?
a) Credit Market b) Stock Market
c) Corporate Debt Market
d) Money Market
e) Forex Market
11. Bharatiya Reserve Bank Note Mudran Limited established as a fully owned subsidiary of the Reserve bank has it's Bank note press at
a) Mysore b) Dewasc) Nashik
d) Noida e) All the above places
12. What is the maximum percentage of Net Demand and Time Liabilities (NDTL) RBI is empowered to increase?
a) 50% b) 40% c) 30%
d) 60% e) No such stipulation
13. The Banking Ombudsman may reject a complaint at any stage if it appears that the complaint made is:
a) Not on the grounds of complaint referred to above
b) Compensation sought from the Banking Ombudsman is beyond Rs 10 lakh .
c) Requires consideration of elaborate documentary and oral evidence and the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
d) If in the opinion of the Banking Ombudsman there is no loss or damage or inconvenience caused to the complainant.
e) All the above
14. To authenticate a Digital signature in Cheque Truncation System (CTS), which of the following keys are used?
a) Private key b) Public Key
c) Master Key d) Only (ii) and (iii)
e) None of the above
15. In case of non-compliance of the award by the bank the baking ombudsman will report to;
a) Reserve bank of India.
b) Supreme court
c) Finance ministry
d) Consumer protection forum
e) Head Office of the concerned Bank
16. A & B are maintaining an 'E or S' account. D has been named as nominee. Balance in the account will be payable to ________ on the death of A.
a) Jointly to B and Nominee D
b) Jointly to B and legal heirs of A
c) B alone d) D alone
e) Will be referred to RBI

17. NREGA (National Rural Employment Guarantee Act) is renamed after :
a) Jawahar Lal Nehru
b) Mahatma Gandhi
c) Indira Gandhi
d) Rajeev Gandhi
e) Jayaprakash Narayan
18. Bank can grant loans against ___
a) LIC Policy b) CDs
c) FD issued by other bank
d) Mutual fund
e) None of the above
19. Which is not a retail deposit product?
a) Credit card b) Term deposits
c) Senior citizen deposits
d) No frills account
e) Letter of Credit
20. As per the RBI's Clean Note Policy, writing on a Currency Note is ……
a) An Offence b) A Crime
c) A Punishable Offence
d) The notes become non-legal tender
e) No such stipulations
21. A bank can purchase NPA from another bank, if in the books of selling bank, the account was NPA for ________
a) 2 years b) 3 years
c) 5 years d) 7 years
e) 18 months
22. Minimum Bank Rate is ______
a) 3% b) 4% c) 5%
d) 6.5% e) None
23. Which is not a major promoter of CIBIL?
a) HDFC b) SBI c) RBI
d) Trans Union International Inc.
e) None of the above
24. Which one is not a fund based service?
a) Short term finance
b) Letter of Credit
c) Bill discounting
d) Export credit
e) Housing Loan
25. Which of the following is / are correct regarding Bharatiya Reserve Bank Note Mudran Private Limited?
a) It is one of the subsidiaries of Reserve Bank of India
b) It prints bank notes (Indian rupees) for Reserve Bank of India (RBI).
c) It was established in 1995 to address the demand for bank notes.
d) Only a & b e) All a, b & c
26. In strategic Alliance, the alliance partners:
a) Merge with each other
b) One partner acquires the other
c) Remain separate entities
d) Loses its name and identify
e) None of the above
27. In Manufacturing sector, small enterprises investment in plant and machinery is:
a) Less than 25 lakhs
b) 10 Lakhs to 2 Crores
c) 25 Lakhs to 5 Crores
d) 5 Crores to 10 Crores
e) Less than 50 lacs
28. Banks undertake to pay electricity bills, insurance premium for the customer regularly. Here the bank acts as ______
a) Debtor b) Creditor
c) Principle d) Agent
e) None of the above
29. In the online world of electronic commerce, what do the initials CEM stands for?
a) Costly E-Commerce Marketing
b) Customer Experience Management
c) Customer Experience Misleading
d) Cost Estimates are Mind Boggling
e) None of the above
30. Cash payment of Term deposits is possible, if the amount doesn't exceed:
a) Rs. 20000 b) Rs. 25000
c) Rs. 40000 d) Rs. 50000
e) Rs. 10,000
31. BCSBI has been set up as a / an ______
a) Autonomous Body
b) Society c) Company
d) Trust
e) Customer Service Club
32. Hypothecation is applicable in the case of ______
a) Movable goods
b) Immovable property
c) Book debts
d) Corporate guarantee
e) Staff loans
33. A stop payment instruction of a cheque can be issued by:
a) The payee b) The endorsee
c) The drawer d) The drawee
e) The collecting Bank
34. FIMMDA stands for:
a) Foreign Exchange Money Markets and Derivatives Association of India
b) Fixed Income Money Markets and Derivatives Association of India
c) Foreign Income Money Markets and Derivatives Association of India
d) Fixed Income Money Market Development Authority
e) None of the above
35. Creator of Trust is referred as:
a) Trustee b) Beneficiary
c) Settlor d) Garnishee
e) Registrar of trusts
36. Sale or purchase of Government Securities by RBI in open market is called as:
a) Credit Planning
b) SCC(Selective credit Control)
c) OMO(Open Market Operations)
d) CAS (Credit Authorisation Scheme
e) FPO(Follow on Public Offer)
37. How many types are T- bills (Treasury Bills) are issued?
a) 2 b) 3 c) 4 d) 5 e) 6
38. The bank that makes payment to the beneficiary on receipt of documents as per terms of Letter of Credit is:
a) Advising Bank
b) Negotiating Bank
c) Confirming Bank
d) Opening Bank
e) Prudential Bank
39. The deposit of cash under CRR requirement with RBI is ______ requirement.
a) Voluntary b) Discretionary
c) Mandatory
d) As per Negotiable Instruments Act
e) None of the above
40. Credit card is a small plastic card of around ______ cm.
a) 7.0 × 5.5 b) 8.5 × 5.0
c) 7.5 × 5.0 d) 8.5 × 5.5
e) 6.0 × 4.5

KEY

1) e	2) b	3) b	4) b	5) a
6) d	7) c	8) d	9) c	10) d
11) e	12) b	13) e	14) a	15) a
16) c	17) b	18) a	19) a	20) c
21) a	22) e	23) c	24) b	25) e
26) c	27) c	28) d	29) b	30) a
31) b	32) a	33) c	34) b	35) c
36) c	37) b	38) b	39) c	40) d.